
రామాయణం
వాల్మీకి రామాయణము-అయోధ్య కాండము
ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org　Mobile App: Free Gurukul　email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul　Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

## వాల్మీకి

# రామాయణము

## అయోధ్యకాండ


అనువాదకుడు:

శ్రీ శ్రీనివాస శిరోమణి



లక్ష్మీ అండ్ సరస్వతి

విద్యానగర్ :: హైదరాబాద్-7.

# వాల్మీకి రామాయణము

## అయోధ్యాకాండ

౧

భరతుడు మేనమామ ఇంటికి ప్రయాణము అయిపోతూ శత్రుఘ్నుణ్ణి తోడు రమ్మన్నాడు. శత్రుఘ్నుడు జితేంద్రియుడు. బుద్ధిమంతుడు. ఆ అన్నగారి మీద అతనికి ఉన్న ప్రేమాతిశయమునుంచి గిరివ్రజపురానికి తోడుగా పోయినాడు.

అక్కడ భరతుడి మేనమామ యుధాజిత్ భరతుణ్ణీ శత్రుఘ్నుణ్ణీ తాను కన్నబిడ్డలవలె ఆదరించినాడు. చక్కగా సత్కరించినాడు. వారు కోరుకొన్నవి అన్నీ ఇచ్చి సంతోషపెట్టినాడు. సుఖపెట్టినాడు. అక్కడ ఆ అన్నతమ్ములు అట్లా ఎంతో సంతోషముగానూ సుఖముగాను ఉంటూ ఉన్నా వృద్ధుడు అయిన తమ తండ్రి దశరథమహారాజును గురించే ఆలోచించ సాగినారు.

దశరథమహారాజున్నూ దేశాంతరములో ఉన్న ఇంద్రవరుణుల వంటి ఆ భరత శత్రుఘ్నులను గురించే ఆలోచించడము మొదలు పెట్టినాడు. ఆయనకు నలుగురు కొడుకులూ నాలుగు చేతులవంటివారు. నలుగురూ ఇష్టులే. అయితే మహావిష్ణువుకు దేవతలు అందరిలోనూ బ్రహ్మదేవుడు అంటే ఎక్కువ ఇష్టము. అదే విధంగా దశరథమహారాజుకు నల్గురు కొడుకులలోను రాముడు అంటే ఎక్కువ ఇష్టము.

ఇంతకూ మహావిష్ణువే రాముడు. మదోన్మత్తుడు అయిన రావణాసురుణ్ణి సంహారము చేయవలసింది అని దేవతలు ప్రార్థిస్తే మానవజన్మము ఎత్తినాడు. అందువల్లనే దేవలోకములో దేవేంద్రుణ్ణి కన్న అదితివలె ఈ మానవలోకములో రాముణ్ణి కన్న కౌసల్యాదేవి శోభించింది. అటువంటి అనుపమానము అయిన పుత్రుడు ఈ భూలోకములో ఎవరికీ పుట్టలేదు అని దశరథమహారాజు సంతోషపడ్డాడు.

దశరథమహారాజుకు ఉన్న సద్గుణాలు అన్నింటితోటీ రాముడు పుట్టినాడు. అతడు సుందరాకారుడు. పరమపరాక్రమవంతుడు. అసూయలేనివాడు. ఎప్పుడూ ప్రశాంత చిత్తముతో ఉండేవాడు. ఎవరు ఎంత పరుషముగా మాట్లాడినా ప్రియముగా జవాబు చెప్పేవాడు. ఎవరు ఎందుకు ఏ కొంచెము ఉపకారము చేసినా సంతోషపడేవాడు. నూరు అపకారాలు చేసినా జ్ఞాపకము ఉంచుకొనేవాడు కాడు. విడవకుండా అస్త్రాభ్యాసము చేస్తూ విరామసమయాలలో శీలవృద్ధులతో సదాచారాలను గురించీ వయోవృద్ధులతో పరంపరాగత సంప్రదాయాలను గురించీ జ్ఞానవృద్ధులతో వేదాంత రహస్యాలను గురించీ చర్చించి తెలుసుకొంటూ ఉండేవాడు.

అతడు మహాబుద్ధిమంతుడు. మధురభాషి. ఎవరిని అయినా అతడే ముందుగా పలుకరించేవాడు. సంతోషపెట్టే సంగతులే మాట్లాడేవాడు. అమితవీర్యవంతుడు అయినప్పటికిన్నీ ఎన్నడూ విర్రవీగి ఎరుగడు. అబద్ధాలు ఆడేవాడు కాడు. పెద్దలను ఎప్పుడూ గౌరవించేవాడు. ప్రజలను రంజింప చేసేవాడు. ప్రజలున్నూ అతణ్ణి అమితంగా ప్రేమించేవారు. అతడు విద్వాంసుడు. ధర్మజ్ఞుడు. దయాశాలి. కోపాన్ని జయించినాడు. ఎప్పుడూ దృఢనియమముతో ఉండేవాడు. పరిశుద్ధుడు. బ్రాహ్మణులను పూజించేవాడు. దరిద్రులను దయతో చూచేవాడు. ఇక్ష్వాకువంశోచితము అయిన దయాదాక్షిణ్య శరణాగత రక్షణాదిధర్మాలు అన్నీ అతనిలో మూర్తీభవించినవి. అతడు క్షత్రధర్మమే తనకు ముఖ్యము అయింది అనీ ఆ క్షత్రధర్మానుష్ఠానము వల్లనే యశస్సూ స్వర్గసౌఖ్యమూ తనకు సంప్రాప్తము అవుతవి అనీ నిశ్చయించుకొన్నాడు.

అతడు ఎన్నడూ చెడువిషయాలలోకి - అంటే జూదమూ మొదలు అయిన వ్యసనాలలోకి - మనస్సు పోనిచ్చేవాడు కాడు. ధర్మవిరుద్ధము అయిన గ్రామ్యసంభాషణలకు చోటు ఇచ్చేవాడు కాడు. ఏవిషయంలో నయినా బృహస్పతి వలె యుక్తికి ప్రతియుక్తి చెప్పేవాడు. ఎప్పుడూ మంచి దేహదార్ఢ్యముతో ఉండేవాడు. అనారోగ్యము ఎన్నడూ ఎరుగడు. అతడు వాగ్మి. దేశకాలవిదుడు. చూచే చూడటముతో ఎదటి వారి మనస్సు కనిపెట్టేవాడు. ప్రజలు అందరికీ బహిఃప్రాణముగా ఉండేవాడు. సాంగముగా వేదాధ్యయనము చేసినాడు. విద్యావ్రతస్నాతుడున్నూ అయినాడు. ఈ లోకములో అతడు ఒక్కడే

సత్పురుషుడు అనిపించుకొన్నాడు. భుజబలముకొద్దీ బాణాలు వదలడములోనూ మంత్రసహితముగా అస్త్రాలను వదలడములోనూ తండ్రికన్నా గొప్పవాడు అయినాడు. పితృమాతృ వంశాలకు రెంటికిన్నీ కులదీపకుడున్నూ అయినాడు. ఏ దోషమూ లేనివాడు, ఎటువంటి కష్టకాలములో నయినా దిగులు పడేవాడు కాడు ఆడి తప్పేవాడు కాడు. ఋజువర్తనుడు, ధర్మార్థ దర్శకులు అయిన బ్రాహ్మణులదగ్గిర సుశిక్షితుడు అయినాడు. ధర్మార్థకామతత్వజ్ఞుడు.

రాముడు మరుపు లేనివాడు. అతడి బుద్ధి ఎప్పటికి అప్పుడు వికసిస్తూ ఉండేది. లౌకిక మర్యాదలూ శిష్టాచారాలూ తెలుసుకొన్న పండితుడు. వినయాన్వితుడు. హావభావాదులవల్ల తన మనో నిశ్చయాన్ని ఇతరులకు తెలియనిచ్చే వాడుకాడు. అతని ఆలోచనలు ఫలపర్యంతమూ ఎవరికీ బోధపడేవికావు అతని కోపము కానీ సంతోషము కానీ ఎన్నడూ వ్యర్థము అయిపోయేది కాదు

అతనిది దృఢము అయిన గురుభక్తి. స్థిరము అయిన ప్రజ్ఞ. దుర్మార్గులను దరి చేరనిచ్చే వాడుకాడు. ఒక్క దుష్టవాక్కు తన నోటివెంట రానిచ్చేవాడు కాడు. ఆలస్యము అనేది అతడికి లేదు. ఏమరుపాటు ఎరుగడు. తన దోషము ఏదో ఇట్టేగుర్తించేవాడు. చూడగానే మనుష్యుల తారతమ్యాలను తెలుసుకొనే వాడు. కృతజ్ఞుడు. శాస్త్రజ్ఞుడు. ఎవరిని అయినా చేర తీయడములోనూ ఆ చేరతీసిన వారిని ఆదరించడములోను అతి సమర్థుడు. పెద్దలతో స్నేహము చేయడములోనూ స్నేహము చేసిన పెద్దలను నిలుపుకొనడములోనూ పండితుడు. దుష్టులను నిగ్రహించడములో నిపుణుడు. ధనార్జనోపాయాలు అన్నీ తెలిసిన వాడు. శాస్త్రీయముగా వ్యయము చేయడమున్నూ తెలిసినవాడు.

అతడు న్యాయవైశేషిక వేదాంత వ్యాకరణ మీమాంసాది శాస్త్రాలనూ సంస్కృత ప్రాకృతాది షడ్భాషలలో కావ్యనాటకాది గ్రంథాలనూ కరతలామలకము చేసుకొన్నాడు. ధర్మలోపమూ అర్థలోపమూ లేకుండా సుఖము అనుభవించేవాడు. అలసుడు కాడు. విహార ప్రయోజనమూ - సంగీతమూ చిత్ర రచనమూ మొదలు అయిన వినోదాలు అన్నీ తెలిసిన వాడు. అర్థవిభాగము - అంటే ధర్మముకోసమూ యశస్సుకోసమూ లౌకిక వ్యవహారము కోసమూ తన కోసమూ తన బంధుమిత్రులకోసమూ ధనాన్ని అయిదు భాగాలు - చేసి వినియోగించడము ఎరిగినవాడు. ఏనుగులనూ గుఱ్ఱాలనూ నడపడములోనూ వాటి

శిక్షించడములోనూ సమర్థుడు. ధనుర్వేద విదులలో శ్రేష్ఠుడు. అతిరథసమ్మతుడు. శత్రువులు ఎత్తి వచ్చేవరకు ఊరక ఉండేవాడు కాడు. అతడే వారికి ఎదురుగుండా పోయి పోరాడి గెలిచి వచ్చేవాడు. సేనలను నడపడములో ఆరితేరినాడు. సురాసురులు ఏకముఅయి ఎత్తివచ్చినా అతణ్ణి ఎదిరించలేరు. అతడు ఇతరులను నెపము ఎన్నేవాడు కాడు. కోపపరవశుడు అయ్యేవాడు కాడు. గర్వపడేవాడు కాడు. ఎవరినీ నిందించేవాడు కాడు. కాలానికి కట్టుపడేవాడు కాడు. మత్సరము లేనివాడు. సూర్యుడు తన అనంతకిరణాలతో తేజరిల్లినట్టు ఇటువంటి లోకోత్తర గుణాలతో రాముడు తేజరిల్లినాడు. సర్వప్రజా కాంతుడు అయినాడు. ముల్లోకాలవారికీ పూజ్యుడు అయినాడు. ఆ అప్రధృష్యపరాక్రమవంతుణ్ణి ఆ ఆశ్రితరక్షణవ్రత సంపన్నుణ్ణి లోకపాలకులతో సరిసమానము అయిన ఆ రాముణ్ణి భూదేవి తనకు ప్రభువుగా వరించింది అనుకొన్నాడు దశరథమహారాజు.

ఆ మహానుభావుణ్ణి రాముణ్ణి తాను జీవించి ఉండగా రాజును చేయడము ఎట్లాగా అని దశరథ మహారాజు ఆలోచించడము మొదలు పెట్టినాడు. అట్లా ఆలోచిస్తూ "రాముడు లోకాభివృద్ధికాముడు. దయాసముద్రుడు. ప్రజల సంతాపాన్ని పోగొట్టడములో పర్జన్యుడి వంటి వాడు. పరాక్రమానికి యమ శక్రుల వంటి వాడు. బుద్ధికి బృహస్పతి వంటి వాడు. ధైర్యానికి మేరుపర్వతమువంటి వాడు. క్షమాగుణానికి భూమివంటివాడు. ప్రజలు అందరికీ నాకన్నా ఇష్టుడు. వాడు - రాముడు రాజ్యపాలనము చేస్తూ ఉంటే నేను చూచి సంతోషించి చని పోవలెను" అని దశరథ మహారాజు నిశ్చయించుకొన్నాడు.

ఈ విషయము దశరథమహారాజు మంత్రులు అందరితోనూ సంప్రదిస్తూ రాత్రి పూట నక్షత్రమండలములోనూ పగటిపూట ఆకాశములోనూ భూమిమీదనూ తనకు ఉత్పాతాలు భయంకరముగా కనబడుతున్నవి అనీ తనకు బాగా వార్ధక్యము వచ్చింది అనీ ప్రజాహితముకోసమూ తన సంతోషముకోసమూ సర్వజనసంతాపహారుడూ నిండుచంద్రుడి వలె సర్వలోకప్రియుడూ అయిన రాముణ్ణి యువరాజును చేయవలెను అనీ చెప్పినాడు. అందుకు మంత్రులు అందరూ అంగీకరించినారు.

రాముణ్ణి యువరాజును చేయవలసిన కాలము ఆసన్నము అయింది అని దశరథమహారాజూ మంత్రులూ అంతట నిశ్చయించినారు. ఆవిషయమూ ఆలో

చించి నిర్ణయించడానికి ఒక సభను సమావేశ పరచవలెను అని దశరథమహారాజు అనుకొన్నాడు. నానా నగర ముఖ్యులనూ జానపద ముఖ్యులనూ రాజముఖ్యులనూ ప్రత్యేకము ప్రత్యేకముగా ఆహ్వానించినాడు.

దూరదేశస్థులు అయినందువల్లనూ వ్యవధి లేక పోయినందువల్లనూ కేకయ మహారాజుకూ జనకమహారాజుకూ ఆహ్వానాలు అంపించలేదు. వారు ఉభయులూ ఆ వృత్తాంతము ఆ తరువాత విని సంతోషిస్తారు అని దశరథమహారాజు అనుకొన్నాడు.

ఆహ్వానాలు అందుకొని వచ్చిన వారిని అందరినీ యథాయోగ్యముగా ఆభరణాదులు ఇచ్చి సన్మానించినారు. వారి వారి అర్హతలకు తగినట్టుగా విడుదులు చూపించినారు. దేవతలను బ్రహ్మదేవుడివలె వారిని అందరినీ దశరథ మహారాజు స్వయముగా చూచి గౌరవించినాడు. అంతట దశరథ మహారాజు తన కొలువుకూటములో సభ చేసినాడు. ఆయనకు అభిముఖముగా రాజ ముఖ్యులూ నానాపట్టణముఖ్యులూ వివిధజనపదముఖ్యులూ వారి వారికి నియమించిన ఆసనాల మీద కూర్చున్నారు. అంతమందీ చుట్టూ కూర్చుని ఉంటే అప్పుడు దశరథమహారాజు సుధర్మామధ్యములో కూర్చున్న సహస్రాక్షుడివలె శోభిల్లినాడు.

౨

దశరథమహారాజు తన కొలువుకూటములో సమావేశము అయిన సదస్యులను అందరినీ చూస్తూ మేఘగర్జనము వలెనూ దుందుభిస్వనము వలెనూ సభాభవనము అంతా ప్రతిధ్వనిస్తూ గంభీరముగానూ స్పష్టముగానూ మనోహరముగానూ ఆపాతమధురముగానూ సంతోషజనకముగానూ రాజలక్షణయుక్తముగానూ లోకహితము కోసము ఈ విధముగా ప్రసంగించినాడు.

“మహాజనులారా! మా పూర్వీకులు అయిన రాజేంద్రులు అందరూ ప్రజలను తమ కన్న బిడ్డల మాదిరిగా కాపాడుతూ రాజ్యపాలనము చేసినారు. మా ఇక్ష్వాకునరేంద్రులవల్లనే ఈ కోసలదేశము సుఖప్రదము అయిన రాజ్యము అయింది. ఉత్తమోత్తమము అయిన రాజ్యమున్నూ అయింది. ఇది మీకు అందరికీ తెలిసిన విషయమే.

"నేనూ మా పూర్వీకుల పంథాను అనుసరించి ఏమరుపాటు లేకుండా నా శక్తికొద్దీ ఇంతవరకూ మిమ్ములను కాపాడుతూ రాజ్యము ఏలినాను. లోక హితముకోసము ఈ శ్వేతచ్ఛాయలలోనే నా వయస్సు అంతా చెల్లి పోయింది. నేను ఇప్పుడు వృద్ధుణ్ణి అయినాను. నా దేహము శిథిలము అయిపోయింది. ఇకను ఈ శిథిలదేహానికి విశ్రాంతి ఇవ్వవలెను.

"ధర్మసంస్థాపన రూపము అయిన రాజ్యభారనిర్వహణము సామాన్యము అయిన పనికాదు. రాజలక్షణాలతో పుట్టి జితేంద్రియుడు అయినవాడే అనేక సాధనాలతో ధర్మసంస్థాపనరూపము అయిన రాజ్యభారము నిర్వహించ కలుగుతాడు. నేను ఈ రాజ్యభారాన్ని మోసి మోసి అలసి పోయినాను. ఈ వసిష్ఠాది బ్రాహ్మణులనూ మిమ్ములనూ ఒప్పించి ఈ రాజ్యభారము మరి ఒకరికి ఒప్పగించి నేను విశ్రాంతి అనుభవించవలెను అనుకొంటున్నాను. నా జ్యేష్ఠ పుత్రుడు రాముడు నా కోరికను పుట్టినాడు. నాకు ఉన్న గుణాలు అన్నీ వాడికి ఉన్నవి. వాడు పుష్యమి నక్షత్రములో పూర్ణచంద్రుడివలె విరాజిల్లుతున్నాడు. పరాక్రమానికి పురందరుడు వంటివాడు. వాడు పరపురంజయుడు. పరమ ధార్మికుడు. ముల్లోకాలూ ఏలగల సమర్థుడు. వాడు మీకు తగిన ప్రభువు అవుతాడు. వాణ్ణి నేను ఇప్పుడు సంతోషముగా యువరాజును చేసి ఈ రాజ్యభారము అంతా వాడి మీద ఉంచవలెను అనుకొన్నాను. నేను ఇక విశ్రాంతి అనుభవించ తలచినాను.

"నా ఈ ఆలోచన మీకు అందరికీ నచ్చేట్టయితే నేను ఇట్లా చేయడము ఉచితము అని మీకు అందరికీ తోచేట్టయితే నేను ఈపని చేస్తాను; లేకపోయేట్టయితే ఈ పని చేయను. నన్ను సంతోషపెట్టడానికి మీరు ఇప్పుడు రామయువరాజ్యాభిషేకము ఒప్పుకోనవసరము లేదు. మీరున్నూ ఆలోచించవలెను. మీకు ఇంకొక పద్ధతి ఏది అయినా తోస్తే నిరాక్షేపముగా చెప్పవచ్చును. ఒక్కడూ ఒంటరిగా ఆలోచించడము కన్నా పూర్వాపరపక్ష వాదాలతో మధ్యస్థులు చేసే నిర్ణయము ఎప్పుడూ నిష్పాక్షికముగానూ అధికార్థముగానూ ఉంటుంది. అందువల్ల మీరు అందరూ ఆలోచించి మీ అభిప్రాయము చెప్పవలెను.

దశరథమహారాజు ఈ మాటలు పూర్తి చేసినాడో లేదో వర్షించే మేఘాలను చూచి నెమళ్ళు చెలరేగి కేకలు వేసేట్టు సభాసదులు అందరూ

"బాగుంది-బాగుంది" అంటూ దిక్కులు పిక్కటిల్లి పోయేట్లు కేకలు వేసినారు. వారి సంతోషధ్వనులకు ఆ సభాభవనము అంతా కదలిపోతున్నదా అనిపించింది.

వసిష్ఠాది బ్రాహ్మణ ముఖ్యులు రాజముఖ్యులతోనూ పౌరముఖ్యులతోనూ జనపదముఖ్యులతోనూ ఆలోచించినారు. అందరూ ఏకాభిప్రాయులు అయినారు. దశరథ మహారాజును చూచి "ఓ రాజా! రాముణ్ణి యువరాజును చేయవలసిందే. ఆ మహాబాహువు ఆ రఘువీరుడు రాముడు శత్రుంజయము గజము మీద శ్వేతచ్ఛత్రముతో ఊరేగుతూ ఉంటే మేము చూడ ముచ్చటపడుతున్నాము" అన్నారు.

దశరథమహారాజు సంతోషించినాడు. అయితే తన సంతోషము పైకి పొక్కనీయకుండా "ఓ సభాసదులారా, నేను చెప్పి చెప్పటముతో మీరు రాముణ్ణి యువరాజును చేయమంటున్నారు. అందువల్ల నాకు సందేహముగా ఉంది. ఎందుకు మీరు అందరూ రామాభిషేకము చేయమంటున్నారో యదార్థము చెప్పవలెను. నేను ధర్మము తప్పకుండా రాజ్యపాలనము చేస్తున్నాను. మీరు ఏ కారణము వల్ల ఇట్లా చెప్పుతున్నారు? నేను ఏది అయినా తప్పు చేసినానా మీరు చెప్పవలెను" అంటూ దశరథమహారాజు ప్రశ్న చేసినాడు.

"ఓ రాజా, రాముడు అనంతకల్యాణగుణసంపన్నుడు. ఆ గుణగణాలను అన్నిటినీ వర్ణించటము మాతరము కాదు. ఎంత వర్ణించినా తనివి తీరదు. ఎన్నో మాటలు ఎందుకు? రాముడు కోసలరాజ్యమే కాదు- ముల్లోకాలూ ఏలగల సమర్థుడు. మరీచికి కాశ్యపుడివలె మా భాగ్యవశము వల్ల మీకు రాముడు పుట్టినాడు.

"రాజా, మానవులము మేమే కాదు, దేవతలూ గంధర్వులూ ఉరగులూ మొదలు అయినవారు అందరూ రాముణ్ణి ఒక్కమాదిరిగా గౌరవిస్తున్నారు. అతని ఆయురారోగ్య ఐశ్వర్యాదుల కోసము ప్రార్థిస్తున్నారు. ఆ ఇందీవర శ్యాముడు ఎప్పుడు యువరాజు అవుతాడా అని అందరూ ఎదురు చూస్తున్నారు. తమకు వృద్ధాప్యము వచ్చింది అనీ రాజ్యపాలనము నుంచి విశ్రాంతి కావలెను అనీ తామే సెలవిచ్చినారు. రాముడికి యువరాజ్యాభిషేకము చేయవలెను అనే మాటలు తమనోటనే వెలువడినవి. అందువల్ల మేమూ సంతోషముగా తమ మాటలను శిరసావహిస్తున్నాము.

"రాజా, తాము దేవదేవుడు అయిన మహావిష్ణువు వంటి వారు. కోరిన కోరికలు ఇచ్చే మహానుభావులు. లోకహితమే తమ మహదాశయము. ఇప్పుడు లోకహితము కోసమూ మమ్ములను సంతోషపెట్టడము కోసమూ తమ జ్యేష్ఠ పుత్రుణ్ణి రాముణ్ణి యువరాజును చేయవలెను" అని ఎలుగెత్తి ఏకకంఠముగా సభాసదులు చెప్పినారు.

3

సభాసదులు తామర మొగ్గల వలె చేతులెత్తి నమస్కారము చేస్తూ చెప్పింది అంతా దశరథ మహారాజు విన్నాడు. వారికి మేలు చేయడము కోసమున్నూ వారిని సంతోషపెట్టడము కోసమున్నూ "మహాజనులారా, ఆశ్చర్యము. మీరున్నూ నా జ్యేష్ఠపుత్రుణ్ణి యువరాజును చేయమంటున్నారు. సంతోషము. ఏమి నా భాగ్యము! నా వంటి అదృష్టవంతుడు మరి ఒకడు ఉండడు" అన్నాడు. వసిష్ఠ వామదేవులను చూస్తూ "ఇది చైత్రమాసము. శ్రీమంతము అయింది. పరమపావనము అయింది. తరులతాదులు అన్నీ మనోహరముగా పుష్పించినవి. రాముడి యువరాజ్యాభిషేకానికి ఏర్పాట్లు అన్నీ ఇప్పుడే చేయించవలెను. ఆలస్యము వద్దు" అన్నాడు దశరథ మహారాజు.

ఈ మాటలకు సభాసదులు "బాగుంది. బాగుంది" అని గొంతెత్తి చెప్పినారు. సంతోషధ్వనులు చెలరేగినవి. ఆ జనఘోషము సద్దు మణిగిన తరువాత "ఓ బ్రాహ్మణోత్తములారా, రామాభిషేకానికి ఏ ఏ కర్మలు చేయవలెనో అందుకు ఏ ఏ ఉపకరణాలు సమకూర్చుకొనవలెనో తాము ఇప్పుడే సెలవు చేయవలెను", అన్నాడు దశరథమహారాజు.

అంతట వసిష్ఠమహర్షి ఆయా కార్యకర్తలను ఉద్దేశించి "రేపు ఉదయము దశరథమహారాజు అగ్నిహోత్రగృహములో పూజాద్రవ్యాలనూ తెల్లని పూలదండలనూ ఓషధులనూ నవరత్నాలనూ బంగారము వెండి మొదలు అయిన లోహాలనూ నూతనవస్త్రాలనూ అగ్నిహోత్రము వలె ధగధగలాడే మేలుబంగారు కలశాలనూ సమగ్రము అయిన పులితోలునూ రెండు వింజామరాలనూ సిద్ధముగా ఉంచవలెను. వేరే వేరే గిన్నెలలో తేనె నెయ్యీ పేలాలూ ఉంచవలెను. అవేకాకుండా చతురంగబలాలూ సర్వశుభలక్షణయుతము అయిన శత్రుంజయము అనే ఏనుగుతోనూ కొమ్ములకు బంగారు తొడుగులు వేసిన ఆబోతుతోనూ

శ్వేతచ్ఛత్రముతోనూ ధ్వజముతోనూ సర్వాయుధాలతోనూ రావలెను. ఈ సందర్భానికి అవసరము అయిన పరిమళ ద్రవ్యాలను సిద్ధము చేయవలెను.

'అంతఃపుర ద్వారాలనూ నగర బహిర్ద్వారాలనూ పూలదండలతోనూ ఘుమఘుమలాడే మంచిగంధముతోనూ అలంకరించవలెను. నగరము అంతటా ఘుమఘుమలాడే ధూపాలు వేయవలెను. లక్షకొద్దీ బ్రాహ్మణులకు రేపటి దినము అన్నదానము చేయవలెను. వివిధ వ్యంజనాలతోనూ క్షీరపక్వమూ దధిపక్వమూ అయిన అన్నము సిద్ధము చేయించవలెను, సంతర్పణ చేయడమే కాకుండా రేపు ఉదయము ముందుగా బ్రాహ్మణులను సత్కరించవలెను. వారికి పేలాలూ పెరుగూ నెయ్యి పుష్కలముగా దక్షిణలూ ఇవ్వవలెను. తెల్లవారుతూనే స్వస్తివాచనము చెప్పించవలెను. అందుకోసము బ్రాహ్మణులకు ఇప్పుడే చెప్పవలెను. ఆ బ్రాహ్మణులకు ఉచితాసనాలున్నూ ఏర్పాటు చేయవలెను. అందరూ వచ్చేటట్టు ప్రోత్సహించవలెను.

"రాజవీధులలో దుమ్మూ ధూళీ రేగకుండా నీళ్ళుచల్లి అలంకరించవలెను. ప్రతి ఇంటిమీదనూ జండాలు ఎత్తవలెను. నటులూ భోగము పడుచులూ చక్కగా అలంకరించుకొనివచ్చి రాజభవనములో రెండవ కక్ష్య దగ్గర ఉండవలెను. దేవాలయాలలోనూ చతుష్పథాలలోనూ పూలదండలూ దక్షిణలూ ఇచ్చేవారినీ పిండివంటలతో అన్నము పెట్టేవారినీ వేరే వేరే నియమించవలెను. యోధులు అందరూ కవచాలు ధరించి పొడుగాటి కత్తులతో రాజభవనము ముందర నిలువవలెను" అని చెప్పినాడు.

ఈ విధముగా చెప్పి వసిష్ఠవామదేవులు ఆయా పనులు చక్కపెట్టడానికి కార్యకర్తలను నియమించినారు. వారు చేయవలసిన పనులు వారు చేసి దశరథ మహారాజును చూచి సంతోషాతిశయముతో యువరాజ్యాభిషేకపు ఏర్పాట్లు అన్నీ అయిపోయినవి అని చెప్పినారు.

అప్పుడు అద్యుతిమంతుడు దశరథమహారాజు ఎంతో సంతోషించినాడు. రాముణ్ణి వెంటనే అక్కడికి తీసుకొని రమ్మని చెప్పి సుమంత్రుణ్ణి పంపించినాడు.

నాలుగు దిక్కులనుంచీ వచ్చిన రాజులూ మ్లేచ్ఛరాజులూ అడవిదొరలూ కొండదొరలూ ఆ సభాభవనములో అప్పుడు దశరథమహారాజు చుట్టూ కూరుచుని

మాటాడుతూ ఉంటే దేవసభామధ్యములో కూర్చున్న దేవేంద్రుడి వలె దశరథ మహారాజు శోభించినాడు.

మహాత్ములమధ్య కూర్చున్న మహేంద్రుడి వలె వెలుగొందుతున్న దశరథ మహారాజు రాజవీథిలో రథము మీద వస్తూ ఉన్న రాముణ్ణి చూచినాడు.

రాముడు రూప వేషాదులను పట్టి భోగపరాయణుడు అయిన గంధర్వరాజు వలె కనిపిస్తాడు. కాని అతడు అనుపమానమైన పరాక్రమవంతుడు. అందుకు అనురూపము అయిన ఆజానుబాహువు. మదపు ఏనుగు వలె మత్తాలసముగా నడిచే మహాబలుడు. పూర్ణచంద్రుడి కన్నా దర్శనీయుడు. చూచిన కొద్దీ చూడబుద్ధి పుట్టే సుందరాకారుడు. తన సౌందర్య ఔదార్య సౌశీల్యాదులతో పురుషుల చిత్తాన్ని సహితము అపహరించిన పురుషోత్తముడు. మండు టెండలలో నానా ముల మాడే ప్రజలకు చల్లదనము ఇచ్చే నీలమేఘుడి వంటివాడు.

ఆ రాముణ్ణి దశరథమహారాజు ఎడతెగకుండా చూడసాగినాడు. ఎంత చూచినా ఆయనకు తనివి తీరలేదు.

కైలాసపర్వతము వంటి ఆ రాజప్రాసాదము దగ్గర రాముడిరథము ఆగింది. ఆ రథము తోలుకొని వచ్చిన సుమంత్రుడు దిగి అతనికి చేయూత నిచ్చినాడు. రథము దిగిన రాముడు ఆ మేడమెట్లు ఎక్కడము మొదలు పెట్టినాడు. చేతులు జోడించి సుమంత్రుడు అతడి వెనుక అడుగులు వేసినాడు.

రాముడు సభాభవనములోకి వచ్చి చేతులు జోడించి పేరు చెప్పుకొని దశరథమహారాజుకు సాష్టాంగ నమస్కారము చేసినాడు. లేచి చేతులు జోడించి ఆయన ప్రక్కను నిలుచున్నాడు. ఆ జోడించిన చేతులు పట్టుకొని దశరథ మహారాజు రాముణ్ణి దగ్గరకు తీసుకొన్నాడు. కౌగలించుకొన్నాడు. అతడు కూర్చుండడానికి బంగారముతో చేసి నవరత్నాలు పొదిగిన ఉన్నత ఉత్తమా సనము చూపించినాడు.

మేరుపర్వతముమీద ఉదయించే సూర్యుడే మేరువు పర్వతానికి అంతటికీ కాంతిని ఇచ్చేట్లు ఆ దివ్యాసనము మీద కూర్చున్న రాముడే తన దివ్య కాంతులను ఆ సభాభవనము అంతటా వెదచల్లినాడు.

ఆ సభాభవనములో వశిష్ఠాది మహర్షులూ రాజర్షులూ మొదలు అయిన వారి మధ్యను కూర్చున్న రాముడు శరత్కాలస్వచ్ఛాకాశములో నక్షత్రాల మధ్య ఉదయించిన చంద్రబింబమువలె కనిపించినాడు.

అప్పుడు అక్కడ కూర్చొని ఉన్న రాముడి రూపము తన యౌవనములో అలంకరించుకొని అద్దములో చూచుకొన్నప్పుడు కనిపించిన ప్రతిబింబము వలె దశరథమహారాజుకు తోచింది. ఆయన సంతోషపరవశుడు అయినాడు. మందహాసముతో "రామా" అని సంబోధించి కశ్యపుడు తన కొడుకు దేవేంద్రుడితో చెప్పినట్టుగా "రామా" నా జ్యేష్ఠపత్ని పరమయోగ్యురాలు. ఆమె తన యోగ్యతకు తగినట్టుగా నిన్ను కన్నది. నీవు నాకు ప్రియపుత్రుడవు అయినావు గుణగణాలకున్నూ నీవే అన్నతమ్ములలో పెద్దవాడవు అయినావు. ప్రజారంజకుడవున్నూ అయినావు. ఇప్పుడు ఈ ప్రజలు అందరూ నిన్ను యువరాజును చేయమన్నారు. అందువల్ల రేపు పుష్యమి నక్షత్రములో నేను నిన్ను యువరాజును చేయబోతున్నాను.

"నాయనా, నీవు జన్మతః వినయాన్వితుడవు. గుణవంతుడవు. పరాక్రమవంతుడవు. నాకు తెలుసును. అయినప్పటికిన్ని పుత్రవాత్సల్యము నుంచి నీ మంచి కోసము నేను చెప్పుతున్నాను. వినవలెను. నీవు ఇంకా అణకువతో ఉండవలెను, జితేంద్రియుడవు కావలెను. స్త్రీప్రసంగమూ మద్యపానమూ జూదమూ వేట మొదలు అయిన వ్యసనాలు కామోద్రేకము కలగచేస్తవి. పరుష ప్రసంగమూ క్రూరదండనమూ ధనవ్యయమూ మొదలు అయిన వ్యసనాలు కోపోద్రేకము కలగచేస్తవి. నీవు ఈ వ్యసనాలను దరి చేరనీయవద్దు. సామాన్య సేవకులకు నీవు పరోక్షముగా ఉండవలెను. అధికారులను ఆజ్ఞాపించి వారిచేత నీపనులు చేయించుకుంటూ ఉండవలెను. మంత్రులు మొదలు అయిన వారితో నీవు ప్రత్యక్షముగా కలిసి మెలిసి ఉంటూ ఉండవలెను. పరరాజ్య వృత్తాంతాలను పరోక్షముగా ఉండి ఎప్పటికి అప్పుడు తెలుసుకొంటూ ఉండవలెను. ప్రత్యక్షముగా ఉండి సర్వరాజ్యవృత్తాంతాలను గమనిస్తూ ఉండవలెను. అమాత్యులనూ సేనానాయకులనూ పురరక్షకులనూ జనపద ముఖ్యులనూ నీవు ఎప్పుడూ సంతోషపెట్టుతూ ఉండవలెను. వారినే కాదు. సర్వప్రజలనూ నీవు సంతోషపెట్టుతూ ఉండవలెను. రాజ్యములో కోశాగారాలనూ ధాన్యాగారాలనూ

ఆయుధాగారాలనూ ఎప్పుడూ సమృద్ధముగా ఉంచవలెను. అవి అన్ని సమృద్ధముగా ఉంటేనే ప్రజలు అందరూ మహోల్లాసముతో ఉంటారు. నీ సచివులూ నీ సామంతులూ అమృతపానము చేసిన దేవతల వలె ప్రవర్తిస్తారు.

"నాయనా, రామా, నీవు మనఃస్థైర్యముతో రాజ్యపాలనము చేయవలెను" అన్నాడు దశరథమహారాజు.

ఈవిధముగా దశరథ మహారాజు చెప్పుతూ ఉండగా రాముడి ప్రియ మిత్రులు గబగబా పరుగెత్తుకొని పోయి కౌసల్యాదేవికి ఈ విషయము అంతా తెలియచెప్పినారు. ఆ ప్రియవార్త వినిపించిన వారికి ఆ భాగ్యశాలిని అప్పుడు రత్నాలూ బంగారమూ గోవులూ బహుమానముగా ఇచ్చింది.

రాముడు దశరథమహారాజుకు నమస్కారము చేసి సెలవు చెప్పి తన భవనానికి పోవడానికి రథము ఎక్కినాడు. జనులు గుంపులు గుంపులుగా ఆ రథము చుట్టూ మూగి జయజయ ధ్వానాలు చేసినారు. రాముణ్ణి సమ్మానించినారు.

పౌరులు అందరూ సంతోషముతో తమ తమ ఇండ్లకు పోయినారు. రామాభిషేకము జరగవలెను అని తమ దేవతలను పూజించినారు.

౪

దశరథమహారాజు కొలువుచాలించిన తరువాత మంత్రులు అందరితోనూ మరునాటి రామరాజ్యాభిషేకాన్ని గురించి మళ్ళీ ఆలోచించినాడు. జరుగవలసిన ఏర్పాట్లను అన్నింటినీ నిశ్చయించినాడు. అంతఃపురములోకి పోతూ రాముణ్ణి మళ్లీ తన దగ్గరకు తీసుకొని రమ్మని సుమంత్రుడితో చెప్పినాడు.

ద్వారపాలకులు సుమంత్రుడి రాక రాముడికి తెలియచేసినారు. ఆయన మళ్లీ ఎందుకువచ్చినాడా అని శంకిస్తూ, వెంటనే ఆయనను లోపలికి రావించి "మంత్రిసత్తమా, తాము మళ్లీ ఎందుకు వచ్చినారో వివరముగా చెప్పవలెను" అన్నాడు రాముడు.

"మహారాజా మళ్ళీ మిమ్ములను చూడవలెను అనుకొన్నాడు. నన్ను పంపించినాడు. అంత కన్నా నాకు తెలియదు. రావడమూ రాక పోవడమూ తమ చిత్తము" అన్నాడు సుమంత్రుడు.

రాముడు వెంటనే రాజభవనానికి బయలు దేరినాడు. అతని రాక తెలియగానే దశరథ మహారాజు వెంటనే లోపలికి పంపించమని ద్వారపాలకులతో చెప్పినాడు. రాముడు లోపలికి పోయి చేతులెత్తి నమస్కారము చేస్తూ సాష్టాంగపడినాడు. ఆయన రాముణ్ణి లేవనెత్తి కౌగలించుకొని మనోజ్ఞము అయిన ఆసనము మీద కూర్చుండ నియమించినాడు.

“రామా, నాకు బాగా వృద్ధాప్యము వచ్చింది. నేను బహుకాలము రాజ్యపాలనము చేసినాను. శాస్త్రనిషిద్ధము కాని సమస్త భోగాలూ సమస్త సుఖాలూ యథేష్టముగా అనుభవించినాను. సకలశాస్త్రాలూ చదివినాను వేదాధ్యయనము చేసినాను. అన్నదానము చేసి భూరిదక్షిణలు ఇచ్చి అనేక యజ్ఞాలు చేసి దేవతల ఋణము తీర్చివేసినాను. నానావిధదానాలూ చేసి బ్రాహ్మణుల ఋణము తీర్చివేసినాను. సమస్త సుఖాలూ అనుభవించి నా దేహ ఋణము తీర్చివేసినాను. నిన్నూ నీ తమ్ములనూ కని పితృఋణము తీర్చివేసినాను. నీవు నాకు పుత్రుడవుగా పుట్టడమే కాకుండా నాకు ఇష్టుడవు అయినావు. నీ అంతటివాడు ఈలోకములో లేడు అనిపించుకొన్నావు. ఇక నీకు రాజ్యాభిషేకము చేయుడమనుకన్నా నాకు మరి ఒక పనిలేదు. కాబట్టి నాకోసము నీవు నేను చెప్పినట్టు ఒప్పుకోవలెను.

“రామా, ఇప్పుడు ప్రజలు అందరూ నిన్ను యువరాజును చేయమంటున్నారు. అంతేకాదు. దారుణము అయిన అమంగళాలు నాకు కలలో కనపడుతూ ఉన్నవి. ఆకాశమునుంచి కొరవులు మంటలు లేకుండా పిడుగులవంటి ధ్వనులతో నేలమీద పడడము కలలో చూచినాను. ఇప్పుడు నా జన్మ నక్షత్రానికి శన్యంగారకరాహువులు వచ్చినట్టు జ్యోతిష్కులు చెప్పుతున్నారు. ఇటువంటి దుర్నిమిత్తాలు తోచినప్పుడు తరుచూ రాజుకు చావు మూడుతుంది, లేదా రాజుకు గొప్ప ఆపదలు అయినా వస్తవి. అందువల్ల రేపే నీకు యువరాజాభిషేకము చేయ నిశ్చయించినాను. మానవుల బుద్ధి చంచలము. కాబట్టి నా ఈ బుద్ధి మారకపూర్వమే నీవు యువరాజువు కావలెను.

“నాయనా, నా అంతఃకరణము నీ రాజ్యాభిషేకానికి తొందర పెట్టుతూ ఉంది. ఈనాడు పునర్వసు నక్షత్రము. రేపు పుష్యమి నక్షత్రము. రాజ్యాభిషేకానికి బాగున్నది అని జ్యోతిష్కులు చెప్పినారు. నీ అభిషేకము రేపే

అయిపోవలెను. నీవు ఇప్పటినుంచి నియమబద్ధుడవుగా ఉండవలెను. నీవూ నీ భార్యా ఈ రాత్రి ఉపవాసము చేయవలెను. దర్భశయ్యమీద పడుకోవలెను. నీ స్నేహితులు నిన్ను ఈరాత్రి ఏమరుపాటులేకుండా కనిపెట్టుకొని ఉండవలెను. ఏమంటే ఇటువంటి సమయాలలో అనేక విఘ్నాలు వస్తూఉంటవి.

"రామా, ఇప్పుడు భరతుడు దూరదేశములో ఉన్నాడు. వాడు ఇక్కడికి వచ్చేలోపలనే నీ రాజ్యాభిషేకము అయిపోవలెను. నీ తమ్ముడు భరతుడు పెద్దలు అందరూ పోయినదారినే పోయేవాడే కావచ్చును. నీవు జ్యేష్ఠుడవు అని నిన్ను అనుసరించేవాడే అయిఉండవచ్చును. ధార్మికుడూ దయాహృదయుడూ అయికూడా ఉండవచ్చును. జితేంద్రియుడున్నూ అయిఉండవచ్చును. కాని మానవుల చిత్తము అనిత్యము, ఎప్పుడూ ఒక్కమాదిరిగా ఉండదు. ఇది నా అభిప్రాయము. ధర్మైకపరాయణులు సహితము ఇతరులు కల్పించే మిత్రభేదానికు లొంగిపోవడము కద్దు, అయితే గతించినదానికి ధార్మికులు అయినవారు చింతించరు. అందువల్ల రేపే నీ రాజ్యాభిషేకము జరుగవలెను. నాయనా, నీవు పోయిరా" అన్నాడు దశరథమహారాజు.

రాముడు తండ్రికి నమస్కారముచేసి తన భవనానికి పోయినాడు. అక్కడ అతడు నిలవలేదు. దశరథమహారాజు తలపెట్టిన తన యువరాజ్యాభిషేకాన్ని గురించి తన తల్లి కౌసల్యాదేవితో చెప్పవలెను అనుకొన్నాడు. తత్క్షణమే ఆమె అంతఃపురములోనికి పోయినాడు.

కౌసల్యాదేవి తెల్లని పట్టుచీర ధరించి దేవతాగారములో మౌనముతో భగవద్ధ్యానము చేస్తూ ఉంది. ఆమె సరసను సుమిత్రాదేవీ సీతాదేవీ లక్ష్మణుడూ కూర్చుని ఉన్నారు. వారిని రాముడు చూచినాడు.

రామాభిషేక వర్తమానము విని సుమిత్రాదేవీ లక్ష్మణుడూ కౌసల్యాదేవి దగ్గరకు వచ్చినారు. వారు సీతాదేవిని అక్కడికి పిలిపించినారు. కౌసల్యాదేవి వారిని ముగ్గురిని వెంటపెట్టుకొని దేవతాగారములోనికి పోయి మరునాడు యువరాజు కాబోతున్న తన పుత్రుడి మంగళాభివృద్ధికోసము కన్నులు మూసుకొని పురుషసూక్తములో చెప్పినట్టుగా ప్రాణాయామముతో జనార్ధనుణ్ణి ధ్యానము చేస్తూ ఉంది.

ఆ నిష్ఠాగరిష్ఠ దగ్గరకు రాముడు పోయి నమస్కారము చేసినాడు. ఆమెను సంతోషపెట్టడానికి "అమ్మా, నాయనగారు ఇక నన్ను ప్రజాపాలనము చేయుమని ఆజ్ఞాపించినారు. రేపు నా యువరాజాభిషేకము అని శాసించినారు. నేనూ సీతా ఈ రాత్రి ఉపవాసము చేయవలెను అని వారు నాతో చెప్పినారు. మేము చేయవలసిన మంగళకార్యాలను అన్నిటినీ నీవు ఇప్పుడే చేయించవలెను" అన్నాడు రాముడు.

ఆ మాటలకు ఆమె కన్నులవెంట ఆనందబాష్పాలు దొర్లినవి. ఎంతో కాలమునుంచీ రామ యువరాజాభిషేకము ఆమె కాంక్షిస్తూ ఉంది. ఆమె మాటలు తడబడుతూ మనోహరముగా "నాయనా, నీవు కలకాలమూ జీవించవలెను. నీపగవారు అందరూ హతము అయిపోవలెను నన్నూ నా వాండ్లనూ ఈ సుమిత్రనూ దీని వాండ్లనూ నీవు సుఖపెట్టవలెను. నీవు మంచి నక్షత్రములో పుట్టినావు. అందువల్ల నీ సద్గుణాలకు నీ తండ్రి నిన్ను మెచ్చుకొన్నాడు. నా వ్రతాలూ నా ఉపవాసాలూ ఇప్పుడు ఆ పుండరీకాక్షుడు ఆ శ్రీమన్నారాయణమూర్తి సఫలము చేసినాడు. నాయనా, రామా, ఇక్ష్వాకు రాజ్యలక్ష్మి ఇప్పుడు నిన్ను చేపట్టబోతున్నది" అని చెప్పింది.

ఈ విధంగా తల్లి చెప్పినమాటలు రాముడు విన్నాడు. అణకువతో చేతులు మోడ్చి అక్కడ కూర్చున్న లక్ష్మణుణ్ణి చూచి మందహాసముతో "తమ్ముడా, నిన్నూ ఈ రాజ్యలక్ష్మి వరిస్తూ ఉంది. నాతోపాటు నీవూ ఈ రాజ్యభారము వహించవలెను. నీవు నా రెండవ ప్రాణానివి. నీ ఇష్టార్థాలూ అమూల్యవస్త్రాభరణాలూ సమస్తభోగాలూ నీవూ అనుభవించవలెను. నా జీవితమూ నా రాజ్యమూ నా భాగ్యభోగాలూ నీ కోసమేను" అన్నాడు.

రాముడు అంతట తల్లులకు నమస్కారముచేసి వారి అనుమతితో సీతను వెంటపెట్టుకొని తన మందిరానికి పోయినాడు.

౫

దశరథమహారాజు రాముణ్ణి ఉపవాస నియమములో ఉండమని చెప్పి పంపించి వేసిన తరువాత వసిష్ఠమహర్షిని పిలిపించి "తపోధనా, తాము సీతారాముల మందిరానికి ఇప్పుడే పోవలెను. వాండ్లచేత వాండ్ల యశస్సుకోసమూ

రాజ్యముకోసమూ సంపదలకోసమూ ఉపవాస వ్రతము పట్టించవలెను'' అని చెప్పినాడు. ఆ వ్రతనిష్ఠాపరుడు "అట్లాగేను'' అన్నాడు.

ఆ మంత్రకోవిదుడు వసిష్ఠమహర్షి బ్రాహ్మణులు ఎక్కిపోయే రథము మీద స్వయముగా బయలుదేరి రామమందిరానికి పోయినాడు. తెల్లటి మేఘమువలె కనిపించే రామభవనములో మూడు కక్ష్యలు దాటినాడు. వసిష్ఠమహర్షి వస్తూ ఉన్నాడు అని ద్వారపాలకులు పోయి రాముడితో చెప్పినారు. అతడు తత్క్షణమే లేచినాడు. ఆ మహానుభావుడికి ఎదురుకోలు చెప్పి ఆయనను పూజించడానికి నేగిరపడ్డాడు. సంభ్రమముతో అడుగులు వేస్తూ ఆయన రథానికి ఎదురుగుండా పోయినాడు. రథముమీదనుంచి దిగడానికి ఆ మహానియుడికి చేయూత నిచ్చినాడు. ఆ వినయానికి వసిష్ఠమహర్షి మెచ్చుకొని అత్యంతాదరముతో రామున్ణి ఆశీర్వదించినాడు. సంతోషముతో "రామా, నీ తండ్రికి నీమీద అనుగ్రహము వచ్చింది. నీవు యువరాజువు అవుతున్నావు. అందుకోసము ఇప్పుడు సీతతో కూడా నీవు ఉపవాసవ్రతము పట్టవలెను. నహుష చక్రవర్తి తన కొమారుడు యయాతికి ఒప్పగించినట్టుగా రేపు ఉదయము నీతండ్రి దశరథ మహారాజు నీకు రాజ్యపాలనము ఒప్పచెప్పుతాడు'' అన్నాడు వసిష్ఠమహర్షి.

అంతట సీతారాముల చేత సమంత్రకముగా ఆ రాజగురువు ఉపవాసవ్రతము పట్టించినాడు. ఆ గురువరేణ్యుణ్ణి సీతారాములు యథాశాస్త్రముగా సమ్మానించినారు. "పోయివస్తాను'' అని చెప్పి వసిష్ఠమహర్షి రామభవనములోనుంచి బయలుదేరినాడు.

అంతట రామున్ణి అతని ప్రియమిత్రులు సమ్మానించి సంతోషపెట్టినారు. రాముడు కొంచెముసేపు వారితో ముచ్చటలాడినాడు. వారు అందరూ వెళ్ళిపోయిన తరువాత తన అంతఃపురములోనికి పోయినాడు. మహోల్లాసముతో సింగారించుకొన్న స్త్రీ పురుషులతోనూ మనోహర గీతవాద్య ధ్వనులతోనూ ఆ అంతఃపురము చెవులకు ఇంపుగా పాటలు పాడే పక్షుల గుంపులూ వికసించిన కమలాలూ ఉన్న కాసారము మాదిరిగా కనిపించింది.

రాజభవనమువంటి రామభవనములోనుంచి వసిష్ఠమహర్షి బయటకు వచ్చినాడు. రాజవీధి అంతా రామాభిషేక దర్శన కుతూహలముతో వచ్చిన జన సమూహముతో కిటకిటలాడుతూ ఉంది. సముద్రతరంగాల మాదిరిగా జనసమూ

హాలు అక్కడకు వస్తూ ఉన్నవి. ఆ మహాజనుల కలకల ధ్వని ఘోషము వలె వినిపిస్తూ ఉన్నవి.

అప్పుడే రాజవీథులు అన్నీ ఊడ్చి నీళ్లు చల్లి సింగారించినారు. అరటి చెట్లూ పోక చెట్లూ వరుసగా ఆ రాజవీథిలో రెండుపక్కలా నిలుచుండ పెట్టినారు. ప్రతి ఇంటి మీదనూ జండాలు ఎత్తినారు.

అయోధ్యానగరములో ఉన్న స్త్రీలూ పురుషులూ బాలురూ వృద్ధులూ ఇకను ఎప్పుడు చీకటి పడుతుంది-ఎప్పుడు తెల్లవారుతుంది అనుకొంటూ రామాభిషేక మహోత్సవము చూడడానికి ఉత్సాహపడుతున్నారు. ఆ జనసమ్మర్దములో నుంచి వసిష్ఠమహర్షి వ్యూహాభేదములో రథమువలె ఎట్లాగో దారి చేసుకొని తెల్లటి మేఘమువలెనూ తెల్లటి కొండ కొమ్మువలెనూ కనిపించే దశరథ మహారాజు భవనము దగ్గరకు పోయినాడు.

దేవేంద్రుణ్ణి చూడపోయే దేవగురువువలె వసిష్ఠమహర్షి ఆ ప్రసాదము మెట్లు ఎక్కి పయికిపోయినాడు. దశరథమహారాజు ఆ వేదవిదుణ్ణి చూచే చూడడముతో సింహాసనముమీదనుంచి లేచినాడు. ఆయనతోపాటు ఆ రాజ పురోహితుణ్ణి గౌరవించడానికి అక్కడ కూర్చున్నవారు అందరూ లేచి నిలుచున్నారు.

"ఓ మహర్షీ, సీతారాముల చేత ఉపవాసవ్రతము పట్టించినారా" అని దశరథమహారాజు ప్రశ్నించినాడు. ఆ మహానుభావుడు "అవును" అన్నాడు.

అంతట దశరథమహారాజు వసిష్ఠమహర్షి అనుజ్ఞ తీసుకొని సభ చాలించినాడు.

నభోమండలములో నక్షత్రాల మధ్య చంద్రుడివలె మహేంద్రభవనము వంటి తన రాజభవనములో దివ్యవస్త్రాభరణ భూషితలు అయిన స్త్రీలమధ్య దశరథమహారాజు తన కాంతులను వెదచల్లినాడు.

౬

వసిష్ఠమహర్షి వెళ్ళిపోయిన తరువాత సీతారాములు స్నానము చేసినారు. మనశ్శుద్ధితో శ్రీమన్నారాయణమూర్తిని పూజ చేసినారు. అంతట రాముడు

హవిష్పాత్రను శిరసా గ్రహించి జ్వలిస్తున్న అగ్నిహోత్రములో శ్రీమన్నారాయణ ప్రీత్యర్థము ఆజ్యహోమము చేసినాడు. హోమము చేయగా మిగిలిన హవిస్సును భుజించినాడు. ఇష్టకార్యసిద్ధికోసము శ్రీమన్నారాయణమూర్తిని ధ్యానము చేసినాడు.

ఆ రాత్రి రాముడు ఆ ఆవరణములో ఉన్న విష్ణ్వాలయములో దర్భశయ్య అమర్చుకొని మౌనవ్రతముతో అచంచల మనస్సుతో వైదేహీసమేతముగా పడుకొన్నాడు. తెల్లవారడానికి ఇంకా ఒక ఝాము పొద్దు ఉంది అనగా నిద్రలేచినాడు. తన భవనములో అలంకారము చేయించడము మొదలు పెట్టినాడు. శ్రవణపేయముగా పాడుతూ ఉన్న సూతవందిమాగధుల స్తోత్రపాఠాలు మేలుకొలుపులూ వింటూ కాల్యాలు ముగించినాడు. ప్రాతఃకాల సంధ్యావందనము చేసినాడు. గాయత్రీజపము అయిన తరువాత సూర్యమండల మధ్యవర్తి అయిన శ్రీమన్నారాయణమూర్తిని స్తోత్రము చేసినాడు. సాష్టాంగపడినాడు.

రాముడు తెల్లటి పట్టు ఉత్తరీయము కప్పుకొని బ్రాహ్మణోత్తముల చేత పుణ్యాహము చెప్పించడము మొదలు పెట్టినాడు. మహాగంభీరముగానూ మనోహరముగానూ బ్రాహ్మణోత్తములు చెప్పుతూ ఉన్న పుణ్యాహధ్వనులతో కలసి మంగళవాద్యధ్వనులు చెలరేగినవి. అయోధ్యానగరము అంతా ఆ శ్రావ్య మనోహరధ్వనులతో మారుమ్రోగిపోయింది. పౌరులు అందరూ నిద్ర లేచినారు. సూర్యోదయము కాగానే రామాభిషేకము జరుగుతుంది అని అందరూ ఉప్పొంగిపోయినారు. పట్టణాన్ని మరింతశోభాయమానముగా అలంకరించడము మొదలు పెట్టినారు. తెల్లటి మేఘాల వలెనూ పెద్ద పెద్ద కొండలవలెనూ ఉన్న దేవాలయాల మీదనూ కోట బురుజుల మీదనూ ఇంకా చతుష్పథాలలోనూ రాజవీథులలోనూ మహోన్నత వృక్షాలమీదనూ రంగురంగుల పతాకలు ఎత్తినారు. ఆయా ప్రదేశాలలో నటులూ నర్తకులూ అభినయిస్తూ నేత్రపర్వముగా నాట్యము చేయసాగినారు. గాయకులు కర్ణపేయముగా పాడసాగినారు.

ఇంటా బయటా స్త్రీలూ పురుషులూ రామాభిషేకాన్ని గురించే ముచ్చటించసాగినారు. ఆటలు ఆడుకొనే పిల్లలు సహితము రామాభిషేకాన్ని గురించే చెప్పుకోవడము మొదలు పెట్టినారు. పౌరులు పూలదండలతో రాజవీథులు అన్నీ

అలంకరించినారు. అంతటా సుగంధధూపాలు వేసినారు. రామాభిషేకము పూర్తి అయి ఊరేగింపు వచ్చే సమయానికి చీకటి పడిపోతుంది అనుకొని వృక్షాకారముగా పెద్ద ఎత్తున దీపపు స్తంభాలు అమర్చినారు. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడెప్పుడు రామాభిషేకము జరుగుతుందా అనుకొంటూ పౌరులు అందరూ గుమికూడ సాగినారు.

"ఆహా దశరథమహారాజు ఎంతబుద్ధిశాలి. తనకు వార్ధక్యము వచ్చింది అని తోచగానే రామునికి రాజ్యాభిషేకము చేయ నిశ్చయించినాడు. రాముడు ధర్మాత్ముడు. భ్రాతృవత్సలుడు. విద్వాంసుడు. మనలను అందరినీ తన బిడ్డల వలె చూచుకొంటున్నాడు. ఆ నిగర్వి ఎప్పుడు రాజు అవుతాడా అనుకొంటూ వచ్చినాము. దైవానుగ్రహము వల్ల ఆ దృష్టశోకపరాయణుడు ఈనాడు తెల్లవారగానే రాజు కాపోతున్నాడు. ఇంక కాస్సేపటికి దశరథమహారాజు దయవల్ల రామరాజ్యాభిషేకము జరుగుతుంది ఇంతకూ ఆ పరమ ధార్మికుడు దశరథమహారాజు బహుకాలము జీవించవలెను" అంటూ పౌరులు ముచ్చట లాడ సాగినారు.

తెల్లవారవస్తూ ఉంది. రామాభిషేకము చూడ వచ్చిన జనసమూహముతో అయోధ్యానగరము అప్పటికే ఇరకటము అయి పోయింది. జనులు నానా దిక్కులనుంచీ గుంపులుగుంపులుగా రాసాగినారు. హర్షధ్వానాలు మిన్ను అంటు తున్నవి. ఒకరి మాట ఒకరికి వినిపించకుండాపోయింది. జనసమూహాలు క్షణ క్షణమూ కోలాహల ధ్వనులతో పొంగి పొర్లివస్తూ ఉంటే అమరావతీ పట్టణము వలె తీర్చి దిద్దినట్టు ఉండే అయోధ్యానగరము పున్నమి నాటి సముద్రము వలె మహాఘోషముతోనూ తిమి తిమింగిలాలు మొదలు అయిన జలచరాలతోనూ అల్లకల్లోలము అయినట్టు తోచింది.

౭

ఎవతో ఎక్కడ పుట్టిందో ఎవరికి తెలియదు. అది కైకేయీదేవికి దాసి. ఆమె పుట్టినింటి నుంచి వచ్చింది. ఎప్పుడూ ఆమె దగ్గర ఉంటూ ఉంటుంది. దాని పేరు మంథర. అది ఆ నాటి సాయంకాలము (తెల్లవారితే రామరాజ్యాభిషేకము అనగా) యాదృచ్ఛికముగా రాజప్రాసాదము మీదికి పోయింది. నాల్గు దిక్కులా చూడడము మొదలు పెట్టింది.

రాజవీథులు అన్నీ చక్కగా చిమ్మి నీళ్ళు చల్లి ముగ్గులు పెట్టి పూలదండలతో అలంకరిస్తూ ఉన్నారు. అంతటా పతాకలూ ధ్వజాలూ ఎత్తుతూ ఉన్నారు.

అభ్యంగస్నానము చేసిన బ్రాహ్మణోత్తములూ పౌరముఖ్యులూ పూల దండలూ కుడుములూ తీసుకొని రామమందిరములోకి వస్తున్నారు. దేవాలయాలకు వెల్ల వేస్తున్నారు. పౌరులు అందరూ సుహృదానందముతో రాజవీథిలో మూగుతూ ఉన్నారు. సమస్త మంగళ వాద్యాలూ మోగుతూ ఉన్నవి. బ్రాహ్మణోత్తముల వేదఘోషము ఆకాశము అంటుతూ ఉంది. మానవులే కాకుండా జంతువులు సయితము సంతోషాతిశయాన్ని వెల్లడిస్తూ ఉన్నవి. సంతోషముతో గుర్రాలు చిందులు తొక్కుతున్నవి. ఉత్సాహాతిశయముతో ఏనుగులు పాదులు కాడుతూ గబ గబా నడుస్తూఉన్నవి. ఆబోతులు రంకెలు వేస్తూ ఉన్నవి. సవిలాసముగా ఆవులు మందలు మందలుగా తిరుగుతూఉన్నవి.

అది అంతా మంథర చూచింది. సంగతి ఏమిటో దానికి తెలియలేదు. ఆ మేడ మీదనే ఆపక్కనే తెల్లని పట్టుచీర కట్టుకొన్న దాది హర్షోత్ఫుల్ల నేత్రాలలో రాజవీథి వంక చూస్తూ ఉంది. మంథర దాన్ని చూచి "ఏమిచే ఎవరికీ ఏమీ పుట్టనివ్వని ఆశపాతకపు మనిషి రాముడి తల్లి ఇప్పుడు ఎంతో సంతోషముతో అందరికీ బహుమానాలు ఇస్తూ ఉంది. కింద చూచి వచ్చినాను. ఇక్కడ నుంచి ఇటు చూస్తే పౌరముఖ్యులు అందరూ మహాసంతోషముతో రాజమందిరము దగ్గర మూగుతూ ఉన్నారు. రాజు ఏది అయినా శుభకార్యము తలపెట్టినాడా-కాస్త చెప్పు" అని అడిగింది.

పిల్లలకు పాలు ఇచ్చే ఆ దాది సంతోషము పట్టలేక పోయింది. అవృత్తాంతము దాచలేకపోయింది. తెల్లవారితే రామాభిషేకము అని అది మంథరకు చెప్పివేసింది.

మంథర నిర్ఘాంత పోయింది. కోపము రేగింది. అక్కడ ఇక నిలువలేక పోయింది. కైలాస పర్వత శిఖరము అంత ఎత్తున ఉన్న ఆ మేడ మీద నుంచి ఆ పాపదర్శిని గబ గబా కిందికి దిగింది. కైకేయీదేవి దగ్గరకు హుటాహుటీ పోయింది. అప్పుడు ఆమె పడుకొని ఉంది. మంథర తీక్ష్ణ స్వరముతో " ఓ

తెలిసితక్కువ రాణీ, నీవు లేవవలెను. ఇంకా ఎందుకు పడుకొంటావు? నీకు ఆపత్కాలము ఆసన్నము అయింది. నానా కష్టాలపాలూ కాబోతున్నావు. నీవు ఇంకా తెలుసుకోలేదు ఏమిటి? ఓ రాణీ, ఇంత శోభనాకారవూ భర్తకు అయిష్టురాలవు అయి పోయినావు. ఓ రాణీ, నా అంత మహాభాగ్యవంతురాలు లేదు అని నీవు ఎప్పుడూ విఱ్ఱవీగుతావు. ఇప్పుడు నీ మహాభాగ్యము అంతా ఎండా కాలములో ఏటి నీళ్ళవలె అడుగంట పోతున్నది" అని చెప్పింది.

ఆ పాపదర్శిని ఈ విధముగా కోపపడుతూ ఉంటే కైకేయీదేవి మనస్సు చిన్నపోయింది. "ఓ మంథరా, నాకు సుఖములేదా-నన్ను నీవు సుఖముగా ఉండనీయవా-నీవు చిన్నపోయిన ముఖముతో కనపడుతున్నావు. చాలా దుఃఖపడుచున్నావు. కారణము ఏమిటి" అని కైకేయీదేవి మృదువుగా అడిగింది.

మంథర మాటకారి. కైకేయీదేవికి మేలు చేయడమే అది తన పనిగా పెట్టుకున్నది. కోపము మనస్సులోనే ఉంచుకొని ముఖము మరింత చిన్నపుచ్చుకొని ఏడుస్తూ "ఓ రాణీ, నీకు అక్షయముగా అపకారము జరిగింది. నీ నాశనానికి పెద్ద ఎత్తున ప్రయత్నము జరుగుతూ ఉంది. దశరథమహారాజు రాముడికి యువరాజ్యాభిషేకము చేయుచున్నాడు. ఈ సంగతి విన్నాను. నాకు అంతులేని భయము వేసింది. నా మనోవ్యథా దుఃఖమూ నేను మాటలలో చెప్పలేను. నన్ను నిప్పులలో పొర్లించినట్లుగా బాధపడ్డాను. ఏమీ తోచలేదు. ఆలోచించినాను. నీకు మేలు చేయడమే నా పని అనుకొన్నాను. ఇక్కడికి వచ్చినాను. ఓ దేవీ, నీ అభ్యుదయమే నా అభ్యుదయము. నీ దుఃఖమే నా దుఃఖము. సందేహము లేదు. ఓ కైకా, నీవు రాజవంశములో పుట్టినావు. దశరథ మహారాజు అంతటివాడికి ఉత్తమకళత్రానివి అయినావు. కాని రాజ్యతంత్రకార్యము గుర్తించవు. గమనించవు. చిత్రమే. దేవీ, నీ భర్త నీతో ధర్మపన్నాలు చెప్పుతూ ఉంటాడు. కాని మోసగాడు. నీతో మహామధురముగా మాట్లాడుతూ ఉంటాడు. కాని పరమక్రూరుడు. ప్రయోజనము మాలిన మంచి మాటలు అన్నీ నీతో చెప్పి నిన్ను ఉబ్బిస్తూ ఉంటాడు. తన పని గడుపుకొంటూ ఉంటాడు. నీవు కల్లా కపటము లేని దానివి. అందువల్లనే నిన్ను మోసము చేసినాడు. దుష్టాత్ముడు. కౌసల్యకు ఇప్పుడు అధికారమూ ఐశ్వర్యమూ కట్టపెట్టపోతున్నాడు. నీకొడుకు భరతుణ్ణి మేనమామ ఇంటికి తోలి వేసినాడు. ఏ

ఆటంకమూ లేకుండా చూచి కౌసల్య కొడుకు రాముడికి రాజ్యము ఒప్పగించ పోతున్నాడు. ఓ రాజపుత్రీ, ఓ చిన్నదానా, దశరథమహారాజు నీ పెనిమిటే కాని నీకు ఇప్పుడు పగవాడుగా ప్రవర్తిస్తున్నాడు. నీ బోటిదే ఒక చిన్నది మాతృవాత్సల్యముతో ఒక పామును పెంచింది. అది విషజంతువు అని అనుకోకుండా తన తొడల మీదికి ఎక్కించుకొన్నది. నీవు దశరథమహారాజును అట్లాగే చేసినావు. పామునూ పగవాణ్ణి ఉపేక్షిస్తే ఏమి అవుతుందో అదే ఇప్పుడు అయింది. ఓ దేవీ, నీవు ఎప్పుడూ సుఖము అనుభవిస్తూ ఉండవలసినదానవు. ఇప్పుడు నీవు నీవాండ్లు అందరితోనూ నాశనము కాబోతున్నావు. సమయము ఆసన్నము అవుతున్నది. నీమంచి ఏదో ఆలోచించుకో. నిన్నూ నీవాండ్లనూ వెంటనే కాపాడుకో. ఓ రాణీ, నదివ్యనేత్రాంతంతో నీవు ఏ పని అయినా చేయ కలవు'' అని చెప్పింది మంథర.

ఆ శుభానన మంథర చెప్పింది అంతా విన్నది. శయ్యమీదనుంచి శరత్కాల చంద్రలేఖ వలె సంతోషముతో లేచింది. రామాభిషేకము జరుగ పోతున్నందుకూ అంతవరకూ ఆ విషయము తనకు తెలియనందుకూ ఆశ్చర్యపడ్డది. ఎంతో సంతోష పడ్డది. ఒక మంచి ఆభరణము తీసి మంథరకు బహుమానముగా ఇస్తూ ''మంథరా, ఎంతో సంతోషవార్త చెప్పినావు. ఇంత సంతోషవార్త ఈ బహుమానము చాలదు. అయినా ఇది ఇస్తూన్నాను. నాకు రాముడు భరతుడు అనే భేదము లేదు. దశరథమహారాజు రాముడికి రాజ్యాభిషేకము చేయ పోతున్నారు అంటే నాకు ఎంతో సంతోషముగా ఉంది. ఇంతకన్నా నన్ను సంతోషపెట్టే వర్తమానము ఇంకొకటి నీవు చెప్ప లేవు. ఇంకా ఏది అయినా కోరుకో, ఇస్తాను. నీకోరిక చెల్లిస్తాను'' అన్నది కైక.

౮

ఈ విధముగా కైకేయీదేవి అన్నందుకు మంథరకు అసహ్యము వేసింది. ఆమె బహుమానముగా ఇచ్చిన ఆభరణము తీసి అవతల పారవేసింది. తాను మంచి చెప్పుతూ ఉంటే ఆమె వినలేదు అని కోపము వచ్చింది. కైక కష్టాల పాలు అవుతుంది అని దుఃఖము వచ్చింది. దుఃఖమూ కోపమూ మంథరలో పెనవేసుకొని పోయినవి.

"ఓ దౌర్భాగ్యురాలా, ఇది నీవు సంతోషపడే సమయమా? నీకు తెలియడము లేదు. ఓ రాణీ, నీవు శోకసాగరమధ్యప్రదేశములోకి పోతున్నావు అయ్యో! ఎంతో దుఃఖపడడానికి బదులు సంతోషపడుతున్నావు. నీబుద్ధి బుగ్గి అయింది. నాకు ఏడుపు వస్తూ ఉంది. నీ పిచ్చితనానికి నాకు నవ్వు వస్తూవుంది. ఓ దేవి, నీసవతి కొడుకు నీకు ఎప్పుడూ పగవాడే. నీకు మృత్యువు వంటివాడు. వాడి అభ్యుదయానికి బుద్ధిమంతురాలు ఎవతె అయినా సంతోషిస్తుందా? రాజ్యాధికారానికి రాముడితో సరిసమానము అయిన వాడు భరతుడు ఒక్కడే. అందువల్ల, రాముడికి భరతుడు అంటే భయము. భయపడ్డవాండ్లే ఎదటి వాండ్లకు ఎప్పుడూ అపకారము చేస్తారు. ఓ దేవీ, పెద్దపులి మనుష్యుణ్ణి చూచి భయపడుతుంది పాము అంతే. అందువల్లనే మనుష్యులు వాటి జోలికి పోక పోయినా అవి మనుష్యుల మీదపడి చంపివేస్తవి. ఇది ఆలోచించిన కొద్దీ నాకు దిగులు వేస్తూ ఉంది. భయము వేస్తూ ఉంది. ఓ కైకా, రాజ్యాధికారానికి లక్ష్మణ శత్రుఘ్నులున్నూ అర్హులే. కాని రాముడికి వాండ్లవల్ల భయము ఏమీ లేదు. లక్ష్మణుడు విలువిద్యలో ఆరితేరినవాడే. రాముడి అంతటి పరాక్రమ వంతుడే. అయితే సర్వాత్మనా వాడు రాముణ్ణి ఆశ్రయించుకొని ఉన్నాడు. వాడివలెనే శత్రుఘ్నుడున్నూ నీ కొడుకు భరతుణ్ణి అనుసరించుకొని ఉంటు న్నాడు. లక్ష్మణ శత్రుఘ్నులు ఇద్దరూ పరతంత్రులుగా ఉన్నారు. స్వతంత్రులుగా లేరు. కాబట్టి రాముడికి ఆ ఇద్దరు తమ్ముల భయమూ లేదు.

"దేవీ, జన్మక్రమాన్ని పట్టికూడా రాముడికి భరతుడుఅంటేనే భయము. రాముడు లేక పోయేట్లయితే రాజ్యము భరతుడికే అవుతుంది. లక్ష్మణ శత్రుఘ్నులు భరతుడి తరువాత పుట్టినారు. అందుచేత రాజ్యప్రాప్త్యధికారము వారికి సన్నిహితముగా లేదు. రాముడి తరువాత రాజ్యప్రాప్త్యధికారము భరతుడికే ఉంది. రాముడు మతిమంతుడు. నీతిజ్ఞుడు. ఏ సమయములో ఏది చేయవలెనో చక్కగా తెలిసినవాడు. నీకొడుకు భరతుడు రాముడి అంతటి సమర్థుడు కాడు. అందువల్ల నీ కొడుకును గురించి ఆలోచించిన కొద్దీ నాకు వణుకు పుట్టుకొని వస్తూఉంది.

"ఓ శుభాంగీ, రేపు ఉదయము పుష్యమి నక్షత్రాన రాముడికి రాజ్యాభిషేకము అయి పోతుంది. కౌసల్య రాజమాత అవుతుంది. అయ్యో, ఇక నామె

మహాభాగ్యవంతురాలు అయిపోతుంది. అంతట ఆమె సంతోషములో చెలరేగుతుంది. తన సవతులను అందరినీ అణచివేస్తుంది. ఓ కేకయరాజపుత్రీ, నీవు ఇక కౌసల్యాదేవికి దండము పెట్టుతూ దాని వలె ఊడిగము చేయవలసి వస్తుంది. నీతోపాటు మేమున్నా ఆమెకు దాసీలము అవుతాము. నీకుమారుడు భరతుడు రాముడికి సేవకుడు అవుతాడు. రాముడి అంతఃపురాంగనలు అందరూ చెలరేగుతారు. భరతుడు దరిద్రుడు అయి పోతాడు. అందువల్ల అతడి అంతఃపురాంగనలు అందరూ రాముడి అంతఃపురాంగనల వెంట దాసీల వలె తిరుగవలసివస్తుంది. అయ్యో" అంటూ మంథర దుఃఖపడి పోయింది.

కైకేయీదేవి ఈ మాటలు చెవిని పెట్టలేదు. మంథరను చూస్తూ "ఓ. గూనీ, రాముడు ధర్మజ్ఞుడు. గురుశిక్షితుడు. జితేంద్రియుడు. కృతజ్ఞుడు. నిర్మలుడు. కల్లలాడడు. దశరథమహారాజుకు జ్యేష్ఠపుత్రుడుగా పుట్టినాడు. అందువల్ల యువరాజు అవుతున్నాడు. ఆ చిరంజీవి తమ్ములనూ తక్కిన వారినీ తండ్రిమాదిరిగా ఆదరిస్తాడు. కాపాడుతాడు. ఓసీ గూనీ రాముడి రాజ్యాభిషేకానికి సంతోష పడవలెను. నీవు ఎందుకు దిగులు పడుతావు? భరతుడి సంగతి అంటావా? రాముడు ఒక నూరు సంవత్సరాలు రాజ్యము ఏలిన తరువాత భరతుడు రాజ్యము ఏలుతాడు. నేను రాముడినే భరతుడికన్నా ఎక్కువగా గౌరవిస్తున్నాను ప్రేమిస్తున్నాను. వాడున్నూ తన సొంత తల్లి కౌసల్యాదేవి కన్నా నన్నే ఎక్కువగా చూస్తున్నాడు. నాకే ఎక్కువ సేవ చేస్తూ ఉన్నాడు. రాముడికి తాను వేరు తన తమ్ములు వేరు అనే భేదము లేదు. తనవలెనే తన తమ్ములనూ చూచుకొంటూ ఉంటాడు. రాముడికి రాజ్యము వస్తే భరతుడికిన్ని రాజ్యము వచ్చినట్టేను" అన్నది కైకేయీదేవి.

ఈ మాటలకు మంథరకు పట్టరాని కోపమువచ్చింది. వేడి వేడి నిట్టూరు విడుస్తూ "ఓ అనర్థదర్శినీ, ఓ మూర్ఖురాలా, నీకు మంచి చెడ్డలు తెలియడములేదు. నీ సవతి కొడుకు రాజు అవుతాడు. నీ సవతికి సేవచేసే విపత్సముద్రములో పడి నీవు మునుగుతూ తేలుతూ ఉంటావు. అప్పుడు నీవు నీకొడుకుకు రాజ్యము లేక పోయిందే అని ఏడుస్తావు. నేను చెప్పుతూ ఉన్నాను. నీవు వినకుండా ఉన్నావు. ఏమి చేసేది? రాముడి తరువాత రాజు అయ్యేది రాముడి కొడుకు. నీ కొడుకు కాదు. నీ కొమారుడికి రాజ్యము ఎట్లా వస్తుంది? అయో

న్యమూ ఏలే రాజులలో నీ కొడుకు పేరు అయినా ఉండదు. రాజుకు పుట్టిన పుత్రులలో ప్రతివాడికీ రాజ్యము రాదు. పుట్టిన రాజపుత్రులు అందరూ రాజులు అయ్యేట్లయితే రాజ్యము ఛిన్నాభిన్నము అయి పోతుంది. ఓ శుభాంగీ. అందువల్ల గుణవంతులు అయిన పుత్రులు ఎంతమంది పుట్టినా రాజు జ్యేష్ఠపుత్రుడికే రాజ్యపాలనము ఒప్పగిస్తాడు. ఓ దయామయీ. నీ కుమారుడు భరతుడికి రాపోతున్న అనర్థము ఆలోచించు. ఏ సుఖమూ అనుభవించకుండా నీ కుమారుడు అసాధుడు అయిపోతాడు. రాజవంశానుక్రమణికలో నీ కొడుకు పేరు అయినా ఉండదు. నేను ఇది అంతా ఆలోచించి తెలుసుకొన్నాను. నీకు మేలు చేయడమే నా పని. అందుకే ఇప్పుడు నేను నీ దగ్గరకు వచ్చి ఇది అంతా చెప్పుతున్నాను. నా అభిప్రాయము నీవు గమనించకుండా ఉన్నావు. నీ సవతి కౌసల్య ఐశ్వర్యవంతురాలు అవుతుంది. ఆమె మహావైభవము అనుభవించ పోతూ ఉంటే నీవు ఆమెకు ఊడిగము చేయవలసిన సమయము ఆసన్నము అవుతూ ఉంటే నీవు నాకు ఆభరణము బహుమానము చేసే బుద్ధిమంతురాలవు! నేను చెప్పుతున్నది ఇప్పుడు నీకు బోధపడదు.

“ఓ కైకా, రాముడు నిరాటంకముగా రాజు అవుతాడు. ఆ తరువాత వాడు భరతుణ్ణి దేశాంతరమో అవసరము అయితే లోకాంతరమో పంపించి వేస్తాడు తప్పదు. నీవు భరతుణ్ణి చిన్నప్పటి నుంచీ మేనమామ దగ్గర అట్టే పెట్టినావు. ఎవరికి అయినా దగ్గర ఉన్న వాండ్ల మీద ఉండే వాత్సల్యము దూరాన ఉండే వాండ్ల మీద ఉండదు. నీకు ఈ మాత్రము ఇది తోచలేదు. చెట్లు సయితను దగ్గర ఉన్న లతలతో చెలిమి చేస్తూ ఉంటవి. భరతుడి వెంట పోయిన శత్రుఘ్నుడు అయినా ఇప్పుడు ఇక్కడ ఉంటే ఎంతో బాగుండేది. కట్టెలు కొట్టే వాండ్లు అడవిలో ఒక చెట్టును నరకపోయినారు. అయితే ఆ చెట్టును అంటిపెట్టుకొని ఉన్న ముండ్లపొదను చూచి భయపడి ఆ చెట్టును వదలిపెట్టి పోయినారట.

“ఓ దేవీ, రాముణ్ణి కనిపెట్టుకొని లక్ష్మణుడూ, లక్ష్మణుణ్ణి కాపాడుతూ రాముడూ అయోధ్యానగరములో ఉండడము మంచి సౌభ్రాత్రత్వానికి అశ్వినీ దేవతల వలె రామలక్ష్మణులు ప్రసిద్ధి కెక్కినారు. రాముడు లక్ష్మణుడికి అపకారము చేయడము అనేదే ఉండదు. అయితే భరతుడికి మాత్రము అపకారము

చేసే తీసుతాడు. సందేహము లేదు. కాబట్టి నీ కుమారుణ్ణి కేకయ మహారాజు ఇంటినుంచే అటు అడవులకు పొమ్మనడము మంచిది అని నాకు తోస్తున్నది. అట్లా చేసేట్లయితే నీ కుమారుడు భరతుడి ప్రాణాలు అయినా దక్కుతవి. ఓ కైకా, నీ మంచి కోసము నేను ఇది అంతా చెప్పుతున్నాను. పిత్రీయము అయిన రాజ్యము ఏవిధముగా నైనా భరతుడికి వస్తేనే నీవు సుఖపడతావు. నీ కుమారుడు సుఖపడుతాడు. నీ వాండ్లు అందరూ సుఖపడుతారు. మేము అందరమూ సంతోషిస్తాము.

"ఓ దేవీ, రాముడికి రాజ్యాభిషేకము అవుతుంది. సకల ఐశ్వర్యాలూ సమస్త అధికారాలూ వాడికి సంప్రాప్తము అవుతవి. భరతుడికి ఎవరి సహాయమూ ఉండదు. ఏ ఒక్క సంపదా ఉండదు. సవతి తల్లి పుత్రుడు అయినందువల్ల రాముడికి సహజశత్రువు అవుతాడు. రాముడిదగ్గర వాడు ఏట్లా బ్రతుకుతాడు? అడవిలో తరుముకొని వస్తూ ఉన్న ఏనుగును సింహము నోటిలో పడకుండా కాపాడేటట్లుగా భరతుణ్ణి రాముడి చేతిలో పడకుండా నీవు ఇప్పుడు కాపాడవలెను.

"ఓ రాజపుత్రీ, నీ పెనిమిటికి నీవు ఒక్కతెవే ప్రియురాలవు అనుకొన్నావు. విర్ర వీగి పోయినావు. నీ గర్వములో నీ సవతి కౌసల్యను నీవు అన్ని విధాలా అవమానించినావు. ఇప్పుడు ఆమె కొడుకు రాజు కాపోతున్నాడు. ఆమె ఇక నీ మీద పగ తీర్చుకోకుండా ఉంటుందా? నిన్ను తన పనికత్తెగా చేసుకోకుండా ఉంటుందా?

"ఓ కైకేయీ, ఈ విశాలకోసలరాజ్యానికి రాముడు రాజు అవుతాడు. నీవు నీకొడుకుతో కూడా దరిద్రురాలవు అయిపోతావు, అవమానాల పాలు అయి పోతావు. అన్ని అమంగళాలూ అనుభవిస్తావు. రాముడు రాజు కాగానె నీ కుమారుడు భరతుడు నాశనము అయి పోతాడు. తప్పదు. ఓ దేవీ, నీసుఖమూ నీ సంతోషమూ నీ ఐశ్వర్యమూ భరతుడి మీద ఆధారపడి ఉన్నవి. అందువల్ల నీకొడుకు రాజు అయ్యేట్టు చూడవలెను. రాముడు ఇక్కడ నుంచి ఇప్పుడే ఈ క్షణమే వెళ్ళి పోయేట్టు నీవు ఏది అయినా ఉపాయము ఆలోచించవలెను" అన్నది మంథర.

౯

మంథర ఈ విధముగా చెప్పినందువల్ల కైకేయీదేవిలో కోపాగ్ని రగులుకొన్నది. ఆమె ముఖము ఎర్రపడిపోయింది. పెద్ద పెద్ద నిట్టూర్పులు విడుస్తూ "మంథరా, నేను ఇప్పుడే ఈ క్షణమే రాముణ్ణి అయోధ్యాపట్టణము నుంచి వెళ్ళకొట్టిస్తాను. భరతుడికి యువరాజ్యాభిషేకము చేయిస్తాను. ఓ మంథరా, ఇందుకు ఉపాయము ఏది అయినా చెప్పు. జాగ్రత్తగా ఆలోచించు" అన్నది కైక.

ఆ పాపదర్శిని "ఓ రాణీ, సంతోషము. భరతుడు యువరాజు అయ్యే ఉపాయము చెప్పుతాను. దేవీ నన్ను అడుగుతున్నావు; నీవు నిజముగా మరిచి పోయినావా—మరిచి పోక పోయినట్లయితే నేను ఏమి చెప్పుతానో అది నీకు తెలిసింది దాచి పెట్టుతున్నావా — ఓ విలాసినీ, నేను చెప్పితే వినవలెను అనుకొంటున్నావా? అయితే చెప్పుతాను విను. విన్న తరువాత నీవూ జాగ్రత్తగా ఆలోచించు" అంటూ కైకేయీదేవి వంక ఉత్సాహముతో చూచింది.

పడుకొన్న శయ్య మీది నుంచి లేచి కైకేయీదేవి "చెప్పు; భరతుడు రాజు అయ్యేటందుకూ రాముడు రాజు కాకుండా పోయేటందుకూ ఉపాయము చెప్పు" అన్నది.

"దేవీ. పూర్వము దేవాసురయుద్ధములో దేవేంద్రుడికి సాయము చేయడానికి నీ పెనిమిటి నిన్ను కూడా వెంట పెట్టుకొని రాజర్షులూ మొదలు అయిన వారితో బయలుదేరినాడు. మీరు అందరూ దక్షిణదిక్కున దండకారణ్యములో తిమిధ్వజుడు అనే శంబరాసురుడు ఉంటూ ఉన్న వైజయంతము అనే పట్టణానికి పోయినారు. ఆ శంబరాసురుడు శతమాయావి. ఆ మహాసురుణ్ణి దేవసేనలు జయించ లేక పోయినవి. అప్పుడు వాడు దేవేంద్రుడిమీద పడ్డాడు. ఆ మహా సంగ్రామములో యోధులు పగలు అంతా మహాఘోరముగా పోరాడినారు. బాణశూలాదుల పోటులకూ పరశుగదాదుల వాటులకూ అందరి ఒడ్లూ గాయాలు అయినవి. చీకటి పడి పోయింది. ఆ రాత్రి అందరూ సొమ్మసిల్లి నిద్ర పోతున్నారు; అర్ధరాత్ర మప్పుడు హఠాత్తుగా రాక్షసులు వచ్చి మీ మీద పడ్డారు. అప్పుడు నీ పెనిమిటి ఆ రాక్షసులతో భయంకరముగా పోరాడి

చేసే తీసతాడు. సందేహము లేదు. కాబట్టి నీ కుమారుణ్ణి కేకయమహారాజు ఇంటినుంచే అటు అడవులకు పొమ్మనడము మంచిది అని నాకు తోస్తున్నది. అట్లా చేసేట్లయితే నీ కుమారుడు భరతుడి ప్రాణాలు అయినా దక్కుతవి. ఓ కైకా, నీ మంచి కోసము నేను ఇది అంతా చెప్పుతున్నాను. పితృప్రియము అయిన రాజ్యము ఏవిధముగా నైనా భరతుడికి వస్తేనే నీవు సుఖపడతావు. నీ కుమారుడు సుఖపడుతాడు. నీ వాండ్లు అందరూ సుఖపడుతారు. మేము అందరమూ సంతోషిస్తాము.

“ఓ దేవీ, రాముడికి రాజ్యాభిషేకము అవుతుంది. సకల ఐశ్వర్యాలూ సమస్త అధికారాలూ వాడికి సంప్రాప్తము అవుతవి. భరతుడికి ఎవరి సహాయమూ ఉండదు. ఏ ఒక్క సంపదా ఉండదు. సవతి తల్లి పుత్రుడు అయినందు వల్ల రాముడికి సహజశత్రువు అవుతాడు. రాముడిదగ్గర వాడు ఏట్లా బ్రతుకుతాడు? అడవిలో తరుముకొని వస్తూ ఉన్న ఏనుగును సింహము నోటిలో పడకుండా కాపాడేటట్లుగా భరతుణ్ణి రాముడి చేతిలో పడకుండా నీవు ఇప్పుడు కాపాడవలెను.

“ఓ రాజపుత్రీ, నీ పెనిమిటికి నీవు ఒక్కతెవే ప్రియురాలవు అనుకొన్నావు. విర్రవీగి పోయినావు. నీ గర్వములో నీ సవతి కౌసల్యను నీవు అన్ని విధాలా అవమానించినావు. ఇప్పుడు ఆమె కొడుకు రాజు కాపోతున్నాడు. ఆమె ఇక నీ మీద పగ తీర్చుకోకుండా ఉంటుందా? నిన్ను తన పనికత్తెగా చేసుకోకుండా ఉంటుందా?

“ఓ కైకేయీ, ఈ విశాలకోసలరాజ్యానికి రాముడు రాజు అవుతాడు. నీవు నీకొడుకుతో కూడా దరిద్రురాలవు అయిపోతావు. అవమానాల పాలు అయి పోతావు. అన్ని అమంగళాలూ అనుభవిస్తావు. రాముడు రాజు కాగానే నీ కుమారుడు భరతుడు నాశనము అయి పోతాడు. తప్పదు. ఓ దేవీ, నీసుఖమూ నీ సంతోషమూ నీ ఐశ్వర్యమూ భరతుడి మీద ఆధారపడి ఉన్నవి. అందువల్ల నీకొడుకు రాజు అయ్యేట్టు చూడవలెను. రాముడు ఇక్కడ నుంచి ఇప్పుడే ఈ క్షణమే వెళ్ళి పోయేట్టు నీవు ఏది అయినా ఉపాయము ఆలోచించవలెను” అన్నది మంథర.

౯

మంథర ఈ విధముగా చెప్పినందువల్ల కైకేయీదేవిలో కోపాగ్ని రగులుకొన్నది. ఆమె ముఖము ఎర్రపడిపోయింది. పెద్ద పెద్ద నిట్టూర్పులు విడుస్తూ "మంథరా, నేను ఇప్పుడే ఈ క్షణమే రాముణ్ణి అయోధ్యాపట్టణము నుంచి వెళ్ళగొట్టిస్తాను. భరతుడికి యువరాజ్యాభిషేకము చేయిస్తాను. ఓ మంథరా, ఇందుకు ఉపాయము ఏది అయినా చెప్పు. జాగ్రత్తగా ఆలోచించు" అన్నది కైక.

ఆ పాపదర్శిని "ఓ రాణీ, సంతోషము. భరతుడు యువరాజు అయ్యే ఉపాయము చెప్పుతాను. దేవీ నన్ను అడుగుతున్నావు; నీవు నిజముగా మరిచి పోయినావా—మరిచి పోక పోయినట్లయితే నేను ఏమి చెప్పుతానో అది నీకు తెలిసింది దాచి పెట్టుతున్నావా — ఓ విలాసినీ, నేను చెప్పితే వినవలెను అనుకొంటున్నావా? అయితే చెప్పుతాను విను. విన్న తరువాత నీవూ జాగ్రత్తగా ఆలోచించు" అంటూ కైకేయీదేవి వంక ఉత్సాహములో చూచింది.

పడుకొన్న శయ్య మీది నుంచి లేచి కైకేయీదేవి "చెప్పు; భరతుడు రాజు అయ్యేటందుకూ రాముడు రాజు కాకుండా పోయేటందుకూ ఉపాయము చెప్పు" అన్నది.

"దేవీ. పూర్వము దేవాసురయుద్ధములో దేవేంద్రుడికి సాయము చేయడానికి నీ పెనిమిటి నిన్ను కూడా వెంట పెట్టుకొని రాజర్షులూ మొదలు అయిన వారితో బయలుదేరినాడు. మీరు అందరూ దక్షిణదిక్కున దండకారణ్యములో తిమిధ్వజుడు అనే శంబరాసురుడు ఉంటూ ఉన్న వైజయంతము అనే పట్టణానికి పోయినారు. ఆ శంబరాసురుడు శతమాయావి. ఆ మహాసురుణ్ణి దేవసేనలు జయించ లేక పోయినవి. అప్పుడు వాడు దేవేంద్రుడిమీద పడ్డాడు. ఆ మహా సంగ్రామములో యోధులు పగలు అంతా మహాఘోరముగా పోరాడినారు. బాణశూలాదుల పోటులకూ పరశుగదాదుల వాటులకూ అందరి ఒడళ్లూ గాయాలు అయినవి. చీకటి పడి పోయింది. ఆ రాత్రి అందరూ సొమ్మసిల్లి నిద్ర పోతున్నారు; అర్ధరాత్రమప్పుడు హఠాత్తుగా రాక్షసులు వచ్చి మీ మీద పడ్డారు. అప్పుడు నీ పెనిమిటి ఆ రాక్షసులతో భయంకరముగా పోరాడి

వాని యోధులు అందరూ హతము అయి పోయినారు. ఆ తాకిడికి నీ పెనిమిటి తట్టుకొనలేక పోయినాడు. దేహము అంతటా గాయాలు అయినవి. రథము మీదనే మూర్ఛ పోయినాడు. అప్పుడు ఆ రథము నడుపుతూ ఉన్న నీవు నీ పెనిమిటి మూర్ఛ పోవడము చూచి ఆ రథాన్ని మరి ఒక రహస్య ప్రదేశానికి తోలుకొని పోయినావు. వివిధ యుద్ధలతో రాక్షసులు అక్కడికిన్ని వచ్చి నీ పెనిమిటిమీద పడ్డారు. అంతట నీవు నీ చాకచక్యముతో మరి ఒక నిగూఢ ప్రదేశానికి రథాన్ని తోలుకొని పోయినావు. నీవు అట్లా రెండుసార్లు నీ పెనిమిటిని కాపాడి శైత్యోపచారాలు చేసి బ్రతికించినావు.

"ఓ శుభనేత్రీ, నిన్ను నీ పెనిమిటి అందుకు ఎంతో మెచ్చుకొన్నాడు. రెండు సార్లు నీవు తనను కాపాడినావు కనుక నీకు రెండు వరాలు ఇస్తాను అన్నాడు. కావలసినప్పుడు కోరుకొంటాను అని నీవు ఆయన దగ్గర ఆ రెండు వరాలూ నిక్షేపముగా దాచి పెట్టమన్నావు. అందుకు ఆ మహాత్ముడు అంగీకరించినాడు. అప్పటి నుంచీ ఇంత వరకూ ఆ రెండు వరాలూ నీవు అడగనూ లేదు, ఆయన చెల్లించనూ లేదు. ఓ రాజపుత్రీ ఇది అంతా నేను చూడలేదు. ఈ కథ అంతా నీవే ఒకప్పుడు నాకు చెప్పినావు. నీ మేలే నాకు కావలెను కనుక ఈ కథను అంతా జ్ఞాపకము పెట్టుకొన్నాను. ఇప్పుడు నీవు ఆ రెండు వరాలూ ఇవ్వమని అడుగు. ఆ రెండు వరాలూ ముందుగా పుచ్చుకో. భరతుడికి రాజ్యాభిషేకము చేయడమూ రాముణ్ణి పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి పంపించడమూ ఆ రెండు వరాలకు గాను కోరుకో. ముందుగా రామరాజ్యాభిషేకము ఆపి వేయించు.

"దేవీ. రాముడు పధ్నాలుగు ఏండ్లు అయోధ్యా నగరములో లేకుండా పోయేట్లయితే భరతుడే రాజుగా స్థిరపడి పోతాడు. ఓ రాజపుత్రీ, ఇకను నీవు ఇప్పుడు చేయవలసింది చెప్పుతాను. విను. నీవు కోపగృహములోకి పోయి మాసిన చీర కట్టుకొని కోపము వచ్చిన దాని వలె కటిక నేల మీద పడుకో వలెను. నీ పెనిమిటి వస్తాడు. నీవు కన్నెత్తి అయినా ఆయనను చూడ కూడదు. ఆయన పలుకరించినా నీవు పలుక కూడదు. అదే పనిగా ఏడుస్తూ నేల మీద పొర్లాడుతూ ఉండ వలెను. ఓ శుభాంగీ, నీ పెనిమిటికి నీమీద ఎంత మక్కువో నీకు తెలియదు. నాకు తెలుసును. నీవు ఒక్కతెవే ఆయన హృదయ ప్రియవు

ఈ విషయములో ఈమాత్రమూ సందేహమువద్దు. నిన్ను ఆయన కోప పడడు. నీకు కోపము వస్తే నీ వంక చూడడానికి కూడా ఆయన వెరుస్తాడు. నీ కోసము నిప్పులలోకి దూకమంటే ఆయన దూకుతాడు. నిన్ను సంతోష పెట్టడానికి ఆయన తన ప్రాణము అయినా వదులుతాడు. ఓ మందమతీ, నీ సౌందర్యబలము ఎటువంటిదో నీకు తెలియదు. నేను చెప్పుచున్నాను. నమ్ము. నా మాట విను. నీ పెనిమిటి నీ మాటకు అడ్డు చెప్పడు.

" ఓ కేకయరాజపుత్రీ, నీకు ఎన్నో ముత్యాలహారాలూ రత్నాలహారాలూ ఆయన ఇస్తాను అంటాడు. కోరుకొన్నంత బంగారము ఇస్తాను అంటాడు. నీకు కావలసిన అన్ని ఆభరణాలూ ఇస్తాను అంటాడు. నీ మనస్సును వాటి మీదికి పోనీయవద్దు. కొంచెము అయినా మెత్తపడవద్దు. ఓ భాగ్యశాలినీ దేవాసురయుద్ధములో నీకు వాగ్దానము చేసిన రెండు వరాలను గురించే నీవు ముందుగా జ్ఞాపకము చేయవలెను. ఆ వరాలను గురించిన వాగ్దానము గట్టిచేసు కోవలెను. ఆ రెండు వరాలూ చెల్లిస్తాను అంటూ ఆయన నిన్ను లేవ తీయ పోతాడు. అంత మాత్రానికే నీవు నేల మీద నుంచి లేవకూడదు. ఆ రెండు వరాలూ చెల్లిస్తాను అని ఆయన చేత ప్రమాణము చేయించుకొని మరీ లేవ వలెను. ఆ రెండు వరాలూ ఇస్తాను అని ఆయన ప్రమాణము చేసిన తరువాత ఆ వరాలకుగాను భరతుడికి పట్టము కట్టవలెను అనీ రాముణ్ణి పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి పంపించవలెను అనీ చెప్పు.

" ఓ కైకా. రాముడు పధ్నాలుగు సంవత్సరాలు అడవిలో ఉండేట్లయితే నీ కొడుకు ఇక్కడ పాదుకొని పోతాడు. మూలబలము అంతా నీ కుమారుడి ఆధీనము అవుతుంది. చివర వరకూ భరతుడే రాజ్యము ఏలుతాడు. దేవీ, రామవ్రవాసము ముఖ్యము సుమా. నేను ఇప్పుడు చెప్పినట్టు చేస్తే నీకూ ని పుత్రుడికీ సర్వార్థాలు సమకూడుతవి. ఓ భామినీ, పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసము చేస్తే రాముడు అరాముడు అయిపోతాడు. తిరిగి వచ్చినా ఏమీ చేయలేడు. ఏకాకిగా ఉండి పోతాడు.

" ఓరాణీ, నీవు ఏ మాత్రమూ భయ పడ నక్కర లేదు. నీవు తలచు కొంటే తలచుకొన్నంతా అయి తీరుతుంది. ఇదే సమయము. ఈరాత్రే దశరథ

మహారాజు చేత నీవు నీ పనిని నెరవేర్చుకోవలెను. రామాభిషేకము జరగకుండా చేయవలెను సుమా" అన్నది మంథర.

కైక ఇది అంతా సావధానముగా విన్నది. అంతవరకూ అంతా ప్రతికూలమేమో నను కొంటూ ఉన్నది అంతా అనుకూలముగా తోచింది. సంతోషించింది. ఆలోచించింది. గూనిది చెప్పిన ఉపాయానికి విస్మయ పడి పోయింది. ఆమె మనస్సు దౌడు తీయడము మొదలు పెట్టింది. అంతట ఆ పరమదర్శిని పెంటి గుర్రిపుపిల్ల మాదిరిగా దారి తప్పింది.

కైకేయీదేవి మంథరను చూచి నవ్వుతూ "ఓ గూనీ, నీవు ఇంత తెలివి అయిన దానవు అనీ ఇంత చక్కగా చెప్ప కలవు అనీ నాకు ఇదివరకు తెలియదు. గూని వాండ్లకు తెలివి తేటలు ఎక్కువ అని విన్నాను. కాని నీ అంత తెలివి అయింది ఈ పృథ్విలో ఎక్కడనూ ఉండదు. నీవు ఒక్కతెవే నా లాభము ఆలోచిస్తూ నా మేలు కోరుతున్నావు. నీవు ఇప్పుడు లేక పోయినట్లయితే రాజు తల పెట్టింది నాకు ఏమీ తెలిసేది కాదుసుమా.

"మంథరా, నీవు ఎంతో మంచిదానవు. మంచిదానవే కాదు. నీవు నిజముగా ఎంతో అందము అయిన దానవు. నీవు అందరు గూని వాండ్ల వంటి దానవు కావు. గాలికి వంగిన తామరపువ్వు వలె నీవు ఎంతో చక్కగా ఉన్నావు. నీమూపుల నిక్కుకు అసూయ పడి నీ రొమ్ము పక్కలతో కూడా కంఠము వరకూ ఉబ్బింది. నీ రొమ్ముల ఉబ్బుకు సిగ్గు పడి చక్కని బొడ్డుతో ఉన్న నీ కడుపు సన్నగిల్లి పోయింది. నీ పెద్ద పెద్ద మొత్తలతో పోటీ పడి నీ స్తనాలు బలిసి పోయినవి. నీ ముఖము ఏ కళంకమూలేని చంద్రబింబము మాదిరిగా ఉంది. మంథరా, నీవు ఎంత అందకత్తెవే. నీవు తెల్లని పట్టు చీర కట్టుకొని నీ మొలనూలు చిరుగజ్జల చప్పుళ్ళతో నీ లావుపాటి తొడలతో నీ చక్కని పిక్కలతో నీ పొడుగాటి పాదాలతో నా ముందు నడుస్తూ ఉంటే నీవు రాజహంస మాదిరిగా కనపడతావు.

"ఓ మంథరా, శంబరాసురుడికి నూరు మాయలే తెలుసును. నీకు వేలకు వేలు తెలుసు. రథఘోణము వంటి నీగూనిలో ఎన్నో మాయలూ ఎన్నో రాజనీతులూ కాపురము చేస్తూ ఉన్నవి. కుబ్జా, రాముడు అడవికి పోగానే భరతుడికి

పట్టాభిషేకము కాగానే నీకు బంగారపు పూలదండలు వేయిస్తాను. నీ చేత బంగారు రవిక తొడిగిస్తాను. రకరకాల రత్నాలతో శోభాయమానము అయిన బంగారము బొట్టు చేయించి పెట్టుతాను. నీ ఒంటి నిండా సొమ్ములు దిగ వేయిస్తాను. మంచి మంచి చీరెలు కట్టపెట్టుతాను. నా సవతులు అందరినీ తృణీకరించి నీవు గర్వముతో తిరిగేటట్లు చేస్తాను. రాణీలు అందరి చేత నీకు పాద సేవ చేయిస్తాను'' అంటూ మంథరను ఉబ్బిస్తూ ఆ తెల్లటి పాన్పు మీద వాలింది.

కైకేయీదేవి శయ్య మీద నయితే వాలింది కాని ఆమె ఆలోచనలు వేదిలో అగ్ని జ్వాలల వలె రగులుకోవడము మొదలు పెట్టినవి. ఆమె స్థితి మంథర గమనించింది. ''ఓ కల్యాణీ, నీళ్లు అన్నీ పార్లిపోయిన తరువాత ఆనకట వేయడము ఎందుకు? రామాభిషేకము అయిపోయిన తరువాత నీవు వరాలు అడిగితే ప్రయోజనము ఏమిటి? దేవీ, కాలయాపనము వద్దు. నీవు ఇప్పుడే లేవవలెను. నేను చెప్పినట్లు చేయవలెను. రాజును నీవు ఇక ప్రతీక్షణము ఎదురు చూస్తూ ఉండవలెను'' అంటూ మంథర ఆ సౌందర్యమదగర్వితను పురికొల్పింది.

అంతట ఆ వాలుకన్నుల సొగసుకత్తె ఆ గూనిదానిని వెంట పెట్టుకొని చీకటి గదిలోనికి పోయింది. అనేక లక్షలు కిమ్మతు చేసే ముత్యాలహారాలనూ రత్నాలహారాలనూ తీసి వేసింది. బంగారము బొమ్మవలె నేల మీద కూర్చుని ''కుబ్జా, నేను కోరే వరము ఒకవేళ నా పెనిమిటి ఇవ్వక పోయేట్లయితే నేను ఇక్కడనే చచ్చిపోతాను. అప్పుడు నీవు దశరథమహారాజుకో కేకయమహారాజుకో నా చావు తెలియ చేయవలసి వస్తుంది. మంథరా; రాముడు అడవికి పోవలెను. భరతుడు రాజు కావలెను. అంతే. నాకు బంగారము అక్కర లేదు. రత్నాలు అక్కర లేదు. ఆభరణాలు అంతకన్నా అక్కర లేదు. రామాభిషేకమే జరిగేట్లయితే నేను బ్రతుకను'' అన్నది కైకేయీ దేవి.

కైకేయీదేవికి మేలు చేయడానికీ రాముడికి కీడు చేయడానికీ మంథర అతి క్రూరముగా ''ఓ కల్యాణీ, రాముడే దొరతనానికి వస్తే నీవూ నీ కొడుకూ దుఃఖాల పాలు కాక తప్పదు. అందువల్ల భరతుడికి రాజ్యాభిషేకము చేయించి తీరవలెను'' అన్నది.

మంథర పదే పదే చెప్పిన మాటలు కైకేయీదేవి హృదయములో నాటుకొని పోయినవి. ఆమెకు దుఃఖము వచ్చింది. ఆశ్చర్యము వేసింది. ఉత్తరక్షణాన

కోపము పెరిగింది. చేతులతో రొమ్ములు బాదు కొంటూ "ఓ మంథరా, భరతాభిషేకము జరిగి తీరవలెను. రాముడు వనవాసానికి పోయి తీరవలెను. రాముడు అడవికి పోక పోయేట్లయితే ఈ చీకటి గదిలో ఈ కటిక నేల మీద నుంచి నేను లేవనే లేవను. స్నానము చేయను, చందనచర్చ చేసుకోను, పూలు పెట్టుకోను, అన్నము తినను, నీళ్లు అయినా త్రాగను. ప్రాణము వదలి వేస్తాను" అంటూ కైకేయీదేవి మహా దారుణము అయిన శపథము చేసింది. ఇంకా ఒంటిని మిగిలి ఉన్న సొమ్ములు అన్నీ తీసి వేసి నేల మీద పార వేసింది.

పుణ్యాంతాన దేవలోకములో నుంచి భూమి మీద పడ్డ కిన్నరాంగన వలె ఆమె ఆ నేల మీద పడుకొన్నది. కోపముతో ఆమె ముఖము మాసి పోయింది. తళతళలాడే ముత్యాలహారాలూ రత్నాలహారాలూ తీసి వేసినందు వల్ల ఆమె నక్షత్రాలు అస్తమించి చీకట్లు కమ్ముకొన్న ఆకాశము మాదిరిగా అయి పోయింది.

౧౦

ఆ పాపాత్మురాలు మంథర విపరీత బోధ చేసినందువల్ల కైకేయీదేవి తన భవిష్యత్తును గురించి భయ పడి పోయింది, దిగులుపడ్డది. అందుకోసము విషము పూసిన బాణము దెబ్బ తిన్న కిన్నరాంగన వలె నేలకు ఒరిగింది. కోపముతో ఆడ తాచు పాము వలె బుసలు కొట్టింది. కర్తవ్యము మనసా నిశ్చయించుకొన్నది. తాను సంకల్పించుకొన్న కార్యము నెరవేరుతుందా నెరవేరదా అని కొంచెము సేపు ఆలోచించింది. కృతకృత్యను అవుతాను అనుకొన్నది. మంథరను చూస్తూ మెల్లగా "అంతా బాగుంది" అని చెప్పింది.

ఆమె సంకల్పము సిద్ధించినట్టే మంథర భావించింది. ఎంతో సంతోషించింది. కైకేయీదేవి తీసి వేసిన రంగురంగుల పూలదండలనూ రత్నాల హారాలనూ ముత్యాలహారాలనూ దివ్యాభరణాలనూ ఆ నేలమీద చెదచల్లి వెళ్ళి పోయింది.

కైకేయీదేవి మాసిన చీర కట్టుకొని చక్కగా అల్లి ఉన్న తన జడను విప్పుకొని తల వెంట్రుకలు అన్నీ గడ్డి వెంటివలె ఒక్క పాయగా ముడి పెట్టుకొని కనుబొమ్మలు ముడి వేసి పుణ్యాంతము అయిన కిన్నరాంగనవలె కటిక

నేల మీద పడుకొన్నది. ఆ చీకటి ఇంట్లో మంథర వెదచల్లి పోయిన ఆభరణాలు అన్నీ నీలాకాశములో నక్షత్రాల వలె మెరుస్తూ ఉన్నవి.

దశరథమహారాజు పట్టాభిషేకము ప్రకటించి కొలువు చాలించి అంతఃపురములోనికి బయలుదేరినాడు. కైకేయీదేవికి రామపట్టాభిషేక విషయము తెలిసి ఉండదు అనుకొన్నాడు. ఆ సంతోషవార్త ఆ ప్రియురాలికి స్వయముగా చెప్ప వలెను అనుకొని రాహువు ఉన్నాడు అని తెలియక తెల్లని మేఘాలు ఉన్న ఆకాశములోకి చంద్రుడు పోయినట్లుగా దశరథమహారాజు కైకేయీదేవి అంతఃపురములోనికి పోయినాడు.

కైకేయీదేవి అంతఃపురములో చిలుకలూ కోకిలలూ కొంచపిట్టలూ హంసలూ నెమళ్ళూ ఎప్పుడూ మనోహరముగా పాటలు పాడుతూ నేత్రపర్వముగా నాట్యము ఆడుతూ ఉంటవి. ఎటు చూచినా సంపెంగచెట్లూ అశోక వృక్షాలూ లతాగృహాలూ చిత్రగృహాలూ కనపడుతవి. వాటిలో ఏనుగు దంతాలూ వెండి బంగారాలూ పొదిగిన తిన్నెలు ఎంతో అందముగా ఉంటవి. దోహద క్రియల వల్ల ఆ అంతఃపురోద్యానవనములో అన్ని ఋతువులలోనూ వృక్షలతా గుల్మాలు పూలు పూస్తూనూ కాయలు కాస్తూనూ పండ్లు పండుతూనూ ఉంటవి. సమయోచితముగా వీణలు మ్రోగిస్తూ పిల్లనగ్రోవులు ఊదుతూ మద్దెళ్లు వాయిస్తూ కంచుతాళాలు వేస్తూ జంత్రగానము సాగుతూ ఉంటుంది. మాటకారులు అయిన గూని దాసీలూ పొట్టి పొట్టి దాసీలూ సిద్ధముగా ఉంటారు. ఏనుగు దంతాలతోనూ బంగారముతోనూ వెండితోనూ చేసిన పీటలూ మనోహరము అయిన మద్యాలూ రుచ్యము అయిన రకరకాల భక్ష్యాలూ రకరకాల అన్నాలూ ఎప్పుడూ సిద్ధముగా ఉంటవి. మనోహరముగా అలంకరించుకొన్న స్త్రీలు అక్కడ ఎప్పుడూ కనిపెట్టుకొని ఉంటారు. ఇన్ని మాటలు ఎందుకు— అది కేవలము స్వర్గధామము.

దశరథమహారాజు హుటాహుటీ ఆ అంతఃపురశయ్యాగృహములోకి పోయినాడు. అక్కడ ఆయనకు కైకేయీదేవి కనిపించలేదు. ఆమె బుద్ధి బుగ్గి అయి పోయింది అనీ ఆమె స్వార్థపరురాలు అయి పోయింది అనీ ఆయనకు తెలియదు. కామోద్రేకముతో "కైకా" అని పిలిచినాడు. జవాబు లేదు. తన కాలి

చప్పుడు కాగానే ఎప్పుడూ ఎదురుగుండా పరుగెత్తుకొనివచ్చే కైకేయీదేవి రాకుండా ఉండడమూ ఆ శయ్యాగృహము అట్లా శూన్యముగా ఉండడమూ. ఆయన అదివరకు ఎన్నడూ ఎరుగడు.

దశరథమహారాజు కైకను గురించి ద్వారపాలికను అడిగినాడు. ఆ ద్వారపాలిక భయముతో వణికి పోతూ "దేవా, దేవిగారికి చాలా కోపము వచ్చింది క్రోధాగారములోకి పరుగెత్తింది" అని చెప్పింది. దశరథమహారాజు మనస్సు చివుక్కు మన్నది. ఆయన దేహము అంతా కంపించింది.

ఆ చీకటిగదిలో కటిక నేల మీద పడి ఉన్న కైకేయీదేవిని దశరథ మహారాజు చూచినాడు. ఆ సుకుమారి అట్లా నేలమీద పడుకొన్నందుకు ఆయనకు కష్టము వేసింది. దుఃఖము వచ్చింది. ఆయన వృద్ధు. ఆమె తరుణి. ఆయన తన ప్రాణముకన్నా ఆమెను ఎక్కువగా చూచుకొనేవాడు. ఆయన ఏ పాపమూ ఎరుగడు. ఆమె పాపసంకల్ప.

కత్తితో తెగ వేసిన పూ తీగ వలెనూ పుణ్యక్షయము అయి నేల కూలిన దేవకన్య వలెనూ కింద పడ త్రోసిన కిన్నరాంగన వలెనూ దేవలోకములో నుంచి జారిపడ్డ అప్సరాంగన వలెనూ పస చెడి నేల కూలిన మోహినీదేవత వలెనూ కట్టిపడవేసిన లేడి పిల్లవలెనూ అలసి సొలసి పడిపోయిన ఆడు గుర్రము వలెనూ అడవిలో వేటకాడు వేసిన విషలిప్తబాణానికి నేల కూలిన ఆడు ఏనుగు వలెనూ ఉన్న కైకేయీదేవిని దశరథమహారాజు చూచినాడు. ప్రేమాతిశయముతో మెంటి ఏనుగును పోతుటేనుగు తొండముతో తడివినట్లు తన చేతితో తడివినాడు.

దశరథమహారాజు అట్లా కైకేయీదేవిని తనచేతితో నిమురుతూ తామర రేకుల వంటి ఆమె నేత్రద్వయాన్ని చూచినాడు. తొట్రుపాటుతో "దేవీ, నామీద నీకు కోపము రావటానికి కారణము ఏమిటి - నిన్ను ఎవరు అయినా తిట్టినారా - ఎవరు అయినా నిన్ను అవమానించినారా? వివరముగా చెప్పు.

"ఓ కల్యాణీ, నీవు ఇట్లా దుమ్ములో పడుకొని ఉండడము నేను చూడలేను. నీకు ఏమి తక్కువ అయింది? నీకు ఏమి లోపము వచ్చింది? వ్యాధి పట్టినదాని వలె ఈ కటిక నేలమీద ఎందుకు పడుకొన్నావు? చెప్పు.

"దేవీ, నీకు ఏమి అయినా సుస్తీగా ఉందా, చెప్పు. సమర్థులు అయిన వైద్యులు ఎంతో మంది ఉన్నారు. వారిని పిలిపిస్తాను. నిన్ను ఎవరు అయినా కష్టపెట్టినారేమో చెప్పు. పోనీ నీకోసము నేను ఎవరిని అయినా సంతోష పెట్టవలెనేమో చెప్పు. నీవు అనుకొనే దాని కన్నా వెయ్యిరెట్లు ఎక్కువగా వారిని సంతోష పెట్టుతాను. రాణీ, నీవు దిగులు పడ వద్దు. నీ దేహాన్ని ఇట్లా కష్ట పెట్ట వద్దు. ఎవణ్ణి అయినా చంపి వేయమంటావా—ఎవణ్ణి అయినా వెళ్ళ కొట్టమంటావా—ఏ దరిద్రుణ్ణి అయినా ధనవంతుణ్ణి చేయమంటావా – ఏ ధనవంతుణ్ణి అయినా దరిద్రుణ్ణి చేయమంటావా – నీవు చెప్పినట్టు నేను చేస్తాను. నా వాండ్ల చేత చేయిస్తాను.

"కైకా. నాకు ప్రాణాపాయము అయ్యే పనిని అయినా నీ కోసము చేస్తాను చెప్పు. నీమీద నాకు ఎంత అనురాగము ఉందో నీకు తెలుసును. నేను నిన్ను సంతోషపెట్టుతాను. నన్ను నీవు సంశయించవద్దు. చెప్పు. నా పుణ్య కర్మ సాక్షిగా ఒట్టు పెట్టుకొన్నాను. దేవీ, ప్రాచ్యసింధుసౌవీరసౌరాష్ట్రాలూ వంగాంగమగధ మధ్యదేశాలూ కాశీకోసల రాజ్యాలూ దక్షిణాపథమూ ధనధాన్యాలతో సమస్త ద్రవ్యాలతో సకల సమృద్ధముగా ఉంటూ ఉన్నవి. ఆ దేశాలలో దొరికే ఏ అమూల్య వస్తువులు నీవు కోరుచున్నా నీకు తెప్పించి ఇస్తాను. ఓ శుభాంగీ, ఎందుకు నీవు ఇట్లా బాధపడుతావు? ఓ మంగళస్వరూపిణీ, నీవు లేవ వలెను. నీవు దేనికి భయ పడుతున్నావో చెప్పవలెను. సూర్యుడు మంచును విడకొట్టినట్టు నీ భయాన్ని పోగొట్టుతాను" అంటూ దశరథమహారాజు కైకేయీదేవిని బుజ్జగించినాడు.

ముందుగా తన భర్త చేత శపథము చేయించనిదే అభిప్రాయము చెప్ప కూడదు అని కైకేయీ దేవి నిశ్చయించుకొన్నది.

౧౧

కామోద్రేకములో ఉన్న దశరథమహారాజును చూస్తూ కైకేయీదేవి "దేవా, నాకు జబ్బు ఏమీ లేదు. నన్ను ఎవరూ అవమానించ లేదు, నిందించనూ లేదు. నాకు ఒక కోరిక ఉంది. ఆ కోరిక మీరు చెల్లించవలెను. మీరు నా

కోరిక చెల్లిస్తాము అని ఒట్టు పెట్టుకొంటేనే నా కోరిక ఏమిటో చెప్పుతాను" అంటూ చిరునవ్వు నవ్వింది

దశరథమహారాజున్నూ మందహాసము చేస్తూ ఆమె తల వెంట్రుకలు నిమురుతూ "ఓసి వెర్రిదానా. నీ కంటే స్త్రీలలో నాకు ప్రియురాలు ఎవరు? పురుషులలో రాముడి కంటే నాకు ఎక్కువ అయిన వాడు ఎవడు? ఇది నీకు తెలియదా? తెలుసును. కైకా, చెప్పుతాను విను. నా బిడ్డలు అందరిలోనూ నాకు ప్రియము అయిన వాడు రాముడు వాడు. అజయ్యుడు. పరమ పూజ్యుడు. నా ప్రాణము కన్నా వాడు నాకు ఎక్కువ అయిన వాడు. కాస్సేపు వాణ్ణి చూడక పోయేట్లయితే నేను బ్రతుక లేను. నీ కోరిక నేను చెల్లిస్తాను అని ఆ రాముడిమీద ఒట్టు పెట్టుకొని చెప్పుతున్నాను.

"ఓ శుభ నేత్రీ, ఇప్పుడు అయినా నా మనసు తెలుసుకో - నీ కోరిక ఏమిటో చెప్పు నేను చెల్లిస్తాను. నన్ను అనుమానించవద్దు. నిన్ను సంతోష పెట్టుతాను. నా పుణ్యము తోడు, నీ కోరిక చెల్లిస్తాను" అంటూ ఒట్టు పెట్టుకొన్నాడు.

ఆయన అనుకూలుడు అయినందుకు కైకేయీదేవి సంతోష పడ్డది. తన కోరిక శత్రువులతో నయినా చెప్ప కూడనిది అని ఆమెకు తెలుసును. అది ఆయనకు ప్రాణాంతకము అవుతుంది అని కూడా ఆమెకు తెలుసును. కాని స్వాభిమానమూ స్వపుత్రపక్షపాతమూ ఆమెను మింగివేసినవి. "రాజా, నా కోరిక తాము చెల్లిస్తాము అని తమ కొమారుని సాక్షిగా తమ పుణ్యాను సాక్షిగా ఒట్టు పెట్టుకొన్నారు. తమ శపథము ఇప్పుడు అగ్నిహోత్రుడు మొదలు అయిన ముప్ఫయి మూడు కోట్ల దేవతలూ విన్నారు. భూమ్యాకాశాలూ సూర్యచంద్రులూ తక్కిన గ్రహాలూ విన్నవి. ఈ రాత్రి సంచారము చేస్తూ ఉన్న సర్వభూతాలూ విన్నవి. ఈ రాజనగరులో ఇలవేల్పులు అందరూ విన్నారు.

"రాజా, మీరు సత్యసంధులు. పరమ ధార్మికులు. మహా పరాక్రమవంతులు. నా కోరిక చెల్లిస్తాము అని నాకు మాట ఇచ్చినారు. ఇందుకు దేవతలు అందరూ సాక్షులు సుమా" అంటూ కైకేయీదేవి దశరథమహారాజు చెయ్యి పట్టుకొన్నది. ఆ కాముకుడు ఉబ్బి తబ్బిబ్బులు అయిపోయినాడు.

"ఓ రాజా, దేవాసుర యుద్ధము జ్ఞాపకము తెచ్చుకోండి. ఆ రాత్రి శంబరాసురుడు అందరినీ సంహారము చేసి వేసినాడు. మీరు అప్పుడు కొనఊపిరితో ఉన్నారు. నేను ఎంతో మెలకువతో అప్పుడు మిమ్ములను కాపాడినాను. మీ ప్రాణము దక్కించినాను. మీరు అప్పుడు నన్ను మెచ్చుకొని ఏవి అయినా రెండు వరాలు నేను కోరుకొన్నవి నాకు ఇస్తాను అని అన్నారు. కావలసి వచ్చినప్పుడు కోరుకొంటాను అని నేను ఆ రెండు వరాలూ నిక్షేపము వలె తమ దగ్గరనే దాచి పెట్టుకొన్నాను.

"నాథా, తాము ఈ భూమిని అంతా ఏలుతూ ఉన్న ప్రభువులు. ఆడి తప్పరు అని ప్రసిద్ధి కెక్కినారు. మీరు నాకు భర్తలు. నేను అప్పుడు తమ దగ్గర దాచి పెట్టుకొన్న రెండు వరాలూ తాము నాకు ఇప్పుడు చెల్లించవలెను. ఇదే నా కోరిక. ఇదివరకు మీరు కోరుకోమన్న వరాలనే నేను ఇప్పుడు కోరుకొంటాను. మీరు ఆ వరాలు చెల్లించవలెను. నేను నోరు తెరిచి యాచించిన తరువాత ఆవరాలు తాము ఇవ్వము అనేట్లయితే నాకు అవమానము అవుతుంది. అవమానపడ్డ తరువాత నేను బ్రతికి ఉండడము ఉత్తది. మీ ఎట్టఎదటనే నేను ప్రాణము విడువవలసి వస్తుంది" అంటూ ఆమె దశరథమహారాజును ధర్మపాశముతో బంధించివేసింది.

వలపన్ని బోయవాడు కూత పెట్టగానే జింక పరుగెత్తుకొనివచ్చి వలలో పడ్డట్టు కైక పన్నిన వలలో దశరథమహారాజు ఏమీ తెలియకుండా పడి పోయినాడు. ఆ కామమోహితుడు ఆమె కోరే రెండు వరాలూ చెల్లిస్తాను అన్నాడు.

ఉత్ఫుల్ల నేత్రాలతో కైకేయీదేవి దశరథమహారాజును చూచింది. దగ్గరకు చేరింది. ప్రశాంతముగా "నాథా, ఆ రాత్రి మీరు కోరుకోమన్న రెండు వరాలూ ఇప్పుడు రెండుగా కోరుతున్నాను. రాముడికోసము ఇప్పుడు మీరు ఏర్పాటు చేసిన అభిషేక సంభారాలు అన్నిటితోనూ నా కొమారుడికి భరతుడికి రాజ్యాభిషేకము చేయించవలెను. ఇది తాము నాకు చెల్లించవలసిన మొదటి వరము. ఇక రెండవ వరము. రాముడు జటాజినాలు ధరించి దండకారణ్యము పోయి పధ్నాలుగు ఏండ్లు ఋషి మాదిరిగా వనవాసము చేసి రావలెను. భరతుడు నిరాటంకముగా యువరాజు కావలెను. ఇదే నా ముఖ్యము అయిన కోరిక.

రాజా, ఇప్పుడే, నాకళ్ళ ఎదటనే రాముడు అడవులకు ప్రయాణము అయి పోవలెను. ప్రభూ, తాము రాజరాజులు. సత్యవ్రతులు. తాము శపథము చేసినారు. తాము దబ్బరలు ఆడ కూడదు. నా కోరిక చెల్లించి తాము తమ వంశ గౌరవాన్ని నిలపెట్టుకోవలెను. తమ సదాచారాన్ని కాపాడుకోవలెను. తమ జన్మ సార్థకము చేసుకోవలెను.

"దేవా, ఆడి తప్పని వారికే ఇహమూ పరమూ అని తపోధనులు చెప్పుతూ ఉంటారు" అన్నది కైకేయీదేవి.

౧౨

ఈ దారుణము అయిన మాటలకు దశరథమహారాజు దద్దరిల్లి పోయినాడు. మూర్ఛ పోయినాడు. కొంచెము సేపటికి తెప్పరిల్లి "ఇది కలా-నిజముగా నే కైకేయి ఇట్లా అన్నదా - చిత్త భ్రమణమా - పూర్వజన్మ వృత్తాంతస్మరణమా-మనోజాడ్యమా" అని ఆలోచించ సాగినాడు. ఏమీ అంతుపట్టలేదు. దుఃఖము అత్యుత్కటము అయిపోయింది. మళ్ళీ మూర్ఛ పోయినాడు. చాలా సేపటికి తెలివి వచ్చింది. ఎటో పరుగెత్తిపోయి ఆడ పెద్దపులి ఎదుట పడ్డ జింక వలె నివ్వెర పోయినాడు. ఆయన అవయవాలు పట్టు తప్పిపోయినవి. ఆ కటిక నేల మీద చతికల పడి పోయినాడు. మంత్రానికి యంత్రమండలములో కట్టు పడి పోయి బుసలు కొట్టే పాము వలె పెద్ద పెద్ద నిట్టూర్పులు విడుస్తూ "ఛీ ఛీ" అన్నాడు. కోపోద్రేకముతో దుఃఖముతో కొట్టుకు లాడుతూ మళ్ళీ మూర్ఛ పోయినాడు.

ఎంతో సేపటికి తెలివి వచ్చింది. పరమ క్రుద్ధుడు అయి పోయినాడు. కన్నులలో నుంచి నిప్పుకణాలు రాలుస్తూ కాల్చివేసేట్టు చూస్తూ "ఓసీ దుష్ట చారిణీ, నీవు మా వంశాన్ని నిర్మూలము చేయ తలచుకొన్నావా - నీకు నేను ఏమి అపకారము చేసినాను? రాముడు ఏమి అపరాధము చేసినాడు? సొంత తల్లికి సేవ చేసేట్టు నీకు సేవ చేస్తున్నాడే - ఇప్పుడు నీవు వాడికి ఈ అన్యాయము ఎందుకు తలపెట్టినావు? నీవు రాకుమారివి అనుకొన్నాను. తీక్ష్ణవిష సర్పాన్ని అజ్ఞానము వల్ల ఇంట్లోకి తెచ్చుకొన్నట్టు నిన్ను తెచ్చుకొన్నాను.

"ఓ కైకా, నా ప్రియపుత్రుణ్ణి ఆ రాముణ్ణి సకలప్రాణికోటీ కొనియాడుతూ ఉంది. వాడు ఏమి తప్పు చేసినాడు అని నేను అడవులకు వెళ్ళ గొట్టవలెను?

ములో ప్రకటించినాను. ఇప్పుడు ఆ మాట తప్పడము ఎట్లాగు? సేనలను అన్ని టినీ యుద్ధానికి తీసుకొనిపోయి శత్రుసేనలను చూచి వెనకకు తిరిగి వచ్చినట్లు కాదా? రామాభిషేకానికి నానాదిక్కుల నుంచీ రాజులు అందరూ వచ్చి నారు. వారు అందరూ నన్ను చూచి ఏమి అంటారో నీకు తెలుసునా? రామునికి రాజ్యాభిషేకము కావడమూ రాజ్యము ఏలడమూ వానప్రస్థుడుగా వనవాసా నికి పోవడమూ తెల్లవారే లోపలనే అయిపోయిందా అని నన్ను వెక్కిరిస్తారు. ఈ దశరథమహారాజు దైవవశాన బహుకాలము రాజ్యము ఏలినాడే కాని బుద్ధి లేనివాడు అని నన్ను నిందిస్తారు. రామాభిషేకము ఎందుకు ఆగిపోయింది అని వృద్ధులూ బహుశ్రుతులూ గుణవంతులూ అడిగితే వారికి నేను ఏమి అని చెప్ప వలెను? కైకేయిబాధ పడలేక రాముణ్ణి అరణ్యవాసానికి పొమ్మన్నాను అని యథార్థమే చెప్పేట్లయితే, వసిష్ఠ వామదేవాది మహర్షుల సమక్షములో మహా జన సభామధ్యములో రామాభిషేకము అని ప్రకటనము చేసినానే-అది అబ ద్ధము అయిపోలేదా అని నన్ను ప్రశ్నిస్తారు.

"ఓ కైకా, నా కొడుకు ఏమి అపరాధము చేసినాడు అని అడవులకు వెళ్ళగొట్టినారు అని కౌసల్య నన్ను అడిగితే నేను ఆమెకు ఏమి చెప్పవలెను? ఇంతకాలమూ ఆమె నన్ను సంతోషపెట్టడమే తన పనిగా పెట్టుకొన్నది. దాసి వలె ఉపచారము చేస్తూ ఉంది. స్నేహితురాలివలె ద్యూతక్రీడాది వినోదాలతో నాతో పొద్దుపుచ్చుతూ ఉంది. సోదరివలె నా సుఖమే కోరుతూ ఉంది. తల్లి వలె నా శరీరపోషణాదులలో శ్రద్ధ వహిస్తూ ఉంది. భార్యవలె ధర్మకార్యా లలో నాకు తోడుపడుతూ ఉంది. ఓ కైకా, నేను ఇంతవరకూ నిన్నుంచి ఆమెను సంతోషపెట్టలేదు.

"ఓ కైకా, నేను ఇంతవరకూ నిన్ను సుఖపెట్టింది అంతా వికటించింది. ఇంతకాలమూ నిన్ను సంతోషపెట్టినందుకూ సుఖపెట్టినందుకూ అపథ్యవ్యం జనోపేతము అయిన అన్నము తిన్న రోగివలె తాపము ఎత్తి బాధపడుచున్నాను. ఇప్పుడు యువరాజ్యాభిషేకము మానివేసి నేను రాముణ్ణి అడవులకు పంపించి వేసేట్లయితే సుమిత్ర తన కొడుకు గతి ఏమిటి-అని భయపడిపోతుంది. ఇకను ఆమె దేనికి అయినా నన్ను ఎట్లా నమ్ముతుంది.

"ఓ రాణీ, రాముడు అరణ్యవాసానికి పోయేట్లయితే నేను బ్రతుకను. అప్పుడు సీత గతి ఏమిటి? ఆమె రెండు అప్రియాలకు తల్లడిల్లిపోతుంది. హిమవత్పర్వత పార్శ్వములో కిన్నరుడు వదలిపెట్టి పోయిన కిన్నరివలె ఏడుస్తుంది. ప్రాణము వదులుతుంది. ఓ కేకయ రాజపుత్రీ, రాముడు అడవికి పోతే సీత ఏడుస్తూ ఉంటే చూస్తూ నేను ఎంతకాలము బ్రతుకుతాను? వెంటనే చచ్చిపోతాను. ఓ కైకా, అప్పుడు నీవు ముండమోసి నీ కొడుకును పెట్టుకొని ఈ రాజ్యము ఏలుతూ ఉంటావు.

"ఓ రాణీ, నీ చక్కదనము చూచి నీవు పరమ యోగ్యురాలవు అనుకొన్నాను. ఇప్పుడు నాపని విషము కలిపిన మద్యాన్ని తెలియక త్రాగినవాడివలె అయిపోయింది. నాకు తెలియలేదు. ఇంతవరకూ నీవు ఇచ్చకాలు ఆడి నన్ను మోసము చేసినావు. నేను ప్రియపుత్రుణ్ణి అమ్ముకొని స్త్రీ సుఖము కొనుక్కొనే వాణ్ణి అవుతున్నాను. సురాపానము చేసిన బ్రాహ్మణుణ్ణివలె ఇక నన్ను రాజవీధిలో అందరూ దూషిస్తారు. ఆశ్చర్యము! కైకా, నీవు నాకు ఎంత దుఃఖము తెచ్చిపెట్టినావు. ఎంత కష్టము తెచ్చి పెట్టినావు. నీ దారుణ వాక్యాలు నేను సహించవలసి వచ్చింది. ఇది అంతా నా పురాకృత దుష్కృతము అయి ఉండవలెను. నేను మెడకు వేసుకొన్నది ఉరిత్రాడు అని తెలియలేదు. తెలియక మెడను ఉన్న ఉరిత్రాటిని భద్రపరిచినట్లు అయింది. నీవు నా మృత్యుదేవతవు అని తెలియక ఇంతకాలమూ నేను నీతో రమించినాను. ఎవరికీ తెలియకుండా పసిపిల్లవాడు కృష్ణసర్పాన్ని పట్టుకున్నట్టు నేను నిన్ను పట్టుకున్నాను. అయ్యో! నేను ఉండికూడా నా పిల్లవాడికి లేనివాణ్ణి అయినాను. దురాత్ముణ్ణి అని నన్ను అందరూ తప్పకుండా తిట్టుతారు. దశరథ మహారాజు స్త్రీ సుఖము కోసము ప్రియపుత్రుణ్ణి అడవులకు వెళ్ళగొట్టినాడు; వాడు కాముకుడూ బుద్ధి తక్కువ వాడూ అంటారు.

"కైకా రాముడు గురుశిక్షవల్లనూ కాండవ్రతాదుల వల్లనూ బ్రహ్మచర్యవ్రతానుష్ఠానము వల్లనూ ఇంతవరకూ గృహస్థాశ్రమ సుఖము అనుభవించలేదు. ఇప్పుడే వాడికి భోగానుభవ కాలము వచ్చింది. నీవు వాడికి ఇప్పుడు ఈ కష్టము తెచ్చిపెట్టుతున్నావు. రాముడు నా మాటకు మారు ఆడడు. అడవికి పొమ్మని నేను అంటే వాడు సరేను అంటూ ప్రయాణము అవుతాడు. కాని నేను ఎందుకు అడవికి పోవలెను అని వాడు ఎదురు తిరగడు. వాడు అట్లా ఎదురు తిరిగితే ఎంత్రో

బాగుంటుంది. కాని వాడు అట్లా చేయడు. వాడు నిర్మలాత్ముడు. నేనూ వాడి వలె నిర్మలాత్మురాల్ని అనే భావిస్తాడు. నేను మనస్సులో ఒకటి ఉంచుకొని పైకి ఇంకొకటి చెప్పుతున్నాను అని వాడు ఊహించనయినా ఊహించడు. అందు వల్ల నేను అడవికి పొమ్మనగానే వాడు 'మంచిది' అంటూ ప్రయాణము అయి పోతాడు. నన్ను అందరూ తిట్టుతారు. నేను పాపిష్ఠివాణ్ణి నన్ను మృత్యువు యమ సదనానికి ఈడ్చుకొని పోతుంది. రాముడు అడవికి పోతాడు. అంతట నేను చచ్చిపోతాను. అప్పుడు నీవు మిగతా వాండ్లను ఎన్ని కష్టాలు పెట్టుతావో? కొడుకు అడవులపాలు అయిపోవడమూ నేను చచ్చిపోవడమూ చూచి భరించ లేక కౌసల్య చచ్చిపోతుంది. రాముడితోపాటు లక్ష్మణుడు అడవులకు వెళ్ళిపో తాడు. శత్రుఘ్నుడు అయినా ఎట్టఎదట ఉండడు కనుక దుఃఖము పట్టలేక సుమిత్ర కూడా చచ్చిపోతుంది. రామ లక్ష్మణ శత్రుఘ్నులనూ నన్నూ కౌస ల్యనూ సుమిత్రనూ ఘోరదుఃఖాల పాలు చేసి నీవుమాత్రము సుఖముగా ఉండ తలచినావు. ఈ కోసలరాజ్యము ఇంతవరకూ చెక్కు చెదరకుండా సుఖముగా ఉంది. రాముడు అడవులకు వెళ్ళిపోయిన తరువాత నేను దాటిపోయిన తరువాత నీవు ఏలికసానివి అవుతావు. ఈ రాజ్యము చిందరవందర అయిపోతుంది.

"కైకా, ఇది అంతా భరతుడికి కూడా ఇష్టము అయ్యేట్లయితే వాడు నా ప్రేతకర్మ చేయకూడదు. ఓ దుర్మార్గురాలా, ఓ శత్రువా, నీ కోరిక చెల్లించుకో. వైధవముండవు అయిపో. నీ కొడుకును పెట్టుకొని రాజ్యము ఏలు. నీవు రాజపుత్రివిగా నాకు భార్యారూపాన దాపురించిన శత్రువవు. నీ నుంచి నన్ను అన్ని పాపాలూ ఆవరించినవి. నీ నుంచి నాకు అంతులేని అప కీర్తి వస్తుంది. నీ నుంచి నాకు అమోఘము అయిన పరాభవము అవుతుంది. నీ నుంచి సమస్త భూతకోటిలోనూ నేను అల్పుణ్ణి అయిపోతాను.

"ఓ పాపసనీ, నా పిల్లవాడు - మాట్లాడితే గధాలూ గుర్రాలూ ఏను గులూ ఎక్కి పోయే నా పిల్లవాడు కారడవులో కాలినడకను తిరగవలెనా? భోజనసమయము రాగానే కుండలధారులు అయిన పాచకులు నేను ఆంటే నేను అంటూ పరుగెత్తుకొని వచ్చి ప్రశస్తము అయిన అన్నపానాదులు అందిస్తే ఆరగించే నా పిల్లవాడు ఘోరారణ్యములో వగరు కాయలూ చేదు దుంపలూ కారపు గింజలూ తినవలెనా ? మహార్ఘ్యము అయిన వస్త్రాలు ధరించి ఎప్పుడూ

సుఖాసనాల మీద కూర్చుండే నా పిల్లవాడు కాషాయగుడ్డలు కట్టుకొని కటిక నేలమీద కూర్చుండవలెనా? ఓ కైకా, ముందు వెనుకలు ఆలోచించకుండా భరతునికి పట్టము కట్టి రాముణ్ణి అరణ్యవాసానికి పంపించమని దారుణము అయిన ఉపదేశము నీకు ఎవడు చేసినాడు? ఆహా, స్త్రీలు ఎటువంటి పనులు అయినా చేస్తారు, ఆలోచించకుండా అపకారము చేస్తారు. వారు స్వార్థపరలు స్త్రీ జాతి నాశనము అయిపోవలెను. అందరు స్త్రీలూ కాదు. భరతుడి తల్లే నాశనము అయిపోవలెను అంటున్నాను.

"ఓ స్వార్థపరీ నీవు అనర్థము తలపెట్టినావు. నన్ను బాధపెట్టడమే పనిగా పెట్టుకొన్నావు. నీకు నేను ఏమి కీడు చేసినాను? జగద్ధితానుకారి అయిన రాముడిలో నీవు ఏమి దోషము కనిపెట్టినావు? రాముడు ఆపదల పాలు అయిపోయేట్లయితే ఈ జగత్తు అంతా కుపితము అయిపోతుంది. ఎంతో ప్రేమతో చూస్తూ ఉన్న తమ పుత్రులను తండ్రులు వదిలిపెట్టి పోతారు. అన్యోన్యానురాగముతో మెలగుతూ ఉన్న భార్యలను భర్తలూ భర్తలను భార్యలూ వదిలిపెట్టి పోతారు. దేశము క్షోభించి పోతుంది, ఓ కటికదానా, దేవకుమారుడి వంటి రాముడు ఉండపట్టే నేను బ్రతికిఉన్నాను. వాణ్ణి చూస్తూ ఉండపట్టే నా మనస్సు ఉల్లాసముగా ఉంటూ ఉంది. వాడు నాతో మాట్లాడుతూ ఉండపట్టే నేను ఇంత వృద్ధాప్యములోనూ యౌవనోత్సాహములో తిరుగుతున్నాను ఓ కైకా, రాముడు ఈ అయోధ్యానగరములో లేకపోయేట్లయితే ఒక్క పురుగు అయినా ఇక్కడ ఉండదు. రాముడూ లక్ష్మణుడూ అడవులకు వెళ్ళిపోతారు. నేను చచ్చిపోతాను. అంతట నీవూ నీ కొడుకు భరతుడూ ఈ అయోధ్యానగరములోనూ ఈ కోసలరాజ్యము లోనూ నా వాండ్లనూ నా బంధువులనూ చంపివేసి రాజ్యము ఏలుతూ ఉంటారు. ఓ దుష్ట చాండాలీ, నీవు నన్ను ఆపదలలో పడద్రోసి దెబ్బ తీస్తున్నావు. నీవు ఇప్పుడు పతి పత్నీ భావము వదిలిపెట్టి స్వతంత్రించి మాట్లాడుతున్నావు. నీ ఈ మాటలకు నీ నోటిపండ్లు వెయ్యి ముక్కలుగా రాలి పోవలెను. రాముడు ఎప్పుడు అయినా ఎవరికి అయినా ఒక్క అహితము చేసినాడా? ఒక్క అప్రియము ఆడినాడా? ఒక్క పరుష వాక్కు అయినా వాడి నోటివెంట వచ్చిందా? వాణ్ణి-ఆ సర్వజన మనోహరుణ్ణి ఆ సకల సద్గుణ సంపన్నుణ్ణి ఏమిదోషము చేసినాడు అని నీవు అడవులకు వెళ్ళ

అవసరము అయితే నేను కౌసల్యను అయినా సుమిత్రను అయినా నా ఐశ్వర్యాన్ని అయినా నా రాజ్యాధికారాన్ని అయినా చివరకు నా ప్రాణాన్ని అయినా వదలిపెట్టుతాను. కాని నా జ్యేష్ఠపుత్రుణ్ణి అందులోనూ అంతటి పితృవత్సలుణ్ణి నేను వదలిపెట్టలేను. వదలిపెట్టను. వాడు ఉంటూ ఉన్నందువల్లనె నేను బ్రతుకుతున్నాను. వాణ్ణి చూడక పోయేట్లయితే నా ప్రాణమే నిలవదు. కైకా, నాపిష్టి కోరికలు కోరవద్దు. నీవు ఈ కోరిక ఇంతటితో మానుకో. రాముడి మీద కోపము వద్దు. నేను నీ పాదాలు పట్టుకొంటాను.

"కైకా, ఈ పరమ దారుణము అయిన కోరిక నీవు ఎందుకు కోరినావు? భరతుడి మీద నాకు ప్రేమ ఉందో లేదో తెలుసుకో వలెను అని అడిగినావా? అయితే అయి ఉండ వచ్చును. అట్లా అయినట్లయితే భరతుడికి రాజ్యాభిషేకము చేయుమని అడగ వలెను; కాని రాముణ్ణి అడవులకు పంపించుమని అడగడము ఎందుకు?

"ఓ, కైకా, రాముడు జ్యేష్ఠుడు అనీ అందరి కన్నా హెచ్చు అయిన వాడు అని నీవే ఇదివరకు నాతో చెప్పుతూ వచ్చినావే - ఆ చెప్పినమాటలు అన్నీ ఇచ్చకాలేనా? నన్ను సంతోషపెట్టడానికో రాముడిచేత సేవ చేయించుకోవడానికో చెప్పిన కల్లబొల్లి కబుర్లేనా? అట్లా కాక పోయినట్లయితే రామాభిషేకము అని నీకు తెలియగానే దుఃఖతాపముతో ఈ క్రోధాగారములోకి ఎందుకు వచ్చినావు? నీవు ఎందుకు దుఃఖ పడుతున్నావు? నన్ను ఎందుకు దుఃఖపెట్టుతున్నావు? ఎవరు అయినా నీకు దుర్బోధ చేసి ఉండవలెను. లేదా కంటికి అగుపించని పిశాచాలు నిన్ను ఆవహించి అయినా ఉండవలెను.

"ఓ కైకా, నీవు ఇంతవరకూ బుద్ధిమంతురాలవుగా ప్రవర్తించినావు. ఇప్పుడు నీకు విపరీత బుద్ధి పుట్టింది. నీ నుంచి ఈ ఇక్ష్వాకువంశానికి అనర్థము రాపోతున్నది. ఓ విశాలాక్షీ, నీవు ఇదివరకు ఒక్క అనుచితము అయిన పని చేసి ఎరగవు. ఒక్క అప్రియము ఆడి ఎరగవు. నీవు ఇప్పుడు ఇట్లా కోరుతూ ఉంటే నేను నమ్మ లేకుండా ఉన్నాను. ఓ చిన్నదానా, నీవు అనేక మార్లు నాతో రాముడూ భరతుడూ నీకు సరిసమానులే నని చెప్పినావు. ఓ రాణీ, నీవు ధర్మభీతి కలదానవే — ఇప్పుడు ఆధర్మభీతి ఏమి అయి పోయింది? పరమధార్మి

పడు అయిన రాముణ్ణి పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసము చేయించమంటున్నావే - ఆ యశస్వి ఏమి తప్పు చేసినాడు ? వాడు—ఆ కుసుమ కోమల శరీరుడు—ఆ సుందరాకారుడు—రాముడు నీకు ఎప్పుడూ భరతుడికన్నా ఎక్కువగా సేవ చేస్తూ వచ్చినాడే - వాణ్ణి ఎందుకు అడవులకు వెళ్ళగొట్టమంటున్నావు? ఇప్పుడు కొత్తగా భరతుడిలో నీకు అతిశయము ఏమి కనిపించింది—వాడికి యువరాజ్యాభిషేకము చేయ మంటున్నావు ? ఓ శుభాంగీ, రాముడు నీకు సేవ చేయడము ఒక్కటే కాదు. నిన్ను గౌరవిస్తున్నాడు పూజిస్తున్నాడు. నీవు చెప్పినట్టు చేసే వాడు వాడు తప్ప మరి ఎవడూ లేడు. వాణ్ణి ఎందుకు అడవులకు పంపించ మంటున్నావు ?

“ఓ కేకయరాజపుత్రీ, ఈ రాజనగరులో ఎన్నో వేల మంది స్త్రీలు ఉన్నారు. ఇంకా ఎన్నో వేల మంది సేవకులు ఉన్నారు. వారిలో ఎవరు అయినా రాముడిలో ఒక్క తప్పు పట్టినారా? ఒక్క అపవాదు అయినా వేసినారా? రాముడు పరిశుద్ధుడు. సమస్త ప్రాణికోటిని సంతోష పెట్టుతూ ఉన్నాడు. సర్వజనులనూ వశపరచుకొన్నాడు. ధనము ఇచ్చి దీనజనుల దారిద్ర్యము పోగొట్టినాడు. శుశ్రూష చేసి గురుజనులను మెప్పించి సర్వవిద్యలూ అభ్యసించినాడు. ధనుర్ధరుడు అయి శత్రువులను అందరినీ సంహారము చేసి వేసినాడు. సత్యవ్రతముతో స్వర్గాదిలోకాలను స్వాధీనము చేసుకొన్నాడు. సత్యమూ దానమూ త్యాగమూ తపమూ మిత్రత్వమూ శుచిత్వమూ రాముడిలో మూర్తీభవించినవి. వాడు దేవతుల్యుడు. మహర్షుల వంటి తేజోవంతుడు. ఎందుకు వాణ్ణి అడవులకు వెళ్ళగొట్టమంటున్నావు ? నేను నా మనస్సులో అయినా వాడికి అప్రియము చేయలేను. వాడు సర్వలోక ప్రియుడు. ఈ కోసలరాజ్యములో జనపదముఖ్యులూ పౌరముఖ్యులూ వాడికి రాజ్యాభిషేకము చేయ వలసింది అని చెప్పినారు. వాణ్ణి నీవు ఒక్క తెవ్వూ కోరినావు అని అడవులకు పొమ్మని చెప్పడము ఎట్లాగు ? ఆ జితేంద్రియుడు ఆ త్యాగమూర్తి ఆ సత్యవ్రతుడు ఆ శమదమాదిగుణసంపన్నుడు రాముడు తప్ప నాకు దిక్కు ఎవరు? కైకా, నేను ముసలివాణ్ణి అయిపోయినాను. నాకు అవసానకాలము ఆసన్నము అయింది. రేపో మాపో నేను దాటి పోతాను. నీవు భయంకరము అయిన కోరిక కోరినావు. కైకా, నన్ను అనుగ్రహించు. సముద్రము పొలిమేరగా నా పరిపాలనములో

ఉన్న ఈ పృథ్విని అంతా నీకు ఇచ్చి వేస్తాను. ఇదుగో కైకా. నేను నీకు నమస్కారము చేస్తున్నాను. నీ కాళ్ళు పట్టుకొంటాను. రాముణ్ణి మన్నించు. రామాభిషేక విషయములో నాకు ధర్మహాని రాకుండా నీవు నన్ను కాపాడు'' అంటూ ఏడుస్తూ దశరథ మహారాజు నేల మీద పడి పోయినాడు. దుఃఖసముద్రములో మునుగుతూ తేలుతూ ఏకముగా కైక వంక చూడ సాగినాడు.

కైకేయీదేవి రౌద్రరూపిణి అయింది. రౌద్రముతో "ఓ ధర్మాత్మా, నా రెండు వరాలూ చెల్లిస్తాను అని తాము ఒట్టు పెట్టుకొన్నారు. అందుకు మీరు ఇప్పుడు దుఃఖపడుతున్నారు. ఇకను ఈ పృథ్విలో తాము పరమధార్మికులము అని ఎట్లా చెప్పుకొంటారు? రాజర్షులు సమావేశము అయినప్పుడు తమను ఎవరు అయినా ఈ విషయము అడిగితే ఏమి చెప్పుతారు? నాభార్య కైక కష్టపడి నన్ను కాపాడింది; నా ప్రాణము రక్షించింది; అందుకు ఆమెకు రెండు వరాలు ఇస్తాను అన్నాను; చివరకు ఎగకొట్టినాను అని చెప్పుతారా? రాజా, వరాలు చెల్లిస్తాను అని ఇప్పుడేకదా తాము ప్రమాణము చేసినారు? ఇంతలోనే మాట తప్పుతారా? అందువల్ల అపకీర్తి మీకు ఒక్కరికే కాదు. మీ బోటి రాజులు అందరికీ అబద్ధాలు ఆడుతారు అనే అపకీర్తి వస్తుంది. ప్రభూ, పూర్వ రాజుల వృత్తాంతాలు జ్ఞాపకము చేసుకోండి. ఆలోచించండి. మీ ప్రమాణాన్ని దబ్బర చేయకండి.

"రాజా, మీరు దుర్మార్గానికి ఒడి కట్టుతున్నారు. ధర్మము తప్పుతున్నారు. మీరు రాముడికి రాజ్యాభిషేకము చేసి కౌసల్యతో ఎప్పుడూ సుఖము అనుభవించ తలచినారు. ధర్మమో అధర్మమో మీకు ఇష్టమో అయిష్టమో మీరు చెల్లిస్తాను అని శపథము చేసినారు. అందుకు తిరుగు లేదు. అట్లా కాదు అని రాముడికి రాజ్యాభిషేకము చేసేట్లయితే మీ ఎట్టయెదుటనే మీరు చూస్తూ ఉండగానే నేను విషము త్రాగి చచ్చి పోతాను. కౌసల్య రాజమాత అయితే అందరూ వచ్చి ఆమెకు నమస్కారాలు చేస్తూ ఉంటే నేను చూస్తూ ఒక్క రోజు అయినా జీవముతో ఉండ లేను. అట్లా ఒక్క రోజు అయినా బ్రతకడము కన్నా విషము త్రాగి చచ్చి పోవడము మేలు. రాజా, నేను భరతుడి మీదనూ నా ప్రాణము మీదనూ ఒట్టు పెట్టుకొని చెప్పుతున్నాను. రాముణ్ణి అరణ్యవాసానికి పంపించ

డను కన్నా మీరు ఏమి చేసినా నేను తృప్తిపడను" అని చెప్పి కైకేయీదేవి దశరథమహారాజు వంక చూస్తూ ఊరక ఉంది.

దశరథమహారాజు ప్రతిమలాడినా ఆమె మాట్లాడలేదు. అప్పుడు ఆయన దేహము అంతా కంపించిపోయింది. ఒక్క ముహూర్తము సేపు అట్లా నిలుచుండి పోయినాడు. కను రెప్పలు వాల్చకుండా కైకేయీదేవి వంక చూస్తూ, ఆమె ముందుగా తన చేత ప్రమాణము చేయించుకోవడమూ ఆ తరువాత ఆమె రాముణ్ణి అరణ్యవాసానికి పంపించమని కోరడమూ భరతుడికి పట్టము కట్టమని చెప్పడమూ మొదలు అయినవి ఆలోచించినాడు. మొదలు నరికిన చెట్టు వలె నేల కూలినాడు. ఉన్నట్టు ఉండి పిచ్చెత్తిన వాడి వలె మాడ సాగినాడు. సన్నిపాత వ్యాధిపీడితుడి వలె కనిపించినాడు. దీన స్వరముతో "ఓ కైకా, ఈ అనర్థము నీకు మేలు అని ఎవరు అయినా బోధ చేసినారా? లేక ఏది అయినా పిశాచము నిన్ను పట్టిందా? నీవు సిగ్గు విడిచి నాతో మాట్లాడుతున్నావు. ఇదివరకు ఈ దుస్స్వభావము నీలో నాకు కనిపించ లేదు. నీవు ఇప్పుడు విపరీతముగా మారి పోయినావు. భరతుడికి పట్టము కట్టమని రాముణ్ణి అడవులకు పంపించమనీ ఎందుకు కోరుతున్నావు? ఇప్పుడు నీకు కొత్తగా వచ్చిన భయము ఏమిటి? నీ భర్తను అయిన నాకూ నీ పుత్రుడు అయిన భరతుడికీ ఈ లోకానికీ నీవు మేలు చేయ తలచుకొన్నట్లయితే రాముణ్ణి అరణ్యవాసానికి పంపించవలెను అనే ఆలోచన నీవు మానుకోవలెను.

"ఓ నీచురాలా, ఓ పాపీ, నిన్ను నేను ఏమి కష్టపెట్టుతాను? రాముడు ఏమి కష్టపెట్టుతాడు? ఓ కటికదానా, మేము నీకు ఏమి అపరాధము చేసినాము?

"ఓ వెర్రిదానా, నీకు తెలియదు. భరతుడు రాముడికన్నా ధార్మికుడు, మతిమంతుడు. రాముణ్ణి అడవులకు వెళ్ళకొట్టితే ఈ రాజ్యము ఏలడానికి భరతుడు ఒప్పుకోడు. ఓ కైకా, రాముణ్ణి నేను అడవికి పొమ్మంటే వాడి ముఖము రాహుగ్రస్త చంద్రబింబమువలె వివర్ణముఅయిపోయేట్లయితే నేను చూడగలనా? చూచి బ్రతుకగలనా? ఓ దేవీ, మంత్రులూ పురోహితులూ మిత్రులూ మహాజనులూ ఏకము అయి ఆలోచించి రామాభిషేకము నిశ్చయించినారు. నేను అందుకు అంగీకరించినాను. రామాభిషేకము చేస్తాను అని మహాజన సభామధ్య

కొట్టమంటున్నావు? నీకోరిక మహాఘోరము అయినది. నీ కోరికనుంచి సర్వమూ నాశనము అయిపోతుంది. నీకోరికను నేను చెల్లించను. ఓ పాంసనీ, నీవు ఏపవు. నిప్పులలో దూకు. ఈ సౌధాగ్రభాగమునుంచి కింద పడి ముక్కలు ముక్కలు అయిపోయి చావు. నేను నీవు కోరినట్టు చేయను. ఓ కైకా, నీవు మంగళకత్తివంటి దానవు. నీ మెచ్చుకోళ్ళు అన్నీ ఇచ్చకాలు. నీ మాటలు అన్నీ కల్లబొల్లి కబుర్లు. నీవు దుర్మార్గురాలవు. నీవు నా వంశనాశనివి. నీవు నా హృదయాన్ని సమూలముగా దహించివేస్తున్నావు. ఇక నీవు బ్రతికి ఉండడము నేను సహించలేను.

"ఓ కైకా, నా కొడుకు రాముడు లేకుండా నేను బ్రతకడము ఉత్తది. ఒకవేళ బ్రతికినా నేను సుఖపడేది ఏమిటి? సంతోషపడేది ఏమిటి? కైకా నీవు నా భార్యవు. నాకు అపకారము చేయవద్దు. నన్ను అనుగ్రహించు. నీ పాదాలు పట్టుకొంటున్నాను" అంటూ పార చాచుకొన్న ఆమె కాళ్లు దశరథమహారాజు అనాథుడివలె పట్టుకోపోయినాడు. జబ్బువంటివాడివలె తూలుతూ కింద పడిపోయినాడు.

౧౩

దశరథమహారాజు ఆడదానికాళ్లు - అందులో తన భార్యకాళ్లు పట్టుకోవలసినంత పాపము చేసినవాడు కాడు. అయితే అటువంటి దురవస్థలో పడిపోయినాడు. కైకేయి కోరిక ఆయన్ను అంత భయపెట్టింది. ఆమె మాత్రము నిర్భయముగా కూర్చున్నది. ఆమెకు కావలసినది ఆమె కోరిక నెరవేరడమే. ఆమె అతి రూక్షముగా దశరథమహారాజువంక చూస్తూ "రాజా, సత్యమే తమ వ్రతము అనీ ఆ సత్యవ్రతాన్ని తాము ఎన్నడూ వదలిపెట్టము అనీ అందరితోనూ చెప్పతూ ఉంటారే — నాకు చెల్లిస్తాము అన్న వరాలు చెల్లించడానికి మీరు ఇప్పుడు ఎందుకు ఇంత గట్టిపట్టు పట్టుతున్నారు?" అని అడిగింది.

ఈ మాటలకు దశరథ మహారాజు కోపోద్రేకముతో వణకిపోతూ "ఆశ్చర్యము. ఓదుష్టచారిణీ, నామీద నీకు ఎంత శత్రుత్వము ఉంది? ఎంత క్రౌర్యము ఉంది? నేను చచ్చిపోయిన తరువాత రాముడు అడవుల పాలు అయిపోయిన తరువాత నీవు నీ కోరికలు కొనసాగించుకో. అప్పుడు సుఖపడు.

"అయ్యో, నేను స్వర్గానికి పోయినా నాకు అక్కడనూ దుఃఖము తప్పదు కాబోలు. దేవతలు రాముణ్ణి గురించే నన్ను అడుగుతారు. కైకకు వాగ్దానము చేసిన వరాలనుంచి రాముణ్ణి అడవులకుపంపించి వేయవలసి వచ్చింది అని నేను యథార్థమే చెప్పేట్లయితే, మరునాడు రాజ్యాభిషేకము చేస్తాను అని అంతకుపూర్వము రామునితో నీవు చెప్పినావే — అది అబద్ధము అయిపోలేదా అని నన్ను దేవతలు దూయపట్టుతారు. కైకా, పుత్రులు పుట్టక పోతే ఎంతో తాపత్రయపడి మహాయజ్ఞము చేస్తే రాముడు పుట్టినాడు. వాడు శూరుడు, సమస్త విద్యలూ అభ్యసించినాడు. శమదమాది గుణసంపన్నుడు. జితేంద్రియుడు; వాణ్ణి - ఆ ఇందీవరశ్యాముణ్ణి - ఆ కమలపత్రాయతాక్షుణ్ణి-ఆ ఆజానుబాహువును నేను విడిచిపెట్టి ఉండడము ఎట్లా? వాణ్ణి దండకారణ్యము పంపించడమా? అయ్యో! వాడు సమస్త సుఖాలూ అనుభవించవలసినవాడు. వాడు కష్టాలు పడడమా? నేను ఆమాట వినలేను. వాడికి కష్టకాలము రాకపూర్వమే నేను దేహము చాలించడము ఉత్తమము.

"ఓ కటికదానా నీకు, ఎందుకు ఈ పాపిష్టిబుద్ధి పుట్టింది? రాముణ్ణి అరణ్యవాసానికి పంపించేట్టయితే ఈ లోకములో నాకు అంతులేని అపకీర్తి వస్తుంది. అసమానము అయిన అవమానము భరించవలసి వస్తుంది" అంటూ చిత్తము భ్రమించి ఏడువ సాగినాడు.

చంద్రోదయము అయింది. ఆ రాత్రి మూడు ఝాముల పొద్దూ మహావ్యాధిగ్రస్తుడివలె నిట్టూర్పులు విడుస్తూ కుమిలిపోతూ కన్నులు మిటకరించి ఆకాశమువంక చూస్తూ "ఓ రాత్రీ, నీవు తెల్లవారవద్దు. నీవు శుభకరివి. నా మీద దయ ఉంచు. నేను చేతులెత్తి నీకు నమస్కారము చేస్తూ ఉన్నాను. ఓ రాత్రీ, అట్లా కాదు అంటున్నావా? అయితే వెంటనే తెల్లవారిపో. నా పీడ విరగడఅయిపోతుంది. ఈ క్రూరురాలిని - ఈ దుర్మార్గురాలిని—ఈ కటికదానిని నేనుచూస్తూ ఉండలేను" అంటూదశరథమహారాజు నమస్కారము చేసినాడు.

అంత దశరథమహారాజు కైకేయీదేవిని ఎట్లాగు అయినా మంచిచేసుకో వలెను అనుకొని "ఓ దేవీ, నీవు మంగళస్వరూపిణివి. నీవు నా ఇల్లాలివి. నేను ఇంతవరకూ సత్యవ్రతముతో జీవించినాను. నా ఆయుష్యము అంతా అయి

పోయింది. నేను ఇకను ఆట్టే కాలము బ్రతుకను. ఇప్పుడు నేను శరణాగతుణ్ణి. ఓ సుశ్రోణీ నేను రామాభిషేకము చేస్తాను అని చాటుగా ఏ ఒకరు ఇద్దరితోనో కాదు; రాజసభామధ్యములో బహిరంగముగా ప్రకటనము చేసినాను. ఓ చిన్నదానా, నీవూ ఆలోచించు. నన్ను అనుగ్రహించు. ఓ చల్లని చూపుల దానా, ఈ రాజ్యము అంతా నీకు వరదానముగా ఇస్తాను. నీవు ఈ రాజ్యము అంతా వరముగా నా దగ్గర పుచ్చుకొని నీ రాజ్యముగా నీవే రామునికి ఒప్పగించు. ఇందుకు నీ కుమారుడు భరతుడు కాదు అనడు. సంతోషిస్తాడు. గురువులూ మంత్రులూ మహాజనులూ ప్రజలూ నిన్ను మెచ్చుకొంటారు. నీ యశస్సు ఈ లోకములో శాశ్వతముగా ఉండిపోతుంది. నేనూ కృతార్థుణ్ణి అవుతాను' అంటూ జాలిపుట్టేటట్టు కన్నీళ్లు కారుస్తూ చెప్పినాడు

ఇందుకు కైకేయీదేవి చలించలేదు. అంగీకరించలేదు.

రాముని వనవాసాన్ని గురించిన ఆలోచనే దశరథమహారాజు మనసులో సుళ్లుతిరగడము మొదలుపెట్టింది.

ఆ రాత్రి గతిస్తున్నది. వైతాళికులు మేలుకొలుపులు పాడ నారంభించినారు. ఆ మేలుకొలుపు పాడడము ఆపివేయమని దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు.

## ౧౪

దశరథమహారాజు దుఃఖముతో నేలమీదపడి పొర్లిగింతలు పెట్టసాగినాడు. కైకేయీదేవి ఆయనవంక చూస్తూ "రాజా" నేను కోరిన వరాలు చెల్లిస్తాము అని ఒట్టు పెట్టుకొని ఏదో పాపకార్యము చేసినట్టు ఇప్పుడు, నేల మీద పడి దొర్లుతున్నారు. మీరు మీ మర్యాద చెడగొట్టుకోవద్దు. మీకు దుఃఖపడడము దేనికి? సత్యమే పరమధర్మము అని ధర్మవేత్తలు చెప్పుతూ ఉంటారు. నేనూ ఆ ధర్మాన్నిపట్టే మీరు వాగ్దానము చేసిన వరాలు చెల్లించమని మిమ్ములను అడిగినాను. మీరు సరేను అన్నారు. రాజా, తమకు తెలియనిది ఏమీ లేదు. పూర్వము శైబ్యుడు అనే రాజు పావురాన్ని కాపాడుతాను అని మాట ఇచ్చినాడు. ఆ దేవిధముగా మహా తేజోవంతుడు అయిన అలర్క మహారాజు అడి

ఏదని ఇస్తాను అని చెప్పినందువల్ల వేదపారంగతుడు అయిన ఒకానొక బ్రాహ్మణుడికి తన రెండు కన్నులూ ఊడపెరికి దానము ఇచ్చినాడు. సమస్త నదులకూ అధిపతి అయిన సముద్రుడు సత్యవ్రతము వల్లనే తన పొలిమేరను దాటి ఈ భూమిని ముంచివేయడము లేదు.

"ప్రభూ, అందరికీ సత్యమే పరమ ప్రాప్యము. సత్యమే ఓంకారము. సత్యమే బ్రహ్మము. సత్యమే ధర్మము. అక్షయముగా ఉండేది సత్యము ఒక్కటే. సత్యమే సమస్తానికీ మూలము. సత్యమే పరమ పురుషార్థము అని వేదాలు చెప్పుతూ ఉన్నవి. రాజా, తమది సుస్థిరము అయిన ధర్మచింతే అయినట్లయితే తాము సత్యము తప్పరు; తప్పకూడదు కూడాను. నాకు ఇచ్చిన వరాలు తాము సఫలము చేసి తీరవలెను. తాము వరప్రదాతలు. నేను ఇప్పుడు మిమ్ములను కోరుతున్నాను. ప్రోత్సహిస్తున్నాను. కనుక ధర్మసిద్ధికోసము మీరు వెంటనే రాముణ్ణి అరణ్యవాసానికి పంపించి వేయవలెను. నేను చెప్పుతున్నాను. ముమ్మాటికీ చెప్పుతున్నాను. మీరు మీ శపథము చెల్లించక పోయేట్లయితే మీరు నన్ను త్యజించి వేసినట్టే. ఇక మీ ఎట్ట ఎదటనే నేను ప్రాణము వదలి వేస్తాను'' అంటూ నిర్విశంకముగా చెప్పింది.

వామనమూర్తికి మాట ఇచ్చి తప్పుకో లేక పోయిన బలిచక్రవర్తివలె దశరథ మహారాజు ధర్మపాశ బద్ధుడు అయిపోయినాడు. కాడికీ బండి చక్రానికీ మధ్యను ఉండే ఎద్దువలె నిలబడి పోయినాడు. ఆయన హృదయము దడదడ కొట్టుకోవడము మొదలుపెట్టింది. ముఖము వెలా తెలా పోయింది. కన్నులు కటక బారిపోయినవి. ఏమీ కనిపించకుండా పోయింది. ఎట్లాగో ధైర్యము చిక్కబట్టి "ఓ పాపీ, నిన్ను నేను సమంత్రకక్రమముగా అగ్నిసాక్షిగా పెండ్లి ఆడినాను. ఇప్పుడు నేను నిన్ను నీపుత్రుడితో కూడా వదలివేస్తున్నాను. ఇక నీవు నా భార్యవు కావు. నేను నీకు భర్తను కాను. నీకు పుట్టిన పుత్రుడు నా పుత్రుడు కాడు. నేను వాడికి తండ్రినిన్నీ కాను.

"ఓరాణీ, రాత్రి అయిపోయింది. సూర్యోదయము అవుతూ ఉంది. గురుజనులు నా కోసము ఎదురు చూస్తూ ఉంటారు. ఇక నేను రామాభిషేకము అయినా చేయవలెను; లేదా చచ్చి అయినా పోవలెను. ఓ అశుభాచారా,

నీ నుంచే రామాభిషేకము ఆగిపోయేట్లయితే నీ కుమారుడు నాకు ఉత్తరక్రియలు చేయకూడదు. నీవూ నీ కుమారుడూ నన్ను ముట్టకూడదు. నాకు నీళ్లు వద కూడదు'' అన్నాడు దశరథమహారాజు.

ఈ మాటలకు కైకేయీ దేవికి పట్టశక్యముకాని కోపము వచ్చింది. అయితే ఆమె మాటనేర్పరి. "రాజా, తాము ఎందుకు విషము మాటలు మాట్లాడతారు? తాము దుఃఖ పడడము ఎందుకు? రాముణ్ణి ఇక్కడికి పిలిపించండి. తాము కృత కృత్యులు అవుతారు'' అన్నది ఆమె.

దశరథమహారాజు కొరడాదెబ్బ తిన్న గుర్రమువలె రేగి "కైకా, నా తెలివి తెల్లవారింది. ఇప్పుడే ఆ పరమధార్మికుణ్ణి నా జేష్ఠపుత్రుణ్ణి రాముణ్ణి పిలిపించు. వాణ్ణి నేను చూడవలెను. వానితో మాట్లాడవలెను'' అన్నాడు.

అప్పుడు తెల్లగా తెల్లవారుతూ ఉంది. సూర్యోదయము అయిన తరువాత పుష్యమి నక్షత్రములో యువరాజ్యాభిషేక సుముహూర్తము వస్తుంది.

తెల్లవారుతూ ఉండగా రాజవీధులు అన్నీ నీళ్లు చల్లినారు. రంగురంగు పూలతో అలంకరించినారు. పతాకలెత్తినారు. పూలదండలతో తోరణాలు కట్టి నారు. అంగళ్లు అన్నీ తెరచినారు. అవి అన్నీ శోభాయమానముగానూ సస్య సమృద్ధిగానూ ఉన్నవి. నగరము అంతటా చందనాగరుధూప వాసనలు గుబాళిస్తూ ఉన్నవి. రామాభిషేక మహోత్సవము చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి జనులు తండోపతండాలుగా వస్తూ వున్నారు.

రాజవీధులు అన్నీ జనాకీర్ణము అయిపోయినవి.

వసిష్ఠ మహర్షి ఆయన శిష్యులూ సరయూ నదిలో స్నానము చేసి అభిషేక ద్రవ్యాలతో రాజవీథిలో మహాజనము మధ్య మెల్లగా దారి చేసుకొని రాజప్రాసాదములోకి వచ్చినారు. అప్పటికే రాజులూ నగరముఖ్యులూ జనపద ముఖ్యులూ అక్కడ చేరినారు. ఆ ఆవరణలో వృక్షాల మీద ఉన్న రకరకాల పక్షులూ, కుహూనాదాలు చేస్తూ ఉన్నవి. బ్రాహ్మణోత్తములు వేదపారాయణము ఆరంభించినారు. యజ్ఞవేత్తలు అయిన బ్రాహ్మణశ్రేష్ఠులు అభిషేక సంబంధ కర్మకలాపాలలో నిమగ్నులు అయినారు. సర్వమూ సన్నద్ధము అవుతూ ఉంది.

అప్పుడు అక్కడికి వచ్చిన సుమంత్రుణ్ణి చూచి వసిష్ఠమహర్షి "ఓ మంత్రి సత్తమా, మీరు వెంటనే పోయి మహారాజుతో సర్వమూ సన్నద్ధము అయింది అనీ సుముహూర్తము ఆసన్నము అవుతూ ఉంది అనీ చెప్పవలెను. నేను చెప్పినాను అని మీరు ఆయనను తొందరచేసి ఇప్పుడే ఇక్కడికి వెంటపెట్టుకొని రావలెను" అన్నాడు.

ఏ అంతఃపురములోకి అయినా యథేచ్ఛగా పోయే అధికారము సుమంత్రుడికి ఉంది. ఆయన సంతోషముగా కైకేయీదేవి అంతఃపురములోకి పోయినాడు. దశరథమహారాజు అప్పుడు ఏ అవస్థలో ఉన్నదీ అతను ఎరుగడు. శయ్యాగృహము దగ్గర నిలుచుని "రాజా, చంద్రోదయ సమయాన సముద్రుడివలె సంతోషాతిశయముతో తాము ఇప్పుడు లేవవలెను. మహాశుభసమయము ఆసన్నము అవుతూఉంది. ఇటువంటి సమయమప్పుడే మాతలి దేవేంద్రుణ్ణి మేలుకొలిపినాడు. అంతట దేవేంద్రుడు రాక్షస సంహారానికి బయలుదేరినాడు. అదే విధముగా నేను మిమ్ములను మేలుకొలుపుతున్నాను.

"ఓ రాజా, వేదవేదాంగాలు అన్నీ బ్రహ్మదేవుడివల్ల పుట్టినవి. అయితే అవి అన్నీ ఆయననే ప్రబోధిస్తూ ఉన్నవి. అదేవిధముగా నేను తమను ప్రబోధిస్తున్నాను. శుభప్రదము అయిన ఈ పృథ్విని ఉదయాస్తమయ కాలాలలో సూర్య చంద్రులు మేలుకొలుపుతున్నారు. అదే విధముగా నేను మిమ్ములను మేలుకొలుపుతున్నాను. ఓ రాజా, తాము ఇక నిద్ర లేవవలెను. మంగళాలంకారాలు చేసుకొని మేరుపర్వతముమీద ఉదయించే సూర్యుడువలె తాము తమ దేహ కాంతులతో తేజరిల్లుతూ సభాభవనానికి రావలెను.

"ప్రభూ, మిమ్ములను సూర్యచంద్రులూ శక్ర వైశ్రవణులూ వరుణాగ్నిహోత్రులూ పార్వతీ పరమేశ్వరులూ కాపాడుతారు. పరమపవిత్రము అయిన రాత్రి గడచిపోయింది. రాత్రి జరుగవలసిన పనులు అన్నీ జరిగిపోయినవి. తాము ఇక నిద్ర లేవవలెను. జరుగవలసిన పనులు తాము జరిపించవలెను.

"దేవా, రామాభిషేకపు ఏర్పాట్లు అన్నీ అయిపోయినవి. వసిష్ఠమహర్షి, బ్రాహ్మణోత్తములూ రాజులూ వర్తకులూ నాగరులూ గ్రామీణులూ తమ రాక ఎదురుచూస్తూ ఉన్నారు.

"ప్రభూ, ఇప్పుడు తమ సభాభవనము చంద్రుడు లేని ఆకాశమువలె ఉంది.

"దళవాయి లేని దండువలెనూ ఆబోతులేని ఆలమందవలెనూ కాపరి లేని గొర్రెలమందవలెనూ సదస్యులు ఉన్నారు.

"రాజా, రాజు కనిపించని రాజ్యము అరాజకము అవుతుంది.

"ప్రభూ, మహాజనులు అందరూ తమ దర్శనముకోసము తహతహలాడుతూ ఉన్నారు. దేవా, తాము వెంటనే బయలుదేరి రావలెను. రామాభిషేకానికి అనుజ్ఞ ఇవ్వవలెను" అంటూ సార్థకముగానూ సానుపూర్వకముగానూ సుమంత్రుడు దశరథమహారాజును ప్రబోధించినాడు.

పడుకొని ఉన్న దశరథమహారాజు సుమంత్రుడి ప్రబోధను అంతా విన్నాడు. ఆయనకు మరింత దుఃఖము వచ్చింది. ఆయన కన్నులు జ్యోతులు అయిపోయినవి. పడుకొనే "ఓ సుమంత్రుడా. నీ స్తోత్రపాఠము నా హృదయాన్ని చీల్చివేస్తున్నది" అని జాలిపుట్టేట్టు ఆయన అన్నాడు.

ఆ మాటలు సుమంత్రుడు విన్నాడు. దశరథమహారాజును చూడవలెను. అనుకొన్నాడు. చేతులుజోడించి లోపలికి పోబోయినాడు ముందుకు అడుగు పడలేదు. వెనకకు తగ్గి ఆలోచిస్తూ నిలుచుండి పోయినాడు.

కైకేయీదేవి వచ్చి సుమంత్రుణ్ణి చూచి సమయోచితముగా "ఓ మంత్రిపుంగవా, రాజు రాత్రి అంతా రాముణ్ణి గురించి జాగరణ చేసినారు. మీరు వెంటనే పోయి రాముణ్ణి ఇక్కడికి తీసుకొని రావలెను. ఇది నేను చెప్పుతున్నాను అని వేరేవిధముగా అనుకోనక్కరలేదు" అన్నది.

కైకేయీదేవి ఈవిధముగా చెప్పినందువల్ల సుమంత్రుడు అనుమానము ఏమీ లేదు అనుకొన్నాడు. సంతోషపడినాడు. ఆమె మాట రాజాజ్ఞగా శిరసావహించి అక్కడనుంచి బయలుదేరినాడు. సముద్రమధ్యములో ఉన్న సుడిగుండములో నుంచి బయటపడ్డట్టు ఆ కైకేయీదేవి అంతఃపురములో నుంచి అతడు బయటికి వచ్చినాడు. ద్వారము ఎదట కానుకలతో వచ్చి నిలుచుని ఉన్న మహా ధనవంతులనూ పౌరముఖ్యులనూ జనపద ముఖ్యులనూ రాజవీధిలో కిటకిటలాడుతూ ఉన్న జనసమూహాన్ని చూచినాడు.

౧౫

సూర్యోదయము అయిన తరువాత పుష్యమీనక్షత్రాన రాముడి జన్మ లగ్నము అయిన కటకలగ్నములో రామ యువరాజ్యాభిషేకము జరుగవలెను.

వేదపారంగతులు అయిన బ్రాహ్మణులు అందరూ ఆ రాత్రి అక్కడనే ఉండి అభిషేకానికి అవసరము అయిన ఏర్పాట్లు అన్నీ చేసినారు. తెల్లవారుతూ ఉండగా వారు అందరూ వసిష్ఠ మహర్షితో రాజసభాభవనములోకి వచ్చినారు. అప్పుడు అక్కడ అమాత్యులూ సేనానాయకులూ వర్తకులూ పౌరముఖ్యులూ మొదలు అయిన వారు అందరూ సమావేశము అయినారు.

అభిషేకముకోసము మేడిమానుతో చేసిన భద్రపీఠాన్ని సిద్ధముగా ఉంచినారు. సింహాసనము అలంకరించినారు. ధగధగలాడే పులితోలు పరచిన నాల్గు గుర్రాల రథమూ బోయీలతో పల్లకీ సిద్ధముగా ఉన్నవి. గంగాపావనోదకాలూ గంగా యమునా సంగమప్రదేశము నుంచి తెప్పించిన పుణ్యజలాలూ ఇంకా ఇతర పుణ్యనదులలోనుంచీ తూర్పుదిక్కుగా ప్రవహించే నదులలోనుంచీ ఊర్ధ్వముఖముగా ప్రవహించే నదులలోనుంచీ దక్షిణోత్తరముఖాలలో ప్రవహించే నదులలోనుంచీ ఎటూ ప్రవహించకుండా నిలిచిఉండే పుణ్యహ్రదాలలోనుంచీ సరస్సులలోనుంచీ ప్రసిద్ధము అయిన బావులలోనుంచీ సమస్త సముద్రాలలోనుంచీ రామాభిషేకానికి తెప్పించిన పుణ్యోదకాలనూ వెండి బంగారు బిందెలలో నింపినారు. ఆబిందెలమీద రావిఆకులూ తామరపువ్వులూ కలువపూలూ మూతలుపెట్టినారు.

తేనే నెయ్యీ పేలాలూ పెరుగూ పాలూ పూలూ వస్త్రాలూ నవధాన్యాలూ నవరత్నాలూ ఖడ్గమూ కార్ముకమూ మణులుపొదిగి బంగారుపిడితో చంద్రకిరణాలవలె తేజరిల్లుతూ ఉన్న రెండుచామరాలూ చంద్రమండలమువలె సుందరముగానూ మనోజ్ఞముగానూ ఉన్న శ్వేతచ్ఛత్రమూ బంగారుపగ్గాలతో అలంకరించిన తెల్లటి ఆబోతూ నాలుగుపళ్లుచేసి మెడనిండా జూలు వేళ్లాడుతూ ఉన్న తెల్ల గుర్రమూ మదజలముకారుస్తు పెద్ద కొండ అంత ఎత్తున ఉన్న ఏనుగూ ఆవులూ మృగాలూ పక్షులూ సిద్ధముగా ఉన్నవి. వేదిలో అగ్నిహోత్రము ఉంచినారు. ఇంపుగా సొంపుగా నడిచే వేశ్యాంగనలు చక్కని

అలంకారాలతో వచ్చినారు. మంగళార్హాలు అయిన ఎనిమిదిమంది కన్నెపడుచులు సమస్తాభరణాలతోను అలంకరించుకొని రామాభిషేకము చేయడానికి సిద్ధముగా ఉన్నారు. వీణావేణు మృదంగతాళాది వాయిద్యాలూ వివిధవాద్యగాండ్లూ సూతవందిమాగధులూ సిద్ధముగా ఉన్నారు.

ఇక్ష్వాకులవంశరాజుల పట్టాభిషేక సమయమప్పుడు తమ తమ ఆచారాలనుపట్టి తేవలసిన కానుకలతో సామంతరాజులు అందరూ వచ్చి దశరథమహారాజు అంతఃపురద్వారముదగ్గర కనిపెట్టుకొని ఉన్నారు. వారికి దశరథమహారాజు దర్శనము కాలేదు. పొద్దెక్కుతున్నది. తమ రాక రాజుకు తెలియచెప్పేవారు ఎవరా అని వారు తహతహ లాడుతున్నారు. అప్పుడు లోపలినుంచి సుమంత్రుడు బయటికి వచ్చినాడు, అతడు ఆ సామంతరాజులను అందరినీ చూచినాడు. రాజుల పురాతన వృత్తాంతాలూ వారి ఆచారాలూ అతనికి తెలుసును. అతడు అంతట ఆ సామంతరాజులతో "ఓ రాజోత్తములారా, రామున్ని ఇప్పుడు ఇక్కడికి తీసుకొనిరమ్మని నన్ను దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు. అయితే ఇప్పుడు మిమ్ములను అందరినీ దశరథమహారాజు గౌరవించవలెను. ఆయనకన్నా ఎక్కువగా రాముడు మిమ్ములను గౌరవించవలెను మీరు కోరుతున్నారు కనుక దశరథమహారాజును నిద్రలేపి మీకు దర్శనము ఇవ్వమని చెప్పతాను" అంటూ సుమంత్రుడు మళ్లీ లోపలికి పోయినాడు.

సుమంత్రుడు దశరథమహారాజు పడకగదిదగ్గరకుపోయి తెర ఇవతల నిలుచుని ఆయన్ను మళ్ళీ స్తోత్రముచేస్తూ "ఓ రాజా, బాగా తెల్లవారిపోయింది. తాము ఇక నిద్రలేవవలెను. సామంతరాజులు అందరూ కానుకలుతీసుకొనివచ్చి కనిపెట్టుకొని ఉన్నారు. బ్రాహ్మణులూ అమాత్యులూ సేనానాయకులూ మీ రాక ఎదురుచూస్తూ ఉన్నారు. మీరు ఇకను లేవవలెను" అన్నాడు.

"ఓ సుమంత్రుడా, నేను నిద్రపోనేలేదు. రాత్రి అంతా మేలుకొనే ఉన్నాను. రామున్ని ఇక్కడికి తీసుకొని రమ్మని కైక నీతో చెప్పింది. అది నా ఆజ్ఞ. నీవు ఎందుకు ఆ ఆజ్ఞను పాటించలేదు? నీవు వెంటనే పోయి రామున్ని ఇక్కడికి తీసుకొని రావలెను" అన్నాడు దశరథమహారాజు.

ఈ మాటలకు సుమంత్రుడు రామ యువరాజ్యాభిషేకము తప్పకుండా అవుతుంది అనుకొంటూ వెలుపలికి వచ్చినాడు. వరూధినీ (పైన కప్పు ఉన్న)

రథము ఎక్కినాడు. శరత్కాల మేఘము మాదిరిగా కనుపించే రామభవనానికి అభిముఖముగా అమిత సంతోషముతో తన రథాన్ని పోనిచ్చినాడు. రామాభిషేకాన్ని గురించి జనసమూహాలు చెప్పుకొంటూ ఉన్న ముచ్చట్లు వింటూనూ శోభాయమానముగా ఉన్న పతాకలనూ ధ్వజాలనూ చూస్తూనూ రాజవీధిలో సుమంత్రుడు పోయినాడు. అతడు రాముణ్ణి తీసుకొని రావడానికి పోతున్నాడు అని ప్రజలు అందరూ సంతోషముతో ఉప్పొంగిపోయినారు.

అనేక గ్రామాలనుంచి కోట్లకొద్దీ గ్రామీణులు వాహనాల మీద వచ్చి వారివారి వాహనాలు దిగి రామభవన ద్వారముదగ్గర చేతులు జోడించి కానుకలతో రాముణ్ణి చూడడానికి కని పెట్టుకొని ఉన్నారు, పౌరులున్నూ మహోత్సాహముతో కానుకలు తీసుకొనివచ్చి చేతులుకట్టుకొని రామదర్శన కుతూహలముతో నిలుచుని ఉన్నారు. వారు అందరూ రామాభిషేకపు ఏర్పాట్లను గురించీ రామాభిషేకమువల్ల సంప్రాప్తము అయ్యే లోకాభ్యుదయాన్ని గురించీ చెప్పుకొంటూ ఉన్నారు. వారిని అందరినీ చూస్తు వారి ముచ్చట్లు వింటూ సుమంత్రుడు రథముతో మేరుపర్వత గుహవంటి రామభవనములోకి పోయినాడు.

రామభవనము తెల్లగా కైలాసపర్వతమువలెనూ ఎంతో ఎత్తున మేరువు పర్వతమువలెనూ చందనాగరు ఘుమఘుమలతో దర్దురపర్వతమువలెనూ సర్వ సంపన్నము అయిన కుబేరభవనమువలెనూ వైభవోపేతము అయిన దేవేంద్రసదనమువలెనూ ఉంది. ఆ భవన బహిర్ద్వారము ఎంతో ఎత్తుఅయింది. ద్వారబంధాలకు రత్నాలూ పగడాలూ పొదిగిఉన్నవి. బంగారు పూలదండలు తోరణాలుగా వ్రేళ్లాడ కట్టిఉన్నవి, ఆ తోరణాలలో మధ్య మధ్య ఉన్న ముత్యాలసరులు శరత్కాలచంద్ర కాంతులవలె వనోజ్జ్వలముగానూ రత్నాలసరులు మధ్యాహ్న సూర్యకిరణాలవలె కన్నులు మిరుమిట్లు కొలుపుతూనూ ఉన్నవి. ఆ భవనశిఖరాలమీద బంగారు విగ్రహాలు తళతళలాడుతూ ఉన్నవి. లోపల ఎక్కడికి అక్కడ చక్కని అరుగులు ఒకతూరు ఉన్నవి. గోడలమీదనూ స్తంభాలమీదనూ చిత్రకారులు అతి నిపుణముగా చిత్రించిన తోడేళ్లు మొదలుఅయిన జంతువుల బొమ్మలు చిత్రవిచిత్రముగా కనిపిస్తున్నవి. ద్వారబంధాలమీదనూ తలుపుల మీదనూ వజ్రాంగులు అతిరమణీయముగా చెక్కిన పూలూ లతలూ కన్నులకు ఇంపుకొలుపుతూ ఉన్నవి. సారసపక్షులు కర్ణపేయముగా పాటలు పాడుతూ

ఉన్నవి. నెమళ్ళు నేత్రపర్వముగా నాట్యము ఆడుతూ ఉన్నవి. లోపలికి వచ్చే వారికి రకరకాల పక్షులూ కూహూనాదాలతో మనోహరముగా స్వాగతము చెప్పుతూ ఉన్నవి. జింకలూ మొదలయిన పెంపుడుజంతువులు అంతటా నిర్భయముగా పరుగులెత్తుతూ ఉన్నవి. పొట్టి పొట్టి దాసీలూ బక్కపలచని పొడుగాటి దాసీలూ వారి వారి పనులు చక్కపెట్టుతూ ఉన్నారు. ఆయా కక్ష్యలు దేవతాగృహాలవలె కనిపించినవి.

సుమంత్రుడు రథముతో మూడు కక్ష్యలు దాటిపోయినాడు. రామాజ్ఞలను శిరసావహించే యువజనులు బారులుతీరి అక్కడ నిలుచుని ఉన్నారు. చక్కగా అలంకరించుకొని గుర్రాలమీదనూ ఏనుగులమీదనూ రథాలమీదనూ వందలకొద్దీ వచ్చిన రాజవల్లభులనూ అమాత్యులనూ అక్కడ చూచినాడు. సుమంత్రుడు రథము దిగి వారిని అందరినీ అభినందించినాడు. సంతోషముతో ఉప్పొంగిపోయినాడు. అక్కడ ఆ అంతఃపురద్వారము ఎదుట నల్లటి మేఘమువలెనూ పెద్ద కొండవలెనూ మహోన్నతకాయముతో అంకుశానికి లొంగకుండా అప్రసహ్యపరాక్రమములో పరుగులుతీసే శత్రుంజయము అనే అందము అయిన పదపు ఏనుగు రాముణ్ణి ఎక్కించుకొని పోవడానికి సిద్ధముగా ఉంది. సుమంత్రుడు ఆ ఏనుగును చూచినాడు. అతనికి రోమాంచము అయింది.

కదలకుండా ఉన్న శరత్కాలమేఘమువలెనూ ధగధగలాడే మేరుపర్వతశిఖరమువలెనూ ఉన్న రాముడి ఏడు అంతస్తుల అంతఃపురములోకి ఏ అడ్డూ లేకుండా మహానదీగర్భములోకి పోయే మొసలిమాదిరిగా సుమంత్రుడు పోయినాడు.

౧౬

ఆ అంతఃపురద్వారములో నుంచి సుమంత్రుడు లోపలికి పోయినాడు. ఆ కక్ష్యలో జనసమ్మర్దము ఏమీ లేదు. రామానురక్తులు అయిన యువకులు ఉజ్జ్వల కుండలకాంతులతో తేజరిల్లుతూ కత్తులూ బల్లెములూ పట్టుకొని ఏమరుపాటు లేకుండా ఏకాగ్రచిత్తముతో అక్కడ కావలి కాస్తున్నారు. వారిని చూచినాడు. చేతులలో బెత్తాలు పట్టుకొని దాసదాసీ జనాన్ని అజమాయిషీ చేసే ద్వారాధ్యక్షవృద్ధులను కాషాయవస్త్రధారులనూ చూచినాడు. వారు —

ఆ ద్వారపాలకులు అందరూ సుమంత్రుణ్ణి మాచీ చూడడముతో లేచి నిలుచుని ఆయనకు నమస్కారము చేసినారు.

సుమంత్రుడు సరసుడు. ఏ అంతఃపురములోకి అయినా యథేష్టముగా పోయే అధికారము ఆయనకు ఉన్నప్పటికిన్ని తాను వచ్చి కనిపెట్టుకొని ఉన్నట్టు రాముడికి తెలియచేయమని ఆయన ఆ ద్వారపాలకులతో చెప్పినాడు. వారు వెంటనే లోపలికి పోయి భార్యాసహితముగా ఉన్న రామునితో సుమంత్రుడు వచ్చి దర్శనము కోసము వాకిట కనిపెట్టుకొని ఉన్నాడు అని చెప్పినారు.

సుమంత్రుడు తన తండ్రికి అంతరంగికుడు అయినందువల్లనూ తనకు ఆయనతో ఎంతో చనవు ఉన్నందువల్లనూ తాను భార్యాసమేతముగా ఉన్నప్పటికిన్ని ఆ ఏకాంతగృహములోకి ఆయనను వెంటనే పంపించవలసింది అని రాముడు ఆ ద్వారపాలకులతో చెప్పినాడు.

రాముడు కుబేరుడువలె చక్కని అలంకారాలతో తెల్లటి దుప్పటి కప్పిన బంగారుపాన్పుమీద కూర్చుని ఉన్నాడు. అతని దేహానికి పూసిన రక్తచందనము వరాహరక్తమువలె కన్నులు చెదిరిపోయేట్టు కనిపిస్తూ ఘుమఘుమ వాసనలు విరచిమ్ముతూ ఉంది. సరసను సీతాదేవి అతనికి వింజామర వీస్తూ ఉంది. అతడు అప్పుడు చిత్తానక్షత్రములో చంద్రుడివలె కనిపించినాడు.

ఆ శత్రుసంహారకుణ్ణి సుమంత్రుడు చూచినాడు. నిజదేహకాంతులతో బాలభాస్కరుడివలె తేజరిల్లుతూ ఉన్న ఆ తేజోవంతుడికి నమస్కారము చేసినాడు. చనవుతో విహారశయనాదుల కుశలము అడిగి "ప్రభూ, తమ అంతటి పుత్రుణ్ణి కన్న కౌసల్యాదేవి మహా ధన్యురాలు. ఇప్పుడు కైకేయీదేవీ మీ నాయనగారూ మిమ్ములను వెంటనే తీసుకొని రమ్మని నన్ను ఇక్కడికి పంపించినారు. మీరు వెంటనే బయలుదేరవలెను" అన్నాడు సుమంత్రుడు.

ఆ ద్యుతిమంతుడు సుమంత్రుణ్ణి సంభావించి సీతాదేవిని చూస్తూ "దేవీ, మా నాయనగారూ కైకేయీదేవీ నా రాజ్యాభిషేకాన్ని గురించే తప్పకుండా ఆలోచించి ఉంటారు. కైకేయీదేవి సమర్థురాలు. మాతండ్రిగారి అభిప్రాయము తెలుసుకొని ఏ ఆలస్యమూ లేకుండా వెంటనే నాకు రాజ్యాభిషేకము చేయవలసింది అని ఆయనను ఆమె ప్రోత్సహించి ఉంటుంది. ఆమె కేకయ రాజ

పుత్రి. భర్తృనువర్తిని. మా తండ్రిగారిని ఆమె ఎప్పుడూ సంతోషపెట్టుతూ ఉంటుంది. నా హితమే కోరుతూ ఉంటుంది. నా శుభ దశాన్నే కాంక్షిస్తూ ఉంటుంది. ఆమె సంతోషముతో నా ప్రయోజనాన్నే మా తండ్రిగారికి తెలియ చెప్పి ఉంటుంది. అందువల్లనే వారు ఉభయులున్నూ నా మేలు కోరే ఈ సుమంత్రుణ్ణి ఇక్కడికి దూతగా పంపించినారు. ఇది నా భాగ్యము. పరిషత్తుకు తగిన మాటనే ఎప్పుడూ పంపిస్తూ ఉంటారు. సంతోషము. దశరథ మహారాజు ఈనాడే నాకు రాజ్యాభిషేకము చేస్తాడు. దేవీ, నేను పోయి కైకేయీదేవినీ మా నాయనగారినీ చూచి మాట్లాడి వెంటనే వస్తాను. నేను వచ్చేవరకూ నీవు ఇక్కడనే నీ పరిజనముతో సంతోషముగా కాలక్షేపము చేస్తూ ఉండు" అంటూ సంతోషాతిశయముతో ఆమె మెడలో పూలదండ వేసినాడు. ఆమెను సంతోషపెట్టినాడు.

సీతాదేవి భర్తకు శుభము చేకూరవలెను అని భగవంతుణ్ణి ధ్యానము చేసి అతని వెంట వాకిలివరకూ పోయి "ప్రభూ, బ్రాహ్మణులు చెప్పినట్లుగా ఇప్పుడు మీకు మీ తండ్రిగారు యువరాజ్యాభిషేకమూ దేవేంద్రునికి బ్రహ్మదేవుడు చేసినట్లుగా కాలాంతరములో మహారాజ్యాభిషేకమూ చేయవలెను. అప్పుడు మీరు పరిశుద్ధులు అయి నియమబద్ధులు అయి రాజసూయ యాగ దీక్షతో కృష్ణాజినధారులు అయి కురంగశృంగము చేతిలో పట్టుకొన్నప్పుడు మిమ్ములను చూచి పూజించవలెను అనుకొంటున్నాను. ప్రభూ, ఇప్పుడు మిమ్ములను తూర్పు దిక్కున దేవేంద్రుడూ దక్షిణ దిక్కున యముడూ పడమటి దిక్కున వరుణుడూ ఉత్తరదిక్కున కుబేరుడూ కాపాడవలెను అని ప్రార్థిస్తున్నాను" అన్నది.

రాముడు ఆమెను అక్కడ ఆగిపొమ్మని చెప్పి ఉత్సవార్థము అవసరము అయిన మంగళాలంకారాలు అన్నీ చేసుకొని గిరిగుహలో నివసించే సింహము దిగివచ్చినట్లుగా తన ఏకాంతగృహములో నుంచి వెలుపలికి వచ్చినాడు. అతని వెనుక సుమంత్రుడు వచ్చినాడు. వాకిటిలో చేతులు జోడించి కనిపెట్టుకొని ఉన్న లక్ష్మణుడు వారిని వెంబడించినాడు. వారు ముగ్గురూ మధ్యకక్ష్యలోకి పోయినారు. స్నేహితులనూ అభిషేకము చూడవచ్చిన అశేషజనాన్ని రాముడు చూచినాడు. వారిని అందరినీ అభినందించినాడు.

బంగారు మలామా చేసి మణులు తాపటము చేసిన వెండిరథము మిట్ట మధ్యాహ్న సూర్యుని కిరణమువలె కన్నులు మిరుమిట్లు కొలుపుతూ రాముడి కోసము అక్కడ సిద్ధముగా ఉంది. ఆ విశాలము అయిన రథానికి ఏనుగు పిల్లల వంటిగుర్రాలు కట్టినారు. అందులో అగ్నిహోత్రమువలె ధగధగలాడే పులితోలు పరచినారు. దివ్యరథము ఎక్కి పోయే దేవేంద్రుడివలె రాముడు ఆ రథము ఎక్కినాడు. లక్ష్మణుడు అతనికి ఎండ తగలకుండా ఒక చేతితో ఛత్రము పట్టుకొన్నాడు. రెండవ చేతితో వింజామర వీస్తూ వెనక కూర్చున్నాడు. ఆ రథము తోలడానికి సుమంత్రుండు ముందు కూర్చున్నాడు. పగ్గాలు వదలినాడు. ఆకాశములో పర్జన్యుడివలె మహా గంభీరధ్వనులు చేస్తూనూ మహేంద్రపర్వతము మీది నుంచి బయలుదేరే నిండుచంద్రుడి రూపముతోనూ ఆ రథము రామమందిరములో నుంచి బయటికి వచ్చింది.

శూరులు సింహనాదము చేసినారు. వందిమాగధులు మంగళగానము ఆరంభించినారు. వివిధ వాద్యధ్వనులూ మిన్ను అంటినవి. జనసమూహములో నుంచి జయజయ ధ్వనులు చెలరేగినవి. కవచాలు తొడుగుకొని ఖడ్గాలూ కార్ముకాలూ పట్టుకొన్న యోధులూ చందనాగరు గంధచర్చలతో దేహాలు తళతళలాడుతూ ఉన్న శూరులూ కోలాహలధ్వనులతో ఆ రథము ముందు నడచినారు. పెద్ద పెద్ద గుర్రాలమీదనూ కొండలు అంత ఏనుగులమీదనూ చక్కని రథాలమీదనూ రాజవల్లభులూ పౌరముఖ్యులూ ఆ రథము వెనుక సాగినారు.

చక్కగా సింగారించుకొన్న ఉత్తమాంగనలు మేడల కిటికీలలో నుంచి ఆ వెండిరథములో పోతూ ఉన్న రాముడిమీద పూలవాన కురిపించినారు. మరి కొందరు పుణ్యాంగనలు ఆరథానికి ఎదురుగుండా పోయి "ఓ కౌసల్యానందనా, నీవు ధన్యుడవు. మీ అమ్మ ఇప్పుడు ఎంత సంతోషిస్తూ ఉందో. ఈ నీయాత్ర సఫలము అవుతుంది. నీవు యువరాజ్యాభిషేకము చేసుకొని ఊరేగుతూ రావలెను. మేము అందరమూ చూచి సంతోషిస్తాము. ఓ రామా, నీహృదయప్రియ అయిన సీతాదేవి సర్వసీమంతినులకన్నా మేలుబంతి. ఆమె ఎంత తపస్సు చేసిందో - రోహిణికి చంద్రుడివలె ఆమెకు నీవు దొరికినావు. నీకు జయము అవుతుంది" అని ఆశీర్వదించినారు.

ఈ మాటలు రాముడు విన్నాడు. ఆ వెండి రథము రాజవీథిలోకి పోయింది.

౧౭

ఆ రాజవీథి పతాకధ్వజాలతో శోభిస్తూ చందనాగరు ధూప వాసనలతో ఘుమఘుమలాడుతూ నానాదేశాలనుంచీ వచ్చిన జనసమూహాలతో కిటకిటలాడుతూ ఉంది. రాముడి రథము అక్కడికి వచ్చింది. ఆ రాజవీథిలో ఇరువైపులా తెల్లటి మేఘాలవలె శోభాయమానముగా ఉన్న ప్రాసాదాలనూ వివిధవస్తువులూ అమ్మే అంగళ్లనూ ఆయా అంగళ్లలో రాసులు రాసులుగా ఉన్న పట్టుబట్టలనూ రంగురంగుల నూలుబట్టలనూ బెజ్జము వేయని ముత్యాలనూ కన్నులు మిరుమిట్లుకొలిపే స్ఫటికాలనూ రత్నాలనూ శ్రేష్ఠము అయిన పరిమళ ద్రవ్యాలనూ రుచ్యము అయిన భక్ష్యాలనూ ఇంకా వివిధవస్తువులనూ చూస్తూనూ చత్వరాలలో నిత్యపూజార్థము ఉంచిన పెరుగూ పేలాలూ అక్షతలూ హావిస్సులూ చందనాగరు పరిమళ ద్రవ్యాలూ ఘుమఘుమ వాసనలు గుభాళించే పూలదండలూ మొదలు అయిన వాటిని చూస్తూనూ బ్రాహ్మణోత్తముల మహదాశీర్వాదాలు వింటూనూ రాముడు రథములో సాగిపోయినాడు

దేవరాజవీథి వంటి ఆ రాజవీథిలో అప్పుడు జానపదులు "రాజానుగ్రహము వల్ల రాముడు రాజు కాబోతున్నాడు. మన కోరికలు అన్నీ ఈడేరుతవి. ఇక మన రాజ్యములో ఎవరికీ ఏ కొంచెము కష్టమూ ఏ కొంచెము దిగులూ ఉండదు. మనము అందరమూ ఎంతో అదృష్టవంతులము" అంటూ చెప్పుకోవడము మొదలు పెట్టినారు.

పౌరముఖ్యులూ రాముడి సుహృజ్జనులూ ఆ రథానికి ఎదురుగుండా పోయి "రామా, నీకు ఇప్పుడు రాజ్యాభిషేకము అవుతుంది. నీవు నీ తాత ముత్తాతల కన్నా మిన్నగా సుఖపడవలెను. నీ తండ్రికన్నా నీ తాతలకన్నా నీవు మమ్ములను ఎక్కువగా సుఖపెట్టవలెను. సంతోషపెట్టవలెను. మాకు ఇప్పుడు ఏ విషయమూ పట్టలేదు. అన్నముతో అయినా నిమిత్తము లేదు. నీవు రాజ్యాభిషేకము చేసుకొని ఊరేగుతూ వస్తూ ఉంటే మేము చూడవలెను. మాకు ఇప్పుడు కావలసింది ఇదే. నీ రాజ్యాభిషేకముకన్నా మమ్ములను సంతోషపెట్టే మహోత్సవము మరి ఒకటి లేదు" అని చెప్పినారు.

ఈ మాటలూ ఈ పొగడ్తలూ రాముడు విన్నాడు. అతడు ఉబ్బి తబ్బిబ్బులు అయిపోలేదు. ఉదాసీనుడుగా ఊరకుండ లేదు. వారి వారి యోగ్యతలను పట్టి అంజలి ఘటిస్తూనూ రక్షణోక్తులు పలుకుతూనూ భ్రూవిక్షేపాదులతో ఆదరిస్తూనూ అందరినీ సంతోషపెట్టుతూ ఆ రథములో సాగిపోయినాడు.

రాముడి రథము కనుచూపు మేర దాటి పోయినప్పటికిన్నీ అందరి మనోనేత్రాలలోనూ రాముడి విగ్రహమే మెలగుతూ ఉంది. ఆ కోసల రాజ్యములో రాముణ్ణి ఎరగనివాడు కానీ రాముడు ఎరగనివాడు కానీ ఒక్కడూ లేడు. రాముడు అందరినీ పలుకరించి మాట్లాడేవాడు. వారి వారి యోగ్యతలను పట్టి అందరినీ ఆదరించేవాడు; గౌరవించేవాడు; సంతోషపెట్టేవాడు. అందువల్ల వర్ణభేదమూ వయోభేదమూ లేకుండా అందరూ అతనికి ఒక్క మాదిరిగా భక్తులు అయినారు.

ఆ రాజవీథిలో చతుష్పథాలకూ దేవపథాలకూ చైత్యాలకూ సభాభవనాలకూ రాముడి రథము ప్రదక్షిణముగా పోయి రత్నాల రాసులతో అలంకరించిన రాజగృహాలవలెనూ ఆకాశాన్ని అడ్డగించే దేవతల విమాన గృహాలవలెనూ మహోన్నత ప్రసాద శృంగాలతో కైలాస పర్వత శిఖరాలవలెనూ ఉన్న వర్ధమానము అనే దశరథమహారాజు దివ్యభవనములోకి పోయింది. ధనుర్ధరులు కావలి కాస్తూ ఉన్న మూడు కక్ష్యలూ రథము దాటి పోయింది. రాముడు అక్కడ ఆ రథము దిగినాడు. మరి రెండు కక్ష్యలు పాదచారుడు అయి పోతూ తన వెంట వస్తూ ఉన్న సుహృజ్జనాన్నీ జనసమూహాన్నీ అక్కడ ఆగి పొమ్మని చెప్పినాడు.

అంతట రాముడు ఒంటరిగా ఆ అంతఃపురములోనికి పోయినాడు.

చంద్రోదయాన్ని ఎదురు చూచే మహాసముద్రమువలె మహాజన సమూహము రాముడి పునరాగమనాన్ని ఎదురు చూస్తూ అక్కడ నిలిచిపోయింది.

౧౮

అక్కడ కైకేయీదేవి నిలుచుని ఉంది. దశరథమహారాజు పాన్పుమీద పడుకొని ఉన్నాడు. ఆయన ముఖము కళాకాంతులు లేకుండా వాడిపోయి ఉంది. దీనుడుగా కనిపించినాడు. రాముడు వినయవిధేయతలతో ఆయనకు

సాష్టాంగ నమస్కారము చేసినాడు. ఆ తరువాత జాగరూకతతో కైకేయీ దేవి పాదాలకు నమస్కారము చేసినాడు.

దశరథమహారాజు "రామా" అని సంబోధించినాడు. ఆయన కన్నులలో నీళ్లు కమ్ముకొన్నవి. బొటబొట నీళ్ళు కారినవి. కన్నులు తెరవలేక పోయినాడు. మాట్లాడలేక పోయినాడు. ఎంత ప్రయత్నము చేసినా ఆయన నోట మాట పెగలేదు. అటువంటి భయావహ రూపముతో దశరథమహారాజు ఉండడము రాముడు అదివరకు ఎన్నడూ చూడలేదు. ఎన్నడూ దేనికీ భయపడి ఎరగని రాముడు అప్పుడు పామును తొక్కిన వాడివలె భయపడి పోయినాడు.

దశరథమహారాజు నిట్టూర్పులు విడుస్తూనూ దుఃఖముతో కంపించి పోతూనూ రాహుగ్రస్తము అవుతున్న సూర్యబింబమువలె దేహము అంతా కుంచించుకొని పోతూనూ కాంతులు మాసిపోతూనూ ఎన్నడూ ఇంకిపోని మహా సముద్రము ఇంకిపోతున్నట్లూనూ అబద్ధాలు ఆడిన మహర్షి వలె వెలా తెలా పోతూనూ కనిపించినాడు. ఊహించడానికి అయినా అలవికాని ఆ ఘోర రూపము ఆ భయావహ రూపము రాముడు చూచినాడు. పర్వకాలములో సముద్రమువలె అతని హృదయము అల్లకల్లోలము అయిపోయింది. చిత్తాన్ని చిక్కపట్టి ఆలోచిస్తూ "ఇది ఏమిటి? నాయనగారూ నన్ను అభినందించడానికి బదులు ఎంతో ఘోరముగా దుఃఖపడుతున్నారు. భయపడుతున్నారు! ఇది వరకు ఎంత కోపముతో ఉన్నా నన్ను చూడగానే ప్రసన్నులు అయ్యేవారు. అటువంటివారు ఇప్పుడు నన్ను చూడగనే దుఃఖపడుతున్నారు. కారణము ఏమి అయి ఉంటుంది?" అని అతడు ప్రశ్నించుకొన్నాడు. కారణము ఊహించలేకపోయినాడు. ధైర్యము కోల్పోయినాడు. విషణ్ణుడు అయినాడు. శోకార్తుడు అయిపోయినాడు. కైకేయీదేవిని చూచి చేతులు జోడించి "అమ్మా, అజ్ఞానము వల్ల నేను ఏమి అయినా అపరాధము చేసినానా? నాయనగారికి ఇప్పుడు ఇంత కోపము ఎందుకు వచ్చింది? కారణము ఏమిటి? అమ్మా, నీవు వారి కోపము పోగొట్టవలెను.

"అమ్మా, నాయనగారికి నేను అంటే ఎంతో వాత్సల్యము. ఇప్పుడు నన్ను చూచి వారు విషణ్ణులు అయినారు. వారి ముఖము వివర్ణము అయిపో

యింది. దుఃఖపడుతున్నారు. నన్ను పలుకరించనైనా పలుకరించ లేకుండా ఉన్నారు. ఎందువల్ల? అమ్మా, నాయనగారికి ఒంట్లో బాగాలేదా? మనస్సులో బాగా లేదా? ఎప్పుడూ ఎవరూ ఆధి వ్యాధులు లేకుండా ఒక్కమాదిరిగా ఉండరుకదా? భరత శత్రుఘ్నులు సుఖముగా ఉన్నారుకదా? కౌసల్యా సుమిత్రలు ఏ అమంగళమూ లేకుండా హాయిగానే ఉన్నారు. అమ్మా, నాయనగారు ఎందుకు ఇట్లా ఉన్నారు?

“ఓ తల్లీ, నాయనగారిని సంతోష పెట్టకుండానూ వారు చెప్పినఏపని అయినా చేయకుండానూ నేను ఉండలేను. వారికి కోపమే వస్తే ఒక్క క్షణము అయినా నేను బ్రతికిఉండలేను. ఈ లోకములో ఎవరి జన్మకు అయినా తండ్రే మూలకారణము. అందువల్ల ఎవరికి అయినా తండ్రే ప్రత్యక్షదైవము.

“అమ్మా, నీవు స్వాభిమానమువల్ల వారిని ఏమిఅయినా పరుషముగా అన్నావా? అందువల్ల వారి మనస్సుకు ఏది అయినా కష్టము వేసిందా? తల్లీ, నాకు చెప్పు. యథార్థము చెప్పు. ఇదివరకు వారు ఎన్నడూ ఇంత వికృతముగా ఉండడము నేను ఎరుగను. ఎందుకు వారు ఇప్పుడు ఇట్లా ఉన్నారో చెప్ప వలెను” అన్నాడు రాముడు.

భర్తకు మరింత కష్టము వేస్తుంది అనే జంకూ గొంకూ అయినా లేకుండా కైకేయీదేవి “రామా, మీ నాయనగారికి కోపమూ లేదు, దిగులూ లేదు. నీవు ఏమి అంటావో అని వారి మనోగతాన్ని వారు నీతో స్వయముగా చెప్పలేక బాధపడుతున్నారు. నీవు వారి ప్రియపుత్రుడవు. నీతో అప్రియము చెప్పడానికి వారికి నోరు ఆడడములేదు.

“రామా, మీ నాయనగారు పూర్వము ఒకప్పుడు నన్ను మెచ్చుకొని నాకు రెండు వరాలు ఇచ్చినారు. ఆవరాలు చెల్లిస్తాను అని ప్రమాణముకూడా చేసినారు. అట్లా వరాలు ఇచ్చినందుకూ అవి చెల్లిస్తాము అన్నందుకూ ఇప్పుడు పామరుడివలె విచారపడుతున్నారు. గతజల సేతుబంధనముచేయడము ఎట్లాగా అని ఆలోచిస్తున్నారు. రామా, నాయనా, సత్యమే ధర్మానికి మూలము అని పెద్దలు చెప్పుతూ ఉంటారు. ఈ సంగతి నీకూ తెలుసు. నీనుంచి మీ నాయన గారికి ఇప్పుడు నామీద కోపము వచ్చింది. ధర్మహాని చేయడానికి సిద్ధము

అయినారు. వారు ధర్మహాని చేయకుండా నీవు వారిని కాపాడవలెను. వారు ఒప్పుకొన్నది - వారు ప్రమాణము చేసినది నీకు కీడు అయినా మేలు అయినా నీవు శిరసా వహిస్తాను అనేట్లయితే ఆ విషయము అంతా నేనే చెప్పుతాను. తాము చెప్పితే విఫలము అయిపోతుందేమో అనుకొని వారు నీతో ముఖాముఖి చెప్పలేకుండా ఉన్నారు. వారి శపథము సఫలము చేస్తాను అని నీవు శపథము చేసేట్టయితే నేనే చెప్పుతాను'' అన్నది.

రాముడు మనోవ్యథతో "అయ్యో, ఎంత అన్యాయము! అమ్మా, నన్ను శంకిస్తున్నావా? నేను బ్రతికిఉండి ప్రయోజనము ఏమిటి? నాయనగారి కోసము నన్ను నిప్పులలో దూకమన్నా దూకుతాను. విషము త్రాగమన్నా త్రాగివేస్తాను. సముద్రములో పడమన్నా పడిపోతాను. దశరథమహారాజు నాకు తండ్రి; ఆచార్యుడు; రాజు. ఆయన ఏమి చెప్పినా నేను చేయవలెను; చేస్తాను. అమ్మా, ఈ రాముడు రెండుమాటల వాడు కాడు. ఆడి తప్పడు. అమ్మా, మా నాయనగారి అభిమతము ఏమిటో చెప్పు. నేను తప్పక చేస్తాను'' అన్నాడు.

అందుకు కైకేయి "రామా, పూర్వము దేవాసుర యుద్ధములో మీ తండ్రి బాణోపహతుడు అయి బాధపడుతూ ఉంటే నేను రెండు మార్లు ఆయనను కాపాడినాను. అప్పుడు మీ తండ్రిగారు నన్ను మెచ్చుకొని రెండు వరాలు కోరుకోమన్నారు. ఆ రెండు వరాలకుగాను ఇప్పుడు నేను భరతుడికి పట్టము కట్టమనీ, నిన్ను దండకారణ్యము పంపించి పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేయించమనీ కోరినాను. నీ అభిషేకసంభారాలతోనే భరతుడికి రాజ్యాభిషేకము చేయవలెను అని కూడా చెప్పినాను. నీ తండ్రి సత్యవ్రతుడు అనీ నీవు సత్యవ్రతుడవు అనీ ఋజువుచేయ తలచుకొన్నట్లయితే నీవు ఇప్పుడే జటాజినాలు ధరించి దండకారణ్యానికి పోవలెను. అక్కడ పధ్నాలు సంవత్సరాలు నీవు నివసించవలెను. నీ తండ్రి దయాహృదయుడు అయినందువల్ల నిన్ను చూచి నీవు ఏమి అంటావో అని దుఃఖపడుతున్నాడు.

"రామా, మీ నాయనగారు నాకు చేసిన వాగ్దానాన్ని నీవు చెల్లించేట్లయితేనే ఆయన తరిస్తాడు. ఆయనకు ధర్మహాని ఉండదు'' అని చెప్పింది.

ఈ మాటలు విన్న రాముడు చలించలేదు, దుఃఖపడలేదు.

దశరథమహారాజు మాత్రము శోకాగ్నితో తాపము ఎత్తి తల్లడిల్లి పోయినాడు.

౧౮

కైకేయీదేవి రాముడితో చెప్పింది చావుతో సరిసమానము అయిన మాటే. అయితే అతడు కొంచెము అయినా దిగులు పడలేదు. అచలముగా "అమ్మా, నీవు అనుకొన్నట్లే కానివ్వు. నేను మా నాయనగారి శపథము శిరసా వహించి వనవాసము చేస్తాను. మా నాయనగారు దుర్ధర్షులు, అరిందములు. అయితే ఎందువల్లనో మరి వారు ఇప్పుడు ఎప్పటి మాదిరిగా నన్ను ఆదరించి నాతో మాట్లాడడము లేదు. కారణము ఏమిటో నీవు చెప్పవలెను. అమ్మా, నీకు కోపము వద్దు. నీవు దిగులుపడ నక్కర లేదు. నీ ఎదుటనే ఇప్పుడే నేను జటాజినాలు ధరించి వనవాసము చేయడానికి ఇటునుంచే ప్రయాణము అయిపోతాను. నీవు సంతోషముగా ఉండు.

"అమ్మా, దశరథమహారాజు ఎప్పుడూ నా మేలు కోరే మహానుభావులు ఎవరు ఏ కొంచెము మేలు చేసినా ఆయన మరచిపోరు. వారు నాకు ఆచార్యులు. అంతే కాదు. వారు నా జనకులు. వారిని సంతోషపెట్టడమే నా ముఖ్యధర్మము వారు ఏమి ఆజ్ఞాపించినా నేను నిర్విశంకముగా శిరసా వహిస్తాను. నిర్వహిస్తాను. నా స్వభావము వారు ఎరుగుదురు. అయితే వారు భరతుడికి రాజ్యాభిషేకము చేయతలచినట్టు నాతో స్వయముగా ఎందుకు చెప్పలేదు అనే విషయము ఒక్కటే నా హృదయాన్ని దహించివేస్తూ ఉంది. అమ్మా, నేను ఒకరి చేత చెప్పించుకోకుండానే, భరతుడు కావలెను అంటే ఏది అయినా ఇస్తాను. ధనము ఇస్తాను. రాజ్యము ఇస్తాను నా ప్రాణము అయినా ఇస్తాను. వాడు నా తమ్ముడు. వాడూ నేనూ అనే భేదము నాకు లేదు. ఇటువంటి స్థితిగతులలో మా నాయనగారి ఆజ్ఞ అని నీవు చెప్పుతున్నావు. నీవు సంతోషముగా కోరుకొన్న కోరిక అని అంటున్నావు. నీవు చెప్పినట్టు చేస్తాను అని నేను ప్రమాణము చేసినాను. ఇక నేను రాజ్యము భరతుడికి వదిలిపెట్టిపోయి వన, వాసము చేయడము ఒక అబ్బురమా! ఇంకా ఏమి అని చెప్పేది? అమ్మా నాయనగారు ఎందుకో నేలవంక చూస్తూ కన్నీళ్ళు కారుస్తున్నారు. వారు

ఎందుకు ఇంత దుఃఖపడుతున్నారో తెలియకుండా ఉంది. అమ్మా, వారిని ఇక నీవే ఊరడించవలెను.

"అమ్మా, భరతుణ్ణి తాతగారి ఇంటినుంచి రావించడానికి ఇప్పుడే రాజాజ్ఞతో దూతలను పంపించవలెను. వేగముగా పోయే గుర్రాలమీద వారు వెంటనే వెళ్ళిపోవలెను. ఆలస్యము ఎందుకు? నాయనగారు నాతో భరతాభిషేకాన్ని గురించి స్వయముగా చెప్పలేదు. అనే విచారము ఇక ఇప్పుడు నాకు లేదు. ఇటునుంచే నేను దండకారణ్యము వెళ్ళిపోతాను. నీవు చెప్పినట్టుగా పధ్నాలుగు సంవత్సరాలూ అక్కడ నివసిస్తాను" అన్నాడు రాముడు.

రాముడు ఈ విధముగా చెప్పినందువల్ల కైకేయీదేవికి సంతోషము వేసింది. అప్పటికి అప్పుడే అతనిని వనవాసానికి ప్రయాణము చేయించవలెను. అనుకొన్నది. "రామా నీవు చెప్పినట్టు భరతుణ్ణి తీసుకొని రావడానికి దూతలు ఇప్పుడే బయలుదేరి పోతారు. అయితే భరతుడు ఇక్కడికి వచ్చేటంతవరకున్నూ నీవు ఉండడము అనవసరము. నీవు ఎట్లాగూ వనవాసానికి పోనిశ్చయించుకొన్నావు కనుక కాలవిలంబనము చేయవద్దు.

"నాయనా, ఇది అంతా నీతో స్వయముగా చెప్పడానికి మీ నాయనగారికి మనస్కరించలేదు. అందువల్ల వారు సిగ్గుపడిపోయి నీతో మాట్లాడలేకుండా ఉన్నారు. మీ నాయనగారికి ఇంతకన్నా మరి ఏ దుఃఖమూ లేదు. నీవు ప్రయాణము అయిపోగానే వారి దిగులు అంతా వదిలిపోతుంది. నాయనా రామా, నీవు అయోధ్యానగరము వదిలిపెట్టి పోయేవరకూ మీ నాయనగారు స్నానము చేయరు. భోజనము చేయరు. అందువల్ల నీవు ఇప్పుడే ప్రయాణము అయిపోవడము మంచిది" అని కైకేయీదేవి చెప్పింది.

దశరథమహారాజు దుఃఖము పట్టలేక "ఛీ ఛీ" అంటూ ఆ బంగారు పాన్పుమీద పడిపోయినాడు. తక్షణమే రాముడు ఆయనకు ఉపచారాలు చేసి లేవనెత్తి కూర్చుండపెట్టినాడు. కాని కైకేయీదేవి చెప్పిన మాటలకు కొరడా దెబ్బ తిన్న గుర్రము మాదిరిగా అతని మనస్సు అడవులకు పరుగు ఎత్తసాగింది. ఆమె చెప్పినట్టు చేయడమే యోగ్యము అయిన పని అనుకొన్నాడు. అంతట అతనికి దశరథమహారాజును గురించిన విచారము అంతా వదిలిపోయింది.

కైకేయీ దేవితో "అమ్మా, నేను అర్థపరుణ్ణి కాను. లోకులను అందరినీ లోపరచుకొని రాజ్యము ఏలవలెను అనే కాంక్ష నాకు లేదు. ఋషివలె ఉండడమే నా కోరిక. నాకు కావలసింది కేవలము ధర్మము. పూజ్యపాదులు అయిన మా తండ్రిగారిని సంతోషపెట్టడానికి నేను ఏపని అయినా చేస్తాను. వారు చెప్పితే నాకు ప్రాణాంతకము అయిన పని అయినా చేస్తాను. పుత్రుడు అయిన వాడికి పితృసేవ చేయడము కన్నా పితృవాక్య పరిపాలనము కన్నా మహత్తరము అయిన ధర్మము మరి ఒకటి లేదు. అమ్మా, నాయనగారు నాతో వాచా చెప్పక పోయినా వారు ఆజ్ఞాపించినారు అని నీవు చెప్పినావు. చాలు నేను పధ్నాలుగు సంవత్సరాలూ వనవాసము చేస్తాను.

"అమ్మా, నీవు నాకు దేవతవంటిదానవు. నీవూ నన్ను ఆజ్ఞాపించవచ్చును. నీ ఆజ్ఞలనూ నేను నెరవేర్చవలెను. భరతుడికి పట్టము కట్టవలెను అనీ నేను వనవాసము చేయవలెను అనీ నీవు ఆజ్ఞాపించినా నేను అవశ్యమూ శిరసా వహించి ఉండేవాడనే. తల్లీ, ఈచిన్నవిషయము దశరథమహారాజును వరాలుగా యాచించినావా? ఇందువల్ల తల్లీ, నీవు నా స్వభావమూ నా గుణగుణాలూ నీ కొంచెమూ గుర్తించలేదు అనుకోవలసి వస్తున్నది. ఓ దేవీ. నేను ఇప్పుడు మా అమ్మ కౌసల్యాదేవికి వీడ్కోలు చెప్పి నా భార్య సీత దుఃఖపడేట్లయితే దానిని సమాధానపరచి ఈనాడే దండకారణ్యము ప్రయాణము అయిపోతాను. ఇంతకన్నా ఆలస్యము చేయను.

"అమ్మా, ఇక భరతుడు రాజ్యపాలనము చేస్తూ నాయనగారికి సేవచేస్తూ ఉండేట్టు చూడవలసిన భారము నీ మీద ఉంది. పితృసేవ చేయడము పుత్రుడికి సనాతన ధర్మము. అందువల్ల చెప్పుతున్నాను" అన్నాడు రాముడు.

కన్నీళ్ళు కారుస్తూ ఈ మాటలు అన్నీ వింటూ ఉన్న దశరథమహారాజు అంతవరకూ కంఠగతము అయి ఉన్న దుఃఖాన్ని అణచుకోలేక పోయినాడు. బావురు మన్నాడు.

రాముడు దశరథమహారాజు పాదాలకూ కైకేయీదేవి పాదాలకూ నమస్కారము చేసినాడు. వారికి ప్రదక్షిణము చేసినాడు. ఆ అంతఃపురములో నుంచి వెలుపలికి వచ్చినాడు. వాకిట నిలుచుని లోపల జరిగింది అంతా వింటూ

కన్నీళ్ళు కారుస్తూ పరమక్రుద్ధుడు అయిపోయిన లక్ష్మణుణ్ణి చూచినాడు. అక్కడ ఉన్న అభిషేక సంభారాలవంక కన్నెత్తి అయినా చూడకుండా. వాటికి ప్రదక్షిణముగా నడువ సాగినాడు.

రాముడికి రాజ్యము పోయింది. అడవులకు పోపోతున్నాడు. కాని చిమ్మ చీకట్లు కమ్ముకొన్నా చంద్రుడి కాంతి మాసిపోనట్లు అతని ముఖవికాసము ఏమాత్రమూ మాసిపోలేదు. మానావమానాలను లెక్క చేయని పరమయోగీంద్రుడివలె చిత్తవికారము ఏమీ లేకుండా అతడు అడుగులు వేయడము మొదలు పెట్టినాడు. శ్వేతచ్ఛత్రము వేయవద్దు అన్నాడు. వింజామరలు వీచవద్దు అన్నాడు. వెండి రథము అక్కరలేదు అన్నాడు. స్వజనులతోనూ పురజనుల తోనూ మాట్లాడకుండా, తన విపత్తికి తాను దుఃఖపడకపోయినా ఇతరులు దుఃఖపడుతారు అనే దుఃఖాన్ని మనసా నిగ్రహించి ఆ అప్రియవార్త తన తల్లికి స్వయముగా చెప్పడానికి కౌసల్యాదేవి అంతఃపురము వైపు నడువ సాగినాడు.

అలంకారాలు చేసుకొని అతని యువరాజ్యాభిషేకము చూడవచ్చిన స్నేహితులు ఎవరూ ఆ శ్రీమంతుడి ముఖములో ఆ సత్యసంధుడి ఆకారములో ఏ వికారమూ కనిపెట్టలేక పోయినారు. శరత్కాల చంద్రుడి సహజకాంతుల వలె రాముడి స్వాభావిక సంతోష కాంతులు ఏమాత్రమూ తరిగిపోలేదు. ఆ ధీరుడు ఆ మహాయశుడు మనోహరము అయిన మాటలతో సమస్తము అయిన వారినీ సంభావిస్తూ నడిచినాడు.

సౌజన్యాది గుణాలలో కానీ పరాక్రమములో కానీ రాముడికి తీసిపోని లక్ష్మణుడున్నూ దుఃఖాన్ని అణచుకొని అతని వెనకనే నడవసాగినాడు.

ఎంతో సంతోషముతో ఓలలాడుతూ ఉన్న కౌసల్యాదేవి మందిరము లోకి ఆ అన్నతమ్ములు అప్పుడు పోయినారు.

౨౦

కైకేయీదేవి అంతఃపురములో నుంచి రాముడు బయలుదేరగానే అంతః పురాంగనలు అందరూ పెద్దపెట్టున ఏడువ సాగినారు.

"అయ్యో ! రాముడు అడవులకు వెళ్ళిపోతాడా ! తండ్రి చెప్పినా చెప్పక పోయినా వాడు అందరికీ అన్ని పనులూ చేసిపెట్టుతూ ఉండేవాడు. చిన

ప్పటినుంచీ కౌసల్యాదేవికి మల్లే మనకు అందరికీ సేవ చేస్తూ ఉండేవాడు. వాడి మీద మనకు కోపము వచ్చినా వాడికి మనమీద కోపము వచ్చేది కాదు. మంచి మంచి మాటలు చెప్పి మన కోపము పోగొట్టేవాడు వాణ్ణి- అటువంటివాణ్ణి - రాముణ్ణి రాజు ఇప్పుడు తెలివితక్కువగా అడవులకు పొమ్మన్నాడు. వాడు లేకుండా మనము ఇక బ్రతకడము ఎట్లాగు" అంటూ దూడలు పోయిన ఆవుల మాదిరిగా అంతఃపురాంగనలు ఎలుగెత్తి ఏడువసాగినారు. రాజును నిందించడము మొదలు పెట్టినారు.

అసలే దుఃఖముతో కుమిలిపోతూ ఉన్న దశరథమహారాజు ఆ రోదన ధ్వనులూ ఆ నిందలూ విన్నాడు. ఆ పాన్పుమీదనే ఆయన మూర్ఛపోయినాడు.

కౌసల్యాదేవి అంతఃపురములోకి పోతున్న రాముడున్నూ ఆ ఆర్త నాదాలు విన్నాడు. మదపుటేనుగవలె నిట్టూర్పులు విడుస్తూ మనోనిగ్రహముతో ముందుకు నడచినాడు.

కౌసల్యాదేవి అంతఃపురద్వారము దగ్గర పరమపూజ్యుడూ వృద్ధుడూ అయిన ద్వారపాలకుణ్ణి అతని అనుచరులనూ చూచినాడు. రాముణ్ణి చూచీ చూడడముతో ఆ ద్వారపాలకులు అందరూ లేచి నిల్చుని "జయీభవ, విజయీభవ" అంటూ ఆశీర్వదించినారు.

రాముడు ఆ మందిరములో రెండవ కక్ష్యవరకూ పోయినాడు. ఎప్పుడూ దశరథమహారాజు సత్కరించే బ్రాహ్మణవృద్ధులను అక్కడ చూచినాడు. వారికి అందరికీ నమస్కారము చేసి మూడవ కక్ష్యలోకి పోయినాడు. అక్కడ ద్వార పాలికలుగా ఉన్న వృద్ధాంగనలనూ యువతులనూ చూచినాడు. వారు ఆ అన్న తమ్ములను ఆశీర్వదించి రాముడి రాక కౌసల్యాదేవికి తెలియజేయుడానికి లోపలికి పరుగెత్తినారు.

కౌసల్యాదేవి ఆ రాత్రి అంతా జాగారము చేసింది. తెల్లవారుతూండగా మహావిష్ణువును పుత్రాభ్యుదయము కోసము పూజచేసింది. సంతోషముగా బ్రాహ్మణులచేత హోమము చేయించడము మొదలు పెట్టింది. తెల్లని పట్టు చీరతో మంగళాలంకారాలతో ఉన్న ఆ వ్రతపరాయణను రాముడు చూచినాడు. దేవపూజార్థము అక్కడ ఉంచిన తెల్లటి పూలదండలూ పూర్ణకుంభాలూ అక్ష

తలూ నెయ్యీ పాలూ పెరుగూ పేలాలూ హవిస్సులూ భక్ష్యాలూ పాయసమూ నువ్వులూ బెల్లమూ సమిధలూ మొదలు అయిన వాటిని చూస్తూ ఆమెను సమీపించినాడు.

వ్రతనియమాలతో కృశించి పోయినప్పటికిన్నీ దివ్యకాంతులతో తేజరిల్లుతూ జలతర్పణము వదులుతున్న ఆ కౌసల్యా దేవి రాముణ్ణి చూచింది. వెంటనే లేచింది. ఎంతో సంతోష పడ్డది. తన పిల్లను చేరతీసుకొనపోయే పెంటి గుర్రమువలె ఆమె రాముడి దగ్గరకు గబగబా అడుగులు వేసింది. అతడు ఆమెకు సాష్టాంగ నమస్కారము చేసినాడు. ఆమె అతణ్ణి లేవనెత్తింది. రెండు చేతులా గట్టిగా కౌగలించుకొన్నది. శిరము ఆఘ్రాణించింది. సంతోషముతో "రామా నీ పూర్వీకులు అందరూ రాజర్షులు, పరమధర్మికులు, మహాత్ములు. వారి అందరివలె నీవూ దీర్ఘాయుష్మంతుడవు కావలెను. వారివలె నీవూ కీర్తిమంతుడవు కావలెను. నీ కీర్తి దిగ్దిగంతాలలోనూ వ్యాపించవలెను. నాయనా, నీ వంశోచిత ధర్మాన్ని నీవు ఎన్నడూ తప్పకూడదు" అంటూ ఆశీర్వదించింది. "నాయనా, నీ యువరాజ్యాభిషేక సమయము ఆసన్నము అవుతూ ఉంది. నీవు ఇప్పుడే పోయి మీ నాయనగారిని చూడవలెను. ఆ సత్యసంధుడు నీకు యువరాజ్యాభిషేకము చేయిస్తాడు. రామా, రాత్రి నీవు ఉపవాసము చేసినావు. ఇప్పుడే తెల్లవారింది. ఏమి అయినా కొంచెము తిను" అంటూ ఆమె పీట వేసింది.

రాముడు సిగ్గుపడి పోయినాడు. వృద్ధాచారాన్ని పట్టి ఆ పీటను చేతితో తాకినాడు. ఇక తాను దండకారణ్యము పోవలసిన విషయము ఆమెకు చెప్ప తలచి చేతులు జోడించి "అమ్మా నీకు ఏమీ తెలియదు నేను ఏమి అని చెప్పేది? ఇక నీవూ సీతా లక్ష్మణుడూ నాకోసము ఘోరదుఃఖము అనుభవించవలసి ఉంది. ఈ పీట నాకు ఎందుకు? నేను ఇప్పుడు దండకారణ్యానికి ప్రయాణము అయిపోవలెను. ఇక నాకు ఇటువంటి పీటలు ఉండవు. ఇరవై అయిదు దర్భలతో అల్లిన విష్టరాసనము మీద నేను కూర్చుండవలెను. రసవద్ద్రవ్యాలతో కూడిన మాంసము తినడము ఉండదు. తేనే పండ్లూ దుంపలూ తింటూ విజనారణ్యములో నేను పధ్నాలుగు సంవత్సరాలు కాపురము చేయవలెను. అమ్మా దశరథమహారాజు ఇప్పుడు భరతుడికి రాజ్యాభిషేకము చేయ

నిశ్చయించినాడు. నన్ను దండకారణ్యము పొమ్మని ఆజ్ఞాపించినాడు'' అన్నాడు రాముడు.

కౌసల్యా దేవి ఈ మాటలు విన్నది. గొడ్డలితో తెగవేసిన సుద్దికొమ్మ వలెనూ ఓడుగాలికి నిలువలేని అరటిచెట్టు వలెనూ నేలకూలింది. బరువులు మోసి మోసి అలసి సొలసి నేలమీద పడిపోయిన గుర్రమువలె ఆమె పొరలాడడము మొదలు పెట్టింది. రాముడు ఆమెను లేవనెత్తినాడు. ఉపచారాలు చేసినాడు. ఆమె ఒంటికి కొట్టుకొన్న దుమ్మూ ధూళీ తన చేతులతో దులిపినాడు.

ఎప్పుడూ ఎంతో సుఖము అనుభవిస్తూ ఉండవలసిన కౌసల్యాదేవి రాముణ్ణి చూస్తూ లక్ష్మణుడు వినేట్టుగా "నాయనా, దుఃఖము అనుభవించడానికా నేను నిన్ను కన్నది? అసలు నీవు నాకు పుట్టకపోయినట్లయితే ఇటువంటి దుఃఖము వచ్చేదే కాదు. గొడ్డురాలికి సంతానము లేదు అనేది ఒక్కటే దుఃఖము. ఇట్లా పుత్ర వియోగ దుఃఖముతో కొట్టుకులాడవలసిన అవసరమే ఉండదు. రామా, మీ నాయనగారు నన్ను ఎన్నడూ సుఖపెట్టలేదు. సంతోషపెట్టలేదు. నేను ఏ ఐశ్వర్యమూ అనుభవించ లేదు. నాకు ఒక కొడుకు పుట్టినాడు; ఇతను అన్ని సౌఖ్యాలూ అన్ని ఐశ్వర్యాలూ అనుభవిస్తాను అనుకొన్నాను. ఇప్పుడు ఇట్లా అయిపోయింది.

"నాయనా, నేను ఇంతవరకూ పట్టుచుపిసిని. ఇక నన్ను సవతులు ఎద్దేవా చేస్తారు. వాండ్ల సూటీపోటీ మాటలు నేను వినవలెను. పడవలెను. ఆడుదానికి సవతుల ఎత్తిపొడుపుల కన్నా భరించరాని దుఃఖము మరి ఒకటి ఉండదు. ఇక నాదుఃఖానికి అంతము ఉండదు. రామా, నీవు ఇక్కడ ఉండగానే నా సవతి ఇట్లా చేసింది. నన్ను ఇట్లా అవమానించింది. ఇక నీవు దూరము అయిపోతే నా గతి ఏమిటి? నేను చచ్చిపోవలసిందే.

"నాయనా, నాకు ఎన్నడూ స్వాతంత్ర్యము లేదు. నీ తండ్రి ఇప్పుడు నన్ను మరీ పనికిమాలిన దానినిగా చేసివేసినాడు. ఇక నేను కైకేయీ దాసీలతో సరిసమానము అయిపోతాను. కాదు, కాదు, వాండ్లకన్నా తక్కువ దానిని అయిపోతాను. కైకేయీ పుత్రుడు ఏమి అనుకొంటాడో అనే భయముతో ఏ ఒక్కడూ ఇక నా ముఖమువంక అయినా చూడడు. నాకు సేవ చేసేవాడే

ఉండడు. నేను దిక్కుమాలినదానను అవుతాను. కైక నన్ను చూచి మటమటలాడుతూ మాట్లాడుతుంది. నాయనా, నేను ఎట్లా ఓర్చుకొనేది ?

“రామా, నీవు యువరాజువు అవుతావు అని నీకు ఉపనయనము అయింది మొదలు క్రిందటి పదిహేడు సంవత్సరాలనుంచీ ఆశపడుతూ వచ్చినాను. నా ఆశలు అన్నీ ఇప్పుడు అడియాసలు అయిపోయినవి. నేను పెద్దదానను. సవతుల ఈసడింపులు నేను భరించలేను. రామా, చంద్రబింబము వంటి నీ ముఖము కనపడక పోయేట్లయితే నేను బ్రతకడము ఎట్లాగు? దిగులుతో ఎన్నాళ్ళు బ్రతుకుతాను ?

“నాయనా, రామా, నీకోసము నేను దేవతారాధనలు చేసినాను. ఉపవాసాలు ఉన్నాను. ఎన్నో వ్రతాలు పట్టినాను, అనేక దానాలు చేసినాను నా శ్రమ అంతా వ్యర్థము అయి పోయింది. నేను చేసిన తపస్సు అంతా చవిటి నేలను నాటిన విత్తనము అయిపోయింది. నేను దరిద్రురాలను కాబోలు. రామా, నిన్ను కష్టపడి పెంచినాను. రామా, వరదదెబ్బకు గట్టి గట్టి ఏటిగట్లు సయితము గండ్లు పడిపోతవి. కాని ఈ దుఃఖానికి నా గుండెలు పగిలిపోకుండా ఉన్నవి. రాయితో చేసినారో ఏమో. భయపడి ఏడుస్తున్న లేడిని సింహము కనికరము లేకుండా ఎత్తుకొనిపోతుంది. కాని నన్ను యముడు ఎత్తుకొనిపోకుండా ఉన్నాడు. యమ లోకములో నాకు చోటు లేదో ఏమో. నాకు చావు లేదు కాబోలు. ఇంత దుఃఖము వచ్చినా నా గుండెలు ఆడుతూనే ఉన్నవి. ఆగిపోలేదు. నా దేహమూ తిన్నగానే ఉంది. ఈ రెండూ ఇనపవి ఏమో. నాయనా, రామా, ఇంతకూ కాలము వస్తేనే కాని చావు రాదు- అంతవరకూ దుఃఖముతో కృశించిపోవలసిందే. ఎవరికి అయినా కోరుకొన్నంతమాత్రాన చావు రాదు. రామా, దూడ వెంట పోయే బక్క ఆవు మాదిరిగా నేనూ నీ వెంట వస్తాను. చంద్రబింబమువంటి నీ ముఖబింబము చూస్తూ బ్రతుకుతాను” అన్నది.

కౌసల్యాదేవి ఇట్లా చెప్పిందే కాని రాముడు పితృాజ్ఞను జవదాటడు అని ఆమెకు తెలుసును.

శత్రువులు తన పిల్లవాణ్ణి పట్టుకొని కట్టివేస్తే చూచి ఏమీ చేయలేక ఏడ్చే కిన్నరాంగనవలె కౌసల్యాదేవి ఎలుగెత్తి ఏడ్చింది.

౨౧

కౌసల్యాదేవి అట్లా ఏడుస్తూ ఉంటే లక్ష్మణుడు సమయోచితముగా ఇట్లా చెప్పినాడు :

“ఓ పూజ్యురాలా, ఒక ఆడదాని మాటకు లోబడి రాముడు రాజ్యము వదులుకొని అడవులపాలు అయి పోవడము నాకూ సమ్మతముగా లేదు. దశరథ మహారాజు వృద్ధాప్యములో ఉన్నాడు. ఆయనకు మనస్సు స్థిమితముగా లేదు. పయిగా విషయలోలుడున్నూ అయిపోయినాడు. కైకేయీ దేవి ప్రేరేపిస్తే మన్మథ పారవశ్యములో ఉన్న ఆయన ఏమి అయినా అజ్ఞాపిస్తాడు.

“అమ్మా, రాజ్యములో అయినా ఉండనీయకుండా అడవులకు వెళ్ళగొట్ట వలసినంత మహాపరాధము రాముడు ఏమి చేసినాడు? రాజద్రోహము ఏమి చేసినాడు? రాముడి శత్రువులు కానీ అపరాధము చేసి రాముడి శిక్ష అనుభవిస్తున్న వాండ్లు కానీ చాటున అయినా రాముడి మీద దోషారోపణము చేసి ఎరగరే. ఏ ఒక్కరూ ఏ ఒక్క దోషమూ ఎన్నడూ రాముడికి ఆపాదించి ఎరగరే. అటువంటివాణ్ణి అడవులకు ఎందుకు వెళ్ళగొట్టవలెను?

“అమ్మా, రాముడు దేవుడి వంటివాడు. ఋజువర్తనుడు. జితేంద్రియుడు. కైకేయీదేవి మొదలు అయిన శత్రు వర్గము వారిని సయితము అతడు ఆదరిస్తూ ఉన్నాడే, అటువంటిపుత్రుణ్ణి ఏ తండ్రి అయినా అడవులకు వెళ్ళగొట్టుతాడా. అందులో ధార్మికుడు అయిన తండ్రి అట్లా అజ్ఞాపిస్తాడా? దశరథమహారాజు మన్మథపరవశుడు అయిపోయి క్రూరవాడివలె ప్రవర్తించినాడు. రాజనీతి తెలిసిన పుత్రుడు ఎవడున్నూ ఆయన మాటలను మన్నించడు. మన్నించనవసరములేదు” అంటూ రాముడి వంక చూచి “రామా, ఈ విషయము ఇతరులకు తెలిసే లోపటనే నీవు రాజ్యాన్ని స్వాధీనము చేసుకోవలెను. నేను నీ వెంట ఉంటాను. నేను ధనుర్ధరుణ్ణి అయి నిలుచుంటే నీవు నా పక్కను దండధరుడివలె కనపడుతూ ఉంటే ఈ అయోధ్యానగరములో నిన్ను ఎదిరించేవాడు ఎవడు? నిన్ను ఎదిరించే సామర్థ్యము ఎవడికి ఉంది? ఎవండ్లు అయినా ఎదిరించడమే జరిగినట్లయితే నా తీక్ష్ణ బాణాలకు ఈ మహానగరము నిర్మానుష్యము అయిపోతుంది. భరతుని పక్షము వాండ్లు కానీ వాడి హితము కోరే ఇంకా ఎవండ్లు అయినా కానీ నే

మీదకు వచ్చేట్లయితే వాండ్లను అందరినీ నేను నాశము చేసివేస్తాను. కైకేయీదేవి ప్రోత్సాహమువల్ల దశరథమహారాజే శత్రుత్వము వహించి మన మీదకు వచ్చేట్లయితే ఆయనను చంపివేదాము; లేదా బందిఖానాలో ఉంచుదాము.

"రామా, కామాతురుడు అయి కార్యాకార్యవిచక్షణ జ్ఞానము పోయి అపమార్గము అవలంబించినప్పుడు తండ్రిని అయినా దండించవలెను. ఇది ధర్మము. నీకు రావలసిన రాజ్యాన్ని ఏ హేతువు వల్ల దశరథమహారాజు కైకేయీదేవికి కట్టపెట్టతలచినాడు? ఏమిబలము చూచుకొని అట్లా చేయవలెను అనుకొన్నాడు? ఓ అరిశాసనా, నీతోనూ నాతోనూ ప్రబలము అయిన విరోధము పెట్టుకొని ఈ రాజ్యాన్ని భరతుడికి ఒప్పగించే శక్తి దశరథమహారాజుకు ఉందా" అంటూ కౌసల్యాదేవి వంక చూచి "ఓ దేవీ, నేను త్రికరణశుద్ధిగా రామానురక్తుణ్ణి. సత్యప్రమాణముగా చెప్పుతున్నాను. నా ధనుస్సుమీదనూ నేను చేసిన యజ్ఞాలమీదనూ నేను చేసిన దానాలమీదనూ ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను. రాముడు అడవికి పోతే నేనూ వాడివెంట అడవికి పోతాను. అడవికి పోవడమేకాదు. మండుతూ ఉన్న మంటలలోకి దూక తలచుకొంటే వాడికన్నా ముందుగా ఆ మండే మంటలలో నేను దూకుతాను. అమ్మా, ఇంతకూ నీవు దుఃఖపడుతూ ఉంటే నేను చూడలేకుండా ఉన్నాను. సూర్యుడు ఉదయించి చీకట్లు పోగొట్టేట్టు నా పరాక్రమముతో నేను నీ దుఃఖాన్ని పోగొట్టుతాను నా పరాక్రమము నీకూ రాముడికీ ఇప్పుడే చూపిస్తాను" అన్నాడు లక్ష్మణుడు.

దుఃఖముతో చలించిపోతూ ఉన్న కౌసల్యాదేవి ఈ మాటలకు 'రామా' నీ తమ్ముడు లక్ష్మణుడు చెప్పుతున్నది అంతా వింటూ ఉన్నావుకదా? ఇకను ఈ విషయములో చేయవలసింది అంతా నీవు ఆలోచించవలెను. నా సవతి చెప్పింది అధర్మము. ఆమె చెప్పింది ధర్మము అనుకొని నీవు నన్ను విడిచిపెట్టి అడవులకు పోవద్దు. నన్ను నీవు దుఃఖపెట్ట వద్దు. నాయనా, రామా, నీవు సమస్తధర్మాలూ తెలిసినవాడవు. నీవు ధర్మాన్నే అనుసరించ తలచుకొంటే ఇక్కడనే ఉండి నీవు నాకు శుశ్రూషచేయవలెను. మాతృసేవకన్నా అధికము అయిన ధర్మము పుత్రుడికి మరి ఒకటి లేదు. కాశ్యపుడు నియమబద్ధుడు అయి తన తల్లికి సేవచేస్తూ స్వగృహములోనే ఉండిపోయినాడు. మహా తపస్సంపన్నులవలె స్వర్గతుడు అయినాడు. కశ్యపప్రజాపతిన్నీ అయినాడు.

"రామా, దశరథమహారాజు నీతండ్రి అయినందువల్ల నీవు ఆయనను పూజిస్తున్నాను అంటున్నావు. మంచిదే. నేను నీతల్లిని. నీవు నీతండ్రిని పూజించేట్టుగా నీ తల్లిని అయిన నన్నూ పూజించవలెను. నీవు అడవులకు పోవడమును నేను ఒప్పుకోవడములేదు. కనుక నీవు పోకూడదు. నీవు లేకపోయేట్లయితే నేను బ్రతకడము ఎందుకు? సుఖపడడము ఎందుకు? నీతో ఉంటూ నేను తృణభక్షణము చేసినా నాకు హాయిగా ఉంటుంది. నీ వియోగదుఃఖము నేనుభరించలేను. నీవు పోతాను అంటేనే నేను తల్లడిల్లిపోతున్నాను. నీవు నన్ను ఇక్కడ వదిలి పెట్టి అడవులకు పోయేట్లయితే నేనుప్రాయోపవేశము చేస్తాను. బ్రతకను. చచ్చి పోతాను. రామా, పిప్పలాద మహర్షి విషయములో అధర్మముగా ప్రవర్తించి నందువల్ల పుణ్యనదులు అన్నిటికీ ప్రభువు అయినప్పటికినీ సముద్రుడికి బ్రహ్మహత్యా పాతకము పట్టుకొన్నది. అదే విధముగా నేను చచ్చిపోయేట్లయితే నీకు ఘోర దుర్గతి పట్టుతుంది" అంటూ ఏడవ సాగింది.

రాముడు ధర్మసహితముగా "అమ్మా, నాయన గారి ఆజ్ఞను నేను అతిక్రమించను. వారిని అతిక్రమించడము నాచేత కాదు. నేనునిన్ను శిరసా ప్రార్థిస్తున్నాను. నన్ను అరణ్యవాసానికి పోనివ్వవలెను. అమ్మా, కండువు మహర్షి సమస్త ధర్మాలూ తెలిసినవాడు. వ్రతానుష్ఠాన పరాయణుడు. తండ్రి ఆజ్ఞాపించినాడు అని గోవధను చేసినాడు. పరశురాముడు కూడ తండ్రి ఆజ్ఞాపించినాడు. అని తనను కన్న తల్లి అనే కనికరము అయినా లేకుండా రేణుకా దేవిని గొడ్డలితో నరికివేసినాడు. ఎవరి విషయమో ఎందుకు? మా పూర్వీకులు సాగరులు పిత్రాజ్ఞా పరిపాలనముకోసము ఈ భూమిని అంతా మహాభయంకరముగా త్రవ్వి హతము అయిపోయినారు. వారే కాదు. ఇంకా ఎంతో మంది దేవతలతో సరి సమానము అయినవారు పిత్రాజ్ఞను శిరసావహించి ఎన్నో పనులు చేసినారు. పిత్రాజ్ఞాపరిపాలనానికి ఈ నాడు నేను ఒక్కణ్ణే బయలుదేరలేదు. పూర్వాచార విరుద్ధమూ అభినవమూ అయిన ధర్మాన్ని నేను ఇప్పుడు అనుసరించ పోవడము లేదు. పరమధార్మికులు అయిన వారు అందరూ పోయిన దారినే నేనూ పోతలచినాను. పోతున్నాను. ఈ భూలోకములో పుత్రుడికి పిత్రాజ్ఞా పరిపాలనము ముఖ్య ధర్మము. అందువల్ల నేను మరి ఒక ధర్మాన్ని పాటించను.

"అమ్మా, నీకు దుఃఖ హేతువు అయితే కావచ్చును కాని పిత్రాజ్ఞాపరిపాలనము వల్ల నన్ను ఏ దోషమూ బాధించదు" అంటూ ఆ వాక్యవిదుడు లక్ష్మణుణ్ణి చూచి "తమ్ముడా, నీకు నామీద ఎంత అనురాగము ఉన్నదీ నేను ఎరుగుదును. నీ పరాక్రమమూ నీ ప్రభావమూ నీ బలమూ నాకు తెలుసును. సత్య స్వరూపమూ శమస్వరూపమూ తెలుసుకోలేక మా అమ్మ మహా దుఃఖపడుతూ ఉంది. లక్ష్మణా, సకల పురుషార్థాలకున్నూ ధర్మమే మూలము. ధర్మము సత్యము మీద నిలిచి ఉంది. సత్యము లేకుండా ధర్మము లేదు. సత్యానికి ధర్మానికీ అవినాభావ సంబంధము. పితృవాక్య పరిపాలనవల్ల నాకు ఇప్పుడు ధర్మమూ సత్యమూ సమకూరుతున్నవి. తండ్రికి కానీ తల్లికి కానీ ఒక బ్రాహ్మణుడికి కానీ మాట ఇచ్చిన తరువాత ధార్మికుడు అయినవాడు ఎవడున్నూ ఆ మాట తప్పడు; తప్పకూడదు. అందువల్ల నేను పిత్రాజ్ఞను అతిక్రమించను. నన్ను అజ్ఞాపించింది కైకేయీదేవి కాదు. పిత్రాజ్ఞను ఆమె నాకు తెలియ చెప్పింది అంతే. తమ్ముడా, నీవు ఇప్పుడు భయంకరము అయిన క్షత్రియ ధర్మము మీదికి నీ బుద్ధిని పోనీయ వద్దు. క్రౌర్యము వద్దు. నా పద్ధతినే నీవూ అవలంబించు." అంటూ కౌసల్యాదేవిని చూచి "అమ్మా, నేను అరణ్యవాసానికి పోక తప్పదు. నా ప్రాణముమీద ఒట్టు పెట్టుకొని చెప్పుతున్నాను. నా వనవాసానికి నీవు అడ్డు చెప్పవద్దు. నన్ను అనుమతించు. ఆశీర్వదించు. స్వర్గము మీదినుంచి భూమి మీద పడి మళ్ళీ స్వర్గానికి పోయిన యయాతిరాజువలె నేనూ నా ప్రతిజ్ఞ చెల్లించడానికి వనవాసము చేసి అయోధ్యానగరానికి మళ్ళీ వస్తాను. అమ్మా, నీవు దుఃఖపడ వద్దు. నీ దుఃఖాన్ని మనస్సులోనే అణచి ఉంచుకో. వనవాసము అయిపోగానే నేను తిరిగి వస్తాను. అమ్మా, దశరథమహారాజు ఆజ్ఞలను నేను ఒక్కణ్ణే కాదు; నీవూ సుమిత్రాదేవీ సీతా ఈ లక్ష్మణుడూ అందరూ శిరసా వహించవలెను. ఇది సనాతన ధర్మము.

"అమ్మా, నా రాజ్యాభిషేకానికి నీవు సమకూర్చిన సంభారాలను నీవు సంతోషముగా భరతాభిషేకానికి ఇచ్చివేయవలెను. నేను వనవాసము చేయడానికి పోవడము ధర్మ సమ్మతము అయిన పని. కనుక నీవూ సమ్మతించవలెను. నీవు దుఃఖపడ వద్దు" అన్నాడు.

ఈ విధముగా ఎంతో ధైర్యముతోనూ స్థైర్యముతోనూ రాముడు చెప్పింది అంతా కౌసల్యాదేవి ఆలకించింది. భరించ లేని దుఃఖముతో ఆమె మూర్ఛ పోయింది. చచ్చిపోయిన దానివలె నేలమీద పడిపోయింది. రామలక్ష్మణులు ఆమెకు ఉపచారాలు చేసినారు. కొంత సేపటికి ఆమె తెప్పరిల్లింది. రాముణ్ణి ఎగాదిగా చూస్తూ "ఓ కొడుకా. శరీరసంబంధములోనూ పెంచి పెద్దవాణ్ణి చేసి పోషించడములోనూ నీకు నీతండ్రి ఎంత పూజ్యుడో నేనూ అంత పూజ్యురాలను. ఇప్పుడు నీవు వనవాసానికి పోవడము నేను ఒప్పుకోవడము లేదు. నేను ఇట్లా దుఃఖపడుతూ ఉంటే నన్ను వదలిపెట్టి నీవు పోకూడదు. నీవు నా ఎదట లేక పోయేట్లయితే నేను బ్రతికి ఉండడము దేనికి? నాకు పరలోక సౌఖ్యాలు ఎందుకు? స్వర్గలోకములో అమృతపానము చేయడమూ, పితృలోకములో స్వధలు తినడమూ మహర్లోకములో మహానందము అనుభవించడమూ నాకు ఎందుకు? అవి ఏవీ నాకు అక్కరలేదు. నీవు నా ఎదట ఉంటే చాలును. అదే నాకు సంతోషము. అదే నాకు స్వర్గము. నాకు కావలసింది నీవు నా ఎదట ఉండడమేను" అంటూ ఏడుస్తూ పడిపోయింది.

ఈ విధముగా ఒక చెంప తల్లి తెలివి తప్పి పడిపోయింది; ఇంకొక చెంప తమ్ముడు లక్ష్మణుడు దుఃఖముతో తపించి పోతున్నాడు. అయితే రాముడి ధర్మచింత క్షణమాత్రమూ చలించలేదు. రాత్రిపూట వేటగాండ్లు పెద్దపెద్ద కొరవులతో దారి అడ్డగించినా లెక్క చేయకుండా తన దారిన పోయే మదపు ఏనుగువలె రాముడి బుద్ధి ధర్మమార్గాన్నే నడువ సాగింది. అటువంటి ధర్మ సంకట సమయములో రాముడు "లక్ష్మణా, నీకు నామీద ఉన్న భక్తి నేను ఎరుగుదును. కాని నీవున్నూ నా అభిప్రాయము తెలుసుకోకుండా మా అమ్మతో పాటు నన్ను ఎంతో దుఃఖ పెట్టుతూ ఉన్నావు. తమ్ముడా, ఒక్క ధర్మము వల్లనే ధర్మార్థ కామాలు అనే మూడు పురుషార్థాలున్నూ సమకూడుతవి. సందేహము అక్కరలేదు. భార్య అనుకూలవతి అయి ధర్మాన్నీ అభిమత అయి కామాన్నీ సుపుత్ర అయి అర్థాన్నీ సమకూరుస్తుంది. అదే విధముగా ధర్మానుష్ఠానము వల్ల ధర్మమూ అర్థమూ కామమూ సంప్రాప్తము అవుతవి. ధర్మార్థ కామాలు మూడూ ఏ పనివల్ల సమకూడవో ఆ పని చేయకూడదు. కేవలమూ అర్థపరుడు అయిన వాణ్ణి లోకము ద్వేషిస్తుంది. కేవల కామ పరత్వము అప్రశస్తము. అందువల్ల ధర్మమూ సమకూడే పని చేయవలెను.

"నాయనా, దశరథ మహారాజు మనకు తండ్రి, గురువు, రాజు. ఆయన కోపమువల్ల కానీ సంతోషమువల్ల కానీ కామాతురతవల్ల కానీ ఏమి ఆజ్ఞాపించినా చేసితీరవలెను. పాపకర్ముడు అయిన కొడుకు తండ్రి చెప్పింది చేయక పోవచ్చును. నేను మాత్రము నాయనగారు చెప్పింది చేయకుండా ఉండను. ధర్మము ఎరిగినవాడు ఎవడు అయినా పిత్రాజ్ఞను శిరసా వహించి తీరుతాడు. అందువల్ల ఆయన చేసిన ప్రతిజ్ఞ–భరతాభిషేక, మద్వివాసన రూపకము అయిన ప్రతిజ్ఞ–నేను నెరవేర్చకుండా ఉండడానికి వీలు లేదు. ఆయన ప్రభువు నన్నూ భరతుణ్ణీ ఆజ్ఞాపించే అధికారము ఆయనకు ఉంది.

"తమ్ముడా, ఈ కౌసల్యాదేవి ఆయన ఇల్లాలు. ఈమెకున్నూ ఆయనే దిక్కు. ఈమే ఆయన ఆజ్ఞలను పాటించవలెను. ఇది పరమ ధర్మము. దశరథ మహారాజు తన పూర్వీకులకన్నా ధర్మాత్ముడు అని ముల్లోకాలలోనూ ప్రసిద్ధికెక్కినాడు. ఆ ధర్మప్రవర్తకుడు జీవించి ఉండగా ఆయన పట్టపురాణి ఒక విధవరాలు మల్లే కొడుకు వెంట అడవులకు పోవడము ఎంతమాత్రమూ పనికిరాదు" అంటూ కౌసల్యాదేవిని చూచి "ఓ పట్టపురాణీ, నేను వనవాసము చేయడానికి పోతున్నాను. దౌహిత్రుడి సత్యవచన ప్రభావమువల్ల యయాతి రాజు మళ్లీ స్వర్గానికి పోయినాడు. అదే విధముగా దీవించు. అరణ్యవాసము ఇట్టే ముగించుకొని వస్తాను. అమ్మా, ఇప్పుడు రాజ్యము కోసము ఉత్తరత్రా నాకు సంప్రాప్తము అయ్యే మహాద్యశస్సు పాడుచేసుకోవడము నాకు ఇష్టము లేదు. ఇంతకూ బ్రతికి ఉండేది బహు కొద్దికాలము. అందువల్ల అధర్మము అవలంబించను. నాకు ఈ తుచ్ఛరాజ్యము అక్కరలేదు" అన్నాడు.

రాముడు ఈవిధముగా తల్లితో చెప్పినాడు. తన అభిప్రాయము తమ్ముడికి వివరించినాడు. ఒంటరిగా దండకారణ్యము పో నిశ్చయించుకొన్నాడు. కౌసల్యాదేవికి మనసా ప్రదక్షిణము చేసినాడు.

౧౨

లక్ష్మణుడు కోపవహ్నితో కుమిలిపోయినాడు. దేహము తాపము ఎత్తింది. కోపము రేగింది. నాగుపామువలె బుసలు కొట్టుతూ ముఖము అంతా కన్నులు చేసుకొని చూడడము మొదలుపెట్టినాడు. అట్లా చూస్తూ ఉన్న ఆ

కూరిమి తమ్ముణ్ణి వదిలిపెట్టి పోకూడదు అనుకొన్నాడు ఆ ధైర్యవంతుడు ఆ జితేంద్రియుడు రాముడు. ఆయన లక్ష్మణుడితో "తమ్ముడా, కోపము నిగ్రహించు. నాకు ఇట్లా అయిపోయిందే అని దుఃఖపడ వద్దు. మానము పోయి అవమానము అయింది అని బాధపడ వద్దు. ధైర్యము వహించు. నా రాజ్యాభిషేకము కోసము నీవు చేసుకొన్న అలంకారాలను విసర్జించు. నిరపాయము అయిన నా వనవాసానికి సాయపడు.

"లక్ష్మణా, అభిషేక సంభారాలను సమకూర్చడములో నీవు చూపించిన చాకచక్యము ఇప్పుడు నా వనవాసానికి అవసరము అయిన వల్కాదులు సమకూర్చడములో చూపించవలెను. నా రాజ్యాభిషేకము ఆగిపోయింది అని మా అమ్మ కౌసల్యాదేవి దుఃఖపడుతూ ఉంది. పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేసి నేను సురక్షితముగా వస్తానో రానో అని ఆమె శంకిస్తూ ఉంది. అందుకు బాధ పడుతూ ఉంది. తమ్ముడా, పితృాజ్ఞను నేను త్రోసివేయకూడదు అనీ పధ్నాలుగు సంవత్సరాల వనవాసము నేను ఇట్టే ముగించుకొని వస్తాను అనీ నీవు మా అమ్మకు నచ్చచెప్పవలెను. ఆమె నా పునరాగమనము ఆశంకించకుండానూ నాకోసము దుఃఖపడకుండానూ ఉండేట్టు నీవు చూడవలెను.

"నాయనా, మనము ఇక్కడ మాట్లాడుకొంటూ ఉంటే, రాముణ్ణి లక్ష్మణుడు ప్రేరేపిస్తే రాముడు అడవికి పోను అంటాడేమో అని కైకేయీదేవి సందేహించి బాధపడుతూ ఉంటుంది. నేను ఇంకా బయలుదేరలేదు అని దుఃఖపడుతూ ఉంటుంది. ఆమె సందేహాన్నీ దుఃఖాన్నీ పోగొట్టవలెను. లక్ష్మణా, మన తల్లులు కౌసల్యా కైకేయీ దేవులు ఆశంకిస్తూ దుఃఖపడుతూ ఉంటే నేను ఒక్క క్షణము అయినా ఉపేక్షించి ఊరకుండలేను

"లక్ష్మణా, నేను ఇంతవరకూ తెలిసి అయినా తెలియక అయినా మన నాయనగారిని కానీ మన తల్లులను కానీ ఎన్నడూ కష్టపెట్టినట్టు గుర్తులేదు. నాయనగారు ఎన్నడూ అబద్ధాలు ఆడరు. ఆడి తప్పరు. వారి పరాక్రమము అమోఘము. ఈ భూలోకములో వారు దేనికీ భయపడి ఎరుగరు. వారు కైకేయీదేవికి చేసిన ప్రతిజ్ఞ దబ్బర అయిపోతుందేమో అనీ అందువల్ల పరలోకములో బాధలు పడవలసి వస్తుందేమో అనీ భయపడుతున్నారు. పరలోక భయముతో

వారు కంపించి పోతున్నారు. వారు నిర్భయముగా ఉండడమే నాకు కావలెను నా పట్టాభిషేకము ఆపివేసి ఇప్పుడే భరతుడికి పట్టాభిషేకము చేయక పోయేట్లయితే కైకేయీ దేవికి చేసిన వాగ్దానము అబద్ధము అయిపోతుంది అని నాయనగారు మనస్సులో బాధపడుతూ ఉంటారు. వారు మనోవ్యథ పడడము నేను సహించలేను. అందువల్ల ఈ పట్టాభిషేక సంరంభము అంతా కట్టిపెట్టి నేను ఇప్పుడే ఇటునుంచి ఇట్లే అరణ్యవాసానికి పోవలెను. అనుకొంటున్నాను.

"లక్ష్మణా, నేను వనవాసానికి పోవడముతో - అంటే వల్కలాలు కట్టుకొని కృష్ణాజినము కప్పుకొని జటామండలాలు ధరించి వనవాసానికి ప్రయాణము అయిపోవడముతో కేకయ రాజపుత్రి మనస్సు కుదటపడుతుంది. అంతట ఆమె తన కొడుకు భరతుడికి నిరాటంకముగా రాజ్యాభిషేకము చేయిస్తుంది. కృతకృత్యురాలు అవుతుంది. తమ్ముడా, నాయనగారు తమ సత్యవాక్య పరిపాలనము కోసము నేను వనవాసము చేయవలెను అని నిర్ణయించినారు. ఇంకా నేను ఇక్కడ ఉండి వారి మనస్సు నొప్పించడము ఎందుకు? వెంటనే వెళ్ళిపోవలెను. ఆలస్యము చేయకూడదు.

"తమ్ముడా పితృవాక్య పరిపాలనము పుత్రుడు అవశ్యమూ అనుష్ఠించవలసిన ధర్మము అని చెప్పినాను. ఆలోచిస్తూ ఉంటే మరి ఒకటిన్నీ తోచింది. నాయనగారు నాకు రాజ్యాభిషేకము తలపెట్టడమూ అది ఇప్పుడు విఫలము అయిపోవడమూ దైవికము. దైవికమే కాకపోయినట్లయితే నన్ను ఇట్లా బాధపెట్టవలెను అని కైకేయీదేవికి ఎందుకు బుద్ధి పుట్టుతుంది? కైకేయీదేవి ఇదివరకు ఎన్నడయినా నన్ను పరాయి అమ్మ కన్న బిడ్డవలె చూడడము నీవు ఎరుగుదువా? నేను ఎన్నడయినా సవతి తల్లి కన్న తల్లి అనే భేదభావముతో ప్రవర్తించడము నీవు ఎరుగుదువా? కైకేయీదేవి నన్నూ భరతుణ్ణి ఏ తారతమ్యమూ లేకుండా ఒక్కమాదిరిగా చూస్తూ వచ్చింది. అంత వాత్సల్యముతో నన్ను చూస్తూ వచ్చిన కైకేయీదేవి యువరాజ్యాభిషేకము కట్టిపెట్టి అరణ్యవాసానికి పొమ్మని నాతో చెప్పరాని మాట చెప్పింది. ఆమె నోటి వెంట అటువంటి ఉగ్రవాక్కు వెలువడడము దైవికము. అందుకు మరిఒక కారణము కనపడడము లేదు.

"లక్ష్మణా, కైకేయీదేవి ఉత్తమ రాజవంశములో జన్మించింది. ఆమె ఇంత వరకూ తన వంశోచిత సుగుణాలకు అనుగుణముగా ప్రవర్తిస్తూ వచ్చింది. ఆమె ఇప్పుడు దుష్కులాంగనవలె భర్తృసాన్నిధ్యములో సిగ్గూ బిడియమూ లేకుండా ఆయనకూ ఆయన ప్రియపుత్రుణ్ణి బాధించే కోరిక కోరింది. ఆ కోరిక చెల్లించవలెను అని ఆమె ఆయనను నిర్బంధించింది. ఇది దైవికము. అందుకు మరి ఒక కారణము లేదు.

"నాయనా, దైవికానికి తిరుగులేదు. సమస్త ప్రాణికోటీ దానికి తల ఒగ్గవలసిందే. ఇప్పుడు అది నా స్థితికీ కైకేయీదేవి స్థితికీ విపర్యయము తెచ్చిపెట్టింది. పెద్దలు అందరూ ఆలోచించి నిశ్చయించిన నా రాజ్యాభిషేకము ఆగిపోయింది. నన్ను ఎంతో వాత్సల్యముతో చూచే కైకేయీదేవి సద్భావము తలక్రిందులు అయిపోయింది తమ్ముడా, దైవికానికి ఏ అడ్డూ లేదు. జరిగిన దానిని పట్టే దైవికము అని అనుకోవలసి వస్తూ ఉంటుంది. అది దైవికము అని ముందుగా తెలియదు; తెలుసుకోలేము కూడానూ. ఎంతో శ్రద్ధతో శ్రమపడి చేసిన పనులు ఒకప్పుడు విఫలము అయిపోతూ ఉంటవి. అందుకు ఏ కారణమూ కనపడదు. ఏ మాత్రము శ్రద్ధ లేకుండానూ శ్రమ పడకుండానూ చేసిన పనులు ఒకప్పుడు సఫలము అవుతూ ఉంటవి. అందుకూ కారణము కనపడదు. కాబట్టి ఆయా పనుల ఫల పరిపాకాన్ని పట్టి దైవికము అనుకొని శిగసా వహించవలెను; అనుభవించవలెను. ముందుగా తెలియదు కనుక దైవికాన్ని ఎదుర్కొనడము అనేదే లేదు. సుఖ దుఃఖాలూ భయక్రోధాలూ లాభాలాభాలూ ఉత్పత్తి వినాశాలూ ఈ మొదలు అయినవి అన్నీ దైవికముగా సంభవిస్తూ ఉంటవి. మహోగ్ర నియమాలతో తపస్సు చేసే మహర్షులుసహితము కామక్రోధ పరవశులు అయిపోవడమున్నూ దైవికమే. ఎంతో కాలము ఆలోచించి ఆలోచించి ఆరంభించిన పని ఇట్టే ఆగిపోతుంది. ఎన్నడూ అనుకోని పని హఠాత్తుగా అయి ఊరుకుంటుంది. దైవికము కాకపోతే ఇటువంటి సంఘటనలకు కారణము ఏమిటి ? ఈ యథార్థము నేను గమనించినాను. అందువల్లనే నేను మనోనిగ్రహముతో ఉన్నాను. నా అభిషేకము ఆగిపోయింది అనే విచారము నాకు లేదు. నీవున్నూ ఆలోచించి చూడు. దుఃఖపడ వద్దు.

"తమ్ముడా, నా రాజ్యాభిషేకము కోసము తెచ్చిన ఈ కలశాలలో జలాలతో ఇప్పుడు నేను తపోవ్రత స్నానము చేస్తాను: కాదు, కాదు, పొరపాటు. ఈ

కలశాలలో జలాలు రాజ్యాభిషేకము కోసము తెచ్చినారు. నేను ఉపయోగించ కూడదు. నేనే స్వయముగా నీళ్లు తోడుకొని తపోవ్రత స్నానము చేస్తాను. నాయనా, నాకు రాజ్యలక్ష్మి విపర్యయము అయిపోయింది అని నీవు దుఃఖపడ వద్దు. రాజ్యపాలనను కన్నా వనవాసమే సుఖముగా ఉంటుంది. శుభ ఫలమూ ఇస్తుంది.

"తమ్ముడా, నా రాజ్యాభిషేకము విఘ్నము అయిపోవడానికి పిన్నమ్మ కారణము కాదు. ఆమె దైవోపహత. అందువల్ల ఆమె అప్రియము చెప్పింది. దైవ ప్రభావము అటువంటిది" అన్నాడు రాముడు.

౨౩

రాముడు ఇట్లా పదే పదే చెప్పుతూ ఉన్న మాటలు నచ్చక పోయినప్పటికిన్నీ లక్ష్మణుడు తల వంచుకొని వినయవిధేయతలతో విన్నాడు, రాముడి ధర్మనిష్ఠకు అతడికి సంతోషము వేసింది. అయితే రాజ్యము వదిలిపెట్టి అరణ్యవాసము చేయపోతున్నందుకు దుఃఖము వచ్చింది. ఆలోచించినాడు. అతనికి మరింత కోపము వచ్చింది. తరిమితే కనపడ్డ కలుగులో దూరి కోపముతో బుసలు కొట్టే పాము వలె నిట్టూర్పులు విడవడము మొదలు పెట్టినాడు. కన్నులు కెంపులవలె ఎర్రపడిపోయినవి. కోపోద్రేకముతో చెలరేగిన సింహమువలె అతని ముఖము దుర్నిరీక్షము అయిపోయింది. కోపము వచ్చిన మదపుటేనుగు తొండము విదిలించేట్టు తన చెయ్యి విదిలిస్తూ చేతి వేళ్ళు ముడుస్తూ తెరుస్తూ తల ఆడిస్తూ చిట్లించిన కనుబొమలలోనుంచి అతిరూక్షముగా రాముడివంక చూస్తూ "అన్నా, పితృవాక్య పరిపాలనము చేయకపోయేట్లయితే ధర్మహాని చేసినవాణ్ణి అయిపోతానేమో అని నీవు భయపడుతున్నావు. లోకులు నిన్ను ధర్మాత్ముడు అని గౌరవించరేమో అనుకొంటున్నావు. అంతే కాకుండా వారున్నూ ధర్మహానికి తలపడుతారేమో అని శంకిస్తున్నావు. ఇది అంతా నీ భ్రాంతి. ఇందు కోసము అడవులకు పోవలెను అని తొందరపడుతున్నావు. ఇది ఏమీ బాగా లేదు. పైగా నీవు ఈ జరిగింది అంతా దైవికము అనీ అది ప్రబలము అనీ అంటున్నావు. నీ వంటి అసంభ్రాంత చిత్తుడు ఎప్పుడూ దైవాన్ని ఇట్లా పొగడడు. దైవము దాని అంతట అది ఏమీ చేయలేదు. దాని పని నెరవేర్చుకోవ

డానికి అది మరి ఒకరిని ఆశ్రయిస్తుంది. అశక్తులూ దీనులూ దైవానికి తల ఒగ్గుతారు. శూరులూ వీరులూ దానిని తిరస్కరిస్తారు. రామా, నీవు శూరులలోనూ క్షత్రియులలోనూ శ్రేష్ఠుడవు. దైవాన్ని నిరాకరించ కల సమర్థుడవు. నీవు దైవాన్ని ప్రశంసించడము అసమంజసము.

"అన్నా, కైకేయీ దశరథులు అధర్మపరాయణులు అయినారు అని నీకు ఎందుకు తోచడము లేదు? ఓ ధర్మాత్మా ఈ లోకములో ధర్మవేషధారులు కొందరు ఉన్నారు. వారు వారి కార్యసిద్ధికోసము ఎప్పుడూ ధర్మపన్నాలు చక్కగా చెప్పుతూ ఉంటారు. అదే విధముగా కైకేయీ దశరథులు పైకి నీ మీద ఎంతో వాత్సల్యము నటిస్తూ నీకు కీడు తలపెట్టినారు. నీవు ఎందువల్లనో తెలుసుకో లేక పోయినావు. కైకేయీ దశరథులు ఇట్లా చేయవలెను అని ముందుగానే ఆలోచించి ఇప్పుడు ఇట్లా చేసినారు. వారు ముందుగా ఆలోచించక పోయినట్లయితే ఎన్నడో వాగ్దానము చేసిన వరాలను దశరథ మహారాజు వంటి నీతిజ్ఞుడు ఇంతవరకూ చెల్లించకుండా ఉండడు. ఒకవేళ ఆయన ఉపేక్షించినా కైకేయీదేవి ఇంతకాలమూ ఆ వరాలను చెల్లించమని అడగకుండా ఉండదు. ఒక వేళ ఇది అంతా వాస్తవమే అనుకొన్నా ఏనాటి వరాలో చెల్లించమని అడగడానికి కైకేయీ దేవికి ఇదా సమయము? ఇది అంతా అబద్ధము. ఇది వారు ఉభయులూ ఆలోచించి చేసిన కుట్ర. ఇటువంటి వారి మాటలు నీవు విననందువల్ల నిన్ను ఏ పాపమూ బాధించదు.

"ఓ వీరా, నీవు జ్యేష్ఠుడవు. నీవు ఉండగా నీకంటే చిన్నవాడికి రాజ్యాభిషేకము చేయడము అధర్మము, లోకవిరుద్ధము. అది నేను సహించలేను.

"రామా, నీవు మహా మతిమంతుడవు. పితృవాక్య పరిపాలనము పరమ ధర్మము అనుకొన్నావు. అందుకోసము నీవు నిన్నటి దినము రాజ్యాభిషేకము అంగీకరించినావు. ఈ నాడు ఆ పరమ ధర్మము కోసమే అడవులకు పోవలెను అంటున్నావు. ఇట్లా రోజుకు ఒకమాదిరి బుద్ధిపుట్టించే ధర్మము ఒక ధర్మమా? ఇదే ధర్మము అయినట్టయితే తిరస్కరించవలెను. పితృవాక్య పరిపాలనము ముఖ్య ధర్మము అనే వ్యామోహములో పడిపోయి ఇది ధర్మము అని నీవు అంటున్నావు. ఒక వేళ ఇదే ధర్మము అనుకొన్నప్పటికిన్నీ దశరథ మహారాజు

కాముకుడు అయి కైకేయీ దేవి వశవర్తి అయిపోయి నిన్ను ఇట్లా ఆజ్ఞాపించడము అధర్మము. నింద్యము. రామా, నీవు ఈ ఆజ్ఞను శిరసావహించ నవసరములేదు. ప్రతీకారము చేసే సామర్థ్యము నీకు ఉంది. ఈ మార్పు-నీకు తలపెట్టిన రాజ్యాభిషేకము ఆపివేసి నిన్ను అరణ్యవాసానికి పంపించి భరతుడికి రాజ్యాభిషేకము చేయవలెను అనే మార్పు కైకేయీ దశరథుల కుతంత్రము తప్ప మరి ఒకటి కాదు. ఇది నీవు తెలుసుకో లేకుండా ఉన్నావే అని నేను దుఃఖపడుతున్నాను. కాముకుడు అయిన తండ్రిమాట విని నీవు వనవాసము చేయిపోవడము లోక విరుద్ధము అయిన ధర్మము. తల్లి తండ్రులు అయినప్పటికిన్ని కైకేయీ దశరథులు కామపరవశులు అయి నీకు కీడు తలపెట్టినారు. నీకు శత్రువులు అయి పోయినారు. వారి కోరికను నీవు మనస్సులో అయినా మన్నించ కూడదు.

"రామా, కైకేయీ దశరథులకు దైవికముగా ఇట్లా బుద్ధి పుట్టింది అని నీవు అంటున్నావు. అట్లా అయినట్లయితే ఆ దైవికాన్ని నీవు ఉపేక్షించవలెను. కాని శిరసా వహించ కూడదు. నేను దైవికాన్ని గౌరవించను. వీర్యహీనులూ మనో దార్ఢ్యము లేని వాండ్లూ దైవాన్ని శిరసా వహిస్తారు. వీరులూ సంభావితాత్ములూ దైవానికి లొంగిపోరు. పురుష కారముతో అణగ త్రొక్కుతారు. దైవానికి భయపడి స్వార్థాన్ని చెడకొట్టుకోరు. కష్టాల పాలు కారు. దుఃఖపడరు. దైవశక్తి ఎటువంటిదో పురుషశక్తి ఎటువంటిదో నేను ఇప్పుడే ఈ లోకానికి వెల్లడించ పోతున్నాను. దైవ మానుష బలాలలో ఏది ప్రబలమో స్పష్టము చేస్తాను. నీ రాజ్యాభిషేకాన్ని చెడకొట్ట చూచిన దైవాన్ని ఇప్పుడే ప్రజా సమక్షములో సంహరించి వేస్తాను. మదము ఎక్కి కాలి కట్టు గొలుసులు తెంచుకొని విచ్చల విడిగా వీథిన పడి పరుగులెత్తే మదపు ఏనుగును మావటివాడు ఒక చిన్న అంకుశము తీసుకొని చాకచక్యముతో మళ్ళించుకొని వచ్చేట్టు నీవు దుర్నివారము అని చెప్పుతున్న దైవాన్ని నేను ఇప్పుడు మళ్ళించి వేయపోతున్నాను. దిక్పాలకులు అందరూ ఎదిరించినా ముల్లోకాలూ ఏకము అయి ఎత్తి వచ్చినా నీ రాజ్యాభిషేకాన్ని ఆపివేయలేరు. ఇక దశరథమహారాజు ఒక లెక్కా?

"రామా, కాదు కాదు-ప్రభూ, నిన్ను వనవాసము చేయించవలెను అని రహస్యముగా ఆలోచించి నిశ్చయించిన వారిని నేను పధ్నాలుగు సంవత్సరాలు

అరణ్యవాసము చేయిస్తాను. నీ రాజ్యాభిషేకము చెడకొట్టి తన కుమారుడికి రాజ్యాభిషేకము చేయవలెను అనుకొంటున్న కైకేయీదేవి దురాశను త్రుంచి వేస్తాను. దశరథమహారాజు ఆజ్ఞను పాతి పార్చి వేస్తాను. కైకేయీ దశరథులకు దైవము అనుకూలముగా ఉంది అనీ మనకు దైవము ప్రతికూలముగా ఉంది అనీ నీవు అనుకొంటున్నావేమో. నాతో విరోధము పెట్టుకొన్న వారికి ఎవరికి అయినా దైవము ఎంత అనుకూలముగా ఉన్నా ఏమీ ఉపయోగపడదు. నా మహోగ్ర పౌరుషానికి అది నిలవలేదు.

''ఓ రామా, నీవు బహుకాలము రాజ్యము ఏలి వార్ధక్యము వచ్చిన తరువాత వానప్రస్థాశ్రమ ధర్మము అవలంబించడానికి వనవాసము చేయవలెను. కాని ఇప్పుడు వనవాసము చేయకూడదు. అప్పుడు అయినా నీ పుత్రులు రాజము ఏలుతారు కాని భరతుడు రాజ్యము ఏలడు. వాడికి రాజ్యపాలనాధికారమే లేదు. పూర్వ రాజర్షులు అందరూ తమ శక్తి ఉడికిపోయిన తరువాత రాజ్యాధికారము తమ జేష్టపుత్రునకు ఒప్పగించి ప్రజలను కన్న బిడ్డలవలె కాపాడవలెను అని చెప్పి వనవాసము చేయపోయినారు. అట్లా చేయవలెను అనే శాస్త్రము చెప్పుతూ ఉంది. నీవున్నూ పూర్వ రాజర్షుల మాదిరిగా చేయవలెను. కానీ కైకేయీదశరథులు చెప్పినారు అని నీవు ఇప్పుడు వనవాసము చేయకూడదు.

''ఓ ధర్మాత్మా, ఇప్పుడు దశరథ మహారాజు చలచిత్తుడుగా ఉన్నాడు అనీ రాజ్యము స్వాధీనము చేసుకొంటే ఏమి బేధాలు పుట్టుకొని వస్తవో అనీ నీవు మనస్సులో అనుకొని రాజ్యము వద్దు అనుకొంటున్నావేమో. నీవు మహావీరుడవు. నీకు అటువంటి భయము వద్దు. నీకు నేను తోడుగా ఉంటాను. సముద్రము పొంగి పొర్లి ఈ భూమిమీద పడకుండా ఒక చిన్న చెలియలి కట్ట కాపాడుతూ ఉన్నట్టు నేను నీ రాజ్యములో ఏ కల్లోలాలూ పుట్టకుండా కాపాడుతాను. అట్లా కాపాడక పోయేట్లయితే నాకు వీరస్వర్గము లేకుండా పోవలెను అని ఒట్టు పెట్టుకొంటున్నాను. అన్నా, ఇకను ఇప్పుడు నీవు వసిష్ఠాది మహర్షులను పిలిపించి నీ కోసము సమకూర్చిన మంగళ జలాలతో రాజ్యాభిషేకము చేసుకొనే పని నీవు చూచుకో. నీరాజ్యాభిషేకాన్ని అడ్డగించే రాజులు ఎవరు అయినా ఉంటే వారిని నేను చూచుకొంటాను. ఈపనికి నేను ఒక్కణ్ణే చాలు.

రామా, నా ఈ బాహువులు దేహానికి అలంకారము కోసము కాదు. ఈ విల్లు నాకు ఒక ఆభరణముకాదు. నా ఈ ఖడ్గము వీర భూషణముగా ఊరక మొలలో దోపుకోవడానికి కాదు. నా అంబుల పొదిలో ఉన్న బాణాలు అన్నీ మోత బరువుకోసము కాదు. ఈ నాల్గు ఆయుధాలూ శత్రు సంహారానికి తప్ప మరి ఒకందుకు కాదు. పగవాడు బ్రతికి ఉండడము నాకు ఎంత మాత్రమూ గిట్టదు. దేవేంద్రుడు అంతటివాడు వజ్రాయుధముతో నన్ను ఎదిరించినా విద్యుత్కాంతులతో జ్వలించే నా ఈ ఖడ్గముతో ఖండించి వేయకుండా ఉండను. నాఖడ్గ ప్రహారణాలకు శత్రువుల తలలూ కాళ్లూ తెగి పడిపోవడమే కాదు; వారి గుర్రాలూ ఏనుగులూ కుప్పలుకుప్పలుగా నేల కూలి నడవడానికి చోటులేకుండా పోవలసిందే. నా ఖడ్గధారా హతికి ఏనుగులు మండుతున్న కొండల వలెనూ మెరుపులతో మెరిసే కారుమబ్బుల వలెనూ నేల కూలుతవి. ఉడుముతోలు కవచము చేతివేళ్ళకు తొడుగుకొని శరాసనము చేత పట్టుకొని నేను నిలుచుంటే ఈ లోకములో తాను మొనగాడను అని ఎవడు నన్ను ఎదిరించ గలడు? నేను అనేకమంది సామాన్యయోధులను ఒక్క బాణముతోనూ ఒక్కొక్క బలవంతుణ్ణి అనేక బాణాలతోనూ పడకొట్టుతాను. నా బాణాలు మానవుల మర్మస్థానాల లోనే పడుతవి. అంతే కాదు. అవి వారి గుర్రాలనూ ఏనుగులనూ హతమార్చి వేస్తవి. అన్నా, నా అస్త్ర ప్రభావానికి ఈ నాటితో దశరథమహారాజు ప్రభుత్వము అంతరించి పోతుంది ఇకను ఈ రాజ్యానికి నీవు ప్రభువు. రామా, ఇంతవరకూ నా ఈ బాహువులు చందన చర్చలు చేసుకోవడానికీ బాహుపురులు పెట్టుకోవడానికీ ధనము దానము చేయడానికీ స్నేహితులకు చెరుపు జరగకుండా కాపాడడానికీ ఉపయోగ పడుతూ వచ్చినవి. ఇకను ఇప్పుడు ఇవి నీ పట్టాభిషేకాన్ని ఆటంక పెట్టే వారిని అందరినీ హతమార్చడానికి ఉపయోగిస్తవి.

''రామా, కాదు కాదు – రామప్రభూ, నేను నీ కింకరుణ్ణి. ఆజ్ఞాపించు. ఈ రాజ్యము అంతా నీ స్వాధీనము కావడానికి ఇప్పుడు నేను ఏమి చేయవలెనో చెప్పు. నేను ఎవరిని సంహారము చేయవలెనో సెలవు ఇవ్వు. ఎవడి కీర్తి నేల పాలు చేయవలెనో చెప్పు. వాడిని వాడి బంధుమిత్ర సహితముగా ఇప్పుడే నాశనము చేసి వేస్తాను. ప్రభూ, ఆజ్ఞాపించు'' అన్నాడు లక్ష్మణుడు.

కన్నీళ్లు కారుస్తూ లక్ష్మణుడు ఇంత మహోగ్రముగా మాట్లాడుతూ ఉంటే ఆ రఘువంశ వర్ధనుడు రాముడు అత్యంతాదరముతో అతని కన్నీళ్ళు

తుడుస్తూ "సౌమ్యుడా నీకు ఎందుకు ఇంత కోపము? నేను పితాజ్ఞను జవదాటను. అదే సత్పథము" అన్నాడు.

౨౮

పితృవాక్య పరిపాలనను కోసము రాముడు నమ్మకముగా అరణ్యవాసము చేసి తీరుతాడు అని కౌసల్యాదేవికి తోచింది. ఆమె కన్నుల వెంట గిరుకున నీళ్ళు తిరిగినవి. మాటలు తడబడుతూ "దశరథ మహారాజుకు జ్యేష్ఠ పుత్రుడూ నా కన్న కడుపు ఎన్నడూ ఏకష్టాలూ ఏదుఃఖాలూ ఎరగని రాముడు-సమస్త ప్రాణికోటినీ సంతోష పెట్టే ధర్మాత్ముడు ఇక అడవులో పరిగలు ఏరుకొని తిని బ్రతకవలెనా?

"రాముడి భృత్యులూ దాసులూ మృష్టాన్న భోజనము చేస్తూ ఉంటే వాడు మాత్రము మహారణ్యాలలో కందమూలాలు తింటూ కాలము గడపవలెనా? అయ్యో! రాముడి అంతటి గుణవంతుణ్ణి అంతటి ప్రేమపాత్రుణ్ణి దశరథ మహారాజు అడవులకు పంపించి వేసినాడు అంటే ఎవరు అయినా నమ్ముతారా? ఒక వేళ నమ్మేట్లయితే అందరూ తమ తమ గతి ఏమిటి అని భయపడి పోకుండా ఉండ కలుగుతారా?

"రామా, నీవు లోకాభిరాముడవు. దైవ వశమువల్ల నీవు అడవులకు పోవలసి వచ్చింది. ఈ లోకములో సమస్త సుఖదుఃఖాలకున్నూ దైవమే మూల కారణము. దాని బలము అపారము. నాయనా, నీవు వెళ్ళిపోగానే నా ఈ దేహము కట్టెపారిపోతుంది. అందులో శోకాగ్ని రగులుకొంటుంది. నీ ఎడబాటు దానికి గాలి అవుతుంది, నా ఏడుపులూ పెడబొబ్బలూ దానికి సమిధలు అవుతవి. నా కన్నీళ్లు దానికి ఆజ్యాహుతులు అవుతవి. నా వ్యసనము దానికి ధూమము అవుతుంది. నా నిట్టూర్పులతో అది విజృంభిస్తుంది. అంతట అది మండు వేసంగిలో ఎండిన పొద అంటుకొన్నట్టు అంటుకొంటుంది. అది కార్చిచ్చు అంత అవుతుంది. నన్ను దహించి వేస్తుంది. నేను బ్రతకను. నాయనా, దూడ వెంట పోయే ఆవు మాదిరిగా నేను నీ వెంట వస్తాను. నీవు ఎక్కడికి పోతే నేనూ అక్కడికి వస్తాను" అంటూ కౌసల్యాదేవి ఏడువసాగింది.

"అమ్మా, కైకేయీదేవి నాయనగారిని మోసము చేసింది. అందువల్ల నేను వనవాసానికి పోవలసివచ్చింది. నీవు కూడా నాయనగారిని వదిలి పెట్టి నాతో వచ్చేట్లయితే వారు జీవించడము ఉత్తది. అమ్మా, ఆడది తన పెనిమిటిని వదిలి పెట్టి పోవడముకన్నా క్రూర కృత్యము మరి ఒకటి లేదు. నీవు అట్లా ఎంత మాత్రమూ చేయవద్దు. మనస్సులో అయినా నీవు అట్లా తలపెట్టవద్దు. నాయనగారు జీవించి ఉండేటంతవరకూ నీవు వారికి సేవ చేస్తూ ఉండవలెను. ఇది సనాతన ధర్మము" అన్నాడు రాముడు.

ఈమాటలకు ఆ శుభదర్శిని "నిజమేను" అన్నది. కాని ఆమె ముఖములో మార్పు ఏమీ కనిపించలేదు. ఆ పరమధార్మికుడు ఆమె దుఃఖాన్ని పోగొట్ట డానికి "దశరథమహారాజు మనకు అందరికీ అధిపతి. మన గురువు. మన పోషకుడు మన ప్రభువు ఉత్తమోత్తముడు. నేనూ నీవూ వారి ఆజ్ఞలను శిరసా వహించి తీరవలెను. నేను ఒక పది సంవత్సరాలూ ఆ తరువాత ఒక నాల్గు సంవత్సరాలూ ఇట్టే మహారణ్యములో గడపివేస్తాను. సుఖముగా తిరిగి వస్తాను. ఆ తరువాత పరమ సంతోషముతో నీమాట జవదాటకుండా నీకు సేవ చేస్తాను" అన్నాడు.

ఆ పుత్రవత్సలకు పట్టరాని దుఃఖము వచ్చింది. ఆమె ముఖము నిండా కన్నీళ్ళు కమ్ముకొన్నవి. "నాయనా, నీవు లేకపోయేట్లయితే, నేను నా సవతుల మధ్య ఉండలేను. పితృవాక్య పరిపాలనము కోసము నీవు అడవికి పోక తప్పదు అంటున్నావు. కనుక నన్నూ నీతో తీసుకొనిపో. అడవిలో లేడి మాదిరిగా నేను నీతో అడవిలో తిరుగుతూ ఉంటాను. నేను నిన్ను శ్రమపెట్టను. నన్ను తీసుకొని పో. కాదు అనవద్దు" అంటూ కౌసల్యాదేవి ఏడ్చింది.

రాముడున్నూ దుఃఖపడుతూ "అమ్మా, ఆడుదానికి బ్రతికి ఉండేటంత వరకూ పెనిమిటే ప్రభువు. ఆయనే దేవుడు. పెనిమిటిని తప్ప మరి ఎవరినీ ఆశ్రయించకూడదు. దశరథమహారాజు పరమ ధర్మికుడు. నాకూ నీకూ నియామకుడు. ఆయన నీకు నాథుడు. ఆయన ఉండేటంత కాలమూ నీవు అనాథవు కావు. అమ్మా, నీకు ఏమి తక్కువ? నీకు భయము ఎందుకు? దిగులు ఎందుకు? భరతుడున్నూ పరమ ధర్మికుడు. సర్వప్రాణికోటినీ సంతోషపెట్టే స్వభావము

వాడిది. వాడు ధర్మవిరుద్ధముగా ప్రవర్తించడు. వాడు నీకు అప్రియము చేయకు నీకు సేవ చేస్తాడు.

“అమ్మా, నేను వెళ్ళిపోయిన తరువాత నీవు నాయనగారిని ఏమరుపాటు లేకుండా కనిపెట్టుకుని ఉండవలెను. వారు పుత్రశోకముతో బాధపడకుండా ఉండే మాటలే నీవు చెప్పుతూ ఉండవలెను. నీవు అట్లా చేయకపోయేట్లయితే పుత్రశోకము భరించలేక ఆయన చనిపోతాడు. అమ్మా, నీవు ఆయనకు సమస్తోపచారాలూ చేస్తూ ఉండవలెను.

“అమ్మా, ఏ స్త్రీ అయినా ఎన్ని వ్రతాలు పట్టి ఎన్ని ఉపవాసాలు చేసి ఉత్తమోత్తమురాలు అని ఎంత పేరు సంపాదించినా భర్తను అనుసరించుకొని ఉండకపోయేట్లయితే ఆమెకు దుర్గతే. పెద్దలకు ఎవరికీ నమస్కారము చేయక పోయినా దేవతలకు పూజ చేయకపోయినా భర్తృసేవ చేస్తూ ఉండే స్త్రీ ఇహపర సౌఖ్యాలు రెండూ అనుభవిస్తుంది. భార్య ఎప్పుడూ భర్తను సంతోష పెట్టుతూ ఉండవలెను. అతనికి మంచి చేస్తూ ఉండవలెను. సేవచేస్తూ ఉండవలెను. ఇదే అనూచానముగా వస్తూ ఉన్న స్త్రీ ధర్మము, ఇదే వేదాలలో చెప్పి ఉంది. ఇదే శ్రుతులలో వినపడుతూ ఉంటుంది. ఇదే స్మృతులలో కనపడుతూ ఉంటుంది.

“అమ్మా, నేను సుఖముగా తిరిగి రావడానికి నీవు ఇక్కడ హోమాదులు చేయిస్తూ ఉండు. దేవతలను పూలతో పూజచేస్తూ ఉండు. సువ్రతులు అయిన బ్రాహ్మణులను సత్కరిస్తూ ఉండు. నియమముతో నియతాహారముతో నీవు నాయనగారికి సేవ చేస్తూ ఉండవలెను. పధ్నాలుగేండ్లు అయిపోగానే నేను తిరిగి వస్తాను. అప్పటికి దశరథమహారాజు జీవించి ఉండేట్లయితే నీవు ఇప్పుడు కోరుతున్న కోర్కెలు అన్నీ సఫలము అవుతవి” అన్నాడు.

కౌసల్యాదేవి కన్నీరు కారుస్తూ “నాయనా, నీవు పరమ పరాక్రమశాలివి. నీకు ఏ భయమూ లేదు. వనవాసము చేయవలెను అని నిశ్చయించుకొన్నావు. నిన్ను నివారించడము నాకు చేతకాకుండా ఉంది. కాలమహిమ! రామా, నీవు ఏకాగ్రచిత్తముతో అడవులకు ప్రయాణము అయిపో, శుభము అవుతుంది. పితృవాక్య పరిపాలనము చేసి పితౄణము తీర్చి చరితార్థుడవు అయి

నీవు తిరిగి వస్తే నా కష్టాలు అన్నీ గట్టు ఎక్కుతవి. నేను సంతోషిస్తాను. సుఖపడతాను.

“నాయనా, రామా, నేను ఎంత చెప్పినా వినకుండా నీవు అడవులకు పోతున్నావు. అబ్బా! దైవానికి ఎంత శక్తి ఉంది? ఎంత బలము ఉంది? ఇంతకూ దైవము దుర్నివారము. తండ్రీ, నీవు ఈనాడే అడవులకు ప్రయాణము అయిపో. సుఖముగా తిరిగి రా. తిరిగి వచ్చి నీ మనోహర వాక్కులతో నన్ను సంతోషపెట్టు.

“రామా, పధ్నాలుగు ఏండ్లూ అయిపోయి జటావల్కలధారివి అయి నీవు ఇప్పుడే నాకు కనపడితే ఎంత బాగుంటుంది! నేను ఎంత సంతోషిస్తాను” అంటూ వనవాసము చేయతలచుకొన్న ఆ శుభలక్షణ లక్షితాంగుణ్ణి తేరి పార చూచింది.

ఆమె మంగళాశీర్వాదాలు చెప్పించ తలచింది.

౨౫

ఆ తల్లి - ఆ మనస్విని-కౌసల్యాదేవి దుఃఖాన్ని అణచుకొన్నది. ఆచమించింది. శుచి అయింది. రాముడితో “నాయనా, నీ ప్రయాణము మాన్పించడము నాచేత కాలేదు. ఏమి చేసేది? నీవు ఈనాడే ప్రయాణము అయిపో. త్వరగా తిరిగి రా. వచ్చి పూర్వ రాజర్షులవలె రాజ్యాభిషేకము చేసుకో.

“ఓ రఘువంశ శార్దూలా, నీవు నియమముతో ధైర్యముతో స్థైర్యముతో సంతోషముతో శిరసా వహిస్తున్న ధర్మమే నిన్ను ఎప్పుడూ కాపాడుతుంది. దేవాలయాలలోనూ చైత్యాలలోనూ ప్రతిదినమూ నీవు ప్రార్థిస్తున్న దేవతలే నిన్ను రక్షిస్తారు. మహారణ్యాలలో మహర్షుల మధ్య నీవు నివసించేట్టు చేస్తారు. రామా, ఆ ధీమంతుడు - ఆ మహాత్ముడు విశ్వామిత్ర మహర్షి నీకు ఉపదేశించిన శస్త్రాస్త్రాలన్నీ నిన్ను ఎప్పుడూ కనిపెట్టుకొని ఉంటవి. ఓ మహాబాహూ, నీ పితృసేవ నీ మాతృసేవ నీ సత్యవ్రతము నీకు దీర్ఘాయుష్యము ఇస్తవి. నిన్ను ఎప్పుడూ కాపాడుతూ ఉంటవి, నాయనా, మున్యాశ్రమాలలో సమిత్తులూ దర్భలూ దర్భముడులూ అగ్ని వేదికలూ దేవస్థానాలూ దేవ పూజార్థము వేసే చిత్రవిచిత్రము అయిన తిన్నెలూ నీకు ఉపయోగిస్తవి. పర్వతాలూ హ్రదాలూ

నదులూ చిన్న చిన్న పొదలూ నిన్ను ఎప్పుడూ సంతోషపెట్టుతవి. విశ్వదేవులూ మరుత్తులూ సిద్ధులూ సాధ్యులూ బ్రహ్మదేవుడూ విరాట్పురుషుడూ పూషా భగ - అర్యములూ దేవేంద్రాది లోకపాలకులూ నిన్ను ఎప్పుడూ సుఖపెట్టుతారు.

"నాయనా, కలలూ కాష్ఠలూ ముహూర్తాలూ దివారాత్రాలూ పక్షాలూ మాసాలూ ఋతువులూ సంవత్సరాలూ నీకు హాయిగా కడచిపోతవి. నీ జ్ఞాపకశక్తీ నీ ధైర్యమూ నీ ధర్మప్రవర్తనమూ నిన్ను ఎప్పుడూ రక్షిస్తవి. సూర్యచంద్రులూ భూమ్యాకాశాలూ నక్షత్రాలూ వాటి అభిమాన దేవతలూ గ్రహాలూ సప్తర్షులూ నారదాది దేవర్షులూ నీకు ఏ కష్టమూ రానీకుండా కనిపెట్టుతారు నీవు మహారణ్యములో మునివిగా పెరుగుతావు కనుక నిన్ను ఆదిత్యులూ దైత్యులూ సుఖపెట్టుతారు. క్రూరకృత్యాలకు ఒడికట్టే రాక్షసులు నీ జోలికి రారు. పిశాచాలూ నీవైపు చూడవు. నాయనా, పక్షులూ పాములూ తేళ్ళూ అడవి ఈగలూ దోమలూ ఇంకా ఇతర పురుగులూ నిన్ను బాధించవు సింహాలూ పెద్దపులులూ ఎలుగుబంట్లూ అడవి ఏనుగులూ మహా భయంకరము అయిన కొమ్ములతో తిరిగే అడవి దున్నలూ ఇంకా ఇతర క్రూర మృగాలూ నిన్ను చూచి తప్పుకొంటవి. కోతులు కొండముచ్చులు నిన్ను చూచి వెక్కిరించవు. నరమాంస భక్షణము చేసే క్రూరసత్వాలు ఏవీ నీ వంక అయినా చూడవు.

"నాయనా, నేను నీకోసము ఇక్కడ దేవతలను పూజ చేస్తూ ఉంటాను. నిరంతరమూ స్తోత్రము చేస్తూ ఉంటాను. అందువల్ల అరణ్యవాసములో నీకు ఏ ఇబ్బందీ రాదు. నీకు దారిలో ఏ ప్రమాదమూ ఉండదు. నీ ప్రయాణము హాయిగా సాగిపోతుంది. నీ పరాక్రమానికి ఏ అడ్డూ ఉండదు. నీవు ఎక్కడకు పోయినా మంగళప్రదముగా ఉంటుంది. నాయనా, నీవు నదులలో స్నానము చేసేటప్పుడు విశ్వామిత్రమహర్షి నీకు ఉపదేశించిన మంత్రాలు నిన్ను కాపాడుతవి. అనే కాదు. అగ్నిహోత్రుడూ, వాయుదేవుడూ నిన్ను ఎప్పుడూ కనిపెట్టి ఉంటారు.

"రామా, నీ శిరస్సును ఆకాశమూ నీ శ్రోత్రేంద్రియాన్ని దిక్కులూ నీ ముఖాన్ని ఇంద్రాగ్నులూ నీ నేత్రాలను సూర్యుడూ నీ మనస్సును చంద్రుడూ

నీ ప్రాణాన్ని వాయువూ నీ నాభిని అంతరిక్షమూ నీ పాదములను భూమీ రక్షిస్తవి.

"నాయనా, సర్వలోక కర్త అయిన బ్రహ్మదేవుడూ సర్వభూత భర్త అయిన శ్రీమన్నారాయణుడూ దేవతలూ మహర్షులూ నిన్ను కాపాడుతారు." అంటూ ఆ యశస్విని - ఆ విశాలాక్షి ఆయా దేవతలను గంధ పుష్పాదులతో పూజచేసింది. స్తోత్రము చేసింది.

వనవాసము రాముడికి మంగళప్రదముగా ఉండడానికోసము హోమము చేయించ తలచుకొని ఆమె నెయ్యీ సమిధలూ తెల్లటి పూలదండలూ తెల్లటి ఆవాలూ అగ్నిహోత్రమూ తెప్పించి మహాత్ముడు అయిన బ్రాహ్మణుణ్ణి పిలిపించింది. రాముడికి వన వాసములో ఏజబ్బూ చేయకుండా ఉండడానికి ఆ బ్రాహ్మణుడు యథావిధిగా హోమకర్మలు అన్నీ పూర్తిచేసినాడు. హవ్యావశేషాన్ని బాహ్యబలిగా ఉంచినాడు. అంతట కౌసల్యాదేవి తేనే పెరుగూ నెయ్యీ అక్షతలూ దక్షిణలూ ఇచ్చి బ్రాహ్మణులచేత పుణ్యాహము చెప్పించింది. మహారణ్యములో రాముడికి మంగళప్రదముగా ఉండడానికి ఆ బ్రాహ్మణోత్తములచేత స్వస్త్యయన మంత్రాలు చదివించింది. ఆ బ్రాహ్మణులు కోరుకొన్నంత ధనము దక్షిణగా ఇచ్చింది. ఆ యశస్విని రాముణ్ణి చూస్తూ "నాయనా, రామా, వృత్రాసురసంహారానికి పోయే దేవేంద్రుడికి దేవతలు చెప్పిన మంగళాశీర్వాదమూ అమృతము తేవడానికి ప్రయాణము అయిన గరుత్మంతుడికి వినతాసతి చెప్పిన మంగళాశీర్వాదమూ పాలసముద్రము చిలికించి దైత్యసంహారము చేసి అమృతము సంపాదించడానికి బయలుదేరిన దేవేంద్రుడికి అదితి చెప్పిన మంగళాశీర్వాదమూ బలిచక్రవర్తిని అణగత్రొక్కి ముల్లోకాలలో విక్రమించడానికి పోయే త్రివిక్రముడికి దేవేంద్రుడి తల్లి చెప్పిన మంగళాశీర్వాదమూ నేను నీకు ఇప్పుడు చెప్పుతున్నాను" అంటూ ఆశీర్వాదమంత్రము పఠించి రాముడి శిరముమీద మంత్రాక్షతలు వేసింది. అతని ఒంటినిండా గంధము పూసి మంత్ర జపము చేస్తూ విశల్యకరణి ఓషధిని రక్షాబంధముగా ముంజేతికి కట్టింది.

ఆ పరమసాధ్వి మనస్సులో మహా దుఃఖపడుతున్నా పైకి సంతోషము అభినయిస్తూ రాముడి తల వంచి ఆఘ్రాణించింది. అతనిని గట్టిగా కౌగలించుకొన్నది. మాటలు తడబడుతూ "రామా, సుఖముగా అడవికి పో. అడవిలో హాయిగా కాలము గడుపు. నీకు ఏ జబ్బూ చేయకు సిద్ధార్థుడవు అయి తిరిగి రా. అయోధ్యకు వచ్చి సర్వ సిద్ధార్థుడవు కావలెను. అప్పుడు నేను నిన్ను ఉదయించే పూర్ణచంద్రుణ్ణివలె కన్నుల పండుగగా చూస్తాను. అంతట నా దుఃఖము అంతా తీరిపోతుంది. అప్పుడు నా ముఖములో సంతోషచ్ఛాయలు బయలుపడుతవి. తండ్రీ, నీవు వనవాసము ముగించుకొని వచ్చేవరకూ నేను రోజులు లెక్కపెట్టుకొంటూ ఉంటాను. ఎట్లాగో బ్రతుకుతాను. నాయనా, రామా, నీవు సింహాసనము ఎక్కడము నేను చూడవలెను; చూస్తాను. నేనూ నాకోడలు సీతా కోరే కోర్కెలు నీవు తీర్చవలెను. నీవు మమ్మలను సంతోష పెట్టవలెను.

"రామా, పోయి రా. నేను యిక్కడ శివుడు మొదలు అయిన దేవగణాలను పూజచేస్తూ ఉంటాను. ఆ దేవతలు నీకు ఎప్పుడూ మేలు చేస్తూ ఉంటారు." అని ఆశీర్వదించింది. ఆమె కన్నుల నిండా నీళ్లు కమ్ముకొన్నవి. రక్షగా ఆమె రాముడి చుట్టూ తిరిగింది. రాముణ్ణి రెండు చేతులా పట్టుకొని దగ్గరకు తీసుకొన్నది. గట్టిగా కౌగలించుకొని వదిలిపెట్టింది. మళ్ళీ కౌగిలించుకొన్నది. ఆమెకు తనివి తీరలేదు. మళ్ళీ కౌగలించుకొన్నది.

రాముడున్నూ పదేపదే ఆమె పాదాలు పట్టుకొని నమస్కారము చేసినాడు.

అంతట ఆ ధర్మాత్ముడు స్వీయకాంతులతో తేజరిల్లుతూ సీతా నిలయానికి పోయినాడు.

## ౨౬

జనావృతము అయిన రాజవీథిలో రాముడు పాదచారుడు అయి నడువసాగినాడు. ఆ గుణవంతుణ్ణి చూచి జనసమూహము కంపించిపోయింది.

రామాభిషేకము కోసము ఉపవాస వ్రత నియమముతో తన అంతఃపురములో కని పెట్టుకొని ఉన్న సీతాదేవికి కైకేయీదేవి అంతఃపురములో ఏమి జరి

గిందీ తెలియదు. రాముడికి యువరాజ్యాభిషేకము అవుతుంది అనే ఆమె అను కొన్నది. అందువల్ల ఆమె రాముడి అభ్యుదయము కోసము దేవపూజ చేసింది. పట్టాభిషేకము చేసుకొని వచ్చే భర్తకు పట్టమహిషి చేయవలసిన పాదార్చనాదులూ మొదలు అయిన రాజధర్మాలు అన్నీ ఆమెకు తెలుసును. అందువల్ల ఆమె గంధపుష్పాక్షతాదులు సమకూర్చుకొని రాముడు ఇప్పుడెప్పుడు వస్తాడా అని మహానందముతో ఎదురు చూస్తూ ఉంది. ఆమెతో పాటు ఆ అంతఃపురములో ఉన్నవారు అందరూ సంతోషసముద్రములో ఓలలాడుతూ ఉన్నారు.

అపూర్వముగా అలంకరించిన ఆ మందిరములోకి రాముడు తల వంచుకొని నడచి వచ్చినాడు. అతని అవయవాలు అన్నీ కంపించినవి. ముఖము దుఃఖావృతము అయింది. అట్లా నడచి వస్తూ ఉన్న రాముణ్ణి సీతాదేవి చూచింది. చివాలున లేచింది. ఆమె గజగజ వణకిపోయింది.

రాముడున్నూ సీతాదేవిని చూచినాడు. అంతవరకూ మనోగతము అయి ఉన్న అతని దుఃఖము అప్పుడు అణగి ఉండలేక పోయింది. పైకి ఉబికింది. ఉత్తరక్షణములో అతని ముఖము వివర్ణము అయిపోయింది. దేహము అంతటా చెమటలు పోసినవి.

సీతాదేవి దుఃఖముతో తపించిపోతూ, "ప్రభూ, ఇప్పుడు ఇది ఏమిటి? ఇట్లా ఉన్నారు ఏమిటి? ఈనాడు బృహస్పతి దేవతాకము అయిన దినము అని చెప్పినారే - శుభకరము అయిన దినము అనీ పుష్యమీ నక్షత్రములో మీ యువరాజ్యాభిషేకము అనీ బ్రాహ్మణోత్తములు చెప్పినారే - ఆ నిర్ణయము అంతా ఏమి అయిపోయింది? మీ మనస్సు అంతా వికలము అయిపోయినట్టున్నదే - ఎందువల్ల? ఇప్పుడు మీ దివ్యసుందర విగ్రహానికి జలఫేన నిభమూ శతశలాకాయుతమూ అయిన శ్వేతచ్ఛత్రము పట్టరేమిటి? చంద్రమండలమువలె తళతళలాడుతూ హంసలవలె తోచే వింజామరలు మీకు వీచరేమిటి? వందిజనులు స్తోత్రపాఠాలు పలుకరేమిటి? సూతులు పురాతన వృత్తాంతాలు ప్రశంసించరేమిటి? మాగధులు మీ వంశావళిని కీర్తించరేమిటి? ఎందువల్ల?

"నాథా, వేదపారంగతులు అయిన బ్రాహ్మణులు మూర్ధాభిషిక్తులు అయిన మీ శిరముమీద తేనె పెరుగూ పెట్టి అభిషేకము చేయరా ఏమిటి?

మంత్రులూ శ్రేణీ ముఖ్యులూ పౌర జానపద ముఖ్యులూ మీ వెంట నడవడానికి చక్కగా అలంకరించుకొని రాలేదు ఏమిటి? మీముందు నడవడానికి నాల్గు గుర్రాల బంగారు పుష్య రథము రాలేదు ఏమిటి? మీ ముందు నడవడానికి నీల మేఘము నేలమీద నడుస్తున్నదో, కాక నల్లటి కొండ కదిలి పోతున్నదో అన్నట్టు కనిపించే శత్రుంజయము అనే మదపుటేనుగు రాలేదు ఏమిటి? మీ ముందు నడవటానికి బంగారు భద్రాసనముతో వీర పురుషులు రాలేదు ఏమిటి?

"ప్రభూ, ఇప్పుడు మీ ముఖములో సంతోషచ్ఛాయలే కనిపించడము లేదు. మీ ముఖవర్ణము అపూర్వముగా మారి పోయింది. మీరు ఇప్పుడు ఇట్లా ఎందుకు వచ్చినారు?" అంటూ ఏడ్చింది.

"సీతా, పూజ్యపాదులు మా నాయనగారు నన్ను వనవాసము చేయమని ఆజ్ఞాపించినారు. నేను వెంటనే వెళ్లి పోవలెను. వారు ఎందుకు ఇట్లా ఆజ్ఞాపించినారో చెప్పుతాను, విను. పూర్వము ఒకప్పుడు నాతల్లి కైకేయీదేవికి మా నాయనగారు రెండు వరాలు ఇచ్చినారు. అవి ఆయన ఇంతవరకూ ఆమెకు చెల్లించలేదు. ఇప్పుడు నా పట్టాభిషేకము తలపెట్టి సర్వమూ సంసిద్ధము చేస్తూ ఉంటే కైకేయీదేవి ఇదే సరి అయిన సమయము అనుకొని తనకు అదివరకు వాగ్దానము చేసిన ఆ రెండు వరాలూ చెల్లించమని మా నాయనగారిని అడిగింది. ఆ రెండు వరాలకుగాను భరతుడికి రాజ్యాభిషేకము చేయుమనీ నన్ను పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేయించమనీ చెప్పింది. మా తండ్రి పరమ ధార్మికుడు. ఆడి తప్పనివాడు. తల ఒగ్గినాడు. నన్ను అడవులకు పొమ్మన్నాడు. నేను ప్రయాణము అయిపోతూ నిన్ను చూడడానికి ఇక్కడికి వచ్చినాను.

"సీతా, నీవు మహా పూజ్యము అయిన వంశములో పుట్టినావు. సమస్త ధర్మాలూ తెలిసినదానవు. పరమ ధర్మవేత్త అయిన జనకమహారాజుకూతురవు. ధర్మచారిణివి. నేను ఈనాడే - ఇప్పుడే అడవులకు వెళ్ళి పోవలెను.

"ఓ సీతా, పరంపరాగతము అయిన ఈ రాజ్యాన్ని దశరథమహారాజు భరతుడికి ఇచ్చివేసినాడు. ఇకను ఈ దేశానికీ ఈ రాజగృహానికీ భరతుడు ప్రభువు. వాడు నమస్కారము చేయడానికి నీ దగ్గరకు వస్తాడు. నీవు వాని ఎదుట నన్ను శ్లాఘించ కూడదు. నా గుణగణాలను గురించి ప్రశంసించ కూడదు.

శ్రీమంతులు తమ సమక్షములో పరపురుషులను పొగడడము సహించరు అందులో రాజులు తమను ఆరాధించి సేవించేవారినే ఎప్పుడూ మెచ్చుకొంటూ గా. అహితము మాట్లాడితే ఔరస పుత్రులను అయినా వెళ్ళగొట్టుతారు సామర్థ్యముతో మెలగేట్లయితే సామాన్య జనులను అయినా దగ్గరకు చేరతీస్తారు అందువల్ల నీవు భరతుడికి అప్రియము చేయకూడదు. వాడి మనస్సు నొప్పించకూడదు. నీవు వాడికి అనుకూలముగా మెలగవలెను. ఇంతకూ భరతుడు బంధుత్వమునుంచి నిన్ను పోషిస్తాడు కాని నిన్ను ప్రత్యేకముగా పోషించవలసిన బాధ్యత వాడికి ఏమీ లేదు.

"ఓ జానకీ, నీవు ఇక భరతుణ్ణి వాడికన్నా ఎక్కువగా దశరథమహారాజునూ సంతోషపెట్టుతూ ఉండవలెను. ఓ కల్యాణీ, నీవు వ్రతోపవాసాదులతో కాలము గడుపుతూ ఉండవలెను. ఉషఃకాలానవే నిద్రలేచి యథావిధిగా దేవ పూజ చేసి నా తండ్రి దశరథమహారాజుకు నమస్కారము చేస్తూ ఉండవలెను. మా అమ్మ కౌసల్యాదేవి వృద్ధు. ఆమె దుఃఖముతో కృశించిపోకుండా నీవు ఆమెను సంతోషపెట్టుతూ ఉండవలెను సుమా. ఆమే కాదు తక్కిన నాతల్లులున్నూ నన్ను ఒక్క మాదిరిగా ఆదరించినారు. ప్రేమించినారు. కాపాడినారు. వారిని కూడా నీవు సంతోషపెట్టుతూ ఉండవలెను.

"ఓ మైథిలీ, నేను భరతశత్రుఘ్నులను నా ప్రాణముకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నీవు భరతుణ్ణి నీ తోపుట్టువుగానూ శత్రుఘ్నుణ్ణి నీ పుత్రుణ్ణిగానూ చూచుకొంటూ ఉండవలెను.

"ఓ వైదేహీ, నీవు ధర్మము తప్పవద్దు. సత్యవ్రత పరాయణవుగా ఉండు. నీకు ఏ ఆపదా రాదు. ఓ ప్రియురాలా, నేను వెళ్ళిపోతున్నాను. ఓ భామినీ, నీవు ఇక్కడనే ఉండవలెను. నీవు ఎవరి మనస్సూ నొప్పించకూడదు. ఇంతకన్నా ఏమి చెప్పేది" అన్నాడు రాముడు.

౨౭

సీతాదేవి ఎవరితో అయినా ఎప్పుడూ ఎంతో మంచిగా మాట్లాడుతుంది. కోపము వచ్చినా అప్రియము ఆడదు. ఎవరి మనస్సూ నొప్పించదు. ఎవరూ ఆమెకు అప్రియము చెప్పరు; ఆమె మనస్సు నొప్పించరు.

రాముడు ఇట్లా చెప్పినాడు. ఆమెకు ప్రణయకోపము వంటి కోపము వచ్చింది. "ప్రభూ, తాము దశరథ మహారాజుకు జ్యేష్ఠపుత్రులు. తాము ఇంత చౌకగా మాట్లాడడము నేను ఇదివరకు ఎన్నడూ వినలేదు. మీరు చెప్పింది వింటే ఆడుదానికి నాకే నవ్వు వస్తూ ఉంది. తల్లీ తండ్రీ తోడుపుట్టువూ కొడుకూ కోడలూ మొదలు అయినవారు అందరూ వారు వారు చేసుకొన్న పుణ్యపాపాలను పట్టి శుభాశుభ ఫలాలు అనుభవిస్తూ ఉంటారు. భార్య ఒక్కతే భర్త అనుభవించే శుభాశుభాలను అన్నిటినీ అనుభవిస్తుంది. దశరథ మహారాజు మిమ్మలను అడవికి పొమ్మంటే నన్నూ పొమ్మన్నట్టే. ఆడుదానికి తండ్రీ తల్లీ కొడుకూ చెలికత్తే దిక్కు కారు. ఆడది స్వతంత్రురాలు కాదు. ఆడుదానికి ఈ లోకములో అయినా పరలోకములో అయినా భర్త ఒక్కడే గతి.

"దేవా, మీరు దుర్గమారణ్యానికి ప్రయాణము అయిపోతున్నాము అంటున్నారు. కాబట్టి నేను మీకన్నా ముందుగా నడచి దారిలో అడ్డము అయ్యే దర్భలూ మొదలుఅయినవాటిని అణగత్రొక్కుతాను. అప్పుడు దారి మీ పాదాలకు మెత్తగా ఉంటుంది. మీతో వనవాసము చేస్తాను. మీ పుణ్యములో నేను పాలు పంచుకొంటాను. అనే ఈర్ష్య మీకు వద్దు. రావద్దు అంటే వస్తాను. అని ఎదురు ఆడుతున్నది అనే కోపము మీకు వద్దు. ఇతరులు త్రాగిన నీళ్ళను అవతల పారపోసేట్టు నన్ను విడిచిపెట్టి పోవద్దు. మీతో రావద్దు అనడానికి నేను మీకు ఏ అపకారమూ చేయలేదు. ఏ పాపమూ చేయలేదు. నామాట మీరు నమ్మండి. నన్ను మీ వెంట తీసుకొని పొండి.

"స్వామీ, భార్య అయింది ఎప్పుడూ భర్తను అనుసరించుకొని ఉండవలెను. భర్త అడుగుజాడలలో మెలగుతూ ఉండవలెను ప్రాసాదాగ్ర భాగాలలో తిరిగినా విమానగృహాలలో నివసించినా వ్యోమమార్గాన అణిమాదిసిద్ధులతో సంచరించినా భార్య అయింది భర్తతోనే ఉండవలెను. సర్వకాల సర్వావస్థలలోనూ భర్తతో ఉండడమే భార్యకు ధర్మము. ఈ విషయము మా అమ్మా మా నాయనగారూ నాకు ఎంతో బోధించినారు. ఇప్పుడు ఈ విషయము నేను కొత్తగా తెలుసుకోవలసింది ఏమీ కాదు.

"నాథా, మీరు పోయే అడవి చొరరానిది అయినా సరే, నిర్జనము అయింది అయినా సరే, పెద్దపులులూ సింహాలూ ఏనుగులూ తోడేళ్ళు మొదలు

అయిన క్రూరజంతువులు తిరిగేది అయినా సరే నేను మీతో రాక తప్పదు. నేను మీ వెంట ఉండక తప్పదు. మీ వెంట ఉంటూ మీకు సేవ చేస్తూ ఉంటే నాకు సుఖముగా ఉంటుంది. సంతోషముగా ఉంటుంది. ఉత్త సుఖమూ సంతోషమే కాదు. నా పుట్టినింట్లో ఉన్నట్టుగా ఉంటుంది. మీకు లేకుండా నాకు త్రైలోక్యాధిపత్యము ఇచ్చినా నేను సుఖపడను. సంతోషించను.

"ఓ వీరాగ్రణీ, మహారణ్యములో నేను మీకు ఎప్పుడూ ఉపచారము చేస్తూ ఉంటాను. నియముతో బ్రహ్మచారిణిగా ప్రవర్తిస్తాను. మీతో పాటు వనమధు గంధవాసనలు ఆఘ్రాణిస్తూ క్రీడిస్తాను. ఎంతమందిని అయినా ఎక్కడను అయినా కాపాడే శక్తి మీకు ఉంది. నన్ను కాపాడడము తమకు ఒక లెక్కా? నేనూ మీతో అడవికి వస్తాను. సందేహించవద్దు. మీతో వనవాసము చేయవలెను. అని నేను నిశ్చయించుకొన్నాను. ఇక నన్ను ఆపడము మీకు అశక్యము. నేనూ ఫల మూలాలే తింటాను. అది కావలెను, ఇది కావలెను అనను. సంశయించ వద్దు. మీకు ఏ విధము అయిన కష్టమూ కలగ చేయను.

"నాథా, మీరు బుద్ధిమంతులు. పరమపరాక్రమవంతులు. మీరు తోడుగా ఉంటారు కనుక నేను మహానదులూ పర్వతాలూ పర్వతాలూ నిర్భయముగా చూస్తాను. విరగ పూసిన తామరకొలనుల దగ్గర హంసలనూ నీరుకోళ్ళనూ చూస్తు మీతో హాయిగా విహరిస్తాను. మీతో పాటు ఆ తామర కొలనులలో స్నానము చేస్తూ దృఢనియమాలతో ఉంటాను. ఎంతో సంతోషముతో మీతో సంచరిస్తాను. మహారణ్యములో అట్లా మీతో లక్షసంవత్సరాలు ఉన్నా నాకు అంత కాలము గతించినట్టే ఉండదు. మీరు లేకుండా స్వర్గలోకములో నన్ను ఉండమన్నా నేను ఉండను.

"ప్రభూ, నేను మీతో వస్తాను. ఎంత చొరరాని అడవి అయినా మీరు వెంట ఉంటారు కనుక నేను నిర్భయముగా నడుస్తాను. ఎన్ని క్రూరమృగాలు ఉన్నా భయపడను. మీ పాదాలు ఆశ్రయించుకొని నా పుట్టినింట్లో ఉన్నట్టు సుఖముగా ఉంటాను.

"నాథా, మిమ్ములను తప్ప నేను మరి ఒకరిని ఎరగను నా హృదయములో మీరు తప్ప మరి ఒకరు లేరు. మీరు నన్ను వదిలిపెట్టి పోయేట్టయితే నేను

తప్పకుండా చచ్చిపోతాను. నన్ను మీ వెంట తీసుకొని పోవలెను. నా ప్రార్థన మీరు అంగీకరించవలెను. నేను మీకు ఏ మాత్రమూ బరువు కాను'' అంటూ సీతాదేవి చెప్పింది.

ఆమె ఇట్లా చెప్పినా ఆమెను అరణ్యానికి తీసుకొని పోవడానికి ఆ ధర్మ వత్సలుడికి మనస్కరించ లేదు. వనవాస కష్టాలను గురించే ఎక్కువగా చెప్పినాడు.

౨౮

రాముడు ధర్మజ్ఞుడు. ఉత్త ధర్మజ్ఞుడే కాదు. ధర్మవత్సలుడు. వనవాస కష్టసుఖాలను గురించి ఆలోచించినాడు. ఆమెను తీసుకొనిపోవడానికి అతనికి బుద్ధి పుట్టలేదు.

సీతాదేవి కన్నులు కన్నీళ్ళతో కలకపారిపోయినవి. రాముడు ఆమెను సముదాయిస్తూ ''ఓ సీతా, నీవు మహా కులీనవు ధర్మిష్ఠవు. నీవు నీ ధర్మము ఆచరిస్తూ ఇక్కడనే ఉండవలెను. నీవు నీ మనస్సుకు తోచినట్టు చేయకూడదు. నీకు స్వాతంత్ర్యము లేదు. నేను చెప్పినట్టు నీవు వినవలెను. చేయవలెను. వనవాసము చేయడము చాలా కష్టము. నీవు ఇకను ఆ ఆలోచన పెట్టుకోవద్దు. నీ మంచికోసమే నేను చెప్పుతున్నాను. నిన్ను భరించడము నాకు ఒక కష్టము కాదు.

''సీతా, వనవాసము ఏ మాత్రమూ సుఖముగా ఉండదు. పెద్ద పెద్ద కొండల మీది నుంచి జారిపడే సెలఏళ్ళ హోరూ కొండ గుహాలలో నివసించే క్రూరజంతువుల గర్జనలూ మహా భయంకరముగా వినిపిస్తూ ఉంటవి. నిర్జనము అయినందువల్ల సింహ శార్దూలాది ఘాతుకమృగాలు విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటవి మనము వాటి కంట పడితే మహాసంభ్రమముతో అవి మనలను ఎదుర్కొంటవి. నదులలో పెద్ద పెద్ద మొసళ్ళు ఉంటవి. ఆ నదుల ప్రాంతము అంతా బురదగా ఉంటుంది. మదపుటేనుగులు సయితము ఆ బురదలో ఆ నదులు దాటి అవతలికి పోలేవు. ఇకను ఏ దారిన ఎటు పోవలెను అనుకొన్నా దట్టముగా అల్లుకొన్న ముళ్ళ తీగలు అడ్డము అవుతవి. అడవికోళ్ళు భయంకరముగా కూస్తూ ఉంటవి. మెట్టను ఇన్ని మంచి నీళ్ళు అయినా దొరకవు. ఎటు పోవడానికీ దారి

దొరకదు. పగలు అంతా నానా కష్టాలూ పడుతూ వాటి అంతట అవి రాలిన పండ్లను ఏరుకొని తినవలెను. నేల రాలిన ఆకులతో రాత్రిపూట మెత్తలు చేసుకొని పడుకోవలెను. కందమూలాలూ పండి రాలిన పండ్లూ తప్ప తినడానికి మరి ఏవీ దొరుకవు. అప్పుడు అప్పుడు ఉపవాసాలు ఉండవలసి వస్తూ ఉంటుంది.

"ఓ మైథిలీ, జటలు ధరించి వల్కలాలు కట్టుకోవలెను. దేవతలనూ పితృదేవతలనూ ఎప్పటికి అప్పుడు వచ్చిన అతిథులనూ యథావిధిగా పూజచేస్తూ ఉండవలెను. ప్రతిదినమూ ముమ్మారు స్నానము చేయవలెను. స్వయముగా పూలు కోసి తెచ్చుకొని అగ్ని వేదిక దగ్గర పెట్టి పూజ చేస్తూ ఉండవలెను. ఋషుల మాదిరిగా జీవించవలెను. ఎప్పుడూ ఆకలి వేస్తూ ఉంటుంది. దొరికినవి మాత్రమే తిని తృప్తి పడవలసి ఉంటుంది. గాలి విపరీతముగా వీస్తూ ఉంటుంది. పొద్దుకూకగానే చిమ్మచీకట్లు కమ్ముకొంటవి. నిరంతరమూ భయము భయముగా ఉంటుంది. అనేక రకాల పాములు వంకరటింకరగా అమిత దర్పముతో నేల మీద తిరుగుతూ ఉంటవి. అవి దారులకు అడ్డముగా పడుకొంటవి. అవి వేటినీ కదలనీయవు. మెదలనీయవు. ఆ పాములకు తోడు తేళ్ళూ అడవి ఈగలూ దోమలూ పెద్ద పెద్ద మిడితలూ ఎప్పుడూ బాధపెట్టుతూ ఉంటవి.

"ఓ సీతా, అడవిలో చెట్లు దట్టముగా పెరిగి కొమ్మలు ఒక దానితో ఒకటి పెనవేసుకొని పోయి ఉంటవి. దర్భలూ రెల్లూ మొదలు అయినవి ముండ్లు తేలి ఉంటవి. నడవడానికి వీలు కాదు. వనవాసము చేసే వారి కాయక్లేశము చెప్ప తరము కాదు. దేనికీ ఆశపడకూడదు. ముందుగా కోపాన్ని వదలి పెట్టవలెను. భయము వేసినా భయపడకుండా ఉండవలెను. ఓ జానకీ, నేను చాల దూరము యోచించినాను. నీవు ఇక్కడనే ఉండవలెను'' అన్నాడు.

ఈ మాటకు సీతాదేవికి మరింత దిగులు వేసింది.

౨౬

సీతాదేవి కన్నీళ్లు కారుస్తూ "నాథా, మీరు చెప్పుతూ ఉన్న వనవాస కష్టాలు అన్నీ మీ సహవాసమువల్ల నాకు సౌఖ్యాలుగానే పరిణమిస్తవి. సింహా శంభ శార్దూలాలూ పెద్ద చమరీ మృగాలూ భయంకరము అయిన పక్షులూ ఇంకా ఇతర క్రూరమృగాలూ మీవంటి అతిమానుషరూపాన్ని అదివరకు అడ

విల్లో ఎన్నడూ చూచి ఉండవు. అందువల్ల అవి మిమ్ములను చూడగానే భయపడి అవతలకు పారిపోవవి. నేను మీ వెంట ఉంటాను కనుక నాకు వాటి భయము ఏమీ ఉండదు.

"ప్రభూ, మీ నాయనగారు మిమ్ములను వనవాసము చేయమని ఆజ్ఞాపించినారు కనుక అవశ్యము నేనూ మీ వెంట బయలుదేరవలెను. మీభార్యను కనుక నేను ఎప్పుడూ మీతోనే ఉండవలెను. మీరు లేకుండా నేను ఇక్కడ ఉండను. ఒక వేళ మీరు నన్ను వదలిపెట్టిపోయేట్లయితే నేను జీవించకూడదు. అది ధర్మము. మీరు దగ్గర ఉంటే సురేశ్వరుడు సయితము నావంక కన్నెత్తి అయినా చూడలేడు. చూచినాడో అవమానపడి పోతాడు. మొగుడు వదిలిపెట్టిన స్త్రీ బ్రతుకకూడదు అనే విషయము మీరు ఇంతవరకు నాతో అనేక సార్లు చెప్పినారు.

"ఓ మహాప్రాజ్ఞా, నేను కొంతకాలము వనవాసము చేయవలసివస్తుంది అని సాముద్రిక లక్షణజ్ఞులు అయిన బ్రాహ్మణులు మా నాయనగారితో చెప్పుతూ ఉండగా విన్నాను. ఆ బ్రాహ్మణుల మాట విన్నప్పటినుంచి ఎప్పుడెప్పుడు వనవాసము చేదామా అని ఉవ్విళ్ళూరుతూ ఉన్నాను. ఇప్పుడు దైవికముగా మీరు వనవాసము చేయవలసి వచ్చింది. అందువల్ల నేనూ మీతో వనవాసము చేస్తాను. ఇట్లా కాకపోయేట్లయితే మరి ఒక విధముగా నాకు వనవాసము సంభవించదు. వనవాసము కష్టము అని నాకూ తెలుసును. అయితే నియతాత్ములను ఏకష్టాలూ ఏమీ చేయలేవు. అందులో మీరు పరమ పరాక్రమవంతులు. మీ వెంట ఉంటాను కనుక నన్ను ఏకష్టాలూ ఏమీ చేయలేవు.

"నాథా, బ్రాహ్మణులు చెప్పడమే కాదు; నాకు పెండ్లికాక పూర్వము మా అమ్మదగ్గర నేను కూర్చుని ఉండగా ఒకానొక తాపసాంగన వచ్చి నన్ను చూచి 'ఈ అమ్మాయి భర్తతో కొంతకాలము వనవాసము చేస్తుంది' అనిచెప్పింది. అందువల్లనే నేను మీ దగ్గరకు వచ్చినప్పటినుంచీ మనము గంగాతీరాన తపోవనాలలో కొంతకాలము ఉందాము అని చెప్పుతూ వచ్చినాను. మీరున్నూ అందుకు అంగీకరించినారు. కాబట్టి ఇప్పుడు మీతో వనవాసానికి బయలుదేరడము అంటే నాకు పండుగగా ఉంది. వనవాసములో మీకు నేను సేవ చేయవలెను అనుకొంటున్నాను. మీరు పరిశుద్ధులు. నిర్మలాంతఃకరణులు. మీ వెంట

ఉంటూ మీకు సేవ చేస్తూ ఉంటే నాపాపాలు అన్నీ పటాపంచలు అయిపో తవి. మీరు నా భర్తలు. మీరు తప్ప నాకు వేరే దేవుడు లేడు. ఇహలోకములోనే కాదు, ఏ పరలోకములోనూ మిమ్ములను ఎడబాసి నేను ఉండను.

"ప్రభూ, తండ్రి ధర్మవిహితముగా ఉదకపూర్వకముగా తన కన్నెను ఎవరికి ఇచ్చి పెండ్లిచేస్తాడో వాడే ఆ కన్యకకు ఇహపరలోకాలలో పెనిమిటి అని వేదవాక్యాలు బ్రాహ్మణులు చదువుతూ ఉండగా మీరున్నూ విన్నారు. నేను మీ ఇల్లాలిని. మీ భక్తురాలను. మీకు సేవ చేయడమే నా వ్రతము. మీరు నన్ను దిగవిడిచిపోతారేమో అని దుఃఖపడుతున్నాను. ఇప్పుడు ఏ హేతువువల్ల మీరు నన్ను మీ వెంట తీసుకొనిపోవడానికి ఒప్పుకోవడము లేదు? మీ సుఖ దుఃఖాలను నేనూ అనుభవించవలెను. మీరు సుఖము అనుభవించేట్లయితే నేనూ సుఖము అనుభవిస్తాను. మీరు దుఃఖము అనుభవించవలసి వచ్చేట్లయితే మీ దుఃఖాన్ని నేనూ పాలు పంచుకొంటాను. ప్రభూ, నన్ను మీ వెంట తీసుకొని పోవలెను.

"స్వామీ, మీరు ఒప్పుకోకపోయేట్లయితే నేను బ్రతకడము ఉత్తది. విషము అయినా త్రాగుతాను. నిప్పు అయినా పెట్టుకొంటాను. అదీ కాక పోయేట్లయితే నీళ్ళలో అయినా దూకుతాను. కాని నేను బ్రతుకను" అన్నది.

సీతాదేవి ఇంత చెప్పినా, అడవిలో జనులు ఎవరూ ఉండరు అనే ఆలోచనతో ఆమెను వెంట తీసుకొనిపోవడానికి రాముడు ఇష్టపడలేదు.

ఆమె వేడి కన్నీళ్ళతో అక్కడి నేల అంతా తడిసి పోయింది. వేడుపులో ఆమె ఎర్రటి పెదవులు వణికి పోయినవి.

## ౩౦

ఏది ఏమి అయిపోయినప్పటికిన్నీ సీతాదేవి రాముడితో వనవాసము చేయు డానికే నిశ్చయించుకొన్నది. అతని విశాల వక్షస్థలము వంక చూచింది. ఆమె ప్రేమ అతిశయించింది. అతని శౌర్యాన్ని గురించి ఆలోచించింది. ఆమెకు కోపము రేగింది. కంపించి పోతూ 'ఆర్యపుత్రా, తమకు సౌందర్యము మాత్రము ఉంది; పౌరుషము లేదు. తమ సౌందర్యానికి అందరూ బ్రమసిపోయినారు. అంతే. నన్ను ఒక్కతెనూ వెంటబెట్టుకొనిపోయి పోషించలేక తాము నన్ను

ఇక్కడ వదలిపెట్టిపోయినారు అని మాతండ్రి జనకమహారాజుకు తెలుస్తుంది. పురుష వేషములో ఉన్న స్త్రీ అని తెలియక పిల్లను ఇచ్చి పెండ్లి చేసినానే అని ఆ క్షత్రియుడు—ఆ శూరుడు దుఃఖ పడుతాడు.

"నాథా, తాము ఈ జగత్తును అంతా తాపము ఎత్తించే సూర్యుని అంతటి తేజోవంతులు అని అందరూ చెప్పుకొంటూ ఉన్నారు. ఇప్పుడు తాము నన్ను ఇక్కడనుంచి ఒంటరిగా పోయేట్లయితే రాముడు తేజోవంతుడు అనుకొన్నది అంతా అబద్ధము అని అజ్ఞానమువల్ల అట్లా అనుకొన్నాము అని ఇకముందు అందరూ చెప్పుకొంటారు.

"స్వామీ, నన్ను తమ వెంట తీసుకొనిపోవడము ఏమి అకార్యము అని ఇప్పుడు తాము దుఃఖపడుతున్నారు? ఎన్నడూ దేనికీ భయపడని మీరు ఇప్పుడు ఎందుకు భయపడవలసి వచ్చింది? ప్రభూ, నేను అనన్య పరాయణను. నన్ను ఎందుకు ఇక్కడ వదలిపెట్టి మీరు ఒక్కరే పోవలెను అనుకొన్నారు? ద్యుమత్సేనుడి కౌమారుడు సత్యవంతుణ్ణి సావిత్రీదేవి పెండ్లి ఆడింది. ఆ సావిత్రీదేవి భర్తను అనుసరించుకొని ఉండడమే వ్రతముగా పెట్టుకొన్నది. నేనూ అదే వ్రతము అవలంబించినాను. మీకు తెలుసును. మీరు ఎక్కడికి పోతే నేనూ మీ వెంట అక్కడికి వస్తాను. నేను కులపాంసనిని కాను. కనుక నేను ఎప్పుడూ మీ వెంటనే ఉండవలెను. మిమ్ములను వదలిపెట్టి ఇక్కడనే కాదు ఎక్కడనూ ఉండను.

"నాథా, నేను మీ సతిని. మీరు నన్ను వివాహము చేసుకొన్నది మొదలు నేను మీ సాహచర్యము చేస్తూ ఉన్నాను. మనము ఇప్పుడు వన యౌవనములో ఉన్నాము. మీరు ఇప్పుడు జాయాజీవులవలె నన్ను మరి ఒకరికి ఎందుకు ఒప్పగించ తలచినారు? భరతుడికి హితము చేయుమని తాము నాతో చెప్పినారు. కౌసల్యాదేవికీ దశరథమహారాజుకూ సేవ చేయుమనికూడా చెప్పినారు. అందుకోసము తాము నన్ను అడవికి తమ వెంట రావద్దు అన్నారు. వారికి హితము చేయడమూ సేవ చేయడమూ నాకు సంబంధించిన పని కాదు. అది తమ పని. నాకు వారితో నిమిత్తము లేదు. ఎప్పుడూ తమతో ఉంటూ తమకు సేవ చేస్తూ ఉండడమే నాధర్మము. ప్రభూ, తాము సమస్తధర్మాలూ

తెలిసినవారు. నన్ను మాత్రము ఇప్పుడు ఇక్కడ వదలిపెట్టి తాము ఒక్కరే వనవాసము చేయ పోవడము అధర్మము.

“నాథా, తాము తపస్సు చేయ తలచుకొన్నా, అరణ్యములో నివాసము పెట్టుకో తలచుకున్నా, స్వర్గానికి ప్రయాణము అయిపో తలచుకున్నా నేను మీ వెంట ఉండవలెను. తాము తప్ప నాకు మరి ఒక లోకము లేదు. నేను మీ సరసను ఉంటే మహారణ్యములో అయినా ఉద్యానవనములో ఉన్నట్టుగా ఉంటుంది. నాకు దారిలో ఏ అలసటా ఉండదు. దర్భలూ రెల్లూ ఇంకా ఇతర ముండ్ల దుబ్బులూ నా కాళ్లకు గుచ్చుకోవు. అవి దూదివలెనూ జింకతోలువలెనూ నా కాళ్ళకు మెత్తగా తగులుతవి. ముండ్లచెట్లు అన్నీ నాకు పూలచెట్లుగా కనపడతవి. గాలికి రేగి నా దేహానికి అంటుకొనే దుమ్ముధూళీ చందనచర్చ చేసుకొన్నట్టుగా ఉంటుంది. పచ్చిక బయళ్లలో మీతో శయనిస్తే ఇక్కడ చిత్రకంబళాలు పరచిన పాన్పులమీద పడుకోవడముకన్నా ఎక్కువ సుఖముగా ఉంటుంది. మీ చేతి మీదుగా మీరు అడవిలో ఏ కానిని ఆకులో పండ్లో కందమూలాలో కాయలో అందిస్తే అవి నాకు అమృతతుల్యముగా ఉంటవి. ఆయా ఋతువులలో పూసే పూలు పెట్టుకొంటూ ఆయా కాలాలలో కాసే కాయలు తింటూ మీతో విహరిస్తూ ఉంటే మీ ఇల్లు కానీ మా ఇల్లుకానీ జ్ఞాపకము రావు. మా నాయన కానీ మా అమ్మ కానీ స్మరణకు రారు.

“నాథా, అడవిలో నా నుంచి మీకు ఏ కొంచెము కష్టమూ కలగనీయను. మిమ్ములను ఏ మాత్రమూ దిగులు పడనీయను నేను మీకు ఏమీ బరువుగా ఉండను. మీతో నేను ఎక్కడ ఉంటే అదే నాకు స్వర్గము. మీరు లేకుండా నేను ఎక్కడ ఉన్నా అది నాకు నరకము. మన అనురాగము అటువంటిది. నన్ను ఇక్కడ దిగవిడిచి మీరు ఒక్కరే అడవులకు వెళ్ళి పోవద్దు. మీతో నేను కూడా వస్తాను

“ప్రభూ, నేను మీ శత్రువుల దగ్గర ఉండను. మీరు మీ వెంట తీసుకొని పోకపోయేట్లయితే నేను తప్పకుండా చచ్చిపోతాను. ఎప్పుడో మీరు లేనప్పుడు ఎందుకు – ఇప్పుడే మీ ఎదటనే నేను చచ్చిపోవడము మేలు అనిపిస్తూ ఉంది. మీ వియోగ దుఃఖము నేను ఒక్క ముహూర్తము అయినా భరించలేను.

తల్లిదండ్రుల ఆజ్ఞలను శిరసా వహించడము కన్నా పుత్రునికి అధికము అయిన ధర్మము మరి ఒకటి లేదు. తండ్రీ తల్లీ గురువూ ప్రత్యక్షదేవతలు. ఓ శుభనేత్రీ ఈ ముగ్గురే ముల్లోకాలూనూ. వీరిని ఆరాధిస్తే ముల్లోకాలూ స్వాధీనము అవుతవి. అందువల్ల నేను వీరిని ఆరాధిస్తున్నాను. జపతప స్స్వాధ్యాయ వ్రతక్రతువుల కన్నా పితృసేవ ఎక్కువ ఫలాన్ని ఇస్తుంది. పితృ సేవవల్ల సాధ్యము కానిది ఏమీ లేదు. పితృసేవాపరాయణులు అయిన మహాత్ములు దేవలోకమూ గంధర్వ లోకమూ గోలోకమూ ఇంకా ఇతరలోకాలూ క్రమముగా బ్రహ్మలోకమూ పొందుతున్నారు. మా తండ్రి సత్యధర్మపథము తప్పనివాడు. ఆయన ఆజ్ఞలను నేను శిరసా వహించవలెను. శిరసా వహిస్తున్నాను. పుత్రుడు అయిన ప్రతివారికీ ఇది సనాతన ధర్మము.

"సీతా, నిన్ను దండకారణ్యము తీసుకొనిపోవలెను అని నేను ఇదివరకు అనుకోలేదు. అయితే నీవు నాతో వనవాసము చేసితీరవలెను అని నిశ్చయించుకొన్నావు కాబట్టి తప్పకుండా నిన్ను నాతో తీసుకొనిపోతాను. ఓ మదిరేక్షణా, నీవు నాతో వనవాసము చేయడానికే ఏనుగుతొండమువంటి తొడలతోను చక్కని అవయవసౌష్ఠవముతోను పుట్టినావు. నీవు సహజభీరువు అయినప్పటికినీన్ని నా సహధర్మచారిణివిగా సంచరిస్తావు కాబట్టి నీకు ఏ భయమూ ఉండదు. నీవు నాతో వనవాసము చేయ తలచుకొన్నందువల్ల నీ వంశగౌరవాన్నీ నా వంశగౌరవాన్నీ నిలపెట్టుతున్నావు.

"ఓ శుభశ్రోణీ, నీవు నావెంట ఉండకపోయేట్లయితే స్వర్గములో నన్ను ఉండమన్నా నేను ఉండను. ఓ సీతా, ఇక మన వనవాస ప్రయాణానికి అవసరము అయిన ఏర్పాట్లు అన్నిటినీ నీవు చేయవలెను. బ్రాహ్మణోత్తములకు నానావిధములుగా దానము చేయవలెను. భిక్షుకులకు అన్నదానమూ చేయవలెను. ఆలస్యము చేయవద్దు. ఈ పనులన్నీ నీవు త్వరగా నెరవేర్చవలెను.

"సీతా, బ్రాహ్మణులకు ఇచ్చేవి అన్నీ ఇచ్చివేసిన తరువాత నావీ నీవీ సొమ్ములూ మంచి మంచి వస్త్రాలూ పాన్పులూ వాహనాలూ అందము అయిన వేడుకవస్తువులూ మన సేవకులకు ఇచ్చివేయవలెను" అని చెప్పినాడు.

అందుకు ఆమె ఎంతో సంతోషించింది. ఆ యశస్విని ఆ మనస్విని పెనిమిటి చెప్పినట్టుగా దానధర్మాలు చేయడానికి నిండు మనస్సుతో ఏర్పాట్లు చేయడము మొదలుపెట్టింది.

## ౩౧

సీతారాముల సంభాషణ లక్ష్మణుడు విన్నాడు. అతనికి పట్టరాని దుఃఖము వచ్చింది. కన్నీళ్లు కారుస్తూ సీతాదేవి వంక చూచి రాముడి పాదాలు పట్టుకొని "అన్నా, నీవు అడవికి పోవడము నాకు ఇష్టము లేదు. నీవు కాదు పోవలసిందేను అంటున్నావు. కాబట్టి నేను ముందుగా బయలుదేరుతున్నాను. ధనుర్ధరుణ్ణి అయి మీకు దోవతీస్తాను. నేను మీతో ఉంటాను కనుక మహారణ్యములో క్రూరమృగాలు భయంకరముగా గర్జించినా పెద్దపెద్ద పక్షులు ఘోరముగా కూసినా సీతాదేవి నీతో నిర్భయముగా ఉండవచ్చును. మీరు హాయిగా విహరించవచ్చును.

"రామా, నీవు లేకుండా నన్ను దేవలోకములో ఉండమన్నా ఉండను. నీవు లేకుండా నాకు అమరత్వము ప్రసాదించినా నేను అంగీకరించను. నీవు లేకుండా నన్ను ముల్లోకాలూ ఏలమన్నా నేను ఒల్లను. నేను ఎప్పుడూ నీతో ఉండవలసిన వాణ్ణేను" అన్నాడు లక్ష్మణుడు.

మహారణ్యానికి తనవెంట రావద్దు అని రాముడు ఎన్నో సామవాక్యాలతో లక్ష్మణుడికి చెప్పినాడు. అంతట లక్ష్మణుడు "రామా, ఇది ఏమిటి ? నేను ఎప్పుడూ నీతో ఉండడానికి నీవు ఇదివరకే అనుమతించినావు. ఇప్పుడు నేను ప్రయాణము అవుతూ ఉంటే వద్దు అంటున్నావు. కారణము ఏమిటి?" అని అడిగినాడు.

"తమ్ముడా, నీ మనస్సు ఎంతో మంచిది. నీవు పరమ ధార్మికుడవు. సత్పథగామివి. వీరుడవు. సఖుడవు. నా అధీనుడవు. నాకు ప్రాణసముడవు. నా తమ్ముడవు. నన్ను ఎప్పుడూ సంతోష పెట్టడమే పనిగా పెట్టుకొన్నావు. నీవు నాతో అరణ్యానికి వస్తే నాకు అక్కడ తప్పకుండా హాయిగా ఉంటుంది. నాకు తెలుసును. కాని ఇక్కడ నా తల్లి కౌసల్యాదేవినీ పరమ యశస్విని అయిన మీ అమ్మ సుమిత్రాదేవినీ కనిపెట్టుకొని ఉండేవారు ఎవరు? మహా

తేజోవంతుడు. మన తండ్రి దశరథమహారాజు ఇంతవరకూ దేవేంద్రుడివలె తన వారికి అందరికీ కోరిన కోరికలు చెల్లిస్తూ వచ్చినాడు. ఇప్పుడు ఆయన కామ పాశ బద్ధుడు అయిపోయినాడు. ఇకను ఈ రాజ్యాన్ని అంతా కేకయరాజపుత్రి స్వాధీనము చేసుకొంటుంది. ఆమె తన సవతులను తిన్నగా చూడదు. భరతుడు రాజు అయినప్పటికిన్నీ కైకేయీదేవి చెప్పు చేతలలోనే ఉంటాడు. అందువల్ల వాడున్నూ దుఃఖాలపాలు అయిన మన తల్లులను గురించి ఆలోచించను అయినా ఆలోచించడు. కాబట్టి నీవు ఇక్కడనే ఉండిపోయి రాజానుగ్రహమువల్ల కానీ నీ అంతట నీవే కానీ పూజ్యురాండ్రను కాపాడవలెను. నేను చెప్పు తున్నాను. నీవు ఈ పని చేయవలెను. లక్ష్మణా, నీకు నామీద ఉన్న భక్తిని నీవు ఈ విధముగా చూపించవలెను. నీవు సమస్త ధర్మాలూ తెలిసినవాడవు. గురుజన పూజనముకన్నా అధికము అయిన ధర్మము లేదు. ఇక నేను వెళ్ళిపోతాను. నాకు గాను నీవు మా అమ్మనూ మీ అమ్మనూ కనిపెట్టుకొని ఉండవలెను. వారిని సుఖపెట్టవలెను. సంతోషపెట్టవలెను'' అని రాముడు చెప్పినాడు.

''రామా, నీ పరాక్రమము భరతుడు బాగా ఎరుగును. వాడు కౌసల్యా సుమిత్రలను శ్రద్ధతో చూస్తాడు. వారిని పూజిస్తాడు. వారికి సేవ చేస్తాడు. సందేహము లేదు. ఇంతకూ కౌసల్యాదేవిని ఒకరు కనిపెట్టుకొని ఉండవలసిన అవసరమే లేదు. ఆమె తన ఆశ్రితులకు ఒక వెయ్యి గ్రామాలు దానము ఇచ్చింది. ఆమె నాబోటివాండ్లను ఎంతమందిని అయినా కనిపెట్టి కాపాడ గలదు. ఆ యశస్విని తనతోపాటు మా అమ్మనూ ఇంకా ఎంతమందిని అయినా కాపాడుతుంది. నీవు మీ అమ్మను గురించీ మా అమ్మను గురించీ విచారపడ నక్కరలేదు.

''రామా, నేను నీ కింకరుణ్ణిగా ఉంటాను. నేను ఇట్లా చేయడములో అధర్మము ఏమీ లేదు. నేను కృతార్థుణ్ణి అవుతాను. నీ పని నెరవేరుతుంది. ప్రభూ, నేను ధనుస్సూ బాణాలూ గడ్డపలుగూ గంపా తీసుకొని ఇప్పుడే ప్రయాణము అయిపోతున్నాను. కందమూలాలూ పండ్లూ ఇంకా తాపసులు ఆరగించే ఆహారపదార్థాలూ నీకోసము సంపాదించి ఉంచుతాను. అడవిలో మీకు నేను ఎప్పుడూ కావలిఉంటాను. నీవు సీతాదేవితో పర్వతసానువులలో

హాయిగా విహరిస్తూ ఉండవచ్చును. మీరు రాత్రిపూట నిర్భయముగా నిద్ర పోవచ్చును.

"ప్రభూ, నేను నీ కింకరుణ్ణి. దివారాత్ర భేదము లేకుండా నీకు సేవ చేయడమే నా ధర్మము" అన్నాడు లక్ష్మణుడు.

రాముడు సంతోషముతో "లక్ష్మణా, నీవు ఇప్పుడే పోయి నీ స్నేహితులు అందరికీ వీడ్కోలు చెప్పు. జనకమహారాజు యజ్ఞానికి మనము పోయి నప్పుడు అక్కడ వరుణదేవుడు మనకు అభేద్యము అయిన కవచాలు రెండూ అక్షయ తూణీరాలతో ధనుస్సులు రెండూ సూర్యసమాన తేజముతో తళతళ లాడే బంగారు పిడులు వేసిన ఖడ్గాలు రెండూ ఇచ్చినాడు. మనము వాటిని పూజార్థము వశిష్ఠులవారి ఇంట్లో ఉంచినాము. మనకు ఇప్పుడు అవి కావలెను. నీవుపోయి వాటిని వెంటనే పట్టుకొని రావలెను" అని ఆజ్ఞాపించినాడు.

రాముడితోపాటు తానూ వనవాసానికి పోతున్నట్టు లక్ష్మణుడు తన మిత్రుల అందరికీ వీడ్కోలు చెప్పినాడు. వసిష్ఠులవారి ఇంటికిపోయి అక్కడ ఉంచిన ఆయుధాలను తీసుకొన్నాడు. తిరిగి రామమందిరానికి వచ్చినాడు. రాముడు సంతోషముతో "సౌమ్యుడా, నీకోసమే చూస్తూ ఉన్నాను. సమయానికి వచ్చినావు. నా స్వంత సొమ్మును అంతా నా ఆశ్రితులకూ బ్రాహ్మణోత్తములకూ దానము ఇవ్వ తలచినాను. నీవు స్వయముగా పోయి వసిష్ఠులవారి పుత్రుడూ బ్రాహ్మణోత్తములలో పరమ పూజ్యుడూ అయిన సుయజ్ఞుణ్ణి ఇక్కడికి వెంటపెట్టుకొని రావలెను. ఆ సుయజ్ఞుణ్ణీ తక్కిన బ్రాహ్మణోత్తములనూ సత్కరించి వారి ఆశీర్వాదాలతో మనము ఈనాడే అరణ్యవాసానికి ప్రయాణము అయిపోదాము" అన్నాడు.

౩౨

రామాజ్ఞను శిరసా వహించి లక్ష్మణుడు సుయజ్ఞుడి ఇంటికి పోయినాడు. అగ్నిహోత్రి గృహములో ఉన్న సుయజ్ఞుణ్ణి సందర్శించి నమస్కారము చేసి "మిత్రమా, మా అన్న రాముడు దుష్కరకర్మకారి వనవాసానికి ప్రయాణము అవుతున్నాడు. తాము వచ్చి చూడవలెను" అన్నాడు.

సుయజ్ఞుడు మధ్యాహ్న సంధ్యావందనము చప్పున పూర్తిచేసి లక్ష్మణుడితో బయలుదేరినాడు. లక్ష్మీ సంపన్నము అయిన రాముడి రమ్య మందిరానికి వచ్చినాడు. హుతాగ్ని హోత్రుడివలె జ్వలిస్తూ ఉన్న ఆ వేదవేత్తను సీతారాములు ప్రదక్షిణము చేసినారు. నమస్కారము చేసినారు. ఆయనను కూర్చుండ పెట్టినారు. అంతట రాముడు మణులు తాపటము చేసిన తన బాహుపురులనూ బంగారు బాహుపురులనూ చక్కని కుండలాలనూ బంగారము చుట్టిన మణిసరాలనూ రత్నాభరణాలనూ కంకణాలనూ ఆ సుయజ్ఞుడికి దానము ఇచ్చినాడు. సీతాదేవి రాముడికి సంజ్ఞ చేసింది. అంతట రాముడు సుయజ్ఞుడితో "మిత్రుడా, నా ఇల్లాలు సీతాదేవికూడా నాతో అరణ్యవాసానికి వస్తూవుంది. ఆమె తన ఆభరణాలను మీ భార్యకు ఇవ్వతలచింది. వాటిని మీరు తీసుకొని పోయి మీ భార్యకు ఇవ్వవలెను" అన్నాడు. సీతాదేవి తన కంఠహారాన్ని మణులు పొదిగిన కంఠాభరణాన్ని మొలనూలునూ రంగురంగుల బాహుపురులనూ బంగారు బాహుపురులనూ సుయజ్ఞుడి చేతికి ఇచ్చింది.

రాముడు తిరిగీ "స్వామీ, నాభార్య రత్న ఖచితము అయిన ఈ పర్యంకాన్ని దీనిమీద పరిచే ఆస్తరణముతో కూడా మీకు ఇవ్వమన్నది. మీరు దీనిని తీసుకోవలెను. నాకు మా మేనమామ శత్రుంజయము అనే ఏనుగును ఇచ్చినాడు. దానికి తోడుగా మరి ఒక వెయ్యి ఏనుగులున్నూ ఉన్నవి. వాటిని అన్నింటినీ మీకు ఇస్తాను. తీసుకోవలసింది" అంటూ వాటిని అన్నింటినీ సుయజ్ఞుడికి ఇప్పించినాడు.

ఆ బ్రాహ్మణోత్తముడు సీతారామలక్ష్మణులను ఆశీర్వదించినాడు.

ఏమరుపాటు లేకుండా నిల్చుని ఉన్న లక్ష్మణుణ్ణి చూచి రాముడు బ్రహ్మదేవుడు దేవేంద్రుణ్ణి ఆజ్ఞాపించేట్టు "లక్ష్మణా, నీవు ఇప్పుడే పోయి అగస్త్య పుత్రుణ్ణీ కౌశికపుత్రుణ్ణీ ఆహ్వానించి తీసుకొని రావలెను. పయిర్లకు వానవలె వారికి నీవు మణులు కురిపించి వారిని సంతోషపెట్టవలెను. వారిని అర్చించవలెను. వారికి వేలకొద్దీ బంగారమూ వెండీ ఇంకా ఎన్నో గోవులూ ఇచ్చి వారిని సంతృప్తిపరచవలెను. మా అమ్మ కౌసల్యాదేవిని ప్రతిదినమూ శ్రద్ధతో ఆశీర్వదిస్తూ ఉన్న బ్రాహ్మణముఖ్యుడు ఒకాయన ఉన్నాడు. ఆయన తైత్తిరీయ శాఖాధ్యాయులకు అందరికీ గురువు, పండితుడు. ఆ వేదవేత్తను

రాపించి ఆయన తృప్తిపడేటట్టుగా పట్టు బట్టలనూ వాహనాలనూ దాసదాసీ జనాన్నీ ఇవ్వవలెను. చిత్రరధుడు అనే సూతుడు ఉన్నాడు. ఆయన దశరథ మహారాజుకు సచివుడు. నాకు సారథి. ఆయన చాలా కాలము నుంచీ మన ఇంట్లో ఉంటున్నాడు. మహార్హాలు అయిన వస్త్రాలనూ ధనాన్నీ ఒక వెయ్యి ఆవులనూ సన్నజీవాలనూ ఇచ్చి ఆయనను సంతోష పెట్టవలెను.

"కఠశాలాపశాఖాధ్యాయులు అయిన బ్రహ్మచారులూ పలాశదండ ధారులు అయిన బ్రహ్మచారులూ నా పోషణలో ఉన్నారు. వారు ఎప్పుడూ వేదాధ్యయనము చేస్తూ ఉంటారు. వారు అంతకు మించి ఏపనీ చేయరు. అయితే అతిరుచ్యము అయిన ఆహారముకోసము ఎప్పుడూ ఆశపడుతూ ఉంటారు. పెద్దలు అందరూ వానిని సమ్మానిస్తూ ఉంటారు. ఎనభై బండ్ల మణులనూ ధాన్యము వేసిన ఎద్దులను ఒక వెయ్యింటినీ దుక్కిటెద్దులను ఒక ఇన్నూటినీ వారికి ఇచ్చి వారిని సంభావించవలెను. ఒక వెయ్యి పాడి ఆవులను కూడా వారికి ఇవ్వవలెను.

"లక్ష్మణా, వీరే కాకుండా ఇంకా ఎంతోమంది బ్రాహ్మణులు మా అమ్మ కౌసల్యాదేవిని ఆశ్రయించుకొని ఉన్నారు. వారికి ఒక్కొక్కరికీ ఒక్కొక్క వెయ్యి గోవులను ఇవ్వవలెను.

"తమ్ముడా, మా అమ్మ కౌసల్యాదేవి సంతోషించేటట్టుగా బ్రాహ్మణు లను అందరినీ నీవు సమ్మానించవలెను" అని చెప్పినాడు.

రాముడు చెప్పినట్లుగా లక్ష్మణుడు బ్రాహ్మణులకు అందరికీ కుబేరుడి వలె దాన ధర్మాలు చేసినాడు.

అప్పుడు సేవకులు అందరూ కన్నీళ్లు కారుస్తూ రాముడి ఎదట నిలుచున్నారు. రాముడు వారిని అందరినీ చూచి "ఓ సేవకులారా, మేము తిరిగీ వచ్చేటంతవరకున్నూ మీరు నా ఇంటినీ లక్ష్మణుడి ఇంటినీ ఎప్పటివలె కని పెట్టుకొని ఉండవలెను. మా ఇండ్లను శూన్య గృహాలుగా ఉంచవద్దు" అంటూ ఆ సేవకులు అందరి జీవనోపాధికి ప్రత్యేకము ప్రత్యేకముగా ధనము ఇచ్చే ఏర్పాటు చేసినాడు. అంతట మిగిలి ఉన్న ధనాన్ని అక్కడికి తెప్పించమని ధనాధ్యక్షుడికి ఆజ్ఞాపించినాడు. అందరూ ఆశ్చర్యపోయేటంత ధనరాశిని అక్కడికి తీసుకొని వచ్చినారు. రామలక్ష్మణులు ఆ ధనాన్ని అంతా పేద బ్రాహ్మణ బాలురకున్నూ వృద్ధులకున్నూ దానము చేసినారు.

అప్పుడు త్రిజటుడు అనే బ్రాహ్మణోత్తముడు రాముణ్ణి చూడడానికి వచ్చినాడు. ఆయన గర్గమహర్షి వంశీయుడు. అయోధ్యా ప్రాంతములో ఉన్నాడు. నిరుపేద. ప్రతిరోజూ ఒక చిన్న గొడ్డలీ గుద్దలీ ఒక చిన్న బుట్టా తీసుకొని అడవికి పోయి కందమూలాలు తవ్వి పరిగలు ఏరుకొని తెచ్చి భార్యా బిడ్డలను పోషిస్తున్నాడు. ఆ దేహశ్రమకు ఆయన దేహము అంతా కమిలిపోయి గోరోచనపు రంగుగా తేలింది. ఆయన వృద్ధు. ఆయన భార్య తరుణి. వారికి ఎంతో మంది బిడ్డలు పుట్టినారు.

ఆ నాడు ఆమె త్రిజటుడితో "స్వామీ, ఆ గొడ్డలీ ఆ గుద్దలీ అట్లా పెట్టండి. నేను చెప్పినట్లు చేయండి. రాముడు ఈ వేళ వనవాసానికి వెళ్ళి పోతున్నాడు. అడిగిన వారికి లేదు అనకుండా దాన ధర్మాలు చేస్తున్నాడు. నన్నూ ఈ బిడ్డనూ వెంటబెట్టుకొని అతని దగ్గరకు పదండి. అతడు మనకు ఏమి అయినా ఇస్తాడు. మన దారిద్ర్యము వదిలిపోతుంది" అని చెప్పింది.

త్రిజటుడు ప్రయాణము అయినాడు. చిరిగిపోయిన ఉత్తరీయము కప్పుకొన్నాడు. భృగ్వంగీరస మహర్షులవలె తేజరిల్లుతూ నడిచినాడు. ఆయన వెనక నవయౌవనములో ఉన్న ఆయన భార్యా, ఆమె వెంట కోడిపిల్లలవలె వారి బిడ్డలూ నడిచినారు. వారిని చూచి జనసమూహము అంతా తప్పుకొని దారి ఇచ్చింది. వారిని రామ మందిరములో ద్వారపాలకులు ఎవరూ అడ్డగించలేదు. వారు హుటా హుటీ అయిదవ కక్ష్యవరకూ పోయినారు.

త్రిజటుడు రాముడి ఎట్టఎదటికి పోయి "ఓ రాజపుత్రా. నీ కీర్తి విన్నాను. నేను నిరుపేదను. బహుపుత్రకుణ్ణి. అడవిలో కందమూలాలూ పండ్లూ పరిగలూ తెచ్చి కుటుంబ పోషణము చేస్తూ ఉన్నాను. తాము మమ్ములను కటాక్షించవలెను" అన్నాడు.

రాముడు ఆ త్రిజటుణ్ణీ నవయౌవనములో ఉన్న ఆయన భార్యనూ వారి బిడ్డలనూ చూచినాడు. మందహాసము చేస్తూ "ఓ బ్రాహ్మణుడా, అవిగో దూరముగా కనబడుతూ ఉన్న ఆవుల మందలు నావే. వాటిలో ఇంకా ఒక్క వెయ్యింటిని అయినా నేను దానము చేయలేదు. మీకు ఎన్ని కావలెనో నేను ఎన్ని ఇవ్వవలెనో తోచడములేదు. అందువల్ల మీ చేతిలో ఉన్న కర్రను విసిరి

యండి. అది ఎంతదూరము పోతే అంత దూరమువరకూ ఉన్న ఆవులను అన్నిటినీ మీకు ఇస్తాను'' అన్నాడు రాముడు.

అంతట త్రిజటుడు పైన కప్పుకొన్న చిరుగుల గుడ్డను తీసి గబగబా నడుము చుట్టుకొన్నాడు. చేతిలో ఉన్న కర్రను గిరగిరా త్రిప్పి శక్తికొద్దీ విసరి వేసినాడు. ఆ కర్ర ఆ ఐదు కక్ష్యలూ దాటింది. సరయూనది దాటింది. అవతల గట్టున ఉన్న వేలకొద్దీ ఆవుల మందలను దాటిపోయి అక్కడ యథేష్టముగా మేస్తూ ఉన్న ఆబోతుదగ్గర పడ్డది.

ఆ కర్ర అంత దూరము పోయినందుకు అందరూ ఆశ్చర్యచకితులు అయినారు.

రాముడు మహదానందముతో ఆ పరమవృద్ధుణ్ణి కౌగలించుకొన్నాడు ఆయన కర్ర పడ్డంతవరకూ ఉన్న ఆవులను అన్నింటినీ ఆయన ఆశ్రమపదానికి గొల్లవాండ్ర చేత తోలించమని ఆజ్ఞాపించినాడు. త్రిజటుణ్ణి చూస్తూ ''ఓ బ్రాహ్మణోత్తమా, దానము అడిగితే తమ బలము పరీక్షించినాను అనే కోపము వద్దు. మీ తేజము ఎటువంటిదో అందరికీ తెలియవలెను అనుకొన్నాను. నవ్వులాటగా మిమ్ములను కర్ర విసరమన్నాను. అంతే. మీకు ఇంకా ఏమి అయినా కావలసి ఉంటే అడగండి. ఇస్తాను. ఏ సంకోచమూ వద్దు. యథార్థము చెప్పుతున్నాను. నేను ధనము బ్రాహ్మణులకోసమే కూడబెట్టినాను. అది మీబోటి వారికి ఇస్తేనే సద్వినియోగము అవుతుంది. అట్లా ఇవ్వడమే నాకు సంతోషము' అన్నాడు. రాముడు.

అన్ని వేల ఆవులను ఇచ్చినందుకు త్రిజటుడూ ఆయన భార్యా సంతుష్టులు అయినారు. వారు రాముణ్ణి మరి ఏమీ అడగలేదు. అంతట వారు సీతారామలక్ష్మణులు సుఖవంతులుగానూ బలవంతులుగానూ కీర్తిమంతులుగానూ బహుకాలము జీవించవలెను అని దీవించినారు.

రాముడు తన స్నేహితులు అందరితోనూ వారివారి యోగ్యతకు తగినట్లుగా సమ్మానవాక్యాలు చెప్పినాడు, తన పరాక్రమముతో సంపాదించిన ధనాన్ని అంతా వారికి ఇవ్వమని ఆజ్ఞాపించినాడు.

ఆనాడు అయోధ్యానగరములో ఉన్న ప్రతి బ్రాహ్మణుడూ ప్రతి సేవకుడూ ప్రతి భృత్యుడూ ప్రతి భిక్షుకుడూ రాముడి దానధర్మాలకు సంతుష్టుడు అయినాడు.

అందరూ సీతారామ లక్ష్మణులను మెచ్చుకొన్నారు. వారు చిరాయువులుగా ఉండవలెను అని ఆశీర్వదించినారు.

33

రామలక్ష్మణులు సీతాదేవిని వెంటపెట్టుకొని దశరథ మహారాజుకు వీడ్కోలు చెప్పిపోవడానికి బయలుదేరినారు.

సీతాదేవి ఆ అన్న తమ్ముల ధనుస్సులనూ ఇంకా వారి ఖడ్గాద్యాయుధాలనూ పూలదండలతోనూ చందనముతోనూ అలంకరించింది. వారు ఆ ఆయుధాలు ధరించి ఆమెకు ఇరువైపులా నడుస్తూ ఉంటే అవి కన్నులు మిరుమిట్లు కొలుపుతూ మరింత ధగధగలాడినవి.

జనసమూహముతో రాజవీధులు అన్నీ క్రిక్కిరిసిపోయినవి. పౌరులు సీతారామలక్ష్మణులను చూడవలెను అనుకొని ప్రాసాదాలనూ హర్మ్యాలనూ విమాన శిఖరాలనూ ఎక్కినారు. గొడుగు అయినా లేకుండా రామభవనములో నుంచి కాలినడకను బయటికి వస్తూ ఉన్న సీతారామలక్ష్మణులను అందరూ చూచినారు. శోకోపహతులు అయిపోయినారు. ఇదివరకు రాముడు ఎప్పుడు ఎక్కడకు బయలుదేరినా వెంట చతురంగబలాలు నడిచేవి. అటువంటివాడి వెంట ఇప్పుడు సీతాదేవీ లక్ష్మణుడూ పాదచారులు అయి వెళ్ళుతూ ఉంటే అందరికీ ఏడుపు వచ్చింది. ఆ కిందటి క్షణమువరకూ సమస్త ఐశ్వర్యాలూ అనుభవించిన మహారాజపుత్రుడు-అడిగినవారికి లేదు అనకుండా ఇచ్చినవాడు-ఇప్పుడు ధర్మ గౌరవమువల్ల సమస్తమూ త్యజించివేసినాడు. తండ్రికి అసత్య దోషము రాకుండా ఉండడానికోసము వనవాసము చేయపోతున్నాడు.

ఆకాశమార్గాన సంచారము చేసే భూతకోటికి అయినా కనుపించని సీతాదేవి ఇప్పుడు పాదచారిణి అయి జనాకీర్ణము అయిన రాజవీథిలో నడుస్తూ ఉంటే ప్రతివాడూ చూచినాడు. రక్తచందనపు మైపూతతో ధగధగ లాడుతూ ఉన్న

సీతాదేవి కుసుమకోమల దేహము ఇక ఎండకూ వానకూ చలికీ మారురూపు ప-
పోతుంది అని అందరూ ఖిన్నులు అయిపోయినారు.

"ఇప్పుడు నిజముగా దశరథమహారాజుకు పిశాచము పట్టింది. లేకపో
కొడుకునూ కోడలునూ అడవులకు పొమ్మంటాడా" అన్నారు కొందరు.

"దశరథమహారాజు రాముణ్ణి అడవికి ఎంతమాత్రమూ పోనీయడు" అ
మరి కొందరు అన్నారు.

అయోధ్యాపౌరులు అందరూ ఇంకా ఈవిధముగా చెప్పుకోవడమ
మొదలు పెట్టినారు:

"గుణవంతుడు కాకపోయినా కడుపున పుట్టిన కొడుకును ఏ తండ్రీ అడ
వులకు వెళ్లకొట్టడు. అందులో తన సత్ప్రవర్తనతో ఈ లోకాన్ని అంత
జయించిన పుత్రుణ్ణి ఏ తండ్రి అయినా వెళ్ళకొట్టుతాడా? అహింసా దయ
విద్యా సత్స్వభావమూ ఇంద్రియ నిగ్రహమూ శాంతమూ అనే ఆరు సద్గుణాలు
రాముడిలో మూర్తీభవించినవి. ఆ మహాత్ముడికి కష్టము వచ్చింది అంటే నీళ్ల
ఇంకిపోయిన తరువాత ఎండా కాలములో జలజంతువుల మాదిరిగా జనుల
అందరూ మలమల మాడిపోవలసిందే. ఆ మహాద్యుతిమంతుడు ఈ జగత్తు అ
వృక్షానికి మూలము వంటివాడు. సమస్త జనులూ ఆ చెట్టుకు కొమ్మలూ ఆకులు
పూలూ పిందెలూ కాయలూ పండ్లూ వంటివారు. ఇప్పుడు ఆ జగత్పతికి అప
వచ్చింది. చెట్టుకు వేరు తెగకొట్టినట్టు అయింది. వేరు నరికిన చెట్టుకు పూసి
పూలూ కాసిన కాయలూ వలె అందరూ ఇక నాశనము అయిపోతారు.

"లక్ష్మణుడివలె మనమూ మన తోటలనూ దొడ్లనూ ఇండ్లనూ వాకిండ్లను
వదిలిపెట్టి రాముడి వెంట అడవికి పోదాము. రాముడు సుఖము అనుభవి
మనమూ సుఖము అనుభవిద్దాము. ఆతడు దుఃఖపడితే మనమూ దుఃఖపడుదాము
మనమూ మన ఇండ్లలో ఉన్న ధనధాన్యాలనూ నిధినిక్షేపాలనూ శయనాసన
దులనూ మనతో తీసుకొని పోదాము. మన ఇలవేల్పులున్నా మనతో-
ఉంటారు. ఇక మన ఇండ్లముందు కసవు ఊడ్చడమూ కలాపి చల్లడమూ ఇం
లోపల కడగడమూ ఉండదు. మన ఇండ్లు అన్నీ దుమ్ముకొట్టుకొని పోతు
లోపల బూజుపట్టి బూచులు వేళ్ళాడుతూ ఉంటవి. ఎలుకలూ పందికొక్కులు

మన ఇండ్లలో కలుగులు పెట్టుకొని కాపురము చేస్తూ చిత్తము వచ్చినట్టు పరుగులు తీస్తూ ఉంటవి; మన ఇండ్లలో నీళ్ళూ నిప్పులూ జపహోమాలూ బలికర్మలూ మంత్రధ్వనులూ ఇక ఉండవు. వంటకుండలూ మొదలు అయినవి పగిలిపోయి పెంకులు మిగులుతవి. క్షామకాలములో వలె మన ఇండ్లు అన్నీ పాడుపడిపోతవి. పాడుపడ్డ ఇండ్లను అన్నిటినీ కైకేయీదేవి స్వాధీనము చేసుకొని సంతోషిస్తుంది.

“రాముడు ఉంటాడు కనుక మహారణ్యమే మహానగరము అవుతుంది. ఈ అయోధ్యానగరమే మహారణ్యముగా మారిపోతుంది. అరణ్యములో వన్యసత్త్వాలు అన్నీ మనలను చూచి భయపడిపోతవి. కలుగులలోనుంచి పాములూ కొండ నెత్తాలలోనుంచి పెద్దపెద్ద పక్షులూ, జింకలూ సాంద్రారణ్యాలలోనుంచి ఏనుగులూ కొండగుహలలోనుంచి సింహాలూ పెద్ద పెద్ద పొదలలోనుంచి శార్దూలాది జంతువులూ పారిపోయి మనము వదిలిపెట్టి వచ్చిన అయోధ్యానగరము చేరుతవి. అవి హాయిగా మన ఇండ్లలోనూ తోటలలోనూ దొడ్లలోనూ కాపురము పెట్టుకొంటవి. యథేష్టముగా తిరుగుతూ ఉంటవి. అప్పుడు కైకేయీదేవి తన కొడుకుతోనూ, బంధువులతోనూ ఈ అయోధ్యానగరములో రాజ్యము ఏలుతూ ఉంటుంది. మనము అందరమూ మహారణ్యములో రాముడితో సుఖముగా ఉంటాము.”

ఈ విధముగా పౌరులు అందరూ చెప్పుకొంటూ ఉన్న మాటలు అన్నీ రాముడు విన్నాడు. అతనికి ఏ మాత్రమూ మనోవికారము కలగలేదు. ఎంతమంది దుఃఖించినా అతడు చలించలేదు. ఎప్పటివలె మందహాసము చేస్తూ మదపుటేనుగు ఠీవితో నడిచినాడు. కైలాస పర్వతమువలె కనిపించే దశరథ మహారాజు భవనములోకి పోయినాడు. అక్కడ ఉన్న వినీత వీర పురుషులను అందరినీ చూస్తూ నడిచినాడు.

ఆ సమీపములోనే ఆర్తరూపముతో సుమంత్రుడు కనిపించినాడు. రాముణ్ణి అడవికి పొమ్మన్నప్పటి నుంచీ ఆ మంత్రిపుంగవుడు దుఃఖాక్రాంతుడు అయిపోయినాడు. రాముడు ఆ సుమంత్రుణ్ణి చూచి తన రాక తండ్రికి తెలియచేయవలెను అని చెప్పినాడు.

## ౩౮

ఆ కమల పత్రాక్షుడు ఆ ఇందీవరశ్యాముడు ఆ సింహ మధ్యముడు ఆ మహాత్ముడు రాముడు తన రాక తండ్రికి తెలియచేయమని సుమంత్రుడితో చెప్పినాడు. సుమంత్రుడికి దుఃఖము వచ్చింది. అతని దేహము అంతా కంపించి పోవడము మొదలు పెట్టింది. అయినప్పటికిన్నీ వెంటనే లోపలికి పోయినాడు. రాముణ్ణి గురించిన దుఃఖముతో నిట్టూర్పులు విడుస్తూ ఉన్న దశరథమహారాజును చూచినాడు.

ఆయన రాహుగ్రస్తము అయిన సూర్యబింబమువలెనూ భస్మచ్ఛన్నము అయిన అగ్నిహోత్రమువలెనూ నిస్తోయము అయిన తటాకమువలెనూ అగుపించినాడు. మనోవ్యాకులముతో ''రామా రామా'' అంటూ దుఃఖపడుతున్నాడు. ఆయనతో ఏమి అని చెప్పడమా అని సుమంత్రుడు దిగులుపడి పోయినాడు. ఆ స్థితిలో ఏమి చెప్పితే ఏమి ఆజ్ఞాపిస్తాడో అని భయపడి పోయినాడు ఆ ప్రాజ్ఞుడు చేతులు జోడించి ఆయన దగ్గరకు పోయి జయము ఆశీర్వదించి మందముగా మధురముగా ''మహారాజా, పురుషశార్దూలము తమ పుత్రుడు రాముడు తమ దర్శనము కోసము వచ్చి వాకిటిలో కనిపెట్టుకొని ఉన్నాడు. అతడు తన ధనాన్ని అంతా బ్రాహ్మణులకూ భృత్యులకూ దానము ఇచ్చినాడు. మిత్రులు అందరికీ వీడ్కోలు చెప్పినాడు. వనవాసానికి ప్రయాణము అయిపోతూ తమ అనుజ్ఞ కోసము సీతా లక్ష్మణ సహితముగా ఇక్కడికి వచ్చినాడు. అనంతకిరణాలతో తేజరిల్లే సూర్యుడి వలె సమస్త రాజగుణాలతో విరాజిల్లుతూ మీ దర్శనము అపేక్షిస్తూ ఉన్నాడు. తాము అతనికి దర్శనము ఇవ్వవలెను'' అని చెప్పినాడు.

ఆ ధర్మాత్ముడు ఆ సత్యవ్రతుడు దశరథమహారాజు సముద్రమువలె గంభీరుడు, ఆకాశమువలె నిర్మలుడు. ఆయన సుమంత్రుణ్ణి చూచి ''మంత్రిసత్తమా, నా భార్యలను అందరినీ ఇక్కడికి రప్పించవలెను. వాండ్ల సమక్షములో ఆ ధార్మికుణ్ణి చూస్తాను'' అన్నాడు. మహారాజాజ్ఞను సుమంత్రుడు ఆయన భార్యలు మున్నూట ఏభైమందికిన్నీ తెలియచేసినాడు. వారు అందరూ రాముడు అడవికి పోతున్నాడు అని కన్నులు ఎర్రపడి పోయేట్లు ఏడుస్తూ కౌసల్యాదేవి వెనుక దశరథమహారాజు దగ్గరకు నడిచినారు.

అంతట ఆయన రాముణ్ణి లోపలికి తీసుకొని రమ్మని సుమంత్రుడితో చెప్పినాడు.

భార్యల మధ్యను కూర్చుని ఉన్న దశరథమహారాజు సుమంత్రుడి వెనుక చేతులు జోడించి నడిచి వస్తూ ఉన్న రాముణ్ణీ సీతాదేవినీ లక్ష్మణుణ్ణీ చూచినాడు. తటాలున లేచినాడు. వారికి ఎదురుగుండా వస్తున్నాడు. దుఃఖార్తుడు అయి వారిని సమీపించకుండానే నేల కూలినాడు. మూర్ఛ పోయినాడు. ఆయనను లేవనెత్తడానికి రామలక్ష్మణులు పరుగెత్తుకొని వచ్చినారు. ఆయన భార్యలు అందరూ గొల్లుమన్నారు. "హా రామా" అంటూ వారు అందరూ నెత్తి బాదుకొంటూ గుండెలు కొట్టుకొంటూనూ ఏడవ సాగినారు. వారి ఏడ్పులకు వారి పెడబొబ్బలకు వారి ఆభరణాల చప్పుళ్లకు ఆ భవనము అంతా కంపించిపోయింది.

రామలక్ష్మణులూ సీతాదేవీ దశరథమహారాజును పర్యంకముమీద పరుండ పెట్టి ఉపచారాలు చేసినారు. కొంత సేపటికి ఆయనకు తెలివి వచ్చినది. దుఃఖ సముద్రములో మునుగుతూ తేలుతూ ఉన్న దశరథమహారాజును చూచి రాముడు "మహారాజా, తాము మాకు అందరికీ నాథులు. తమ అనుజ్ఞ పొంది వీడ్కోలు చెప్పి పోవడానికి వచ్చినాను: నేను దండకారణ్యానికి ప్రయాణము అయిపోతున్నాను. నన్ను తాము సంతోషముతో ఆశీర్వదించవలెను. ప్రభూ ఈ సీత నాతో వస్తూ ఉంది. ఈ లక్ష్మణుడున్నూ నా వెంట బయలుదేరినాడు. రావద్దు అని వీళ్ళకు నేను అనేకవిధాల చెప్పినాను. వీండ్లు వినలేదు. వీండ్లు నేను లేకుండా ఇక్కడ ఉండము అన్నారు. వీండ్లూ నాతో రావడానికి తాము అనుమతించవలెను. ప్రభూ, ప్రజలు అందరూ ఈ భూమిమీద సంచరించడానికి బ్రహ్మదేవుడు అనుజ్ఞ ఇచ్చినట్లు మేము వనవాసము చేయడానికి తాము అనుజ్ఞ ఇవ్వవలెను" అన్నాడు.

రాముడు ఏమాత్రమూ ఆలస్యము చేయకుండా వనవాస ప్రయాణ సన్నద్ధుడు అయి వచ్చి తనను అనుజ్ఞ అడుగుతూ ఉన్నందుకు కించపడి పోయి "రామా, నేను ఎప్పుడో కైకేయికి వరాలు ఇచ్చి ఇప్పుడు మోసపోయినాను. నీవు ఇప్పుడు నన్ను నిగ్రహించి ఈ అయోధ్యకు రాజువు అయి రాజ్యము ఏలు" అన్నాడు దశరథమహారాజు.

రాముడు పరమధార్మికుడు. పరమధార్మికుడు మాత్రమే కాదు. మాట నేర్పరి. అతను చేతులు ఎత్తి నమస్కారము చేస్తూ "ప్రభూ, తాము ఎంత కాలము అయినా ఈ రాజ్యము ఏలవలెను. తాము పుణ్యమూర్తులు. నా నుంచి మీకు అసత్యదోషము రాకూడదు. మీ నుంచి నాకున్నూ అసత్యదోషము రాకూడదు. ఇప్పుడు నేను వనవాసము చేయడమే ధర్మము. రాజా, ఒక తొమ్మిది సంవత్సరాలు, ఆ తరువాత ఒక అయిదు సంవత్సరాలు - ఏమి అంత పెద్ద కాలము ! సుఖముగా వనవాసము చేస్తాను. గడువు కాలము అయిపోగానే వచ్చి నేను మీ పాదములమీద వాలుతాను" అన్నాడు.

ఈ మాటలకు దశరథమహారాజు సత్యపాశబద్ధుడు అయిపోయినాడు. ఆయనకు దుఃఖము వచ్చింది. దీనుడు అయిపోయినాడు. కైకేయీదేవి చెంపను చేరి వెంటనే రాముణ్ణి పంపించి వేయమని చెవిలో ఊదడము మొదలు పెట్టింది. ఆయనకు ఏమీ తోచకుండా పోయింది. రాముణ్ణి చూస్తూ "నాయనా, పో, నీవు ప్రయాణము అయిపో. నీవు ఇహ పర లోక సౌఖ్యాలు అన్నీ అనుభవించవలెను. తిరిగి ఇక్కడికి రావలెను. ఈ రాజ్యము ఏలవలెను. నాయనా, నీవు నిర్భయమూ మంగళకరమూ అయిన సత్పథము అవలంబించు, పో.

"రామా, నీవు రఘుకుల దీపకుడవు. సత్యవ్రతుడవు. పరమ ధార్మికుడవు. అడవికి పోవలెను అని నీకు బుద్ధి పుట్టింది. నీ బుద్ధి మార్చడము ఎవరి తరము? అయితే, నాయనా, నీవు ఇప్పుడే ప్రయాణము అయిపోవద్దు. ఈ రాత్రి అంతా ఇక్కడనే ఉండు. ఈ ఒక్క పూట అయినా నిన్ను కళ్ళారా చూచి సంతోషిస్తాను. నీవు మీ అమ్మనూ నన్నూ చూస్తూ ఈ రాత్రి అంతా ఇక్కడనే ఉండు. మేము మా చిత్తము వచ్చినట్టుగా నిన్ను సంతోషపెట్టుతాము. నీవు రేపు ఉదయము ప్రయాణము అయి పోవచ్చును.

"నాయనా, నా పరలోక సౌఖ్యము కోసము నీవు సమస్త సౌఖ్యాలూ వదులుకొని కారడవులకు పోతున్నావా? ఇటువంటి దుష్కర కార్యము నీవు తప్ప ఎవరూ చేయరు. చేయలేరు. రామా, నిన్ను అడవికి పంపించడము నాకు ఎంత మాత్రమూ ఇష్టము లేదు సత్యప్రమాణముగా చెప్పుతున్నాను. ఈ కైక నివురు కప్పిన నిప్పు. తన క్రౌర్యాన్ని తెలియనీయకుండా దాచి ఉంచుకొన్నది. దీని దగ్గర నా ప్రజ్ఞ చలించింది. ఇది నన్ను మోసపుచ్చింది. ఎన్నడో సంతో

షముతో నేను ఇస్తాను అన్న వరాలను నన్ను ఏమరచి విపరీతముగా అడిగి పుచ్చుకొన్నది. నాయనా, ఈ కైక మన వంశాచారాన్ని నేలపాలు చేసింది. అయ్యో! ఈ కైక కోరికను నీవు కూడా సఫలము చేయవలసివచ్చింది. రామా! నీ ధార్మికతకు నాకు ఆశ్చర్యము వేస్తూ ఉంది. అయితే నీవు నా జ్యేష్ఠపుత్రుడవు. నాకు అసత్యదోషము రానీకూడదు అనుకొన్నావు. ఆశ్చర్యము లేదు'' అంటూ దశరథమహారాజు కన్నీళ్లు కార్చినాడు.

ఈ ఆర్తాలాపాలకు రాముడు లక్ష్మణుడి వంక చూచి, దశరథమహారాజుతో "రాజా, ఈ నాడు మీరు నన్ను సంతోష పెట్టుతారు. రేపు ఎవరు సంతోష పెట్టుతారు? అందువల్ల నేను కోరికలు అన్నీ వదులుకున్నాను. వనవాసము చేయడానికి సంకల్పించుకొన్నాను. ఈ నా బుద్ధి మారదు. ప్రభూ, కైకేయీ దేవికి తాము సంతోషముగా వరాలు ఇచ్చినారు. ఆ వరాలను మీరు సంపూర్ణముగా చెల్లించవలెను. మీ ఆజ్ఞను నేను శిరసా వహించి పధ్నాలుగు సంవత్సరాలూ మహారణ్యములో మహర్షుల మధ్య నివసిస్తాను. మిమ్మలను నిగ్రహించమని చెప్పినారు. మీకు ఆ ఆలోచన వద్దు. ఈ రాజ్యము ఏలవలెను అనే కోరిక నాకు లేదు. ఇంకా ఏవో సుఖాలు అనుభవించవలెను అనే కోరిక అంతకన్నా లేదు. మీ ఆజ్ఞలను నెరవేర్చడము ఒక్కటే నాకు ఉన్న కోరిక. మీరు దిగులు పడవద్దు. కన్నీళ్లు కార్చవద్దు. గంభీరుడు అయిన సముద్రుడు ఎప్పుడు అయినా కలత చెందుతాడా? మీ ఆజ్ఞలను శిరసా వహించడము తప్ప నాకు ఈ రాజ్యముతో పని ఏమిటి? స్వామీ, నాకు కావలసినది తాము. తమ సత్యవ్రతము. నేను అనృతము అంగీకరించను. నా సుకృతముమీదనూ నా సత్యము మీదనూ ఒట్టు పెట్టుకొని చెప్పుతున్నాను. నేను ఇకను ఇక్కడ ఒక్క క్షణము అయినా ఉండను. నన్ను కైకేయీదేవి వనవాసానికి పొమ్మన్నది. నేను పోతాను అన్నాను అందువల్ల మీ ఆజ్ఞను శిరసా వహించడమే కాకుండా ఆమెకు ఇచ్చిన మాటను నిలపెట్టుకొన్నవాణ్ణి అవుతాను.

"దేవా, దేవతలకు సయితము తండ్రే ప్రత్యక్షదైవము అని చెప్పగా విన్నాను. అందువల్ల నా తండ్రే నాకు దేవుడు అనుకొంటున్నాను. ఆయన ఆజ్ఞలను తలదాల్చడమే నాపని. నేను నా వనవాసము అయిపోయిన తరువాత వచ్చి తమ దర్శనము చేస్తాను. తాము ఇక దిగులు పడవద్దు. ప్రభూ, నా ఈ

తల్లులు అందరూ నేను వనవాసానికి పోతున్నాను అని గద్గదకంఠాలు అయి కన్నీళ్ళు కారుస్తున్నారు. వారిని ఓదార్చవలసినవారు మీరు. మీరే దుఃఖపడితే మిమ్ముల్ని ఓదార్చేవారు ఎవరు? మీరు దుఃఖపడవద్దు.

“దేవా, నేను ఈ పట్టణమూ ఈ రాజ్యమూ వదలుకొని పోతున్నాను. కనుక పట్టణాలతోనూ పర్వతాలతోనూ వనాలతోనూ సుస్థిరము అయిన హద్దులతోనూ ధనధాన్య సమృద్ధముగానూ సర్వశుభావహముగానూ ఉన్న ఈ రాజ్యాన్ని భరతుడికే ఇవ్వండి. వాడే ఈ రాజ్యాన్ని అంతా పరిపాలిస్తాడు. మీరు ఆజ్ఞాపించినట్టు జరిగి తీరవలెను. మీ ఆజ్ఞలను నేను శిరసావహించడము శిష్టజన సమ్మతము అయిన విషయము. అందువల్ల మీ ఆజ్ఞలను నెరవేర్చడములో ఉన్న ఉత్సాహము నాకు మరి దేనిమీదనూ లేదు. నేను ఏదో కష్టపడతాను అని మీరు దుఃఖపడవద్దు. తమకు అసత్యదోషము రాకుండా ఉండడమే నా మహదాశయము. తమ సత్యవ్రతముకోసము నేను దేనిని అయినా వదులుకొంటాను. ఏ సుఖాన్ని అయినా వదులుకొంటాను. ఈ సీతను అయినా వదులుకొంటాను. అందువల్ల నేను ఇప్పుడు ఈ రాజ్యము వదులుకొనిపోవడము ఒక గొప్ప విషయము కాదు. తమ సత్యవ్రతానికి నావల్ల భంగపాటు రాకూడదు.

“రాజా, నేను ఈ సీతతోనూ లక్ష్మణుడితోనూ మహారణ్యాలలో ప్రశాంత హరిణాలతో నానావిధ శకుంతకూజితాలు వింటూ విహరిస్తాను. చిత్రవిచిత్రము అయిన వృక్షాలు చూస్తూ వివిధ ఫలాలూ కందమూలాలూ తింటూ గిరి గుహలలో నివసిస్తూ ఆయా నదులలోనూ సరస్సులలోనూ స్నానము చేస్తూ హాయిగా కాలము గడుపుతాను. రాజా, తామున్నా ఇక్కడ సుఖముగా ఉండండి” అని చెప్పినాడు రాముడు.

దశరథమహారాజు దుఃఖాగ్నిలో పడిపోయినాడు. ఆ మనసు తాపము ఎత్తింది. ఏడుపువచ్చింది. పెద్ద పెట్టున ఏడుస్తూ రాముణ్ణి గట్టిగా కౌగలించుకొన్నాడు. స్మృతి తప్పి పడిపోయినాడు.

కైకేయీదేవి తప్ప తక్కిన రాజపత్నులు అందరూ గొల్లుమన్నారు. ఇది అంతా వింటున్న సుమంత్రుడు ఆవురుమని ఏడుస్తూ మూర్ఛపోయినాడు.

అక్కడి వారు అందరూ "అయ్యో అయ్యో" అంటూ పెద్దపెట్టున వాపోయినారు.

౩౫

సుమంత్రుడు తెప్పరిల్లి నిట్టూర్పులు విడుస్తూ తల ఆడిస్తూ చేతులు నులుపుకొంటూ పళ్లు పటపట కొరికినాడు. కోపోద్రేకముతో అతని కన్నులు కెంపులవలె ఎర్రబడిపోయినవి. ముఖము అంతా నెత్తురుముద్ద అయిపోయింది. ముఖమే కాదు - అతని దేహము అంతా ఎర్రపడిపోయింది. సంతాపపడుతూ ఉన్న దశరథ మహారాజువంక చూచినాడు. ఆయనమనస్సు తెలుసుకొన్నాడు. తీక్ష్ణబాణాలతో మర్మస్థానాలను భేదించేటట్టు వాగ్బాణాలతో కైకేయీదేవి హృదయాన్ని చిందరవందర చేయవలెను అనుకొన్నాడు.

అంతట సుమంత్రుడు ఆమెగుట్టు అంతా బట్టబయలు చేయ తలచుకొని "ఓ దేవీ, చరాచరాత్మకము అయిన ఈ జగత్తుకు అంతటికీ దశరథమహారాజు ప్రభువు. ఆయన మీకు పెనిమిటి. ఆయన తలపెట్టిన పని మీరు 'కాదు' అన్నారు. మీరు ఆయనను తిరస్కరించినారు. ఇక మీరు, ఈ లోకములో చేయలేని అకార్యము ఏదీ లేదు.

"దశరథమహారాజు దేవేంద్రుడివలె అజయ్యుడు. హిమాచలమువలె అచలుడు. మహోదధివలె అక్షోభ్యుడు. అటువంటి వాణ్ణి మీరు ఇట్టే దుఃఖాల పాలు చేసినారు. ఆయనను ఇక మీరు చంపివేస్తారేమో అనిపిస్తూ ఉంది. కాదు, కాదు. ఆయన వంశాన్ని నాశనము చేసి వేస్తారేమో అనిపిస్తూ ఉంది.

"అమ్మా, ఆయన మనలను అందరినీ పోషిస్తున్నాడు. మనము కోరిన కోరికలు ఇస్తున్నాడు. మనము అందరమూ ఆయనను అనుసరించి పోవలెను. అందులో మీరు ఆయనను చేపట్టి ఆయనను ఎప్పుడూ అనుసరిస్తూ సంతోష పెట్టుతూ ఉండవలెను. ఒక కోటిమంది కొడుకులను కని పెంచడము కన్నా పెనిమిటిని ఒక్కణ్ణి అనుసరించి మెప్పించడమే ఆడుదాని ధర్మము. అంత కన్నా అధికము అయిన ధర్మము ఆడుదానికి మరి ఒకటి లేదు.

"ఓ రాణీ, రాజు చనిపోయినప్పుడు కొడుకులలో వయస్సును పట్టి పెద్దవాడు రాజు అవుతూ ఉంటాడు. తక్కిన కొడుకులు ఆ పెద్దవాణ్ణి అనుసరించుకొని ఉంటారు. ఇది లోకధర్మము. ఈ ధర్మాన్నే ఇక్ష్వాకువంశీయులు అనూచానముగా అనుసరిస్తున్నారు. కులక్రమాగతము అయిన ఈ ధర్మాన్ని మీరు దశరథమహారాజు జీవించి ఉండగానే ఆయనచేతనే చెడగొట్టించ తలచినారు. మీరు కృతార్థులు అయితే కావచ్చును. మీ పుత్రుడు భరతుడే రాజు అయితే కావచ్చును. ఈ భూమిని అంతా అతడే ఏలవచ్చును. మేము మాత్రము రాముడు పోయే చోటికే పోయి ఉంటాము. మేమే కాదు, ఏ ఒక్క బ్రాహ్మణుడున్నూ ఈ అయోధ్యానగరములో కాపురము ఉండడు. యోగ్యులు అయినవారు ఎవరూ ఈ అయోధ్యలో ఉండకుండా పోయేటంత అమర్యాద పనికి మీరు తలపడినారు.

"అమ్మా, మీరు ఎంతటి అపచారానికి పూనుకొన్నారు? మీరు ఇప్పుడు రాముణ్ణి అరణ్యవాసము చేయించమని పట్టుపట్టుతూ ఉన్నందుకు బ్రహ్మర్షులు యమదండముకన్నా భయంకరము అయిన తమ వాగ్దండాలతో మిమ్ములను ఎందుకు సంహారించకుండా ఉన్నారో తెలియడము లేదు. మీరు పూనుకొన్న ఈ పాపకర్మకు ఈ భూమి ఇంకా ఎందుకు బద్దలు అయిపోకుండా ఉన్నదో అని ఆశ్చర్యము వేస్తూ ఉంది.

"ఓ రాజపుత్రీ, ఎవడు అయినా గొడ్డలి తీసుకొని పనికట్టుకొని తియ్యని పండ్లు పండే మామిడిచెట్టును నరికివేసి వేపమొక్కకు పాదులు కట్టి పాలు పోసి పెంచితే, అది తియ్యని కాయలు కాస్తుందా? అదేవిధముగా దశరథమహారాజు తన పట్టమహిషిని వదలిపెట్టి మిమ్ములను ఆదరించినాడు. ఇప్పుడు మీరు ఇట్లా చేసినారు. ఇప్పుడు మిమ్ములను అని ప్రయోజనము ఏమిటి? మీరు గొప్ప వంశములోనుంచే వచ్చినారు. అయితే వేపచెట్టుకు ఎప్పుడు అయినా తేనె కారుతుందా? మీరు మీ తల్లిగుణాన పుట్టినారు. మీ తల్లికథ ఇదివరకే నేను విన్నాను.

"పూర్వము ఒక మహాత్ముడు మీ నాయనగారికి సమస్త ప్రాణికోటుల భాషలూ బోధపడే వరము ఇచ్చినాడు. ఆ వరప్రభావమువల్ల పిపీలికాది సమస్త జీవరాశుల మాటలూ మీ నాయనగారికి తెలుస్తూ ఉండేవి. ఒక

నాడు మీ నాయనగారు పాన్పుమీద పడుకొని ఆ ప్రక్కనే చీమలు చెప్పుకొంటూ ఉన్న మాటలు విన్నారు. ఆ చీమల మాటలకు ఆయనకు నవ్వు వచ్చింది. పెద్ద పెట్టున చాలాసేపు నవ్వినారు. మీ నాయనగారు తనను అపహసిస్తున్నారు అని మీ అమ్మకు కోపము వచ్చింది. ఎందుకు నవ్వింది చెప్పమని మీ అమ్మ అడిగింది. నవ్విన కారణము చెప్పేట్లయితే తనకు వెంటనే చావు మూడుతుంది, అని మీ నాయనగారు ఎంతో దూరము చెప్పినారు. మీ అమ్మ వినలేదు. "చావండి బ్రతకండి, ఏమి అయినా కండి. చెప్పవలసిందేను" అని పట్టు పట్టింది అంతట మీ నాయనగారు వరము ఇచ్చిన ఆయనను అడిగినారు. ఆ వరప్రదాత "ఏది ఏమి అయినా చెప్పకూడదు' అన్నాడు. మీ అమ్మ అప్పటికిన్ని ఊరక ఉండకుండా మీ నాయనగారిని నిర్బంధించి బాధ పెట్ట సాగింది. తన చావును కూడా మీ అమ్మ లెక్క చేయడము లేదు. అది మీ నాయనగారికి పట్టరాని కోపము వచ్చింది. అంతట మీ అమ్మను వెళ్ళగొట్టినారు. అప్పటినుంచీ మీ నాయనగారు కుబేరుడివలె సుఖముగా ఉంటూ ఉన్నారు.

"ఓ దేవీ, మీరున్నూ ఇప్పుడు మీ తల్లివలె దుష్టచారిణుల దారి పట్టినారు. పాపానికి ఒడికట్టుకొన్నారు. తల్లి గుణము కూతుళ్ళకూ తండ్రి గుణము కొడుకులకూ వస్తుంది అనే లోకోక్తిని యథార్థము చేస్తున్నారు. మీ అజ్ఞానము వల్ల మీరు మీ పెనిమిటి దశరథమహారాజు చేత చేయించకూడని పని చేయించడానికి పూనుకొన్నారు. అందువల్ల ఆయనకు భరించరాని అపయశస్సు వస్తుంది. ఆయన చనిపోతాడేమో - మీరు అట్లా చేయవద్దు. మీరు మీ పెనిమిటికి విధేయులుగా ఉండవలెను. రాముడికి యువ రాజ్యాభిషేకము చేస్తాను అని వారు మహాజన సభామధ్యములో ప్రకటించినారు. వారి మాట మీరు అబద్ధము చేయించవద్దు. రాముడు అరణ్యవాసానికి వెళ్ళిపోతున్నాడు అని పౌర జానపదులు అందరూ దుఃఖపడుతున్నారు. వారి అందరి దుఃఖాన్నీ మీరు పోగొట్టవలెను. వారిని అందరినీ మీరు సంతోష పెట్టవలెను. చిన్నవాడికి పట్టము కట్టించి పెద్దవాణ్ణి అడవులకు వెళ్ళగొట్టించమని పాపిష్ఠులు ఎవరో మిమ్ములను పురికొల్పినారు. ఆ అధర్మానికి మీ పెనిమిటిని పాల్పడమని మీరు నిర్బంధిస్తున్నారు.

"తల్లీ, ఈ దశరథమహారాజు దేవేంద్రుడితో సరిసమానము అయిన లోక నాథుడు. లోకనాథుడే కాదు, మీకు నాథుడు. మీరు ఆయనను అధర్మము పాలు చేస్తున్నారు అమ్మా!. ఆయన మీకు వాగ్దానము చేసిన వరాలు పొల్లు పోతవేమో అనుకోవద్దు. ఈ రాజీవాక్షుడు ఈ శ్రీమంతుడు ఈ పుణ్యాత్ముడు మీకు ఈ రాజ్యముకన్నా ఎక్కువ ఐశ్వర్యము ఇచ్చి మీ వరాలు చెల్లిస్తాడు. కాని మీరుగా మోసము చేసి ప్రమాణము చేయించుకొన్న మీ వరాలు చెల్లించడు. మీరు అనుకొన్నట్టు మీ వరాలు చెల్లిస్తాడు అనే ఆశ మీరు పెట్టుకో వద్దు.

"అమ్మా, రాముడు జ్యేష్ఠుడు. వదాన్యుడు. సదాచార సంపన్నుడు. ధర్మరక్షకుడు. లోకరక్షకుడు. మహా బలవంతుడు. అతనికే పట్టాభిషేకము జరుగవలెను. ఓ తల్లీ, రాముడు ఇప్పుడు తండ్రిని వదిలిపెట్టి వనవాసానికి పోయే ట్లయితే మీకు గొప్ప అపవాదు వస్తుంది. మీకన్నా ఎక్కువగా దశరథమహా రాజుకు అపయశస్సు వస్తుంది. ఈ రాజ్యములో ధర్మము నాశనము అయిపో తుంది. అమ్మా, అందువల్ల రాముడే రాజ్యము ఏలవలెను. రాముడే లేకపోయే ట్లయితే ఈ అయోధ్యలో యోగ్యులు ఎవరూ నివసించరు. ఓ తల్లీ, రాముడి యౌవరాజ్యాభిషేకము అయిపోగానే దశరథమహారాజు పూర్వ రాజర్షుల మాది రిగా తపస్సు చేసుకోవడానికి అడవులకు వెళ్ళిపోతాడు. అందుకు మీరు వారికి తోడ్పడవలెను" అన్నాడు.

సుమంత్రుడు రాజ సమక్షములో ఇంత నిష్ఠురముగా మాట్లాడి ఇన్ని మంచి మాటలు చెప్పినా కైకేయీదేవి క్షోభపడలేదు. ఆమె హృదయము చలించలేదు. ఆమె ముఖములో క్రౌర్యపు చిహ్నాలు అయినా మారిపోలేదు. ఆమె నిర్భయముగా ఊరక ఉన్నది.

## ౩౬

కోరినట్టు వరాలు చెల్లిస్తాను అని కైకేయీదేవికి చేసిన శపథము తప్పించు కోవడానికి దారి కనపడక దశరథమహారాజు కన్నీళ్లు కారుస్తూ "ఓ సుమం త్రుడా, రత్నరాసులతోనూ సమస్త శస్త్రాస్త్రాలతోనూ చతురంగసేనలూ రాముడి వెంట పోవడానికి వెంటనే ఏర్పాటు చేయవలసింది. రాముడి ముఖ్యా

శ్రితులనూ వీర్యపరీక్షార్థము రాముడు తనదగ్గర ఉంచుకొన్న వీరులనూ ఆయుధాలు చేసి జీవించేవారినీ సేనలు విడిదిచేసే చోట దుకాణాలు పరుచుకొని ఆయా వస్తువులు అమ్మే వర్తకులనూ పాటలు పాడుతూ ఆటలు ఆడే అందకత్తెలు అయిన వేశ్యాంగనలనూ పౌరముఖ్యులనూ అడవిదార్లు చూపించే బోయవాండ్లనూ ఇంకా రాముడి వెంట పోతాము అనే వారిని అందరినీ రాముడి వెంట పోయే సేనాసమూహముతో పంపించి వేయవలసింది. వారివారికి కావలసిన ధనమూ వస్త్రాలూ మొదలు అయినవి అన్నీ ఇవ్వవలసింది, ఇంకా నూనె నెయ్యి మొదలు అయిన అపరూపవస్తువులను బండ్లమీద వేసి పంపవలసింది. నా ధనకోశాన్ని ధాన్యకోశాన్నీ కూడా రాముడితో పంపించి వేయవలసింది. ఇట్లా చేసేట్లయితే అడవులలో క్రూరమృగాలనూ అడవి ఏనుగులనూ వేటాడుతూనూ ఆయా పుణ్యనదులలోనూ పవిత్ర హ్రదాలలోనూ స్నానము చేస్తూనూ అడవి తేనె త్రాగుతూనూ నా పిల్లవాడు రాముడు కోసలరాజ్యాన్ని మరచిపోకలుగుతాడు. పుణ్యక్షేత్రాలలో యజ్ఞాలు చేస్తూనూ పుణ్యపురుషులకు యథోక్తదక్షిణలు ఇస్తూనూ పోయి నా పిల్లవాడు మహారణ్యములో మహర్షుల మధ్య సుఖముగా ఉంటాడు.

"రాముడు శ్రీమంతుడుగా వనవాసము చేయవలెను. భరతుడు తన భుజబలములో ఈ అయోధ్యలో రాజ్యము చేయవలెను" అని ఆజ్ఞాపించినాడు.

ఈ ఆజ్ఞను కైకేయీదేవి విన్నది. ఆమెకు భయము వేసింది. ఆమె ముఖము ఎండిపోయింది. గొంతు ఆరిపోయింది. ఏడుపు ముఖముతో దశరథమహారాజుకు ఎదురుగుండా పోయి "రాజా, రాముడివెంట సమస్తమూ పంపించి వేస్తే పౌరులు అందరూ వెళ్ళిపోతే అయోధ్యానగరము సురాసారాన్ని త్రాగివేసిన సురాభాండమువలె అయిపోతుంది, అటువంటి రాజ్యము భరతుడు ఒల్లడు' అంటూ అంతమందిలోనూ సిగ్గూ బిడియమూ లేకుండా అన్నది.

ఆ పెద్దపెద్ద కళ్ళ కైకేయీదేవిని చూస్తూ దశరథమహారాజు "ఓ ఎగ్గుల మారీ, మోయరాని బరువు నా నెత్తిన ఎత్తినావు, ఇంకా ఎందుకు నన్ను హింస పెట్టుతావు? రాముడి వెంట చతురంగబలాలూ పోకూడదు అని నీవు ఇదివరకు నన్ను వరము అడిగినావా" అంటూ ప్రశ్నించినాడు. ఈ ప్రశ్నకు కైకేయీదేవికి కోపము ఇబ్బడి అయింది. ఆమె "రాజా. తమ పూర్వీకుడు సగరచక్రవర్తి

తన జ్యేష్ఠపుత్రుడు అశ్వమంజుణ్ణి అయోధ్యానగరమునుంచి అడవులకు వెళ్ళ కొట్టినట్టు తాము రాముణ్ణి పంపించివేయవలెను'' అన్నది.

''ఛీ ఛీ'' అన్నాడు దశరథమహారాజు.

ఆమె మాటలకు అక్కడ ఉన్నవారు అందరూ ఏవగించుకొన్నారు. ఆమె ఎవరినీ ఏ మాత్రమూ లక్ష్యము చేయలేదు. ఆమె దశరథమహారాజుతో ఇంకా ఏమో మాట్లాడపోయింది.

అప్పుడు వృద్ధుడూ పరిశుద్ధుడూ మహామాత్యుడూ అయిన సిద్ధార్థుడు ''ఓ దేవీ, అశ్వమంజుడు దుష్టుడు. అయోధ్యానగర వీధులలో ఆడుకొనే పిల్లలను మరిపించి తీసుకొనిపోయి సరయూనదిలో పడత్రోసి సంతోషిస్తూ ఉండే వాడు. అందుకు అయోధ్యా నగర వాస్తవ్యులు అందరూ క్రుద్ధులు అయిపోయి సగరచక్రవర్తి దగ్గరకు పోయి ''రాజా, మేము అందరమూ అయోధ్యానగర ములో ఉండవలెను అనేట్లయితే తాము అశ్వమంజుణ్ణి తమ పుత్రుడు అని మన్నించకుండా అడవులకు వెళ్లగొట్టించవలెను. తాము అతణ్ణి వెళ్ళకొట్టను అనేటట్లయితే మేము అందరమూ ఈ అయోధ్యానగరము వదలిపెట్టిపోతాము' అని చెప్పినారు. వారిని సగరచక్రవర్తి ఎందుకు అంత భయపడుతున్నదీ చెప నున్నాడు.

'' ''ప్రభూ, అశ్వమంజుడి బుద్ధి భ్రంశము అయిపోయింది. అతడు వీధులలో అమాయికముగా ఆడుకొనే పిల్లలను మాయచేసి తీసుకొనిపోయి సరయూ నదిలో పడత్రోసి చంపి వేస్తున్నాడు. అది ఒక వేడుక అయిపోయింది''. అని పౌరముఖ్యులు చెప్పారు. సగరచక్రవర్తి ఆ విషయము విచారించినాడు. అశ్వమంజుణ్ణి అతని భార్యనూ కట్టుగుడ్డలతో అప్పటి అప్పుడు రథము ఎక్కించి అడవులకు పంపించి వేసినాడు. అశ్వమంజుడు జీవముతో తిరిగి అయోధ్యానగరానికి రాకూడదు అనికూడా శాసనము చేసినాడు.

''ఆ అశ్వమంజుడు పాపిష్ఠివాడు అయి అడవులలో ఒక గుడ్డికోలు చిన్న గంపతోనూ అన్ని దిక్కులా తిరుగుతూ కందమూలాలు త్రవ్వుకొని తింటూ కాలముగడపినాడు. మహాపరాధము చేసినందువల్ల మహాధర్మకుడు అయిన సగరచక్రవర్తి తన జ్యేష్ఠపుత్రుడు అని మన్నించకుండా అశ్వమంజుణ్ణి అడవు లకు వెళ్ళకొట్టినాడు.

"అమ్మా, ఈ రాముడు ఏమి అపరాధము చేసినాడు అని దశరథమహారాజు ఇప్పుడు ఇతనిని అడవులకు వెళ్ళగొట్టవలెను? మాకు రాముడిలో ఏ ఒక్క దోషమూ కనిపించడములేదు. రాముడు చంద్రుడివలె నిర్మలుడు. ఓ రాణీ, నిజముగా ఈ రాముడిలో ఏ ఒక్క దోషము అయినా మీకు కనబడ్డట్టయితే చెప్పండి. దశరథమహారాజు క్షత్రణ్ణి ఇప్పుడే అడవులకు వెళ్ళగొట్టుతాడు ఏ దోషమూ లేనివాణ్ణి-అందులో పరమ ధార్మికుడు అయినవాణ్ణి అకారణముగా అడవులకు వెళ్ళగొట్టడము అపరాధము. అటువంటి అధర్మము దేవేంద్రుడు అంతటి తేజోవంతుణ్ణి అయినా దహించివేస్తుంది" అని చెప్పినాడు.

సిద్ధార్థుడి మాటలకు దశరథమహారాజు కోపవశుడు అయిపోయినాడు. అతి హీనస్వరముతో "ఓ పాపిష్ఠురాలా, ఈ సిద్ధార్థమంత్రి చెప్పినది నీకు నచ్చదు. నాకు తెలుసును. నీది కుత్సితపు బుద్ధి. నీవి కుచేష్టలు. నాకు మేలు ఏదో నీకు మేలు ఏదో నీకు తెలియదు. నీవు తెలుసుకోలేవు. నీవు సన్మార్గము వదిలిపెట్టినావు.

"ఓ కైకా, నేను ఇప్పుడు ఈ రాజ్యాన్ని త్యజించివేస్తున్నాను. రాముడి వెంట వెళ్ళిపోతున్నాను. నీవు భరతమహారాజుతో యథేష్టముగా బహుకాలము ఈ రాజ్యము ఏలుతూ ఉండు" అన్నాడు దశరథమహారాజు.

## ౩౨

ప్రధానామాత్యుడు సిద్ధార్థుడు చెప్పింది రాముడు విన్నాడు. అత్యంత వినయములో దశరథమహారాజును చూచి "రాజా, నేను భరతుడికోసము సమస్త భోగభాగ్యాలూ వదులుకొని సర్వసంగపరిత్యాగము చేసి వనవాసము చేయడానికి పోతున్నాను. నేను అక్కడ కందమూలాలు తింటూ కాలము గడపవలెను. నాకు అనుచరులు ఎందుకు? సేనలు ఎందుకు? మదపుటేనుగును దానము ఇచ్చిన తరువాత దాని నడుముకు కట్టేతాడు అట్టి పెట్టుకోవడము ఎందుకు? ఆ తాడుమీద మోజు ఎందుకు? అందువల్ల ప్రయోజనము ఏమిటి? సేనలూ మొదలు అయినవి అన్నీ భరతుడికే ఉండవలెను. వాడికే తాము ఇవ్వవలెను. మీరు ఇప్పుడు నేను కట్టుకోవడానికి వల్కలాలు తెప్పించవలెను. నేను పధ్నాలుగు సంవత్సరాలు వనవాసము చేయవలెను కనుక నాకు ఒక గుద్దలీ ఒక చిన్న గంపా ఇప్పించవలెను" అన్నాడు రాముడు.

అక్కడివారు అందరూ ఏమి అనుకొంటారో అనే సిగ్గు అయినా లేకుండా కైకేయీదేవి స్వయముగా వారికి ముగ్గురుకీ వల్కలాలు తెచ్చింది. రాముణ్ణి ఆ వల్కలాలు కట్టుకోమన్నది. రాముడు తన సన్నని వస్త్రాలు విడిచివేసి ఆ వల్కలాలు రెండూ కట్టుకొన్నాడు. లక్ష్మణుడున్నూ అక్కడనే తండ్రి సమక్షములోనే తన అందము అయిన దుస్తును వదలివేసి ఆ నారబట్టలు కట్టుకొన్నాడు.

సీతాదేవి తాను కట్టుకోవలసిన రెండు వల్కలాలనూ చూచింది. వలను చూచిన లేడివలె భయపడి పోయింది. అంత ముతకవి కట్టుకోవడము ఎట్లాగా అని భయపడడమే కాకుండా అంత చిన్నవి కట్టుకోవడము ఎట్లాగా అని దిగులు పడ్డది. సిగ్గుపడ్డది. ఆ జనకరాజపుత్రి ఆ శుభాంగి ఆ పతివ్రతా ధర్మదర్శిని, ఆ వల్కలాలు కట్టుకోవడానికి పదేపదే ప్రయత్నము చేసింది. అవి కట్టుకోవడము ఆమెకు చేత కాలేదు. నిర్వేదపోయి నిలుచున్నది. ఒక వల్కలాన్ని భుజము మీద వేసుకొన్నది. రెండవదాన్ని చేతితో పట్టుకొన్నది. కట్టుకోవడము చేత కానందుకు సిగ్గుపడిపోయి గంధర్వరాజువంటి రాముణ్ణి చూచి కన్నీళ్లు కారుస్తూ "నాథా, తాపసాంగనలు ఈ నారచీరలు ఎట్లా కట్టుకొంటారు" అని అడిగింది. అంతట రాముడు ఆమె కట్టుకొని ఉన్న తెల్ల పట్టుచీర మీదనే వాటిని కట్టి చూపించ పోయినాడు.

అప్పుడు అంతఃపురాంగనలు అందరూ ఘొల్లుమన్నారు. వారు అందరూ కన్నీళ్ళు కారుస్తూ రాముడితో "ఓ తేజస్వీ, ఈ సీతాదేవిని వనవాసము చేయమని మీ నాయనగారు ఆజ్ఞాపించలేదు. నీవు మీ నాయనగారి ఆజ్ఞను శిరసా వహించి ప్రయాణము అయిపోతున్నావు. మంచిదే, అయితే నీవు ఈ సీతను తీసుకొని వెళ్ళవద్దు. నీవు తిరిగి వచ్చేటంతవరకూ నీకు బదులు ఈ ఈసీతను చూస్తూ మేము బ్రతుకుతాము. నీకు లక్ష్మణుడు తోడుగా వస్తూ ఉన్నాడు. అందువల్ల సీతను ఇక్కడే ఉంచవలెను. సీత మంగళ స్వరూపిణి. ఈమె తాపసాంగనవలె అరణ్యములో ఉండవలసింది కాదు. నాయనా, నీవు ధర్మనిత్యుడవు. మేము ఎంతచెప్పినా నీవు ఇక్కడ ఉండవు. కనుక ఈ సీతను ఇక్కడనే మాదగ్గరనే ఉంచి పో. మేము నిన్ను యాచిస్తున్నాము" అన్నారు.

ఈ మాటలకు కైకేయీదేవి చూస్తూ ఊరుకున్నది. రాముడు అంతఃపురాంగనల మాటలు వింటూనే తనతో పాటు వనవాసానికి వస్తూ ఉన్న సీతాదేవికి ఆ నారచీరెలు కట్టుకోవడము మాపించినాడు.

అంతట సీతాదేవి ఆ నారచేరెలు కట్టుకోపోతూ ఉంటే రాజగురువు వసిష్ఠమహర్షి ఆమెతో అవి కట్టుకోవద్దు అని చెప్పి కైకేయీదేవిని చూచి "ఓ కైకా, నీకు దుర్బుద్ధి పుట్టింది. నీవు సదాచారాన్ని వర్జించినావు. నీవు మర్యాదను అతిక్రమించినావు. వంశనాశానికి పూనుకొన్నావు. ఈ దశరథ మహారాజును మోసము చేసినావు. ఇంకా నీకు తనివి తీరలేదు. ఇప్పుడు ఈ సీతను వంచన చేస్తున్నావు. ఈమె రాణి. ఈమె అడవికి పోనవసరము లేదు. ఇప్పుడు రాముడికోసము సిద్ధముచేసిన సింహాసనము ఈమె అధిష్ఠించవలెను. గృహస్థులకు అందరికీ భార్య ఆత్మస్వరూపము. ఇది వేదవాక్యము. ఈ సీతాదేవి రాముడి ఆత్మస్వరూపము. రాముడు లేనప్పుడు రాముడి రాజ్యము ఈమే ఏలవలెను.

"ఓ కైకా, ఈమె నీ కోడలు. ఈమె నారచీరలు కట్టుకొనవలసిన ఆమె కాదు. నీవు ఈమెకు మంచి మంచి చీరలూ శ్రేష్ఠము అయిన ఆభరణాలూ ఇవ్వవలెను. నీవు ఈమెను నారచీరలు కట్టుకోనీకూడదు.

"ఓ దేవీ, భరతుడు ఈ దశరథమహారాజు పుత్రుడే అయినట్లయితే ఈయన మనఃపూర్వకముగా ఈయని రాజ్యము ఒల్లడు. రాజ్యము ఏలడు. అంతే కాదు. నిన్ను తన తల్లిగా మన్నించడు. నీవు ఆకాశానికి ఎగిరినా భరతుడు తన వంశ క్రమానుగతము అయిన సధర్మాన్ని చెడకొట్టడు. నీ పుత్రవాత్సల్యము నీ కొమారుడికి కీడే అవుతుంది. నీకు తెలియదు. రాముడు అరణ్యవాసము చేస్తూన్నాడు అంటే నీ కుమారుడు భరతుడున్నూ వల్కలాజినధారి అయి శత్రుఘ్నుణ్ణి వెంట తీసుకొని రాముడి దగ్గరకే పోయి వనవాసము చేస్తాడు. రాముణ్ణే అనుసరించుకొని ఉంటాడు.

"ఓ కైకా, నీవు రాముణ్ణి ఒక్కడినే వనవాసము చేయించమని కోరినావు. కాని ఈ సీతాదేవిని కూడా వనవాసము చేయించమని దశరథమహారాజును కోరలేదు. ఈమె—సీతాదేవి భర్తతో వనవాసము చేయడానికే సంక

ల్పించుకొన్నట్లయితే రాముడివలె ఈమె వల్కలాలు ధరించ నవసరములేదు. ఈమె ప్రతిదినమూ ఆభరణాలు అన్నీ పెట్టుకొని అలంకారాలు అన్నీ చేసుకొని రాముడితో ఉండవచ్చును. ఈ జనకరాజ పుత్రి వెంట ఈమె వాహనాలూ పరిచారికలూ కూడా పోయి ఉండవచ్చును. ఈమె తన సమస్త వస్తువులూ వెంట తీసుకొని పోవచ్చును'' అన్నాడు.

ఆ బ్రాహ్మణోత్తముడు ఆ అప్రతిమానప్రభావుడు దశరథమహారాజు కులగురువు వశిష్ఠమహర్షి ఇంత చెప్పినా కైకేయీదేవి చలించలేదు. సీతాదేవి మనస్సున్నూ మారలేదు. ఆమె భర్తకు అనురూపము అయిన వేషముతోనే వన వాసానికి పోవలెను అనుకొన్నది.

౩౮

సీతాదేవి నారచీరలు కట్టుకొన్నది. అక్కడ ఉన్నవారు అందరూ దశ రథమహారాజును చూస్తూ "ఛీ ఛీ'' అన్నారు. ఆయన దుఃఖాక్రాంతుడు అయి పోయినాడు. బ్రతుకుమీదనూ ధర్మముమీదనూ కీర్తిమీదనూ ఆయనకు అస హ్యము వేసింది. వేడివేడి నిట్టూర్పులు విడుస్తూ "ఓ కైకా, ఈ సీత నార చీరలు కట్టుకోవలసిన అవసరము లేదు. ఈమె సుకుమారి. బాల. ఈమె ఎప్పుడూ సుఖమే అనుభవించవలెను. వనవాసము చేయవలసినది కాదు అంటూ కులగురు వులు వశిష్ఠులవారు చెప్పినారు. అది యథార్థము. ఈ జనకరాజసుత ఈ పాతి వ్రత్యతపోయుక్త వల్కలాలు ధరించి ఇంతమంది సమక్షములోనూ మైమరచిన శ్రమణికి మల్లే నిలుచున్నది. ఈమె ఎవరికి ఏమి అపకారము చేసింది? ఓ కైకా, ఈ సీత నారచీరలు కట్టుకొని రామునితో అడవికి పోవలెను అని నేను ఇది వరకు నీకు వరము ఇవ్వలేదు, ఈమె కట్టుకొన్న వల్కలాలు ఇప్పుడే విడిచి వేయవలెను. ఈమె తన పెనిమిటితో వనవాసము చేయడానికే నిశ్చయించు కొన్నట్టయితే సమస్త రత్నాభరణాలూ పెట్టుకొని సుఖముగా పోవలెను.

"ఓ కైకా, నాకు చావు దగ్గరకు వచ్చింది. అందువల్లనే నీవు అడగ గానే నీ కోర్కెలు చెల్లిస్తాను అంటూ ఘోరముగా శపథము చేసినాను. నీవు నీ బాలిశత్వమువల్ల రాముణ్ణి అడవులకు వెళ్ళగొట్టమనీ భరతుడకి పట్టము కట్ట మనీ కోరినావు. వెదురుకు వేసే పువ్వే వెదురును దహించి వేస్తుంది. అదే విధ ముగా నేను చేసిన శపథమే నన్ను దహించి వేస్తున్నది.

"ఓ పాపీ, ఒకవేళ రాముడు నిన్ను ఏ కొంచెము అయినా కష్టపెట్టినాడేమో. ఈ వైదేహి నిన్ను ఏమి కష్టపెట్టింది? ఏమి అపచారము చేసింది? ఈ హరిణాక్షి-ఈ ముద్దరాలు-ఈ మృదుశీల-ఈ పాతివ్రత్యసహాయుక్త-ఈ జనకరాజపుత్రి ఇకముందు నీకు ఏమి అపకారము చేస్తుంది? ఓ పాపీ, రాముణ్ణి అరణ్యవాసానికి పంపించే పాపము చాలదా? ఇంకా ఎందుకు పాతకాలకు ఒడి కట్టుతావు? నీకు ఏమి లాభము? ఓ కైకా, తనకు యువరాజ్యాభిషేకము అవుతుంది అనుకొంటూ వచ్చిన రామునికి నీవు చెప్పింది అంతా విన్నాను. నేను తల ఒగ్గినాను. నీవు ఇప్పుడు ఆ కోరికను అతిక్రమించి పోయినావు. ఈ సీత కూడా నారచీరలు కట్టుకొని వనవాసానికి పోతూ ఉంటే చూడవలెను అని ఇప్పుడు నీకు బుద్ధిపుట్టింది. సీతచేత నారచీరలు కట్టించినావు. నీవు ఘోర నరకాన పడుతావు" అన్నాడు ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు.

ఆయనకు ఏడ్పు వచ్చింది. కన్నీళ్ళు కార్చినాడు. కైకేయీదేవి మనస్సు కరగలేదు. ఆయన దుఃఖానికి అంతము కనపడలేదు. నేలవంక చూస్తూ తల వంచుకొని కూర్చున్నాడు.

రాముడు ప్రయాణసన్నద్ధుడు అయి "దేవా, తాము పరమధార్మికులు. ఈ యశస్విని మా అమ్మ కౌసల్యాదేవి ఉత్తమశీల, వృద్ధు. తాను నన్ను అడవులకు పొమ్మన్నా తమను ఈమె నిందించడములేదు. నేను వెళ్ళిపోగానే ఈమె శోకసాగరములో పడుతుంది. ఇటువంటి దుఃఖము ఈమె ఇదివరకు ఎన్నడూ ఎరగదు. ఈమెను మీరు కనిపెట్టవలెను, కనికరించవలెను. ఈమె పుత్రశోకముతో కుంగిపోకుండా మీరు ఈమెను ఆదరించవలెను. నన్ను తలచుకొంటూ ఈమె మీ ప్రాపున బ్రతుకుతుంది. నేను కనపడక పోతే ఈమె దుఃఖములో కృశించిపోతుంది. ఈమె పుత్రప్రేమ అటువంటిది. నా కోసము ఈమె ప్రాణము విడువకుండా మీరు కాపాడవలెను. ఓ వరదా, తాము దేవేంద్రుడు అంతటివారు. కోరిన కోరికలు ఇస్తారు. నాకు ఇంతకన్నా ఏ కోరికా లేదు" అన్నాడు.

## ౩౯

రాముడు చెప్పింది దశరథమహారాజూ, ఆయన భార్యలూ విన్నారు. ఆ మాటలకు ఆయన భార్యలు మూర్ఛపోయినారు. మునివేషములో ఉన్న

రాముణ్ణి దశరథమహారాజు చూచినాడు. కళ్ళుఅన్నీ నీళ్ళుకమ్ముకొనిపోయినవి. తేరిపార చూడలేకపోయినాడు. తల వంచుకొన్నాడు. మాట్లాడలేక పోయినాడు. ఒక కొంచెము సేపు మయిమరిచిపోయినవాడివలె కూర్చున్నాడు. రాముణ్ణి గురించే ఆలోచిస్తూ, "నేను పూర్వజన్మలో ఆవుల దగ్గరనుంచి దూడలను ఎడపాపి ఉంటాను. లేదా తల్లిదండ్రులనుంచి బిడ్డలను అయినా ఎడపాపి ఉంటాను. కాకపోతే చిన్నవాండ్లను హింసపెట్టి అయినా ఉంటాను. అందువల్ల నాకు ఇప్పుడు ఇట్లా సంభవించింది. నన్ను కైకేయి ఇంత క్లేశపెట్టుతూ ఉన్నా చావకుండా ఉన్నాను. ఇంతకూ అవసానకాలము ఆసన్నము కానిదే ఈ బొందిలోనుంచి ప్రాణము పోదు. నా జ్యేష్ఠపుత్రుడు - అగ్నిహోత్రుడి వంటి తేజోవంతుడు కట్టుకొన్న తన సన్నబట్టలు వదిలిపెట్టి వల్కలాలు కటుకొని నా ఎట్టఎదుట నిలుచుంటే నేను చావకుండా చూస్తూ ఊరుకోవలసి వచ్చింది. తన స్వార్థముకోసము నన్ను ఒక్కణ్ణి వంచనచేసిన ఒక్క కైకేయి నుంచి ఇంతమంది జనము ఇంత దుఃఖము అనుభవించవలసి వచ్చింది." అంటూ దశరథమహారాజు విలపించినాడు. ఆయన దేహము కంపించిపోయింది. "రామా" అన్నాడు, ఆ పయిన ఆయన నోట మాట పెగలలేదు. నిశ్చేష్టుడు అయినాడు. కొంత సేపటికి సుమంత్రుణ్ణి చూచి కన్నీళ్ళు కారుస్తూ "ఓ మంత్రి పుంగవా, విలాసార్థము ఎక్కిపోయే రథాన్ని ఒకదానిని సిద్ధము చేయించి తీసుకొని రావలెను. నీవే ఈ మహాభాగుణ్ణి ఆ రథము ఎక్కించుకొని పోయి జనపదాలకు అవతల వదిలిపెట్టి రావలెను. ఓ సుమంత్రుడా, ఇప్పుడు తల్లిదండ్రులు తమ పుత్రుణ్ణి-సత్పురుషుడు అని పేరెన్నిక కన్నవాణ్ణి- అందులో శౌర్యవంతుణ్ణి అడవులకు వెళ్ళకొట్టుతున్నారు. గుణవంతుల సద్గుణాలకు ఇది ఫలము కాబోలు" అన్నాడు.

సుమంత్రుడు రాజాజ్ఞను శిరసావహించి వెంటనే వెళ్ళిపోయి సువర్ణరత్న భూషితము అయిన రథాన్ని అలంకరించి ఉత్తమాశ్వాలను కట్టించి అక్కడికి తీసుకొని వచ్చినాడు.

అంతట దశరథమహారాజు తన ధనాధ్యక్షుణ్ణి అక్కడికి రావించినాడు. అతడు పరిశుద్ధుడు, దేశకాలజ్ఞుడు. ఆయా కాలోచిత వస్తువిషయ నిశ్చయజ్ఞాని. సీతాదేవి వనవాసము చేసే పధ్నాలుగు సంవత్సరాలకూ సరిపోయేట్టుగా లెక్క

చేసి మంచిమంచి చీరలూ శ్రేష్ఠము అయిన రత్నాభరణాలూ ఇవ్వవలసిందని ఆతడికి దశరథమహారాజు ఆజ్ఞాపించినాడు. ఆ ధనాధ్యక్షుడు వెంటనే కోశగృహము నుంచి ఆమూ వస్త్రాభరణాలు అన్నీ తెప్పించి సీతాదేవికి ఇచ్చినాడు. సీత సుజాత. ఆమె అవయవాలు అన్నీ అంతకన్నా సుజాతాలు. ఆ అవయవాలకు తగినట్టుగా ఆమె ఆ చిత్రవిచిత్రము అయిన సువర్ణమణిభూషణాలను పెట్టుకొన్నది. అప్పుడు ఆభవనములో ఆమె ఆభరణద్యుతులు ఆకాశములో బాలభాస్కర ప్రభలవలె విరాజిల్లినవి.

కౌశల్యాదేవి అప్పుడు ఆ మైథిలిని రెండుచేతులా కౌగిలించుకొని శిరము ఆఘ్రాణించి "సీతా ఈలోకములో ఆడవాండ్లు సామాన్యముగా తాము కోరే వాటిని అన్నిటినీ సమకూర్చి సంతోషపెట్టేటంత వరకే తమ భర్తలను గౌరవిస్తారు. ఆ భర్తలకు కష్టకాలము వస్తే ఆ ఆడవాండ్లు వాండ్లను ఏమాత్రమూ లెక్క చేయరు. సుఖము అనుభవించేటంత కాలమూ వాండ్లు మంచివాండ్లుగా ఉంటారు. కాని వాండ్ల భర్తలకు ఏ కొంచెము ఆపద వచ్చినా ఏ కొంచెము దారిద్ర్యము వచ్చినా వాండ్లకు దుష్టబుద్ధులు పుట్టుతవి. భర్తలను వదలివేయవలెను అనుకొంటారు. సామాన్యస్త్రీలు వాండ్ల మొగవాండ్లతో ఎప్పుడూ అబద్ధాలు ఆడుతారు. లేశమాత్రానికి కలహిస్తారు. వాండ్లు పాప సంకల్పలు. దుర్గ్రాహ్య హృదయులు. వాండ్లకు కులగౌరవముతో పనిఉండదు. చేసిన మేలు మరచిపోతారు. లోకమర్యాదలను పాటించరు. విద్య వాండ్లను మార్చదు. అగ్నిసాక్షిగా పెండ్లిచేసుకొన్న పెనిమిటి అనే గౌరవము వాండ్ల మొగవాండ్లమీద వాండ్లకు ఉండదు. వాండ్ల చిత్తాలు క్షణక్షణానికీ చలిస్తూ ఉంటవి. వాండ్లు వికృతముగా ప్రవర్తిస్తారు. వాండ్లను ఎవరూ నమ్మడానికి వీలులేదు.

"ఇటువంటి సామాన్య స్త్రీలే కాకుండా పతివ్రతలు అయినవాండ్లు కొందరు ఈ లోకములో ఉన్నారు. ఆ పతివ్రతలు ఇట్లా ప్రవర్తించరు. వాండ్లు సత్యము తప్పరు. సదాచారము మానివేయరు. గురుజనులను ధిక్కరించరు. వాండ్లకు పెనిమిటి ఒక్కడే పరమ పవిత్రుడు. వాడే అందరికన్నా అధికుడు. వాడే వాండ్లకు గతి. వాడే వాండ్లకు దేవుడు. తల్లీ సీతా, నా కొడుకు దరిద్రుడుఅయినా ధనవంతుడుఅయినా నీకు పెనిమిటి. అడవులకు వెళ్ళకొట్టినారు

అని నీవు వాణ్ణి అలక్ష్యము చేయవద్దు. వాడు నీ పెనిమిటి కాబట్టి వాడే నీకు దేవుడు. నీవు ఎప్పుడూ వాణ్ణి అనుసరించుకొని ఉండవలెను'' అని చెప్పింది.

ఇట్లా ధర్మిష్ఠముగా చెప్పిన కౌసల్యాదేవికి ఎట్టఎదుట నిలుచుని ఉన్న సీతాదేవి చేతులు జోడించి "ఓ పూజ్యురాలా మీరు ఆజ్ఞాపించినట్లే నేను నడుచుకొంటున్నాను. నన్ను మీరు సామాన్య స్త్రీలకింద లెక్క వేయవద్దు. పెనిమిటి విషయములో నేను ఎట్లా ప్రవర్తించవలెనో మా అమ్మా మా నాయనగారూ నాకు ఎంతో బోధ చేసినారు. చంద్రుణ్ణి వెన్నెల ఎన్నడూ వదిలి పెట్టదు. అట్లాగే నేను ధర్మాన్ని వదిలి పెట్టను. నాభర్త ఎక్కడ ఉంటే నేనూ అక్కడనే ఉంటాను, తీగెలు లేని వీణ మోగదు. చక్రాలు లేని రథము నడవదు. అట్లాగే నూరుమంది కొడుకులు ఉన్నా పెనిమిటి వెంట ఉండని స్త్రీ సుఖపడదు. ఏ స్త్రీకి అయినా తల్లి దండ్రులు ఏది అయినా మితముగానే ఇస్తారు. కొడుకు అయినా మితముగానే ఇస్తాడు. ఒక్క పెనిమిటి మాత్రమే ఆడుదానికి అన్నీ అమితముగా ఇస్తాడు, అందువల్ల పెనిమిటిని పూజించకుండా ఉండడము ఎట్లాగు? నేను పతివ్రతను. మహా పతివ్రతలు అయినవారివల్ల ఆ ధర్మాలు అన్నీ విన్నాను. నేను నా పెనిమిటిని ఎన్నడూ అలక్ష్యము చేయను. నాకు ఆయనే దేవుడు'' అన్నది.

సీతాదేవి ఇంత మనోహరముగా చెప్పినందుకు కౌసల్యాదేవికి సంతోషము కలిగింది. దుఃఖము వచ్చింది. ఆమె కన్నీళ్ళు కార్చినది.

తల్లులు అందరిలోనూ పూజ్యురాలు అయిన కన్న తల్లి కౌసల్యాదేవికి రాముడు నమస్కారపురస్సరముగా ప్రదక్షిణము చేసినాడు. అంతట ఆ పరమ ధార్మికుడు "అమ్మా, నీవు దుఃఖపడవద్దు. నా నాయనగారిని కనిపెట్టుకొని ఉండు. నా వనవాసము ఇట్టే కడచిపోతుంది. నీవు కళ్లు మూసుకొని నిద్రపో. పద్నాలుగు ఏండ్లూ నీకు తెలియకుండా ఇట్టే కడచిపోతవి, నీవు కన్నులు తెరచి చూడగానే నేను నా స్నేహితులు అందరితోనూ నీకు కనపడుతాను'' అని చెప్పి, తక్కిన మున్నూటయాభైమంది తల్లులకున్నూ నమస్కారముచేసి "ఓ తల్లులారా, చిరపరిచయమువల్ల కానీ అజ్ఞానమువల్ల కానీ నేను మీకు ఏ కొంచెము అయినా అపచారము చేసి ఉంటే నన్ను మీరు అందరూ క్షమించవలెను. ఇప్పుడు నేను మిమ్ములను అందరినీ వదిలి పెట్టి పోతున్నాను'' అన్నాడు.

వారు అందరూ శోకోపహతచిత్తులు అయి క్రౌంచపక్షులవలె ఎలుగెత్తి ఏడవసాగినారు. మృదంగాలూ ఉడుకలూ మేఘాలూ మొదలు అయిన జంత్ర వాద్యాలు ఎప్పుడూ మ్రోగే దశరథమహారాజు భవనములోంచి అప్పుడు ఆపదలపాలు అయిపోయిన స్త్రీల పరిదేవనాలు విలాపాలు ఘోరముగా వినిపించినవి.

౪౦

దశరథ మహారాజుకు సీతారాములూ లక్ష్మణుడూ చేతులు జోడించి పాదాభివందనము చేసినారు. ముగ్గురూ దీనవదనాలతో ఆయనకు ప్రదక్షిణము చేసినారు. తనతో పాటు వనవాసము చేయడానికి రాముడు సీతాదేవికీ లక్ష్మణుడికీ ఆయన చేత అనుజ్ఞ ఇప్పించినాడు. దుఃఖపడుతూ ఉన్న తన తల్లిని చూచినాడు. శోక సమ్మూర్ఛుడు అయిపోయినాడు. ఆమెకు భార్యా సహితముగా శిరసా నమస్కారము చేసినాడు.

లక్ష్మణుడు కౌసల్యాదేవికి నమస్కారము చేసి తన తల్లి సుమిత్రాదేవి వంక చూచినాడు. ఆమె దుఃఖము అణచుకోలేకపోయింది. అవురుమన్నది. తన పాదాలు అంటి నమస్కారము చేస్తూ ఉన్న తన పుత్రుడు లక్ష్మణుణ్ణి రెండు చేతులా లేవనెత్తింది. అతని శిరము ఆఘ్రాణించి "నాయనా, లోకసంరక్షణార్థము కౌశల్యాదేవి రాముణ్ణి కన్నది. ఆ రాముణ్ణి నిరంతరమూ కనిపెట్టుకొని ఉండి వాడికి సేవచేయడానికి నేను నిన్ను కన్నాను. కనుక నీవు ఎప్పుడూ ఏమరుపాటు లేకుండా వాణ్ణి కనిపెట్టుకొని ఉండు. వాణ్ణి ఒక్కణ్ణే కాదు. సీతారాములను కనిపెట్టుకొని ఉండు. ఈ నాడు రాజ్యాభావమువల్ల వ్యసని అయినా రేపు రాజ్యప్రాప్తివల్ల సమృద్ధుడు అయిన రాముడే నీకు దిక్కు. కనిష్ఠుడికి జ్యేష్ఠానువర్తనము లోకధర్మము. అందులో మీ ఇక్ష్వాకువంశములో జేష్ఠుడికోసము కనిష్టుడు దానధర్మాలు చేయడమూ యజ్ఞదీక్ష వహించడమూ రణరంగములో తనుత్యాగము చేయడమూ అనూచానముగా వస్తూ ఉన్న ఆచారము. నాయనా, నీవు రాముడితో హాయిగా అడవికి పో. రాముడే నీకు తండ్రి అనుకో. ఈ సీతాదేవే నీ తల్లి అనుకో. అడవే అయోధ్యాపట్టణము అనుకో. సీతారాములతో సుఖముగా ఉండు. సంతోషముగా వాండ్లతో ప్రయాణము అయిపో" అని చెప్పింది.

అప్పుడు సుమంత్రుడు రాముణ్ణి చూచి చేతులు జోడించి మాతలి దేవేంద్రుడికి చెప్పేటట్టు "మహాయశా, రథము సిద్ధముగా ఉంది. తమకు శుభము అవుతుంది. తాము రథము ఎక్కవలెను. తాము కోరే చోటుకు రథము తోలుకొని పోవడానికి సిద్ధముగా ఉన్నాను. తాము ఈనాడే ప్రయాణము అయిపోవలెను అని కైకేయీదేవి చెప్పింది. తాము ఇప్పుడే బయలుదేరేటట్లయితే తమ పధ్నాలుగు సంవత్సరాల వనవాసానికీ ఇదే మొదటి దినము అవుతుంది" అని చెప్పినాడు. సర్వాలంకారాలతోనూ శోభిస్తూ ఉన్న వరారోహ సీతాదేవి అప్పుడు అరుణోదయ సూర్యుడివలెనూ జ్వలితాగ్నిహోత్రమువలెనూ ధగధగలాడుతూ ఉన్న ఆ బంగారు రథము ఎక్కింది. ఆమె తరువాత రామలక్ష్మణులు ఆ రథము ఎక్కినారు. సీతాదేవికి వనవాసానికి సరిపోయేటట్టుగా వస్త్రాభరణాలు ఇప్పించినట్టే దశరథమహారాజు రామలక్ష్మణులకు వివిధ ఆయుధాలూ కవచాలూ చర్మము వేసి కట్టిన గంపలూ గుద్దళ్ళూ ఇప్పించినాడు. సుమంత్రుడు వాటిని అన్నిటినీ ఆ రథ మధ్యభాగములో పెట్టించినాడు. సీతారామలక్ష్మణులు సర్దుకొని కూర్చుండగానే సుమంత్రుడు గుర్రాల పగ్గాలు సడలించి అదలించినాడు. రథము కదిలింది.

అప్పుడు అయోధ్యానగరము అంతా సంచలించిపోయింది. అభిషేకము చూడవచ్చిన వివిధ జనపద ప్రేక్షకులు నిర్ఘాంతపోయినారు. పౌరులకు ఏమి చేయడానికీ తోచక నిశ్చేష్టులు అయిపోయినారు. సైనికులు కలవరపడిపోయినారు. ఏనుగులు కోపముతో ఘీంకారము చేసినవి. గుర్రాలు కాలికట్టు త్రాళ్ళు తెంపుకొని కాళ్ల గజ్జెల చప్పుళ్లతోనూ గిట్టల మోతతోనూ పట్టణము అంతటా పరుగులు ఎత్తినవి. పెద్దలు పిన్నలూ వృద్ధులు, ఎండాకాలములో దప్పిక అయిన వాండ్లు మంచినీటికోసము జలాశయము వైపు పరుగులు ఎత్తేట్లుగా, రాముడి రథము వెంట పడ్డారు. ఆ రథము ఇరుపక్కలకు కొంతమందీ ఆ రథము ముందు పక్కకు మరికొంతమందీ పోయినారు. ఇంకా కొంతమంది ఆ రథము వెనక మూగినారు. అందరూ తలలు పైకి ఎత్తి చూచినారు. వారికి అందరికీ రాముడు చక్కగా కనిపించలేదు. అప్పుడు అందరూ నిట్టూర్పులు విడుస్తూ, కన్నీరు కారుస్తూ "ఓ సుమంత్రుడా, గుర్రాల పగ్గాలు లాగి పట్టుకో. రథాన్ని మెల్లగా పోనివ్వు. మేము రాముణ్ణి కండ్లారా చూడవలెను. ఇప్పుడు తప్పితే మళ్లీ

ఇంక ఎన్నాళ్ళకు ఆ మహానుభావుని ముఖారవిందము చూస్తామో" అంటూ కేకలు వేశారు.

అప్పుడు అక్కడ మూగిన జనులు కొందరు "అయ్యో! దేవకుమారుడి వంటి కుమారుడు రాముడు అడవుల పాలు అయిపోతూ ఉంటే కౌసల్యాదేవి గుండె బ్రద్దలు అయిపోలేదు. ఆమెది ఇనుపగుండె అయి ఉండవలెను. సందేహములేదు" అని అన్నారు.

"సీతాదేవి ఎంతదొడ్డది! ఆమె ధర్మపరాయణి. మేరుపర్వతాన్ని సూర్యకాంతులు ఎన్నడూ ఎడబాయనట్లు రాముణ్ణి ఆమె వదిలిపెట్టకుండా ఉంది. రాముడితో రాముడి నీడవలె వనవాసానికి పోతున్నది" అని కొందరు అన్నారు.

"ఓ లక్ష్మణా, నీవు దేవసమానుడు అయిన నీ జ్యేష్ఠ భ్రాతకు నిరంతరమూ సేవ చేయవలెను అనుకొన్నావు. కృతకృత్యుడవు అయినావు. రాముణ్ణి వెంబడించడమే నీకు తపస్సిద్ధి. ఇదే నీకు అభ్యుదయము. ఇదే నీకు స్వర్గద్వారము' అని అంటూ అందరూ దుఃఖము పట్టలేక కన్నీళ్ళు కార్చినారు.

రాజమందిరములో అంతఃపురాంగనలు అందరూ దశరథమహారాజు చుట్టూ మూగి బిగ్గరగా ఏడువసాగినారు. అంతట ఆయన దుఃఖము పట్టలేక "నేను రాముణ్ణి చూడవలెను" అంటూ బయటికి వచ్చినాడు. వేటకాండ్లు కట్టివేసిన పోతుటేనుగును చూచి పెంటిఏనుగులు గీపెట్టి ఏడ్చేటట్టు ధర్మపాశబద్ధుడు అయిన రాముణ్ణి చూచి పురస్త్రీలు అందరూ బొబ్బలు పెట్టి ఏడవడము చూచినాడు. ఆ శ్రీమంతుడు అప్పుడు రాహువు పట్టిన చంద్రుడివలె తేజోహీనుడు అయిపోయినాడు.

ఇంతింత అని చెప్పనలవికాని ధైర్యవంతుడు రాముడు అప్పుడు తన రథముచుట్టూ జనసమూహాలు మూగుతూ పరుగెత్తుకొని వస్తూ ఉంటే గుర్రాలను వేగముగా పోయేట్టు తోలమని సుమంత్రుడితో చెప్పినాడు. ఆ జనులు అందరూ రథాన్ని ఆపమంటూ కేకలు వేయసాగారు. అందువల్ల సుమంత్రుడు ఆ రథాన్ని వేగముగా తోలలేక పోయినాడు. ఆపలేక పోయినాడు. ఆ రథాన్ని మందముగా పోనిచ్చినాడు.

రథ చక్రాలకు రేగిన దుమ్ము అంతా ఆ మహాజన సమూహము కార్చిన కన్నీళ్ళకు పైకి లేవకుండా అణిగిపోయింది. నీళ్ళలో చేపలు కదిలితే కమలాలలో నుంచి నీళ్ళు కారినట్టు అక్కడ చేరిన స్త్రీల నేత్ర కమలాలలో నుంచి కన్నీళ్ళు కారసాగినవి. ఆ విధముగా జనసమూహము హాహాకారాలతో రోదనము చేస్తూ రాముడి రథము వెంట పడడము దశరథమహారాజు చూచినాడు. మొదలు అంట నరకిన చెట్టువలె నేల కూలినాడు. అట్లా నేలకూలిన మహారాజును జన సమూహము చూచింది. "హా రామా" అంటూ కొందరూ "అయ్యో కౌసల్యా" అంటూ కొందరూ కేకలు వేసినారు. అందరూ ఘొల్లుమన్నారు. అంతఃపురాంగనలు అందరూ ఘోరముగా రోదనము చేయడము మొదలుపెట్టినారు. ఆ రోదన ధ్వనులు మిన్ను అంటినవి.

అప్పుడు రాముడు వెనకకు చూచినాడు. దశరథమహారాజూ కౌసల్యాదేవీ తన రథము వెంట పరుగెత్తుకొని రావడము చూచినాడు. అతని మనస్సు కదిలిపోయింది. ధర్మపాశబద్ధుడు అయి ఉన్నాడు. కట్టివేసిన గుర్రపు పిల్ల తల్లిని చూచినట్టు ఓర చూపులతో తల్లినీ తండ్రినీ చూచినాడు. ఎప్పుడూ ఎంతో సంతోషమూ సుఖమూ అనుభవిస్తూ ఎక్కడికి అయినా వాహనాలలో పోయే తన తల్లీ తండ్రీ అట్లా రథము వెంట పరుగెత్తడము సహించలేక పోయినాడు. బరిగోలతో పొడిచిన ఏనుగువలె బాధపడ్డాడు. రథాన్ని బాగా వేగముగా తోలుమని సుమంత్రుణ్ణి ఆజ్ఞాపించినాడు. వెంట ఉన్న దూడ కనబడక పోతే ఆవు కొట్టము వైపు పరుగెత్తుకొని వచ్చేటట్టు కౌసల్యాదేవి రాముడి రథము వైపు పరుగుతీసింది. "ఓ రామా, ఓ సీతా, ఓ లక్ష్మణా" అంటూ కేకలు పెట్టింది. పరుగెత్తుతూ శివము ఎత్తినట్లు చిందులు తొక్కడము మొదలు పెట్టింది. అప్పుడు దశరథమహారాజు రథము ఆపమని గొంతెత్తి పెద్దపెట్టున కేక వేసినాడు.

"సుమంత్రుడా, గుర్రాలు వాయువేగముతో పోయేటట్టు తోలవలెను" అని రాముడు గట్టిగా చెప్పినాడు. సుమంత్రుడికి ఏమీ తోచలేదు. దశరథ మహారాజు ఆజ్ఞను శిరసావహించడమా రామాజ్ఞను నెరవేర్చడమా అనే జిజ్ఞాసలో పడ్డాడు. అతని పని రథచక్రాల మధ్య పడ్డట్టు అయిపోయింది. రాముడు అది కనిపెట్టి "ఓ మంత్రిపుంగవా, నాతల్లి తండ్రుల దీనావస్థను

చూచి నేను సహించలేకుండా ఉన్నాను. రాజు నిన్ను నిందించేటట్లయితే ఆయన కేక వినిపించలేదని చెప్పవచ్చును. ఓ అమాత్యశేఖరా, రథాన్ని వేగముగా పోనివ్వు" అన్నాడు. సుమంత్రుడు అప్పుడు రామాజ్ఞను శిరసా వహించడమే కర్తవ్యము అనుకొన్నాడు. రథము వేగముగా పోతుంది అని ఆతను అందరికీ తెలియజేసినాడు. అప్పుడు అంతఃపుర స్త్రీలు ఆ రథానికి ప్రదక్షిణము చేసి నిలుచుండి పోయినారు. పురజనులు వెనకకు మళ్ళలేదు. వెనకకు పోవలెను అనే బుద్ధి వారికి మనస్సులోనైనా పుట్టలేదు. అందరూ ఏడువ సాగినారు. సుమంత్రుడు గుర్రాలను అదలించినాడు. అవి వాయువేగముతో పరుగిడినవి.

అంతట అమాత్యులు దశరథమహారాజుతో "ప్రభూ, ప్రయాణము అయిపోతున్నవారు తొందరగా తిరిగిరావలెను అనుకొనేటట్లయితే వారిని పంపించడానికి దూరము పోకూడదు" అన్నారు. ఆ సుగుణ సంపన్నులు చెప్పిన మాటలు దశరథ మహారాజు విన్నాడు. విషణ్ణవదనుడు అయి ఒండ్లు అంతటా చెమటలు కారుతూ భార్యలు అందరితోనూ ఆ పోతున్న రథమువంక చూస్తూ నిలుచున్నాడు.

## ౪౧

రాముడు దశరథమహారాజుకూ కౌసల్యాదేవికీ పాదాభివందనము చేసి తక్కిన తల్లులకు వీడ్కోలు చెప్పి రథము ఎక్కగానే అంతఃపురాంగనలు అందరూ బావురు మన్నారు.

"అయ్యో, రాముడు ఎక్కడికి పోతున్నాడు? దిక్కులేని వాండ్లకు ఇకను దిక్కు ఎవడు? ఆశక్తులకు ఇకను అండ ఎవడు? తాపసులను కాపాడే వాడు ఇకను ఎవడు? అందరినీ రక్షించేవాడు ఇకను ఎవడు? అయ్యో! ఎవరు ఏమి అన్నా కోపము రానివాడే - ఎవరి మనస్సు నొప్పించనివాడే - కోపము వచ్చినవారిని సమాధానపరచేవాడే - ఇతరుల సుఖమే తన సుఖముగా ఇతరుల దుఃఖమే తన దుఃఖముగా భావించేవాడే - కన్నతల్లీ సవతితల్లీ అనే భేదము లేకుండా తల్లులు అందరినీ ఒక్కమాదిరిగా పూజించేవాడే - ఆ రాముడు ఆ జగద్రక్షకుడు ఇప్పుడు ఎక్కడికి పోతున్నాడు? కైకేయీదేవి బాధ పడలేక రాజు

అడవులకు పొమ్మంటే ఎక్కడికి పోతున్నాడు? ఆ మహారాజు ఎంత మతి మాలినవాడు! ప్రాణికోటిని అంతా సంతోషపెట్టే వాణ్ణి ధర్మము తప్పని వాణ్ణి సత్యము తప్పనివాణ్ణి రాముణ్ణిఅడవులకు వెళ్ళగొట్టుతున్నాడా'' అంటూ అంతః పురాంగనలు దూడలు పోయిన ఆవులవలె బిగ్గరగా కేకలు పెడుతూ ఏడవ సాగినారు. పుత్రశోకముతో అసలే కుమిలిపోతూ ఉన్న దశరథమహారాజు అప్పుడు ఆ ఆర్తాలాపాలు ఆలకిస్తూ అక్కడ ఉండలేకపోయినాడు. "రాముణ్ణి చూడవలెను'' అంటూ బయటికి పోయినాడు.

రామాభిషేకము ఆగిపోయింది అని తెలియగానే ఆహితాగ్నులు అగ్ని హోత్రాలలో హోమాలు చేయలేదు. గృహస్థులు వంట వండుకోలేదు. ప్రజలు ఎవరూ తమ తమ పనులలోకి పోలేదు. మానవులేకాదు, పశువులు గడ్డి కూడా తినక నిలుచుండి పోయినవి. ఏనుగులు గ్రాసకబళాలు నోటిలో పెట్టుకో లేదు. ఆవులు దూడలకు పాలుయివ్వలేదు. తల్లులు తమ తొలిచూలు బిడ్డలను అయినా దగ్గరకు తీయలేదు. రాముడివంటి కొడుకును కౌసల్యాదేవి వంటి తల్లి అడవులకు పోనీకుండా ఆపలేదే అని కొడుకులకు తల్లులమీద ఆపేక్ష అంతరించింది. రాముడివంటి కొడుకు తల్లి ఎంత చెప్పినా వినకుండా చివరకు తనతో పాటు వెంట అయినా తీసుకొనిపోకుండా పెళ్లాన్ని తీసుకొని పోతున్నాడే అని తల్లులకు కొడుకులమీద మమకారము మాయము అయింది. దశరథమహా రాజు అంతటి పెద్దవాణ్ణి కైకేయీదేవి అంత చిన్నది ఇట్టే మోసము చేసిందే అని భర్తలకు భార్యలమీద అనురాగము అడుగు అంటింది. పట్టమహిషిని- అందులో జేష్ఠపుత్రుడిని కన్న ఇల్లాలిని దశరథ మహారాజువంటి ధర్మాత్ముడు కాస్త అయినా కనికరము లేకుండా కష్టాల పాలు చేసినాడే అని భార్యలకు భర్తలమీద గౌరవము అంతర్ధానము అయింది. అన్నతమ్ముల అన్యోన్యానురాగము అనుమానాస్పదము అయింది.

ఆ నాడు సూర్యుడు ఎండ కాయడము మానివేసినాడు. రాము పృథివి కదిలింది. సముద్రము పొంగి భయంకరముగా గాలి వీస్తూ ఆకాశము అంతటా దట్టముగా మబ్బులు కమ్ముకొన్నట్లు అయిపోయింది. అయోధ్యానగర వాస్తవ్యులు అందరూ శోకసాగరములో పడిపోయినారు. దిక్కులు తెలియకుండా పోయినవి. అందరికీ దుఃఖము తరంగాలు తరంగాలుగా వచ్చింది. అందరూ

దశరథమహారాజును గురించి చెప్పుకొంటూ ఏడుస్తూ రాజవీధిలోకి వచ్చి నిలుచుండి నిశ్చేష్టులు అయినారు. రాముడి మిత్రులు అందరూ మూర్ఛపోయినారు. ఎక్కడివారు అక్కడనే తెప్పరిల్లకుండా పడిపోయినారు. చల్లగాలి వీచడము మానివేసింది.

సూర్యాస్తమయము ఎప్పుడు అయిందో ఎవరికీ తెలియదు. చంద్రుడు గుడ్డిగా వెన్నెల కాయడము మొదలు పెట్టినాడు. ఇక్ష్వాకుల పూర్వికుడు-నక్షత్రరూపాన ఆకాశములో అగుపించే త్రిశంకువు చంద్రుణ్ణి కలుసుకొన్నాడు. ఆ చంద్రుడికి అప్పుడు గురుబుధుల సంబంధమూ కుజాది క్రూరగ్రహ సంబంధమూ పట్టింది. అశ్విన్యాదితారల తళతళలు ఆగిపోయినవి. సప్తర్షులు కాంతులు మాసిపోయి కనిపించినారు. ఇక్ష్వాకులతార అయిన విశాఖాతారక పొగ కమ్ముకొని పోయింది.

ఇన్ని మాటలు ఎందుకు ? దేవేంద్రుడు త్రిలోకాధిపత్యము మానుకోగానే భయంకర ధ్వనులతో ఈ పృథివి అంతా పర్వతాలతో కూడా గజగజలాడిపోయేటట్లు రాముడు యువరాజ్యాభిషేకము మానుకొని అరణ్యవాసము చేయడానికి రథము ఎక్కగానే ఏనుగులు ఘీంకారాలతోనూ గుర్రాల పరుగులతోనూ జనసమూహాలతోనూ ఆర్తనాదాలతోనూ యోధగణాల భుజవిస్ఫాలన ధ్వనులతోనూ అయోధ్యానగరము కంపించిపోయింది.

౪౧

రాముడు ఎక్కిపోతున్న రథచక్రాల ఒరవడికి ఆకాశము అంత ఎత్తున దుమ్ము రేగింది. ఆ రేగిన దుమ్మువంక దశరథమహారాజు కన్నులార్పకుండా చూస్తూ నిలుచున్నాడు. ఆయన చూచినకొద్దీ ఆ దుమ్ము రేగడము ఎక్కువ అయింది. అంతట కొంతసేపటికి ఆ రథపరాగము అణిగిపోయింది. రథము పోయిన జాడ అయినా తెలియలేదు. అప్పుడు దశరథమహారాజు ఆర్తుడు అయినాడు. విషణ్ణుడు అయిపోయినాడు. చివరకు స్మృతి తప్పి నేలమీద పడిపోయినాడు. ఆయనకు కుడిపక్కను ఉన్న కౌసల్యాదేవి వెంటనే ఆయనను లేవనెత్తింది. ఆయన ఎట్లాగో తెప్పరిల్లినాడు. భరతుణ్ణి గురించి ఆలోచిస్తూ ఆయన ఎడమపక్కను ఉన్న కైకేయీదేవి అప్పుడు ఆయనను పట్టుకోపోయింది.

ఆ నీతిమంతుడు ఆ వినయసంపన్నుడు ఆ ధర్మాత్ముడు దశరథమహారాజు కైకేయీదేవిని చూచినాడు. ఆమె చిత్తవృత్తిని కనిపెట్టినాడు. ఆయన దేహము కంపరము ఎత్తింది. ఆమెను చూస్తూ "ఓ దుష్టచారిణీ, నీవు నన్ను తాకవద్దు. నీ ముఖము నేను చూడను. నీవు నా భార్యవు కావు. నీవు నా చుట్టానివి అయినా కావు. నీ ఆశ్రితులకూ నాకూ సంబంధము లేదు. వాండ్లు నా భృత్యులు కారు. ఓ కైకా, నీవు కేవల అర్థపరవు. నీవు ధర్మాన్ని త్యజించినావు. నిన్ను నేను త్యజించివేస్తున్నాను. అగ్నిసాక్షిగా నీ చెయ్యి నేను పట్టుకొన్నాను. ఆ అగ్నిహోత్రానికి నీతో నేను ప్రదక్షిణము చేసినాను. అట్లా నీతో నాకు ఏర్పడ్డ ఇహపరసంబంధాలు రెండూ నేను త్యజించివేస్తున్నాను. ఇకమీదట నీతో నాకు ఇహలోక సౌఖ్యాన్ని ఇచ్చే క్రీడాది వ్యవహారాలు ఉండవు. పరలోక సాధనాలు అయిన అగ్నిహోత్రాదికర్మలున్నూ నీతో నేను చేయను.

"ఓ కైకా, నేను ఇక బ్రతుకను. భరతుడు పట్టము కట్టుకొని సంతుష్టుడు అయ్యేటట్లయితే వాడు నాకు వదిలే జలతర్పణాదులను నేను ముట్టను" అన్నాడు దశరథమహారాజు. దుఃఖముతో కొట్టుకులాడుతున్న కౌసల్యాదేవి ఆయన దేహానికి అంటుకొన్న దుమ్మును అంతా దులిపింది. ఆయనను మెల్లగా రాజమందిరము వైపు నడిపించింది. ఆయన అడుగులు ముందుకు వేస్తున్నాడే కాని మాటిమాటికీ వెనకకుతిరిగి రథము పోయిన దారివంక చూడడము మొదలు పెట్టినాడు. ఆ ధర్మాత్ముడి మనస్సులో తాపస వేషముతో రథము ఎక్కిపోయిన రాముడే కనపడ సాగినాడు. అగ్నిహోత్రాన్ని చేతులతో పట్టుకొన్న వాడివలెనూ కావలెను అని బ్రాహ్మణుణ్ణిచంపిన వాడివలెనూ ఆయన బాధపడిపోయినాడు, ఆతాపము ఆయన భరించలేక పోయినాడు. ఏడవడము మొదలు పెట్టినాడు. రాముడు అయోధ్య పొలిమేర దాటి పోయినాడు అని అప్పుడు వర్తమానము వచ్చింది. రాహువు మింగుతున్న సూర్యుడివలె అయిపోయినాడు. అప్పుడు కౌసల్యాదేవి శోకావేశముతో మూర్ఛపోయింది. పరిచారికలు ఆమెను అక్కడనుంచి తీసుకొని పోయినారు.

దశరథమహారాజు ఏడుస్తూ "అయ్యో! నాకు ఇప్పుడు కనిపిస్తున్నది అరణ్య మార్గమా ఆ మార్గాన రాముణ్ణి తీసుకొని పోయిన గుర్రాల అడుగులూనా? ఉత్తమాంగనలు చందన చర్చ చేసి వింజామరలు వీస్తూ ఉంటే

మెత్తని పరుపులమీద అంతకన్నా మెత్తని దిండ్లు పెట్టుకొని పవ్వళించే నా జ్యేష్ఠపుత్రుడు రాముడు ఈ నాడు ఏ చెట్టుకిందనో ఏ కొయ్యో ఏ రాయో తలగడగా పెట్టుకొని పడుకొంటాడు, తప్పదు ఒళ్ళు అంతా దుమ్ము కొట్టుకొని నిట్టూర్పులు విడుస్తూ సెలయేటిదగ్గర బురదలో పడుకొని లేచిపోయే పోతుటేనుగువలె నిద్రలేస్తాడు. నా పుత్రుడు మహాబాహువు. లోకనాథుడు అనాథుడివలె అడవికి పోతూ ఉంటే ఆటవికులు అందరూ చూస్తారు అయ్యో జనకమహారాజు అల్లారు ముద్దుకూతురు - సుఖము తప్ప ఎన్నడూ ఏ కష్టమూ ఎరగని నా కోడలు సీత ఈ నాడు దారిలో కాళ్ళకు ముళ్లు గుచ్చుకొని బాధపడుతుంది. ఆమె అడవులు ఎన్నడూ ఎరగదు. క్రూరమృగాల భయంకర గర్జనలకు ఆమె తప్పకుండా భయపడి పోతుంది.

“ఓ కైకా, నీ కోరిక ఈడేరింది. రాముడు లేకుండా నేను బ్రతకను. ఓ రాజపుత్రీ, ఇక నీవు విధవవు అయి ఈ రాజ్యము ఏలు” అంటూ కలవరించి పోయినాడు. కైకేయీదేవి అక్కడ నుంచి మెల్లగా తప్పుకొన్నది. పరిజనము అంతా ఆయన చుట్టూ మూగినారు. రాజవీథిలో ఆయన నడచి సాగినారు. అప్పుడు ఆ రాజవీధి పాడుపడి పోయినట్లుగా ఉంది. చతుష్పథాలలోనూ గృహద్వారాలలోను మనుష్యులే కనిపించలేదు. దేవాలయ ద్వారాలు తెరచి లేవు. అంగళ్ళు అన్నీ మూసివేసి ఉన్నవి. ఆ రాజవీథిలో దుఃఖార్తులూ దుర్బలులూ వృద్ధులూ మాత్రము అక్కడక్కడ కనిపించినారు. శక్తి ఉన్నవారు అందరూ రాముడి రథము వెంట పడిపోయినారు అని తెలుసుకొన్నాడు. రాముణ్ణి గురించి ఆలోచిస్తూ రోదిస్తూ సూర్యుడు మబ్బుల మాటున పోయేటట్టు ఆయన అంతఃపురములోనికి పోయినాడు.

దశరథమహారాజు మందముగా అడుగులు వేస్తూ మెల్లగా అస్పష్టముగా గద్గదస్వరముతో “రాముణ్ణి కన్న కౌసల్యాదేవి మందిరానికి నన్ను తీసుకొని పోవలసింది. మరి ఒక చోట నా హృదయానికి ఊరట ఉండదు” అన్నాడు. అప్పుడు ద్వారదర్శులు ఆయనను కౌసల్యాదేవి మందిరానికి తీసుకొనిపోయినారు. అక్కడ పక్కమీద పడుకొన్నాడు. అక్కడనూ ఆయనకు మనస్స్వాస్థ్యము లేకపోయింది. సీతారామ లక్ష్మణులు లేని అంతఃపురము చంద్రుడూ నక్షత్రాలూ లేని ఆకాశమువలె ఆయనకు అగుపించింది. ఆ భవనము అట్లా

శూన్యముగా తోచే సరికి అంతటి పరాక్రమవంతుడూ రెండు చేతులతోనూ ముఖము కప్పుకొని "అయ్యో రామా, నన్ను వదలిపెట్టి పోయినావా" అంటూ గద్దపెట్టున అరుస్తూ "రాముడు తిరిగి వచ్చేవరకూ బ్రతికి ఉండే భాగ్యము నాకు లేదు. వాడు తిరిగివచ్చిన తరువాత వాణ్ణి కౌగిలించుకొని సంతోషించే పుణ్యాత్ములు ఎవరో" అంటూ ఆ పక్కమీద పడిపోయినాడు. సొమ్మసిల్లి నిద్రపోయినాడు.

అర్ధరాత్రము అయింది. దశరథమహారాజుకు మెలకువ వచ్చింది. కాళరాత్రివలె అది అతి భయంకరముగా తోచింది. "ఓ కౌసల్యా, నాకు ఇప్పుడు కళ్ళు కనిపించడము లేదు. నా చూపు రాముడితోనే పోయింది. కన్నులు తెరిచినా నాకు ఏమీ కనిపించటము లేదు. నా దేహము తాపము ఎత్తుతూ ఉంది. రాముణ్ణి లాలించిన నీ చేతులతో నన్ను తాకు. నా తాపము ఏమి అయినా తగ్గుతుంది ఏమో" అన్నాడు.

కౌసల్యాదేవి ఆయన దగ్గర కూర్చుని చేతితో నిమురుతూ నిట్టూర్పులు విడుస్తూ ఘోరముగా ఏడ్చింది.

## ౪౩

పక్కమీద పడుకొని పుత్రశోకముతో కుమిలిపోతూ ఉన్న దశరథ మహారాజుతో కౌసల్యాదేవి "ఓ రాజా, క్రూరసర్పము విషము వెళ్ళకక్కేటట్టు కైక తన కుటిలత్వము రాముడిమీద వెళ్ళకక్కింది. వాడు అడవిపాలు అయిపోయినాడు. ఇకను కైక కుబుసము విడిచిన పామువలె హాయిగా ఇష్టము వచ్చినట్టు తిరుగుతుంది. నాకు భయము వేస్తూ ఉంది. ఇంట చేరిన దుష్టసర్పానికి ఇంట్లోవారూ బయటివారూ కూడా భయపడక తప్పదు.

"నాథా, కైక భరతుడికి రాజ్యము అవశ్యమూ ఇప్పించవలెను అనుకొన్నది. బాగానే ఉంది. అయితే అది నాకొడుకును అడవిపాలు చేయుమని ఎందుకు కోరింది? పోనీ, అన్నము అయినా పెట్టకుండా రాముణ్ణి భరతుడికి దాస్యము చేయవలెను అని కోరకపోయిందే? అట్లా కోరినా ఎంతో బాగుండేది. వాడుబిచ్చము ఎత్తుకొని తింటూ భరతుడికి దాస్యము చేస్తూ అయినా మన కళ్ల ఎదట ఉండేవాడు, రాజా సర్వకాలాన సేవకులకు ఇవ్వవలసిన పాలిభాగాన్ని

ఆహితాగ్ని అయినవాడు రాక్షసులకు ఇచ్చినట్టు మీకు ఇష్టము వచ్చినట్టు రాముణ్ణి వాడి పదవినుంచి పడద్రోసి రాజ్యభాగము కైకకు ఇచ్చేసినారు. ప్రభూ, వాడు ఆ పరాక్రమవంతుడు ఆ ధనుర్ధరుడు సీతనూ లక్ష్మణుణ్ణి వెంట పెట్టుకొని గజరాజువలె నడిచి ఈపాటికి అడవికి పోయి ఉంటాడు.

"రాజా, తాము కైక మాట పాటించి వనవాసకష్టాలు ఎన్నడూ ఎరుగని సీతారామలక్ష్మణులను వనవాసము చేయవలసింది అని ఆజ్ఞాపించినారే-అక్కడ వాండ్ల గతి ఏమిటి? సీతారాములు నవ యౌవనములో ఉన్నారు. వాండ్లు సమస్త భోగాలూ అనుభవించవలసిన కాలము ఇది. ఇటువంటి సమయములో వాండ్లను మీరు అడవులకు వెళ్లగొట్టినారు. వాండ్లు అక్కడ దరిద్రులవలె కందమూలాలు తింటూ ఎట్లా బ్రతుకుతారు? పధ్నాలుగు సంవత్సరాల వన వాసమూ అయిపోయి రాముడు సీతనూ లక్ష్మణుణ్ణీ వెంటపెట్టుకొని ఇప్పుడే ఇక్కడికి వస్తే ఎంత బాగుంటుంది! నా దుఃఖము అంతా అంతరించిపోతుంది. అయ్యో, నాకా అంత భాగ్యము? అటువంటి శుభసమయము ఎంతకాలానికి వస్తుందో? నిద్రపోయినవాండ్లు సుఖముగా లేచి వచ్చినట్టు సీతారామలక్ష్మణులు ఇక్కడికి రావడమూ ఆ పురుషసింహులను పౌరులు అందరూ చూచి పున్నమినాటి సముద్రుడివలె ఉప్పొంగిపోయి ఈ అయోధ్యానగరము అంతా అలంకరించి జండాలు ఎత్తడమూ ఎప్పుడు జరుగుతుందో? గోవు వెంట కోడెవలె సీత వెంట రాముడు ఎప్పుడు వస్తాడో? ఆ అరిందములు రాజవీథిలో వస్తూ ఉంటే వారిమీద ప్రజలు పేలాలు చల్లేది ఎప్పుడో? మొలలో పెద్ద పొడుగాటి కత్తులు వేళ్ళాడుతూ ధనుర్ధరులు అయి ధగధగ మెరిసే కుండలాలతో పర్వతశిఖరాలవలె ఆ అన్నతమ్ములు ఎప్పుడువస్తారో? ఆ సీతారామలక్ష్మణులు బ్రాహ్మణ కన్యలకు పూలూ పండ్లూ పంచిపెడుతూ అయోధ్యానగర ప్రదక్షిణము ఎప్పుడు చేస్తారో?

"ఓ రాజా, నేను పూర్వజన్మలో బహు క్రూరముగా ప్రవర్తించి ఉంటాను. పాలు కుడుస్తూ ఉన్న బిడ్డలను కండ కావరముతో తల్లిదగ్గరనుంచి ఎడ పాపి ఉంటాను. నాథా, ఆవులు ఎంతో మురిపెముగా చూసుకొంటున్న లేగ దూడలను సింహము వచ్చి ఎత్తుకొనిపోయినట్టు నా పిల్లవాణ్ణి నాదగ్గర ఉండనీ కుండా కైక బలవంతముగా ఎడపాపింది. ఓ రాజా, నాకు పుట్టిందే ఒక్క పిల్ల

వాడు. వాడు ఒక్కడూ సకలసద్గుణ సంపన్నుడూ సర్వశాస్త్ర విశారదుడూ అయినాడు. దేవతలవలె పాతికేళ్ల వయస్సులో ఉన్నాడు. వాడు జ్ఞానవృద్ధు. వాణ్ణి - అటువంటి నా పిల్లవాణ్ణి వదిలిపెట్టి నేను ఎట్లా బ్రతికేది? రాజా, నాపిల్లవాణ్ణి నేను ఇప్పుడు చూడవలెను. వాణ్ణి చూడకుండా నేను బ్రతకలేను.

'ఓ రాజా, మీకు తెలియనిదము లేదు. వేసంగిలో ఈ భూమి మండుటెండలకు తాపము ఎత్తిపోయేటట్టు పుత్రశోకాగ్నికి నా దేహము తాపము ఎత్తిపోతూ ఉంది. ఈ తాపము నేను భరించలేను'' అంటూ ఏడిచ్చింది.

౪౪

ఆ భాగ్యశాలిని కౌసల్యాదేవి ఈ విధముగా ఏడుస్తూ ఉంటే పరమ ధార్మికురాలు అయిన సుమిత్రాదేవి ''ఓ పూజ్యురాలా, ఎందుకు దుఃఖపడుతావు? ఎందుకు ఏడుస్తావు? నీకొమారుడు సమస్త సద్గుణవంతుడు. పురుషోత్తముడు. మహా బలవంతుడు. ఐహిక సుఖము కోసము ఆశపడలేదు. ఆముష్మిక సౌఖ్యాన్ని అపేక్షించినాడు. శిష్టులు అందరూ అనుసరించే ధర్మాన్ని శిరసా వహించినాడు. తన తండ్రి సత్యసంధుడు అని ఈ లోకానికి ఋజువు చేయవలెను అనుకొన్నాడు. అందుకోసము రాజ్యాన్ని త్యజించినాడు. అడవులకు పోయినాడు. అటువంటి సత్పురుషుడి కోసము నీవు ఎంతమాత్రమూ దుఃఖపడకూడదు.

''ఓ దేవీ, రాముడికోసమే కాదు; లక్ష్మణుడి కోసమున్నూ నీవూ నేనూ దుఃఖపడకూడదు. వాడు పాపరహితుడు. సర్వభూతహితుడు. తనజ్యేష్ఠభ్రాతకు సేవ చేయవలెను అనుకొన్నాడు. రాముడితో కూడా అడవికి పోయినాడు. వాడి మంచికోసమే వాడు అట్లా చేసినాడు. కనుక ఆ అన్నతమ్ములకోసము మనము దుఃఖపడకూడదు. సీతఎప్పుడూ సుఖము అనుభవించ వలసిందే. అయితే అది అరణ్యవాస కష్టాలు తెలియక బయలుదేరి పోయింది అనుకోవద్దు. అది పతివ్రత. తన ధర్మాన్ని గుర్తించింది. ధర్మాత్ముడు అయిన నీ కొడుకు దాని పెనిమిటి. అందువల్ల అది రాముణ్ణి వెంబడించింది. కనుక దానికోసమున్నూ నీవు దిగులు పడకూడదు.

"అక్కా, నీ కొడుకు ధర్మమూ సత్యవ్రతమూ తనకు ధనము అనుకొన్నాడు. అందువల్ల వాడి కీర్తిపతాకము ఈ ప్రపంచము అంతటా పాదుకొంటుంది. అంతే. వాడు తిరిగి వస్తాడు. ప్రభువు అవుతాడు. రాముడు పరిశుద్ధుడు. మహాత్ముడు. సూర్యుడు వాణ్ణి గుర్తిస్తాడు. తనతీక్ష్ణకిరణాలతో వాడి దేహానికి తాపము ఎత్తకుండా కనిపెట్టి ఉంటాడు. వాయువు వన్యసుగంధముతో ఆయా కాలాలకు తగినట్టు సమశీతోష్ణముతో వాడి మీద వీస్తాడు. రాత్రిపూట చంద్రుడు తన చల్లని కిరణాలతో ఆ పుణ్యాత్ముణ్ణి తండ్రివలె కౌగిలించుకొని సంతోష పెట్టుతాడు ఓ దేవీ, రాముడు ఇదివరకు తిమిధ్వజుని పుత్రుణ్ణి యుద్ధములో సంహారము చేసినప్పుడు బ్రహ్మదేవుడు మెచ్చుకొని దివ్యాస్త్రాలు ఇచ్చి రాముణ్ణి బహూకరించినాడు. అటువంటి అస్త్రబల సంపన్నుడికి అటువంటి శూరుడికి అడవిలో భయము ఏమిటి? వాడు విహారము చేస్తాడు. అడవిలో ఉన్నా స్వగృహములో ఉన్నట్టు సుఖముగా ఉంటాడు. రామబాణాలకు ఎటువంటివారు అయినా నాశనము అయిపోతారు. వాడి ఆజ్ఞలకు ఈ భూమి అంతా తల ఒగ్గుతుంది. వాడి శౌర్యము అపారము. వాడి బలము అమోఘము. వాడి తేజము దుర్నిరీక్ష్యము. వాడు వనవాసము చేసి వస్తాడు. ఆ తరువాత రాజ్యము ఏలుతాడు.

"ఓ దేవీ, రాముడు సూర్యుడికి సూర్యుడు. అగ్నిహోత్రుడికి అగ్నిహోత్రుడు. ప్రభువుకు ప్రభువు. సంపదకు శ్రేష్ఠము అయిన సంపద. కీర్తికి కీర్తి. క్షమకు క్షమ. దేవతలకు దేవత. భూతాలకు పెనుభూతము. వాడితో సరిసమానము అయినవాడు ఈ పట్టణములలోనే కాదు ఈ లోకములోనే లేడు. అటువంటివాడు వనవాసానికి పోతున్నాడు అని అయోధ్యాపౌరులు ఈనాడు దుఃఖానికి తాళలేక తల్లడిల్లి పోతున్నారు. వాడువనవాసము అయిపోగానే అయోధ్యకు వస్తాడు. సీతవలెనే భూదేవి వాణ్ణి ఆశ్రయించుకొని ఉంది. రాజ్యలక్ష్మిన్నీ వాడితోనే ఉంది. వాడు రాజ్యాభిషిక్తు అవుతాడు. ఈ దుఃఖపడుతూ ఉన్న పౌరులు అందరూ ఆనాడు సంతోషపడుతారు. వాడు అపరాజితుడు. వల్కలాలు కట్టుకొని దర్భాసనముతో వాడు అడవికి ప్రయాణము అయిపోతూ ఉంటే వాడి పెండ్లాము సీతవలెనే రాజ్యలక్ష్మిన్నీ వాణ్ణి వెంబడించి పోయింది. వాడికి దుర్లభము అనేది ఏమీ లేదు. మేటి విలుకాడు లక్ష్మ

ఉడు బాణఖడ్గాధ్యాయుధాలతో వాడిముందు నడుస్తూ ఉంటే వాడికి - పురుషోత్తముడికి ఏమిదుర్లభము? ఓ దేవీ, రాముడు యథావిధిగా వనవాసము ముగించుకొని వస్తాడు నీవు చూస్తావు అజ్ఞానములో పడవద్దు. నేను చెప్పు తున్నది నిజము. నీవు ఏడవవద్దు.

"ఓ మంగళ స్వరూపిణీ, రాముడికి ఏ అమంగళమూ సంభవించదు. నీవు మనోవ్యథ పడవద్దు. దుఃఖపడవద్దు. అందరినీ ఓదార్చవలసిన నీవే ఇట్లా దుఃఖ పడుతూ ఉంటే నిన్ను ఓదార్చేవారు ఎవరు? రాముణ్ణి కన్న తల్లివి నీవు దుఃఖ పడడము ఏమిటి? రాముడి కన్నా సత్పథగామి మరి ఒకడు ఈ లోకములో లేడు. అటువంటి వాడికోసము నీవు దుఃఖపడడము తప్పు. అక్కా, నీవు అనింది తవు (ఒక్క తప్పు చేసి ఎరుగవు). నీవు చేసినవి అన్నీ పుణ్యకర్మలు. రాముడు వస్తాడు. త్వరలో వస్తాడు. ఉదయిస్తున్న పూర్ణచంద్రుడివలె వచ్చి నీకు కనపడ తాడు. నీ కోడలు సీతనూ నా కొడుకు లక్ష్మణుణ్ణీ వెంటపెట్టుకొని వస్తాడు. వాడి వెంట వాడి స్నేహితులు అందరినీ చూస్తావు. రాముడు వాని మృదు పీన హస్తాలతో నీ పాదాలు పట్టుకొని నీకు శిరసా నమస్కారము చేస్తాడు. అప్పుడు నీవు మేఘ సమూహము పర్వత శిఖరాన్ని తడిపేటట్టు ఆనందబాష్పాలతో వాణ్ణి తడుపుతావు" అంటూ ఓదార్చింది.

ఈ విధముగా సుమిత్రాదేవి - లక్ష్మణుడి తల్లి సుమిత్రాదేవి చెప్పిన మాటలు అన్నీ కౌసల్యాదేవి విన్నది. శరత్కాల మేఘములో జలమువలె ఆమె దుఃఖము అంతరించింది.

౪౫

దశరథమహారాజూ ఆయన అంతఃపురాంగనలూ రాముడి మిత్రులూ బల వంతముమీద వెనకకు మళ్ళినారు. కాని పౌరులు మాత్రము రాముడి రథము వెంట పరుగెత్తడము మానలేదు. రథము ఎంతదూరము పోయినప్పటికినీ్ని ఆ జన ప్రియుణ్ణి వదిలిపెట్టి వారు వెనుకకు రాకపోయినారు. ఈ జగత్తుకు పూర్ణ చంద్రుడు ఎటువంటివాడో అయోధ్యావాసులకు రాముడు అటువంటివాడు. అందువల్ల ఆపౌరులు "పోవద్దు, పోవద్దు" అంటూ కేకలు పెట్టుతూ, రథము కంటికి కనబడకుండా పోతున్నా రథము పోయిన దారినే పరుగెత్తి సాగినారు.

దశరథమహారాజు సత్యవ్రతుడు అని రాముడు ఈలోకానికి రుజువుచేయ తలచుకొన్నాడు. అందువల్ల అతని బుద్ధి వనవాసముమీదనే లగ్నము అయింది. రథము వేగముగా పోతూ ఉన్న కొద్దీ "పోవద్దు" అంటూ పౌరులు కేకలు పెట్టుతూ పరుగెత్తుకొని రావడను రాముడు గమనించినాడు. తనఅభిప్రాయము వారికి చెప్పవలెను అనుకొన్నాడు.

రథము మెల్లగా నడిచింది.

పౌరులు అందరూ వచ్చి రథాన్ని కలుసుకొన్నారు. రాముడు వారిని అందరినీ తన కన్నబిడ్డలవలె దయార్ద్రదృష్టితో చూస్తూ "అయోధ్యా పౌరులారా, నామీద మీకు ఉన్న వాత్సల్యమూ గౌరవమూ మీరు భరతునిమీద చూపించవలెను. నేను సంతోషిస్తాను. భరతుడు కైకేయీదేవి ప్రియపుత్రుడు అని మీరు అన్యథా ఆలోచించవద్దు. వాడు సకల కల్యాణగుణసంపన్నుడు. మీకు మేలు చేస్తాడు. మిమ్ములను సంతోషపెట్టుతాడు. వాడు వయస్సులో చిన్నవాడు. కాని జ్ఞానవృద్ధు. పైకి మెత్తగా కనిపిస్తాడు. కాని పెద్దపులివంటి వాడు. పరమ పరాక్రమవంతుడు. రాజగుణాలు అన్నీ ఉన్నవాడు మా పూర్వికులకు అనురూపము అయిన ప్రభువు అవుతాడు. వాడి రాజ్యపాలనములో మీకు ఏ భయమూ ఉండదు. మిమ్ములను అందరినీ వాడు చక్కగా కాపాడుతాడు.

"ఓ మహాజనులారా, భరతుణ్ణి యువరాజుగా దశరథమహారాజు నియమించినాడు. రాజశాసనాన్ని నేనే కాదు మీరు అందరూ శిరసా వహించవలెను. అందువల్ల నేను వనవాసానికి పోతున్నాను. మీరు అందరూ అయోధ్యకు వెళ్ళిపొండి. దశరథమహారాజు నా కోసము పరితపించకుండా చూడండి. ఆయనను మీరు అందరూ సంతోషపెట్టండి. మీరు అట్లా చేస్తే నేను సంతోషిస్తాను. ఇక మీరు వెనుకకు వెళ్ళండి" అన్నాడు.

రథము వాయువేగముతో పోసాగింది.

రాముడు ఎంత స్థిరచిత్తముతో పితృవాక్యపరిపాలనరూప ధర్మము నిర్వహించ తలచినాడో పౌరులున్నూ అంత స్థిరచిత్తముతో అతనిని అడవికి పోనీకుండా అయోధ్యకు మళ్ళించుకొని పోతలచినారు. అందువల్ల ఎంత చెప్పినా

వినకుండా వారు అందరూ కన్నీళ్ళు కారుస్తూ ఆ రథము వెంట పరుగెత్తసాగినారు. వాండ్లు అట్లా పరుగెత్తుతూ ఉంటే ఏదో తాడుతో కట్టివేసి వాండ్లను అందరినీ లాగుకొనిపోతూ ఉన్నట్టుగా కనిపించింది. ఆ మహానుభావుడి సద్గుణాలు వారిని అందరినీ అట్లా ఆకర్షించినవి.

ఆరథము వెంట పరుగులెత్తింది పౌరులు మాత్రమే కారు. వయోవృద్ధులూ ఓజోవృద్ధులూ జ్ఞానవృద్ధులూ అయిన బ్రాహ్మణులున్నూ పరుగులెత్తినారు. వారు ఆ రథానికి మరింత వెనకపడిపోయినారు. వార్ధక్యమువల్ల తలలు వణికిపోతూ రాముడి రథాన్ని లాగుకొనిపోతూ ఉన్న గుర్రాలను ఉద్దేశించి "ఓ హయరాజములారా, పరుగెత్తవద్దు. ప్రాణికోటిలో మీకు ఉన్న చెవులు వేటికీ లేవు. అందువల్ల మీకు మేము చెప్పుతున్నాము. మా మాట వినవలెను. రాముడు పరమధార్మికుడు. పరిశుద్ధుడు. దృఢవ్రతుడు. వీరుడు. మీకూ మాకూ ప్రభువు. మీరు అతనికి మేలు చేయవలెను. కనుక వెంటనే మీరు వెనకకు మళ్ళవలెను. ఆ ప్రభువును మీరు పురోపవన విహారానికి తీసుకొని పోవలెను కాని కారడవిలో వదిలిపెట్టడానికి తీసుకొనిపోకూడదు. ఓ గుర్రములారా, మీరు వెంటనే వెనకకు మళ్ళవలెను" అంటూ ఆ బ్రాహ్మణోత్తములు పెద్దపెట్టున కేకలు పెట్టినారు.

ఆ బ్రాహ్మణోత్తముల కేకలు రాముడు విన్నాడు. అతని హృదయము ద్రవించింది. తన రథము వెనక పాదచారులు అయి వస్తూ ఉన్న బ్రాహ్మణోత్తములను తాను రథములో కూర్చొని ఆశ్వాసించడము అసంగతముగా తోచింది. అది సదాచార విరుద్ధము అనిపించింది. వెంటనే అతడు రథము దిగినాడు. అతనితో పాటు సీతాలక్ష్మణులున్నూ దిగినారు. బ్రాహ్మణులను కలుసుకోవడానికి వెనకకు పోయేటట్లయితే వనవాసప్రయాణ వ్రతభంగము అవుతుంది అనుకొన్నాడు. అందుకోసము ఆ బ్రాహ్మణులే వచ్చి తనను కలుసుకోవడానికి రాముడు అడుగులలో అడుగులు పెట్టుకొంటూ నడవసాగినాడు.

ఆ బ్రాహ్మణోత్తములు రాముణ్ణి సమీపించి "రామా, నీవు బ్రహ్మణ్యుడవు. అందువల్ల బ్రాహ్మణ్యము అంతా నీ వెనక వస్తూ ఉంది. చూడు. నాయనా, మేము నిరతాగ్నిహోత్రులము. అరణికర్రెలు భుజాలమీద వేసి తెచ్చుకొంటున్నాము. మేమే కాదు. అదుగో చూడు. వాజపేయయాగాలలో ప్రాప్తించిన శ్వేతచ్ఛత్రాలతో బ్రాహ్మణులు వస్తూ ఉన్నారు. నాయనా,

నీవు ఎందుకు ఎండలో నడుస్తావు? నీకు తాపము ఎత్తుతుంది. నీ దేహము కంది పోతుంది. కొంచెము ఆగు. ఆ వాజపేయయాజులు వచ్చి శరత్కాల మేఘాల వంటి తెల్లటి గొడుగులు నీకు పట్టుతారు.

"రామా, ఎప్పుడూ వేదమంత్రాలమీదికి పోయే మా బుద్ధి ఇప్పుడు నీమీద లగ్నము అయింది. నిన్ను పట్టి మేమూ వనవాసము చేయతలచినాము. మాకు ఉన్న ధనము అల్లా వేదాలు. అవి మా హృదయాలలోనే ఉన్నవి. మా ఇండ్లలో ఉన్న ఇల్లాండ్లను వాండ్ల పాతివ్రత్యమే కాపాడుతుంది. వాండ్లను మేము కాపాడవలసిన పని లేదు. అందువల్ల మేమూ నీవెంట ఉంటాము. నీవు అట్లా వద్దు అనేటట్లయితే నీవు మాతో అయోధ్యకు రావలెను. అసలు నిన్ను అయోధ్యకు మళ్ళించుకొని పోవడానికే మేము ఇంతదూరము వచ్చినాము.

"రామా, నీవు ధర్మపరాయణుడవు. కాబట్టి నీవు మా మాట వినవలెను. మేము బ్రాహ్మణులము. వయోవృద్ధులము. మా తలలు హంసలవలె తెల్లగా నెరసిపోయినవి. మేము ఈ దుమ్ములో సాగిలపడి నిన్ను ప్రార్థిస్తున్నాము. నీవు అడవికి పోవద్దు. అయోధ్యకు మళ్ళు. బ్రాహ్మణ ప్రార్థనను మన్నించడము అధర్మము కాదు. నాయనా, రామా, అయోధ్యలో ఎంతోమంది బ్రాహ్మణులు యజ్ఞాలు చేయవలెను అనుకొని సంభారాలు సమకూర్చుకొన్నారు. నీవు అయోధ్యకు వస్తేనే ఆ యజ్ఞాలు అన్నీ యథావిధిగా జరుగుతవి. నీవు రాకపోయేటట్లయితే ఆ యజ్ఞాలు అన్నీ ఆగిపోతవి. ఆ దోషము నిన్ను పట్టుకొంటుంది.

"ఓ రామా చరాచరము అయిన ప్రాణికోటి అంతా నీకోసము దుఃఖపడుతూ ఉంది. నిన్ను అయోధ్యకు మళ్ళమని ప్రార్థిస్తున్నది. నిన్ను వదిలిపెట్టి ఉండలేక అయోధ్యా పౌరులు అందరూ నీవెంట పడ్డారు. వారిని చూచి చెట్లు సయితము నీ వెంట పరుగెత్తడానికి ప్రయత్నము చేస్తూ ఉన్నవి. అయితే వేళ్లు పెళ్ళగిలక కొట్టుకులాడుతున్నవి. గాలి వేగానికి హోరని ఏడుస్తూ నిన్ను చూస్తూ నీవంకకు తిరుగుతూ ఉన్నవి. నాయనా, చూడు, పక్షులు ఆహారము వర్జించి కదలకుండా మెదలకుండా చెట్లమీద కూర్చుని ఎంతో దీనముగా నీవంక చూస్తూ ఉన్నవి. అవిన్నీ నిన్ను అయోధ్యకు మళ్ళుమని ప్రార్థిస్తున్నవి"
అని బ్రాహ్మణులు చెప్పినారు.

ఆ బ్రాహ్మణోత్తముల దీనాలాపాలు ఆలకించి రాముణ్ణి పోనీకుండా అడ్డము అయిందో అన్నట్టుగా తమసానది వారి ఎట్టఎదుట కనిపించింది.

అంతట సుమంత్రుడు రథానికి కట్టిన గుర్రాలను విప్పివేసినాడు. అలసట తీరడానికి వాటిచేత నేలమీద పొర్లిగింతలు పెట్టించి తమసానది స్వచ్ఛజలాలు త్రాగించి ఆ జలాలలోనే వాటి ఒండ్లు కడిగి ఆ తీరాన పచ్చిక మేయడానికి వాటిని వదలినాడు.

౪౬

రమ్యము అయిన ఆ తమసానదీతీరము చేరినతరువాత రాముడు సీతాదేవి వంక చూస్తూ లక్ష్మణుడితో "తమ్ముడా, మన వనవాసము ఈ నాటితో ఆరంభము అయింది. ఇది మొదటి రాత్రి. ఇక నీవు మన ఇల్లు మొదలు అయిన వాటిని గురించి తలచుకోకూడదు. ఈ సీత సుకుమారి. ఎట్లా నడవకలుగుతుంది అని దిగులుపడవద్దు, చూడు. ఇప్పుడు ఈ సాయంసమయాన తమతమ నెలవులకు చేరుతూ ఉన్న పక్షిసంఘాల కూతలనుంచిన్నీ వన్యమృగాల ధ్వనులనుంచిన్నీ ఈ అరణ్యము ఏడుస్తూ ఉండా అనిపిస్తున్నది. ఇక చీకటి పడినతరువాత ఈ మహారణ్యము బావురుమంటూ ఉంటుంది.

"లక్ష్మణా, మనము అడవులపాలు అయిపోయినాము అని మన రాజధానీనగరములో స్త్రీ పురుషులు అందరూ దుఃఖపడుతూ ఉంటారు. నాయన గారి మీదనూ మన మీదనూ భరతశత్రుఘ్నుల మీదనూ ప్రజలకు ఉన్న అనురాగము అపారము. అందువల్ల మనకోసము అందరూ ఎంతో దుఃఖపడుతూ ఉంటారు. నాయనగారిని గురించి ఆలోచిస్తూ ఉంటే నాకు ఏడుపు వస్తున్నది. పరమయశస్విని మా అమ్మను తలచుకొంటే నా గుండె ఝల్లుమంటుంది. వాండ్లు ఉభయులూ మనకోసము ఏడ్చి ఏడ్చి కళ్ళు పోగొట్టుకొంటారో ఏమో వాండ్ల కన్నులు కాయలు కాసిపోతవి. ఏమో. కాదు. అట్లా జరగదు. భరతుడు వస్తాడు. వాడు ధర్మాత్ముడు. ధర్మార్థకామసహితము అయిన వాక్యాలతో వాడు నాయనగారిని మాఅమ్మనూ ఊరడిస్తాడు. లక్ష్మణా, భరతుడి గుణగణాలను గురించి ఆలోచించిన కొద్దీ మన తలితండ్రులకోసము మనము దిగులుపడనవసరములేదు అనిపిస్తూ ఉంది. నీవు ఇప్పుడు నా వెంట రావడమున్నూ మంచిదే

అయింది. నీవు లేకపోయినట్లయితే ఈ సీతను కనిపెట్టుకొని ఉండడానికి నేను మరి ఒకరిని వెదుకు కొనవలసి వచ్చేది.

“లక్ష్మణా, సంధ్యాసమయము అవుతూ ఉంది. ఈ తమసాతీరము పుణ్య క్షేత్రము. తినడానికి ఇక్కడ నానావిధ వన్యపదార్థాలూ దొరుకుతవి. అయితే ఇది మన వనవాసానికి ఆరంభదినము. అందువల్ల ఈ రాత్రి నేను ఉపవాసము చేయతలచినాను. ఈ తమసాపావనోదకాలను మాత్రము పానము చేస్తాను” అంటూ సుమంత్రుణ్ణి చూచి “మంత్రి పుంగవా, తాము ఈ గుఱ్ఱాలను ఈ రాత్రి ఏమరకుండా కనిపెట్టుకొని ఉండవలెను. ఈ శ్రమ తమకు తప్పదు” అని చెప్పి సాయంకాలాహ్నికాలను నిర్వర్తించడానికి లేచినాడు.

అంతట వారు శుభకరము అయిన ఆ సాయంసంధ్యను ఉపాసించినారు.

చీకటిపడుతూ ఉండగా సుమంత్రుడు గుఱ్ఱాలను కట్టివేసి ఆరాత్రి వాటికి సరిపోయే మేత వేసినాడు. లక్ష్మణుడి సాయముతో సీతారాములకు పండి రాలిన ఆకులతో ఆ తమసానదీ తీరాన శయ్యలను అమర్చినాడు. సీతారాములు ఆ శయ్యలు చూచి సంతోషించినారు. పవ్వళించినారు.

సీతారాములకు హాయిగా నిద్రపట్టింది. అప్పుడు లక్ష్మణుడు సుమంత్రుడితో రాముణ్ణి గురించి అనేక విషయాలు చెప్పడము మొదలు పెట్టినాడు. వారు ఇద్దరూ అట్లా రాముణ్ణి గురించి మాట్లాడుకొంటూ ఉండగా రాత్రి తెల్లవారవచ్చింది. వారికి ఆ సంగతి తెలియనే తెలియదు. ఇంతలో ఆ తమసా తీరాన ఉన్న ఆలమందలలో ఆవులు అన్నీ నిద్రమేల్కొన్నవి. అవి నీళ్ళు త్రాగడానికి బయలుదేరినందువల్ల వాటి గిట్టల చప్పుళ్ళు సుమంత్రుడూ లక్ష్మణుడూ విన్నారు. అటు చూచినారు. తెల్లవారవస్తూ ఉంది అని తెలుసుకొన్నారు. ఇటు రాముడున్నూ నిద్రలేచినాడు.

రాముడి రథము వెంటపడి పరుగెత్తుకొనివచ్చిన అయోధ్యాపౌరులు అందరూ అక్కడ చెట్లకింద పడి ఒండ్లు ఎరగకుండా నిద్రపోతున్నారు. రాముడు వారిని చూచినాడు. విచారపడ్డాడు. అంతట ఆ మహాతేజోవంతుడు, ఆ ధర్మమూర్తి లక్ష్మణుణ్ణి చూచి “తమ్ముడా, మనమీద ఉన్న అపేక్షవుంచి వీండ్లు అందరూ ఇండ్లూ వాకిండ్లు వదిలి పెట్టి మన వెంటపడి పరుగెత్తుకొని

వచ్చినారు. అలసి సొలసి ఎంతో గాఢముగా నిద్రపోతున్నారు. వీండ్లు ఈ నాడు నిద్రపోయినట్లు ఇకను ఎన్నడూ నిద్రపోరు. నేను ఎంత చెప్పినా వీండ్లు వినరు. మనలను ఎట్లాగు అయినా అయోధ్యకు మళ్ళించుకొని పోవలెను అని సంకల్పించుకొన్నారు. అందుకు వీండ్లు ప్రాణాలను అయినా విడుస్తారు. కాని మనలను విడిచిపెట్టిపోరు. వీండ్లు అందరూ నిద్రలేచే లోపలనే మనము రథము ఎక్కిపోవలెను. మన జాడ తెలియకపోతే మార్గాంతరము లేక వీండ్లు ఇండ్లకు మళ్లుతారు. పౌరులు వారి అంతట వారు తెచ్చుకొన్న కష్టాలను రాజులు తొలగించవలెను. కాని రాజులు తమ కష్టాలను పౌరులు అనుభవించేటట్టు చేయకూడదు అని చెప్పినాడు. లక్ష్మణుడు అందుకు అంగీకరించినాడు. సుమంత్రుడు రామాజ్ఞను శిరసావహించి ఆ ఉత్తమాశ్వాలను అప్పటికి అప్పుడు ఆ రథానికి పూంచినాడు. ధనుఃఖడ్గకవచాది పరికరాలతో సీతారామ లక్ష్మణులు ఆ తెల్లవారు ఝామున రథము ఎక్కినారు.

సుండ్లు తిరుగుతూ గబగబా పరుగులెత్తుతూ ఉన్న ఆ తమసానదిని రాముని రథము ఇట్టే దాటింది. వారు అవతలిగట్టు చేరినారు. ముండ్లూ గిండ్లూ లేకుండా హాయిగా నిర్భయముగా నడిచి పోవడానికి అనువు అయిన రహదారి వారికి కనిపించింది. సీతారామలక్ష్మణులు ఆ రథము దిగినారు అంతట రాముడు సుమంత్రుణ్ణి చూచి "ఓ మంత్రిసత్తమా, తాము ఇప్పుడు ఈ రథాన్ని అయోధ్యా నగరాభిముఖముగా కొంత దూరము వెనకకు తోలుకొని పోయి ఒక గడియసేపు అయిన తరువాత మనము ఇప్పుడు వచ్చిన దారిన కాకుండా మరి ఒక దారిన తిరిగి రథాన్ని తోలుకొనివచ్చి మరి ఒక రేవులో ఈ తమసానదిని దాటి మమ్ములను కలుసుకోవలెను. మన జాడ పౌరులుకనిపెట్టకుండా ఉండే దారిని తాము రథాన్ని తిరిగి తోలుకొనిరావలెను. తాము ఈ ఉపకారము చేయవలెను" అని చెప్పినాడు.

సుమంత్రుడు రథాన్ని అటు ఉత్తరాభిముఖముగా తోలుకొనిపోయినాడు. సీతారామలక్ష్మణులు ఇటు కాలినడకను ఆ బాటను పట్టుకొని పోయినారు.

అంతట కొంతసేపటికి సుమంత్రుడు రథాన్ని పెడదారిని తోలుకొని వచ్చి సీతారామలక్ష్మణులను కలుసుకొన్నాడు. వారు అప్పుడు ఆ రథము

ఎక్కినారు. వారి ప్రయాణము శుభావహముగా ఉండడానికోసము సుమంత్రుడు ఆ రథాన్ని ముందు కొంచెము దూరము ఉత్తరాభిముఖముగా తోలి ఆ తరువాత తపోవనాలకు పోయే దారి పట్టించి గుర్రాల పగ్గాలు వదలినాడు.

ఆ మహారథుణ్ణి – తననూ తన సారథినీ తన గుఱ్ఱాలనూ కాపాడు కొంటూ పదికొండువేలమంది విలుకాండ్లతో పోరాడే ఆ మహారథుణ్ణి ఆ మహా తేజోవంతుణ్ణి రాముణ్ణి భార్యాసోదర సహితముగా అడవిలో వదిలిపెట్టి రావడానికి సుమంత్రుడు రథము ఎక్కించి తోలుకొనిపోతూ ఉంటే రాముడు హాయిగా కూర్చున్నాడు.

౪౨

తెల్లగా తెల్లవారింది. చెట్ల కింద పడి నిద్రపోతూ ఉన్న అయోధ్యా వాసులు అందరూ మేల్కొన్నారు. నిద్రలేచినారు. వారికి రాముడుకానీ రథముకానీ కనిపించలేదు. వారు అందరూ శోకోపహతులు అయినారు. నిశ్చేష్టులు అయినారు. కన్నీళ్ళు కారుస్తూ దశదిశలా చూచినారు. రథపరాగము అయినా వారికి కనిపించలేదు. ఆ బుద్ధిమంతులు అందరూ తమ ఏమరుపాటుకు కించ పడి పోయినారు. అట్లా ఒండ్లు ఎరుగకుండా నిద్రపోయినందుకు వారిని వారే నిందించుకొన్నారు.

"రాముడు తన భక్తులను ఎప్పుడూ మోసము చేయడు. అతడు మనలను ఇప్పుడు తను కన్నబిడ్డల వలె ఎప్పుడూ కాపాడేవాడు. ఆ రఘువంశలలాముడు మనలను ఇట్లా వదిలిపెట్టి అడవికి ఎందుకు పోయినాడు? మనము ఇకను ఇక్కడ చచ్చిపోవడమే మంచిది. కాదా మరణదీక్షతో మనము అందరమూ ఉత్తరాభిముఖముగా అయినా పోవడము ఉత్తమము. రాముడు లేకుండా మనము బ్రతకడము ఎందుకు? ఇక్కడ ఎండు కట్టెలు పెద్దపెద్దవి కావలసినన్ని కన పడుతున్నవి. వీటితో చితి పేరుద్దాము. ఆ చితి ముట్టించి భగభగ మండే మంటలలో పడి చచ్చిపోదాము.

"మనము అయోధ్యకు పోతే అక్కడ రాముణ్ణిగురించి అడిగేవారికి ఏమి అని చెప్పడము? ఆ ప్రియంవదుణ్ణి ఆ అనసూయకుణ్ణి అనుసరించి పోయి అడవిలో వదిలిపెట్టి వచ్చినాము అని చెప్పడము ఎట్లాగు? రాముడు లేకుండా మనము

ఒక్కళ్ళమే పోతే మన ఇండ్లలో ఆడవాండ్లు ఏమి అంటారో! మన పిల్లలు ఏమి అడుగుతారో! మన పెద్దవాండ్లు మనను గురించి ఏమి భావిస్తారో! ఎంత దుఃఖపడిపోతారో......పట్టణము పట్టణము అంతా దుఃఖసముద్రములో మునిగిపోతుంది. ఆ జితాత్ముడి వెంట మనము తగుదుము అంటూ పరుగెత్తుకొని వచ్చినాము. ఇప్పుడు ఆ పరమ పరాక్రమవంతుడు లేకుండా ఏ ముఖము పెట్టుకొని అయోధ్యకు పోవడము" అని చెప్పుకొంటూ పౌరులు అందరూ దుఃఖాక్రాంతులు అయినారు. ఏమీ తోచక ఏడ్చినారు.

వారిలో కొంతమంది రాముడి రథము పోయిన దారి అంటూ ఒక దారి కని పెట్టినారు. అందరూ ఆ దారిన కొంచెము దూరము పోయినారు. అక్కడ నుంచి ఆ రథము ఎటు పోయిందీ వారు కనిపెట్టలేక పోయినారు. అందరూ ఖిన్నులు అయిపోయి "అయ్యో! రథము పోయిన దారే కనపడడము లేదు. ఇకను ఏమి చేయడము? మనము దైవోపహతులము" అనుకొన్నారు. మార్గాంతరము తోచలేదు. ఏడుస్తూ, వచ్చిన దారినే అయోధ్యకు పోయినారు. అక్కడ వారి వారి ఇండ్లలోకి పోవడానికి వారికి మనస్కరించలేదు. కన్నీళ్ళు కారుస్తూ ఎక్కడి వాండ్లు అక్కడ నిలుచుండిపోయినారు.

రాముడు లేని అయోధ్య చంద్రుడు లేని ఆకాశమువలెనూ, నీళ్లు ఎండిపోయిన చెరువువలెనూ వారికి అగుపించింది. ఎట్లాగో వారు అందరూ వారి వారి ఇండ్లకు పోయినారు. ఎట్టఎదుట కనిపించిన వాండ్లు స్వజనులో పరజనులో ఆ దుఃఖములో వాండ్లు గుర్తుపట్టలేక పోయినారు.

౪౮

అట్లా రాముడి రథము వెంట వడి పరుగెత్తి అతడు ఎటు పోయిందీ తెలియక దుఃఖపడి కన్నులు కాయలు కాచేటట్టు ఏడ్చి ఏడ్చి చచ్చిపోవలెను అనుకొని మనోవ్యథతో తిరిగి వచ్చిన అయోధ్యాపౌరులు అందరూ ప్రాణము పోయిన వారివలె అయిపోయినారు. వారు తమ ఎట్టఎదుట స్నేహితులు కనిపించినా పలకరించలేక పోయినారు. అపూర్వ వస్తువులు అగుపించినా ఆనందించలేక పోయినారు. ఎప్పుడో కనిపించకుండా పోయిన రత్నాది అమూల్య వస్తువులు కనిపించినవి అని చెప్పినా సంతోషించలేక పోయినారు. వాండ్లు

ఎట్లాగో వాండ్లవాండ్ల ఇండ్లలో అడుగు పెట్టినారు. వాండ్లను చూస్తూనే వాండ్ల పిల్లలూ పెద్దలూ పెండ్లాలూ వాండ్లను చుట్టవేసుకొన్నారు. రాముణ్ణి గురించి ప్రశ్నించడము మొదలుపెట్టినారు. వాండ్లు శోకముతోనూ సిగ్గుతోనూ తెలా తెలా పోతూ ఏమీ సమాధానము చెప్పలేక గుడ్లు మిటకరించి ఊరక ఉన్నారు.

ఏ ఇంట్లోనూ పొయ్యి రాజేయలేదు. బ్రాహ్మణులు వారివారి కర్మకలాపాలు మానివేసినారు. వర్తకులు అంగళ్లు తెరవలేదు. తల్లులు తమ తమ తొలిచూపులు మొగశిశువులు దగ్గరకు వచ్చినా ముద్దులాడలేక పోయినారు. ఇంటింటా స్త్రీలు దుఃఖార్తలు అయి ఏడవసాగినారు. ఏనుగును అంకుశముతో పొడిచేటట్టు ప్రతి ఇల్లాలూ తన పెనిమిటిని ఎత్తిపొడుపు మాటలతో పొడిచి వేయడము మొదలుపెట్టింది.

“మీరు రాముణ్ణి తీసుకొని రాకుండా ఇక్కడ ఇండ్లలో ఏమి చేయడానికి వచ్చినారు? ఆ పుణ్యాత్ముణ్ణి ప్రతిదినమూ. చూడకుండా ఉండే వాండ్లకు ఇండ్లు ఎందుకు ? పెండ్లాలు ఎందుకు ? బిడ్డలు ఎందుకు ? డబ్బు ఎందుకు ? ఇంత చేతకాని వాండు మీరు తగుదుము అంటూ రాముడి వెంట ఎందుకు పరుగెత్తినారు? మమ్ములను పొమ్మన్నా మేము పోయి ఆ మహానుభావుడి పాదాలమీద ప్రాణాచారము పడేవాండ్లము. ఆ మహాత్ముణ్ణి తప్పకుండా తిప్పి తీసుకొనివచ్చే వాండ్లము.

“అయోధ్యలో ఉన్న మొగవాండ్లు అందరిలోనూ లక్ష్మణుడు ఒక్కడే సజ్జనుడు. అందువల్లనే సీతారాములకు సేవ చేయడానికి వారితో పోయినాడు. సీతారాముల సేవ చేయడానికి సజ్జనులే అర్హులు. మీకు ఆ అర్హత లేదు. అందువల్ల మీరు వారితో పోలేక తిరిగి వచ్చినారు. సీతారాములు అడవులలో ఏ ఏ మనోహర నదులలో ఏఏ తామరకొలనులలో ఏఏ చెరువులలో స్నానము చేస్తారో అవి అన్నీ వారి గాత్రసంస్పర్శవల్ల పవిత్రము అవుతవి. అవి అన్నీ మీ కన్నా ఎక్కువ పుణ్యము చేసుకొన్నవి. ఆ మహానుభావుణ్ణి ప్రతిదినమూ కన్నులారా చూచే భాగ్యము అయినా మీకు లేదు.

“మహారణ్యములలో సుహా రమ్యము అయిన మహోన్నత వృక్షాలు రాముడికి గొడుగువలె నీడను ఇస్తవి. నదులలో ఉండే గొప్పగొప్ప నీటిఊటలు అతనికి స్వచ్ఛజలాలను ఇస్తవి. పర్వతసానువులు అతని విహారశయ్యాసనాలకు అనుకూలముగా ఉంటవి. అతడు ఆ అరణ్యాలలో ఎక్కడికి పోయినా చేతనా చేతనాలు అన్నీ ప్రియాతిథి తమవద్దకు వచ్చినట్లు అతనిని సమ్మానిస్తవి. తల నిండా పూలు ముడుచుకొని చేతుల నిండా పూల గుత్తులు తీసుకొని మధుర మంగళగానము చేస్తూ దేవుణ్ణి పూజించే స్త్రీలవలె అడవిలో విరగపూసిన చెట్లు, భ్రమరాలు ఝుంకారము చేస్తూ ఉంటే, తమ కొమ్మలతో సీతారాముల మీద పూలు వెదచల్లుతవి. మాకు - మీ ఇల్లాండ్లకు ఆమాత్రము భాగ్యము అయినా లేకుండా చేసివేసినారు.

“రాముడు అడవిలో తిరుగుతూ ఉంటే ఆయా చెట్లు అకాలము అయినప్పటికీ పూలు పూస్తవి. ఆ పూలు పిందెలుకట్టి కాయలు కాని పండ్లు అవుతవి. ఆ పండ్లను ఆ చెట్లు రాముడికి కానుకగా అందిస్తవి. అతనిని చూడగానే పర్వతాలు సెలఏళ్ళలో స్వచ్ఛజలాలు వరదలు అయి ప్రవహించేటట్లు చేస్తవి. ఆ పర్వతాలమీద ఉండే చెట్లు అన్నీ ఎండతాపము ఎత్తకుండా చల్లగాలి వీస్తవి. ఆ చెట్లు చేసిన పుణ్యము అయినా మనము చేయలేదు కాబోలు.

“రాముడు ఉండే చోట ఎవరికీ ఏ భయమూ ఉండదు. ఎవరూ ఎవరి వల్లనూ అవమానపడరు. ఆ మహాబాహువు ఆ శూరుడు దూరము పోక పూర్వమే మనము అందరమూ బయలుదేరి పోయి కలుసుకోవలెను. ఆలస్యము చేయవద్దు. మనము అందరమూ ఇక్కడ చేసే కాపరాలు అక్కడనే అతని సమక్షములోనే చేదాము. ఆ మహాత్ముడి అడుగుజాడలలో నడవడముకన్నా మనకు మరి ఒక సుఖము ఏమి ఉంది? అతడు మన ప్రభువు. మనకు అందరికీ మూలాధారము అయినాడు. మన పరమప్రాప్యము. మేము సీతాదేవికి సేవ చేస్తూ ఉంటాము; మీరు రాముడికి సేవ చేస్తూఉండండి. మాయోగక్షేమాలను సీతాదేవి చూస్తుంది; మీ యోగక్షేమాలను రాముడు కనిపెట్టుతూ ఉంటాడు. ఇంకా ఆలస్యము ఎందుకు? పదండి, పోదాము.

“రాముడు లేని అయోధ్య నివాసయోగ్యముగా ఉండదు. అంతా అమనోజ్ఞముగా ఉంటుంది. అందరూ రాముణ్ణి గురించే ఆలోచిస్తూ దుఃఖపడుతూ

ఉంటారు. ఒక్కరు అయినా సంతోషముగా నివసించడము ఉండదు. రాజ్యము కైకేయిది అయిపోతుంది. అంటే నాథుడు లేని రాజ్యము అవుతుంది. ధర్మశూన్యము అయిన రాజ్యము అవుతుంది. అటువంటి రాజ్యములో బ్రతికి ఉండి ఏమి ప్రయోజనము? డబ్బు ఉండి ఏమి ప్రయోజనము? కొడుకులు ఉండి ఏమి ప్రయోజనము?

“ఐశ్వర్యకాంక్షవల్ల కైకేయీదేవి భర్తను-అందులో ఈ దేశానికి అంతటికీ రాజు అయిన వాణ్ణి వదులుకొన్నది. ఆయన జ్యేష్ఠపుత్రుణ్ణి-కులదీపకుడు అయినవాణ్ణి నిర్దాక్షిణ్యముగా అడవులకు వెళ్ళగొట్టించింది. ఆమె కులపాంసని. దుష్టచారిణి. అధర్మపరాయణి ఆమె ఎవరిని అయినా వదులుకొంటుంది. ఎవరిని అయినా ఎక్కడికి అయినా వెళ్ళగొట్టిస్తుంది. ఆమె రాజ్యములో సుఖము అనుభవించడము ఏమిటి? ఆమె జీవించి ఉండేటంతవరకూ అందరూ ఆమె రాజ్యములో కింకరులవలె జీవించవలసి వస్తుంది. ఆమె రాజ్యపాలనము మొదలు పెట్టితే అయోధ్యలో మీరు ఉండకలరేమో కాని మేము ఉండలేము. మేము ఉండము; మేము ఈ మాటలు ఉద్రేకము వల్ల చెప్పడము లేదు. మా బిడ్డలమీద ఒట్టు పెట్టుకొని చెప్పుతున్నాము. రాముడు ఉండని అయోధ్యలో మేము ఉండము. ఏమంటే ఈ రాజ్యము అనాయకము అవుతుంది. అంతా ఉపద్రవముగా ఉంటుంది. ఎవరికీ ఏ ఆధారమూ ఉండదు.

“ఒక్క కైకేయి నుంచి ఇంత రాజ్యమూ నాశనము అయిపోతుంది. తప్పదు.

“రాముడు అడవికి చేరినట్లు తెలియగానే దశరథమహారాజు చచ్చిపోతాడు. బ్రతకడు. అంతటితో ఈ రాజ్యము అంతటా ఏడుపులే. మీరు రాముడి వెంట పోయి తిరిగివచ్చినారు. మీరు బుద్ధిహీనులు. వట్టి దరిద్రులు. ఇప్పుడు అయినా ఆలోచించండి. మనము అందరమూ వెంటనే రాముడి దగ్గరకు అయినా పోవలెను, లేదా విషము అయినా త్రాగవలెను. అదీ కాక పోయేటట్లయితే ఈ అయోధ్య వర్తమానాలు తెలియకుండా ఉండే ఏ దూరదేశానికి అయినా లేచి పోవలెను. ఇకను ఇక్కడ ఉండడము అనేది అప్రశస్తము.

“దశరథమహారాజు జీవించి ఉండేటంతవరకూ మనము ఇక్కడనే ఉండవచ్చు అంటారేమో. అది పొరపాటు. దశరథమహారాజు కపటోపాయ

ముతో సీతారామలక్ష్మణులను అడవులకు వెళ్లగొట్టినాడు. పశువులను కసాయి వాడికి ఒప్పగించేటట్టు ఇక మనలను అందరినీ ఆయన భరతుడికి ఒప్పగించడము మిగిలి ఉంది.

"ఆ నీలమేఘశ్యాముడు ఆ పద్మపత్రాయతాక్షుడు ఆ మనోహరుడు ఆ ఆజానుబాహువు ఆ మహాబలుడు ఆ అరిందముడు ఆ శాంతుడు ఆ సత్యవ్రతుడు రాముడు ఈ లోకానికి అంతటికీ పూర్ణచంద్రుడివంటి ప్రియదర్శనుడు. ఆ మధుర భాషణుడు ఎవరిని అయినా ముందుగా తానే పలుకరించి మాట్లాడుతాడు. అతడు మత్తమాతంగ విక్రమముతో మహారణ్యములో సంచరిస్తూ ఉంటే ఆ ప్రదేశము అంతా శోభిస్తుంది" అంటూ స్త్రీలు అందరూ శోకసంతప్తలు అయి మరణసమయములో వలె ఏడువ సాగినారు.

ఆ నగరాంగనల ఏడుపులు వినలేక సూర్యుడు అస్తమించినాడు. చీకటి పడిపోయింది.

ఆనాడు అయోధ్యలో ఆహితాగ్నులు అగ్నిహోత్రాలలో హోమాలు చేయలేదు. వేదాధ్యయనము ఎక్కడా జరగలేదు. సత్కథా కాలక్షేపాలు సాగలేదు. మూసివేసిన అంగళ్లు అన్నీ మూసినట్టే ఉండి పోయినవి. నగరము అంతా నిరాశ్రమము అయిపోయింది. అంతటా గాఢాంధకారముగా అలముకొన్నది.

అయోధ్యానగరము అప్పుడు నక్షత్రాలు లేని ఆకాశమువలె అయిపోయింది.

స్త్రీలు అందరూ తన కన్న కొడుకునో తమ తోబుట్టువునో అడవులకు వెళ్ళగొట్టినట్టు ఏడువ సాగినారు. ఏమంటే రాముణ్ణి వారు అందరూ తమ కన్న కొడుకు కన్నా ఎక్కువగా భావిస్తూ ఉండేవారు. ఆ పౌర స్త్రీల ఏడుపులు తప్ప సర్వసాధారణము అయిన గీతోత్సవ నృత్యవాద్య ధ్వనులు ఏవీ ఆ సమయములో అయోధ్యలో వినిపించలేదు.

ఆ మహానగరము అప్పుడు నీళ్ళు ఇంకిపోతున్న సముద్రమువలె తోచింది.

౪౯

పిత్రాజ్ఞాపరిపాలనముకోసము రాముడు సీతాలక్ష్మణ సమేతముగా ఆ తెల్లవారుజామున అయోధ్యాపౌరులను అందరినీ వదిలిపెట్టి రథము ఎక్కి ప్రయాణము అయిపోయినాడు.

తెల్లవారుతూ ఉండగా వారు ఉదయ సంధ్యను ఉపాసించినారు.

అంతట పెద్ద పెద్ద గ్రామాలూ చిన్న చిన్న పల్లెలూ చూస్తూనూ విత్తనాలు చల్లడానికి చక్కగా తీర్చిదిద్దినట్లు దున్నిన పొలాలు చూస్తూనూ విరగపూసిన తోటలూ దొడ్లూ చూస్తూనూ పోతూ ఉంటే, రథము ఎంత వేగముగా పోతూ ఉన్నదీ సీతారాములకు తెలియనేలేదు. ఆయా గ్రామాలలో గ్రామీణులు సీతారాములను చూచి "అయ్యో, దశరథమహారాజు కామపరవశుడు అయి ఏమి పని చేసినాడు? అబ్బా, కైకేయీదేవి ఎంత క్రూరురాలు! ఎంత పాపాత్మురాలు! ఆమె పాపకృత్యాలు చేయడమే పనిగా పెట్టుకొన్నట్టు ఉంది. రాముడు మహా ప్రాజ్ఞుడు. దయామయుడు. జితేంద్రియుడు. పరమ ధార్మికుడు. అటువంటివాణ్ణి అడవులకు వెళ్ళగొట్టించింది. ఆహా, కైకేయి కులాంగనల మర్యాదను పాటించకుండా, ఎంతటి క్రూరకృత్యానికి ఒడికట్టింది!

"అయ్యో! ఈ సీతాదేవి జనకమహారాజు కూతురు. ఎంతో సుఖముగా సంతోషముగా పెరిగింది. ఈ భాగ్యశాలిని ఇక వనవాస కష్టాలు ఎట్లా అనుభవిస్తుందో, అయ్యో, దశరథమహారాజు ఎంత దయామాలినవాడు! ఏ పాపమూ ఎరుగనివాణ్ణి ప్రజారంజకుణ్ణి అందులో తన జ్యేష్ఠపుత్రుణ్ణి పుత్రవాత్సల్యము అయినా లేకుండా అడవులకు వెళ్ళగొట్టినాడా" అని చెప్పుకొంటూ ఉన్న మాటలు రాముడు విన్నాడు.

రథము కోసలదేశపు పొలిమేర మీదికి పోతూ ఉంది. నిర్మలోదకాలతో ప్రవహించే వేదశ్రుతి అనే నది అడ్డము అయింది. రథము ఆ నదిని దాటి దక్షిణ దిక్కుగా సాగిపోయింది. అశేషముగా గోవులు సంచరిస్తూ ఉన్న ప్రదేశము కనిపించింది. పుణ్యోదకాలతో గంగా ద్వారాన గబగబా సముద్రానికి పోతున్న గోమతినది ఎదురు అయింది. రథము ఆ నదిని దాటింది. గుఱ్ఱాలు ఇంకెంత వేగముగా పరుగులు ఎత్తి సాగినవి. హంసధ్వనులు మనోహరముగా విని

పించినవి. నేత్రపర్వముగా నాట్యము ఆడుతున్న నెమళ్ళ గుంపులు కనిపించినవి. రథము స్యందికానదిని దాటింది.

ఇక్ష్వాకువు వైవస్వత మనువుకు ఇచ్చిన భూభాగము అక్కడితో అంతము అయింది.

అంతకుముందు సీతాదేవికి ఆ కోసలరాజ్యాన్ని గురించి చెప్పతూ గ్రామోప గ్రామాలు చూపిస్తూ ఉన్న రాముడు సుమంత్రుణ్ణి ఉద్దేశించి "ఓ మంత్రి పుంగవా, ఇంక ఎంతకాలానికి ఈ కోసలరాజ్యానికి తిరిగి వస్తానో, ఎంత కాలానికి నా తల్లిదండ్రులను కలుసుకోటానో, సరయూ తీరాన పుష్పి తాటవులలో ఎంత కాలానికి వేటాడుతానో" అంటూ, సుమంత్రుడు ఏదో అడుగుతూ ఉన్నట్టు తోచి "మంత్రిసత్తమా, వేటాడడము దూష్యము అంటున్నావా? నిజమే. అయితే సదాచార సంపన్నులు శ్రాద్ధాదికాలాలలో మాంసము కోసము వేటాడుతారు. రాజర్షులు క్రీడార్థమున్నూ విలుకాండ్లు లక్ష్య వేధనాభ్యాసము కోసమున్నూ వేటాడుతూ ఉంటారు. రాజులను సంతోష పెట్టే వేడుక వేటకన్నా మరి ఒకటి లేదు. అందువల్ల రాజర్షులు అందరూ కాలానుగుణము అయిన మృగయావినోదాన్ని సమ్మతించినారు. నాకు అయితే వేటాడడము అట్టే ఇష్టము లేదు" అంటూ ఆయా విషయాలు మనోహరముగా మాట్లాడుతూ ఉండగా రథము కోసలదేశపు పొలిమేరను సమీపించింది.

## ౫౦

ఆ కోసలదేశము విశాలము అయింది. ఎంతో రమ్యము అయింది. అటువంటి దేశాన్నీ అటువంటి రాజ్యాన్నీ వదిలిపెట్టి ఆ ధీమంతుడు రాముడు భార్యతోనూ, తమ్ముడితోనూ వెళ్ళిపోతున్నాడు.

నగరము వదిలిపెట్టి పోయేటప్పుడు కార్యసిద్ధికోసము నగరానికీ నగరాధి దేవతలకూ నమస్కారము చేసి వీడ్కోలు చెప్పడము శిష్టాచారము. రాముడు అయోధ్యలో బయలుదేరినప్పుడు జన సమ్మర్దము వల్ల అట్లా చేయలేకపోయినాడు. అందువల్ల పొలిమేర దాటిపోతూ ఉండగా సుమంత్రుణ్ణి రథము ఆపమన్నాడు. అయోధ్యాభిముఖుడు అయి చేతులు జోడించి "ఓ నగరరాజమా, నిన్ను మా వంశీయులు కాకుత్స్థులు అందరూ పరిపాలించినారు. నేను

ఇప్పుడు నిన్ను వదిలి పెట్టి పోవలసివచ్చింది. నీకు ఇప్పుడు ఇక్కడనుంచి వీడ్కోలు చెప్పుతున్నాను. నిన్ను కాపాడుతున్న దేవతలుఅందరికీ మొక్కుతున్నాను. మా తండ్రి ఋణము తీర్చడానికి నేను వనవాసము చేస్తాను. తిరిగి వచ్చి మా తలిదండ్రులను కలుసుకొంటాను. అప్పుడు ముందుగా నీ దర్శనము చేస్తాను. నన్ను అనుగ్రహించవలసింది'' అంటూ నమస్కారము చేసినాడు.

రాముడు ఆ జేవురించిన కళ్ళవెంట నీళ్లు కారుస్తూ తనను సాగనంప వచ్చిన గ్రామీణులను అందరినీ దగ్గరకు రమ్మని చేతులతో సంజ్ఞ చేసి ''ఓ గ్రామీణులారా, మీరు నన్ను యథార్థముగా ఆదరించి నా వెంట ఇంత దూరము వచ్చినారు. నా మీద మీకు ఎంత దయ ఉన్నదీ నాకు తెలుసును. నన్ను చూచినకొద్దీ మీకు దుఃఖము వస్తుంది. మిమ్ములను చూస్తూ ఉంటే నాకు దుఃఖము వస్తుంది. దేనికి అయినా ఎక్కువసేపు దుఃఖపడడము తప్పు. మీరు మీ మీ ఇండ్లకుపోయి మీ మీ పనులు చూచుకోండి. నా దారిన నేను పోతాను' అని చెప్పినాడు.

అంతట ఆ గ్రామీణులు ఆ పూజ్యుడికి ప్రదక్షిణ నమస్కారాలు చేసినారు. ఘోరముగా దుఃఖపడుతూ వెనుకకు మళ్లిపోతూ తిరిగి తిరిగి రాముడి వంక చూస్తూ మధ్య మధ్య నిలబడిపోతూ నడవ సాగినారు. అప్పుడు రాముడి రథము సంధ్యాసమయ సూర్యుడివలె వారికి కనపడకుండా పోయింది.

ఆ కోసలరాజ్యము ధనధాన్యోపేతము అయింది. జనులు అందరూ దానశీలురు. ఆ గ్రామాలు అన్నీ మహా రమ్యము అయినవి. ఆ గ్రామాలలో జనులు నిర్భయముగా జీవిస్తూ ఉన్నారు. మామిడితోపులూ ఉద్యానవనాలూ ప్రతి గ్రామములోనూ ఉన్నవి. ప్రతి గ్రామములోనూ దేవాలయాలూ యజ్ఞశాలలూ యూప స్తంభాలూ ఉన్నవి. జలాశయాలు అన్నీ జలసమృద్ధముగా ఉన్నవి. అన్ని గ్రామాలలోనూ అవుల మందలు అశేషముగా ఉన్నవి. జనులు అందరూ దేహపుష్టితోనూ మనస్సంతుష్టితోనూ ఉన్నారు. ప్రపంచములో ఉన్న రాజులు అందరూ వచ్చి చూడవలసిన గ్రామాలు అవి. ప్రతి గ్రామములోనూ బ్రహ్మఘోషము వినిపిస్తుంది. అది ప్రతిరాజూ కాంక్షించే రాజ్యము. అటువంటి రాజ్యాన్ని వదిలిపెట్టి రాముడు అరణ్యవాసానికి పోతున్నాడు. ఆ ధైర్యవంతుడి మనస్సు ఈషణ్మాత్రమూ చలించలేదు.

రథము కోసలదేశము దాటి దక్షిణాభిముఖముగా పోయింది.

అంతట రాముడు పుణ్యోదకాలతో ప్రవహిస్తూ ఉన్న గంగానదిని చూచినాడు.

స్వర్గమర్త్యపాతాళ లోకాలలో ప్రవహించిన ఆ నదిని చూచిన మాత్రాననే సమస్త శుభాలూ సమకూరుతవి. దానిలో స్నానము చేస్తే సమస్త కల్మషాలూ నశించిపోతవి. అందువల్లనే ఋషులు అందరూ ఆ నదిని సేవించినారు. ధర్మసమృద్ధము అయిన మున్యాశ్రమాలు ఆ నదీతీరాన వెలసినవి. అవి అన్నీ ఆ నదికి అలంకారాలు అయినవి.

ఆ నది మడుగులలో అప్సరాంగనలు అత్యంత సంతోషముతో క్రీడిస్తూ ఉంటారు. ఆ నదీతీరాన దేవదానవ గంధర్వకిన్నరులు విహరిస్తూ ఉంటారు. ఆ నది మంగళజలాలలో వివిధ గంధర్వాంగనలూ ఎప్పుడూ జలకమాడుతూ ఉంటారు. ఇందరు ఇన్ని విధాల సేవించినా ఆ పుణ్యోదకాలు ఎన్నడూ పంకిలము అయిపోవు. ఆ నదీతీరాననే దేవతల క్రీడాపర్వతాలూ ఉద్యానవనాలూ వందలకొద్దీ ఉన్నవి. దేవతలను ఉద్ధరించడానికి ఆ గంగ ఆకాశమార్గాన దేవలోకములోకి పోయింది. అక్కడివారిని అందరినీ పునీతులను చేసింది. దేవతలకు అందరికీ అది తామరకొలనుఅయింది. ముల్లోకాలలోనూ ప్రసిద్ధికిఎక్కింది

ఆ గంగాజలాలు రాళ్ళమీద పడుతూఉంటే ప్రౌఢాంగన చేతులు చరచి చప్పట్లు కొట్టుతున్నట్లుగాతోస్తుంది. అది తెల్లని నురుగులు విరచిమ్ముతూ ఉండే చల్లని చిరునవ్వులు వెదచల్లుతున్నట్లు కనిపిస్తుంది. అది నిమ్నోన్నతశిలల మీదనుంచి పడుతూఉంటే పొడుగాటి నల్లని జడ వేలాడుతున్నట్లు అగుపిస్తుంది. అది సుళ్ళు తిరుగుతూ ఉంటే నాభివలె గోచరిస్తుంది. అది అగాధ ప్రదేశాలలో స్తిమిత గంభీరముగా నడుస్తుంది. ఒకచోట విపరీతము అయిన వేగముతో పొంగులుఎత్తుతుంది. ఒకచోట మృదంగధ్వనులుచేస్తూ దూకుతుంది. ఒకచోట మహాభైరవ స్వనాలు చేస్తూ నడుస్తుంది.

ఆ గంగ అట్లా ప్రవహిస్తూ ఉంటే వికసించిన నల్లకలువలు దాని కన్నులవలెనూ కమలాలు దాని చేతులవలెనూ తీరాన చెట్ల వరుసలు దాని మెడలోని హారాలవలెనూ విశాలము అయిన ఇసుక తిన్నెలు దాని ఘనజఘనాలవలెనూ

విరగపూసిన తెల్లకలవులు దాని నితంబాల వంపులవలెనూ గాలికి రాలిన రకరకాల పుష్పాదులు దాని రక్తచందనపు పూతలవలెనూ నిర్మలజలాలు తళతళలాడేదాని మణిభూషణాలవలెనూ పూలూ పండ్లూ గుల్మాలూ నీరు కోతులూ పాములూ పక్షులూ మొసళ్లూ దాని వివిధా భరణాలవలెనూ భ్రమపెట్టుతవి.

హంసలూ సారసపక్షులూ చక్రవాకపక్షులూ మనోహరముగా పాటలు పాడుతూ ఉంటే అడవి ఏనుగులూ దేవతల ఏనుగులూ దిశాగజాలూ ఘీంకారాలు చేస్తూ ఉండే సముద్రుణ్ణి కలియడానికి పరుగులు ఎత్తుతూ ఉన్న మదవతి వలె ఆ గంగ కనిపిస్తుంది.

ఆ పుణ్యనది విష్ణుపాదాలలోనుంచి జారింది. ఈ భూలోకములో వారి పాపాలను పోకొట్టడానికి భగీరథుడి ప్రభావమువల్ల శివజటాజూటాలలోనుంచి కిందికి దిగింది. అలలతో సుళ్ళు తిరుగుతూ పరుగులు ఎత్తుతున్న ఆ గంగానదిని రాముడు శృంగిబేరపురము పోతూ చూచినాడు. అంతట అతడు సుమంత్రుడితో "ఓ మంత్రిపుంగవా, మనము ఇక్కడనే ఆగిపోదము. అదిగో ఆ పెద్ద గారచెట్టు చిగురుటాకులతో, పూలు పూసి మనోహరముగా కనపడుతున్నది· ఆ చెట్టుక్రిందమనము ఉండిపోదాము. దేవతలూ దానవులూ మానవులూ మృగాలూ పక్షులూ సేవించే ఈ గంగానదిని మనమూ సేవింతాము" అన్నాడు. "బాగుంది" అన్నాడు లక్ష్మణుడు.

సుమంత్రుడు రథాన్ని ఆ చెట్టుకిందికి తోలుకొనిపోయినాడు. సీతారామ లక్ష్మణులు రథము దిగినారు. సుమంత్రుడు గుర్రాలను విప్పి వాటికి మేత వేసినాడు.

ఆ ఇంగుదీ వృక్షముక్రింద కూర్చున్న రాముడిదగ్గరకు పోయి సుమంత్రుడు చేతులు జోడించి నిలుచున్నాడు.

అక్కడికి దగ్గరలో శృంగిబేరపురము ఉంది. అక్కడ గుహుడు అనే రాజు ఉన్నాడు. వాడు నిషాదజాతిలో పుట్టి స్థపతి అనే బిరుదుతో రాజ్యము ఏలుతూ ఉన్నాడు. వాడు మహాబలవంతుడు. రాముడికి ప్రాణసఖుడు. రాముడు గంగాతీరానికి వచ్చినట్టు గుహుడికి తెలిసింది. అంతట అతడు నిషాద

వృద్ధులనూ అమాత్యులనూ వెంటబెట్టుకొని రాముణ్ణి సందర్శించడానికి బయలు దేరినాడు.

దూరాన ఉండగానే రాముడు గుహుణ్ణి చూచినాడు. అతనికి ఎదురు కోలు చెప్పడానికి లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని ఎదురుగుండా పోయినాడు.

మునివేషములో ఉన్న రాముణ్ణి గుహుడు చూచినాడు. ఆర్తుడు అయి పోయినాడు. దుఃఖముతో రాముణ్ణి కౌగలించుకొన్నాడు. "రామప్రభూ, నీకు అయోధ్య ఎటువంటిదో నా ఈ పట్టణమున్నూ అటువంటిది. ఇప్పుడు నేను ఏమిచేయవలెను? ఓ మహాబాహూ, ఓ మిత్రుడా, నీవు ఇప్పుడు నా అతిథివి" అంటూ ఉండగా అతడి అనుచరులు అర్ఘ్యజలాలూ అన్నాదులూ పట్టుకొని వచ్చినారు.

అంతట గుహుడు "ప్రభూ, మీకు స్వాగతము. ఇదిగో అర్ఘ్యజలము. ఇవిగో భక్ష్యము - భోజ్యము - లేహ్యము - పేయము. వీటిని పుచ్చుకోవలసింది. మీకు శయనాదులు ఏర్పాటుచేస్తాను. మీ గుర్రాలకు మేత వేస్తాను. రామ ప్రభూ, నా ఈ భూమి అంతా నీది. మేము అందరమూ నీకింకరులము. నీవే మా ప్రభువు. మా ఈ రాజ్యము నీవే ఏలు" అన్నాడు.

"ఓ గుహుడా, నీవు స్నేహాతిశయముతో పాదచారుడవు అయి నన్ను చూడడానికి వచ్చినావు. నన్ను సత్కరించినావు. నాకు అంతే చాలును. నేను సంతుష్టుణ్ణి అయినాను" అంటూ రాముడు కండలు తిరిగిన తన రెండు బాహువు లతో గుహుణ్ణి గాఢాలింగనము చేసుకొని "మిత్రుడా, నిన్నూ నీ బంధువులనూ ఇప్పుడు నా భాగ్యవశమువల్ల చూడగలిగినాను. మీరు అందరూ క్షేమముగా ఉంటూ ఉన్నందుకు నాకు సంతోషము. ఏ ఉపద్రవాలూ లేకుండా నీ రాజ్యము సుఖప్రదముగా ఉందా? నీ మిత్రులు అందరూ క్షేమంగా ఉన్నారా? నీ బొక్కసము తరుగు లేకుండా ఉందా? నామీద ప్రేమాతి శయముతో నీవు తీసుకొని వచ్చిన భోజన ద్రవ్యాదులను నేను నీకే ఇచ్చివేస్తు న్నాను. కానుకలు అందుకొనే అర్హత ఇప్పుడు నాకు లేదు. నేను పిత్రాజ్ఞను శిరసా వహించి వల్కలాలు ధరించినాను. దర్భమొలత్రాడు కట్టుకొన్నాను అరణ్యవాసానికి పోతున్నాను. అక్కడ నేను తపస్సు చేయవలెను. ఫలమూల

లనే తింటూ ఉండవలెను. అందువల్ల నాకు నీవు ఏమీ ఇవ్వనవసరము లేదు. ఈ గుర్రాలకు మేత ఇస్తే చాలును. ఇవి మా నాయనగారివి. వారికి ఈ గుర్రాలు అంటే ముద్దు. వీటిని చక్కగా మేపి పంపించి వేస్తే నన్ను నీవు ఎంతో సత్కరించిన వాడవు అవుతావు'' అని చెప్పినాడు.

అంతట గుహుడు ఆ గుర్రాలకు నీళ్ళు పెట్టి పచ్చి మేత వేయవలసింది అని తన వాండ్లను ఆజ్ఞాపించినాడు.

ఆ తరువాత రాముడు వల్కలాన్ని ఉత్తరీయముగా వేసుకొని పశ్చిమ సంధ్యను ఉపాసించినాడు. లక్ష్మణుడు పోయి స్వయముగా తెచ్చిన గంగా జలాలను ఆహారముగా పుచ్చుకొన్నాడు.

చీకటిపడ్డ తరువాత పాదప్రక్షాళనము చేసుకొని ఆచమించి నేలమీద పడుకొన్నాడు. సీతాదేవీ అట్లాగే నేలమీద పడుకొన్నది.

లక్ష్మణుడితోపాటు గుహుడున్నూ ధనుర్ధరుడు అయి సుమంత్రుడితో మాట్లాడుతూ ఏమరు పాటు లేకుండా ఆ రాత్రి అంతా కావలి కాయడానికి నిలుచున్నాడు.

ఆ మహాత్ముడు ఆ ధీమంతుడు ఆ యశస్వి దశరథమహారాజు పుత్రుడు ఆ రాముడు అంతవరకూ సుఖాలు అనుభవించినవాడు - ఎన్నడూ ఏకష్టాలూ ఎరుగనివాడు అట్లా నేలమీద పడుకొంటే ఆ రాత్రి అతడికి ఎంత సేపటికీ తెల్లవారలేదు.

## ౫౧

రాత్రి చాలా పొద్దుపోయింది. లక్ష్మణుడు ధనుర్ధరుడు అయి ఏకాగ్రతతో కాపలా కాస్తున్నాడు. అతణ్ణి చూచి గుహుడు సంతాపసంతప్తుడు అయి పోయినాడు. ''నాయనా, లక్ష్మణా, నీకోసము శయ్య అమర్చి ఉంది. నీవు పడుకోవలసింది. నీవు ఎంతో అలసిపోయి ఉన్నావు. సుఖముగా నిద్రపో. మేము అందరమూ కష్టానికి అలవాటు పడ్డ వాండ్లము. నీవు అట్లా కాదు. సుఖపడ్డ వాడివి. ఈ రాత్రి అంతా మేము సీతారాములకు కావలి కాస్తాము.

"ఓ లక్ష్మణా. ఈ భూభాగములో రాముడి కన్నా ప్రియమిత్రుడు నాకు ఎవడూ లేడు. నేను యదార్థము చెప్తున్నాను. రాముడు నా ప్రాణ మిత్రుడు. అతని అనుగ్రహమువల్ల నేను యశస్విని అయినాను. ధనవంతుణ్ణి అయినాను. ధర్మాధర్మాలు తెలుసుకొన్నాను.

"నాయనా, నిద్రపోతూ ఉన్న ఈ సీతా రాములకు నేనూ నా జ్ఞాతులూ విల్లంబులు పట్టుకొని అన్ని దిక్కులా కాపలా కాస్తాము. నేను ఎప్పుడూ ఈ అడవిలో తిరిగేవాణ్ణి, ఇక్కడ నాకు తెలియంది ఏమీ లేదు. చతురంగ బలాలు వచ్చినా నన్ను ఒక్కణ్ణీ ఇక్కడ ఎదుర్కొలేవు" అన్నాడు గుహుడు.

అంతట లక్ష్మణుడు "ఓ గుహుడా, నీవు పరమధార్మికుడవు. నీ శక్తి సామర్థ్యాలు నేను ఎరుగుదును. నీవు ఇక్కడ కాపు ఉంటే మాకు ఏ భయమూ లేదు. అయితే దశరథమహారాజు అంతటివాడికి జ్యేష్ఠపుత్రుడు రాముడు సీతా దేవితో కూడా ఇట్లా నేలమీద పడుకొని ఉంటే నాకు ఎట్లా నిద్రపట్టుతుంది? నాకు సుఖము ఎందుకు? నేను బ్రతికి ఉండడము ఎందుకు? ఈరాముణ్ణి యుద్ధములో దేవాసురులు అయినా ఎదుర్కొనలేరు. అటువంటి రాముడు ఇటువంటి కటిక నేలమీద సీతాదేవితో పడుకొని నిద్రపోతున్నాడు. ఓ స్థపతీ దశరథమహారాజు ఎన్నో పూజలు చేసి ఎన్నోమంత్రాలు జపములుచేసి ఎన్నో యజ్ఞాలు చేసి ఈరాముణ్ణి కన్నాడు. గుణగణాలలో అయనకూ ఈ రాముడికీ ఏభేదమూ లేదు. దశరథమహారాజుకు ఈ రాముడు అంటే ఎంతో ప్రేమ. ఇతడు అరణ్యానికి చేరినాడు అని తెలయగానేఆయన బ్రతకడు. అంతట దశరథమహారాజు అంతఃపురాంగనలు అందరూ ఏడ్చి ఏడ్చి మూలపడి పోతారు. అంతట రాజభవనమూ ఏ చడీ చప్పుడూ లేకుండా పాడుపడి పోతుంది. అంతటి కోసలరాజ్యమూ అనాథము అయిపోతుంది.

"ఓ గుహుడా, కౌసల్యాదేవీ దశరథమహారాజూ మా అమ్మ సుమిత్రాదేవీ ఇక బ్రతుకుతారు అని నేను అనుకోను. ఒకవేళ బ్రతికేటట్లయితే ఈ రాత్రి మాత్రము బ్రతుకుతారు, ఆతరువాత బ్రతుకరు. మా అమ్మ నాతమ్ముడు శత్రుఘ్నుణ్ణి చూచుకొని బ్రతికితే బ్రతకవచ్చును. కాని పరమ పరాక్రమవంతుణ్ణి రాముణ్ణి కన్న కౌసల్యాదేవి మాత్రము బ్రతుకదు.

# అయోధ్యకాండ

"అయోధ్యనగరవాసులు అందరూ దశరథమహారాజుమీద ఎంతో అనురాగముతో ఉంటున్నారు. ఆయనవల్లనే వారు అందరూ సుఖపడుతున్నారు. సంతోష పడుతున్నారు. ఆయన పోయిన తరువాత వాండ్లు అందరూ దిక్కులేని వాండ్లు అయిపోతారు.

"గుహుడా, రాముడు దశరథమహారాజుకు జ్యేష్ఠపుత్రుడు. మహాత్ముడు. అందులో ప్రియపుత్రుడు. అటువంటి రాముణ్ణి చూడకుండా దశరథమహారాజు జీవించడము ఉత్తది. ఆ మహారాజు చనిపోయిన తరువాత కౌసల్యాదేవి ఎంత మాత్రమూ బ్రతుకదు. అయిపోయింది ఏదో అయిపోయింది. అంతా అయిపోయింది. అది అంతా తలచుకొని ప్రయోజనము లేదు. మా తండ్రి దశరథ మహారాజు రాముడికి పట్టము కట్టవలెను అనుకొన్నాడు. ఆ కోరిక ఈడేరకుండానే ఆయన చనిపోతాడు. తప్పదు.

"గుహుడా, తండ్రికి మరణ సమయము ఆసన్నము అయినప్పుడు దగ్గర ఉండి ప్రేతకర్మలను అన్నిటినీ చేసే పుత్రులే పుత్రులు. వారే సిద్ధార్థులు. మాకు ఆ భాగ్యము లేదు కాబోలు.

"అయోధ్యానగరము ఎంతో మనోహరము అయిన పట్టణము. రమ్యము అయిన చత్వరాలూ తీర్చి దిద్దిన రాజవీథులూ విశాలము అయిన హర్మ్య ప్రాసాదాలూ ఉన్నతము అయిన రాజప్రాసాదాలు ఇప్పుడు నా కళ్ళఎదుట కనపడుతున్నవి. మా అయోధ్యానగరము ఎటు చూచినా ఎప్పుడూ రథాలతోనూ గుర్రాలతోనూ ఏనుగులతోనూ కిటకిట లాడుతూ ఆరామ ఉద్యానవనాలతోనూ చక్కని భోగము పడుచులతోనూ తూర్యనాదాలతోనూ సమాజోత్సవాలతోనూ హృష్టపుష్ట జనులతోనూ సర్వకల్యాణ సంపన్నముగా ఉంటుంది. అక్కడ ఇక భరతశత్రుఘ్నులు విహరిస్తారు.

"ఓ స్థపతీ, దశరథమహారాజు బ్రతికి ఉంటాడా? ఆ సువ్రతుణ్ణి ఆ మహాత్ముణ్ణి నేను మళ్ళీ పోయి చూడకలనా? మా వనవాసము అంతా అయిపోవడమూ రాముడు అయోధ్యానగరానికి తిరిగి పోవడమూ దశరథమహారాజు క్షేమముగా ఉండడమూ సంభవిస్తుందా?" అంటూ ఆ నిలుచుకొని ఉన్న లక్ష్మణుడు అవురుమని ఏడ్చినాడు.

గుహుడున్నూ వ్యసనాభిపీడితుడు అయిపోయినాడు. జ్వరము వచ్చి బాధపడుతున్న ఏనుగు మాదిరిగా కన్నీరు కార్చసాగినాడు.

ఇంతలో తెల్లవారవచ్చింది.

## ౫౨

రాముడు నిద్రలేచి "లక్ష్మణా, సూర్యోదయము కాబోతున్నది. రాత్రి సుఖముగా గడచిపోయింది. ఇదుగో నల్లటి కోకిల మహా మధురముగా కూస్తూ ఉంది. అడవిలో నుంచి నెమళ్ళు కేకలు పెట్టుతూ ఉన్నవి. గంగానది మహా వేగముగా సముద్రానికి పరుగులు ఎత్తుతూ ఉంది. మనము ఈ గంగను త్వరగా దాటిపోవలెను" అన్నాడు.

లక్ష్మణుడు గుహుణ్ణి సుమంత్రుణ్ణి పిలిచి రాముడి అభిప్రాయము తెలియ చెప్పినాడు.

గుహుడు తన మంత్రులను పిలిచి "రామప్రభువు ఇప్పుడే ఈ గంగానదిని దాటి పోవలెను అంటున్నాడు. చుక్కాని అమర్చిన బందోబస్తు అయిన చక్కని నావను రేవులోకి తీసుకొని వచ్చి తెడ్డు వేసి రామప్రభువును సుఖముగా దాటించవలెను" అని ఆజ్ఞాపించినాడు.

వాండ్లూ అప్పటికి అప్పుడే అందము అయిన ఒక నావను రేవులోకి తీసుకొని వచ్చి గుహుడికి చెప్పినారు. అంతట గుహుడు రాముడి దగ్గరకు పోయి నమస్కారము చేసి "దేవా నావ సిద్ధముగా ఉంది. మీకు ఏమి కావలెనో నేను ఇంకా ఏమి చేయవలెనో చెప్పవలెను" అన్నాడు.

"గుహుడా, నేను కోరింది చేసిపెట్టినావు. నావలో ముందుగా సీతాదేవి వస్త్రాభరణాదులను ఎక్కించవలెను" అన్నాడు రాముడు. అంతట ఆ అన్నతమ్ములు కవచాలు తొడుగుకొన్నారు. తూణీరాలు బిగించి కృపాణాలు ధరించి కోదండపాణులు అయి సీతాదేవిని వెంటపెట్టుకొని రేవులోకి పోయినారు.

సుమంత్రుడు రాముడికి నమస్కారచేసి "ప్రభూ, ఇక నేను ఏమి చేసేది" అని అడిగినాడు. రాముడు తన కుడిచేతితో సుమంత్రుడి వీపు తట్టుతూ

“ఓ మంత్రి సత్తమా, ఇకను మీరు అయోధ్యకు వెళ్ళండి. దశరథమహారాజు చెప్పినంతదూరమూ రథము ఎక్కించి మమ్ములను తీసుకొని వచ్చినారు. ఇకను మేము ఈ గంగను దాటి కాలినడకను అడవికి పోతాము. మీరు ఇంటికిపోయి ఏమరుపాటు లేకుండా మా తండ్రిని కనిపెట్టుకొని ఉండండి” అని చెప్పినాడు.

సుమంత్రుడికి దుఃఖము వచ్చింది. ఆ పురుషోత్తముణ్ణి చూచి “రామ ప్రభూ, మీ వనవాస ప్రయాణము తప్పించడానికి ఎవరికీ అలవి కాక పోయింది. మీరు ఆటవికుడి వలె భార్యనూ తమ్ముణ్ణి వెంటపెట్టుకొని పోతున్నారు. మీ బ్రహ్మచర్యవ్రతానుష్ఠానమూ మీ వేదాధ్యయనమూ మీ దయాగుణమూ మీ ఆర్జవమూ నిష్ఫలాలు కాబోలు. మీరు అడవిలో ఉన్నా ముల్లోకాలూ జయించిన మహా విష్ణువు వలె మీరు కీర్తివంతులు అవుతారు. మీకు సద్గతే. ఇంతకూ మోసపోయినవాణ్ణి నేను. మీ వెంట వచ్చిన పౌరులను వంచించడానికి నన్ను ఉపయోగించినవారు. ఇప్పుడు నన్నూ వారివలెనే చేస్తున్నారు. ఇక మేము కైకేయీదేవి అధీనులము అయి దుఃఖభాగులము అవుతాము. మేము చచ్చిపోయిన వారిలో లెక్క” అన్నాడు.

రాముడు అప్పుడే దూరగతుడు అయిపోయినట్లు సుమంత్రుడికి తోచింది. పట్ట శక్యము కాని దుఃఖము వచ్చింది. చాలసేపు ఏడ్చినాడు. ఆ అశుచి పోవడానికి గంగాజలముతో ముఖము కడుగుకొన్నాడు. ఆచమించినాడు.

అంతట రాముడు “ఓ సుమంత్రుడా, ఇక్ష్వాకు వంశీయులకు మీవంటి స్నేహితుడు మరి ఒకడు లేడు. దశరథమహారాజు నన్ను తలచుకొని దుఃఖపడకుండా మీరు చూడవలెను. దుఃఖముతో ఆయన హృదయము తల్లడిల్లి పోతూ ఉంటుంది. అయన వృద్ధు. పయిగా కామభారముతో కుంగిపోయి ఉన్నాడు. అందువల్ల నేను మీకు ఇంతగా చెప్పుతున్నాను. కైకేయీదేవిని సంతోషపెట్టడానికి ఆయన ఏమి ఏమి ఆజ్ఞాపించినా మీరు సందేహించకుండా చక్కపెట్టవలెను ఏమంటే, తాము అనుకొన్న పనులు నిర్విఘ్నముగా కొనసాగించుకోవడానికే రాజులు రాజ్యపాలనము చేస్తూ ఉంటారు. ఏపని ఎట్లా చేస్తే దశరథ మహా రాజు సంతోషిస్తాడో ఆ పనిని ఆయనకు మీరు అట్లా చేసిపెట్టుతూ ఉండవలెను.

"ఎన్నడూ ఏ దుఃఖమూ ఎరగని ఆ పూజనీయుడికి ఆ జితేంద్రియుడికి మా తండ్రి దశరథమహారాజుకు నేను నమస్కారము చేసి ఈ విధముగా మనవి చేసినాను అని చెప్పవలెను.

"అయోధ్యానగరము వదలి అడవిలో ఉండవలసి వచ్చినందుకు నేను కానీ సీత కానీ లక్ష్మణుడు కానీ ఏమాత్రమూ కించ పడడము లేదు. పధ్నాలుగు సంవత్సరాలూ అయిపోగానే మేము మళ్ళీ వస్తాము. వచ్చి మిమ్మలను కని పెట్టుకొని ఉంటాము" అని మా నాయనగారితో చెప్పి మా తల్లి కౌసల్యాదేవికీ తక్కిన రాజపత్నులకూ కైకేయీదేవికీ పదేపదే నమస్కారము చేసినాము అని చెప్పవలసింది.

"సుమంత్రుడా, భరతుణ్ణి వెంటనే పిలిపించవలెను అనీ రాజుల సమ్మతితో వానికి పట్టము కట్టవలెను అనీ మీరు దశరథమహారాజుకు చెప్పి ఆ పని చేయించవలెను. భరతుణ్ణి యువరాజును చేసి కౌగిలించుకోగానే దశరథమహారాజుకు మా ఎడబాటువల్ల వచ్చిన దుఃఖము అంతా తొలగిపోతుంది.

"ఓ సుమంత్రుడా, భరతుడితో ఈ విధముగా చెప్పవలెను. "నీవు దశరథ మహారాజు విషయములో ఎట్లా ప్రవర్తిస్తావో తల్లులు అందరి విషయములోనూ అదేవిధముగా ప్రవర్తించవలెను. కైకేయీదేవి నీ తల్లి. సుమిత్రాదేవి శత్రుఘ్నుడి తల్లి. వారిని ఇద్దరినీ నీవు ఎట్లాగూ గౌరవిస్తావు. అడవికి పోయిన వాడి తల్లి కౌసల్యాదేవి. ఆమెను నీ తల్లివలె గౌరవించడమే నీ గొప్పతనము. నీవు నీ తండ్రినీ తల్లులనూ సంతోష పెట్టడానికే యువరాజువు అవుతున్నావు."

"ఓ సుమంత్రుడా, ఈ విధముగా వారివారికి చెప్పవలెను. ఇక జాగు ఎందుకు ? మీరు అయోధ్యానగరానికి సుఖముగా వెళ్ళిపోవలసింది" అన్నాడు.

సుమంత్రుడు దుఃఖముతో కుంగిపోయి రాముణ్ణి చూస్తూ "రామా నాకు మీతో ఉన్న స్నేహము నుంచి నేను ఇప్పుడు నిర్భయముగా చెప్పుతున్నాను. మిమ్మలను సంతోష పెట్టవలెను అని చెప్పడము లేదు. నేను మీ భక్తుణ్ణి. మీరు లేకుండా నేను ఒక్కణ్ణి అయోధ్యాపట్టణము పోలేను. పయిగా అయోధ్యానగరము ఇప్పుడు మీ వియోగ శోకముతో పరితపించి పోతూ ఉంటుంది. నేను మిమ్మలను ఈ రథము ఎక్కించుకొని రావడము అందరికీ తెలిసిన విష

సుమే. ఇప్పుడు మీరు లేకుండా నేను ఒక్కణ్ణి ఈ రథము తోలుకొనిపోతే అందరూ నన్ను నిందిస్తారు. యుద్ధరంగములో రథము ఎక్కి వచ్చిన వీరుడు హతుడు కాగా తిరిగి వచ్చిన శూన్య రథాన్ని చూచి అతని సైన్యము దైన్యము పాలు అయ్యేటట్టుగా ఉత్త రథముతో నేను తిరిగిపోతే అయోధ్య అంతగానూ అటమటించిపోతుంది.

“రామా, మీరు ఇప్పుడు అయోధ్యనగరానికి ఇంతదూరాన ఉన్నప్పటికీ అయోధ్యాపౌరులు అందరూ మిమ్ములను గురించే ఆలోచిస్తూ అన్నము అయినా తినకుండా ఉంటారు. మీరు వనవాసానికి బయలుదేరినప్పుడు ప్రజలు అందరూ ఎంత తల్లడిల్లి పోయినారో ఎంత క్షోభ పడి పోయినారో మీరే స్వయముగా చూచినారు. మీరు లేకుండా నేను ఇప్పుడు ఈ రథములో పోతే పౌరులు అందరూ అప్పటికన్నా నూరింతలు దుఃఖపడిపోతారు.

“రామా, మీ అమ్మగారితో నేను ఏమి అని చెప్పేది? మీ కుమారుణ్ణి మేనమామ ఇంట్లో దిగ పెట్టి వచ్చినాను అని చెప్పేదా ? ఈ అబద్ధము చెప్పడము ఎట్లాగు? అట్లాగే మీ కుమారుణ్ణి అడవులలో వదలి పెట్టి వచ్చినాను అని చెప్పలేను.

“రామా, మీరూ సీతాదేవీ లక్ష్మణుడూ రథము ఎక్కితే లాగుకొని వచ్చిన గుర్రాలు మీరు ముగ్గురూ ఇప్పుడు ఎక్కకపోతే ఈ రథాన్ని లాగుతవా? నేను అయోధ్యకు పోను. మీతోనే వస్తాను. అడవిలోనే ఉంటాను. మీరు ఇందుకు అంగీకరించవలెను. మీరు కాదు అనేటట్లయితే నేను ఈ రథముతో కూడా అగ్నిప్రవేశము చేస్తాను.

“రామా, అడవిలో క్రూరమృగాలు ఏవీ మీ తపస్సుకు విఘ్నము చేయకుండానే ఈ రథము ఎక్కిపోయి వాటిని వేటాడి చంపి వేస్తాను. మీ వనవాస ప్రయాణము వల్ల మీకు రథము తోలే భాగ్యము నాకు లభించింది. మీరు అనుగ్రహిస్తే వనవాస సౌఖ్యమున్నూ అనుభవిస్తాను. మీరు అనుమతించవలెను. ఓ ప్రభూ, అడవిలో ఈ గుర్రాలు మీకు సేవ చేస్తవి. వీటి జన్మ ధన్యము అవుతుంది. నేను మీ సేవచేస్తూ ఉంటాను. మీరు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే ఉంటాను. మీరు లేకుండా నేను అయోధ్యలోనే కాదు దేవలోక

ములో అయినా ఉండను. దేవేంద్రుడి రాజధాని నగరానికి అయినా పోను. మీ పధ్నాలుగు ఏండ్ల వనవాసము అయిపోగానే ఈ రథము మీదనే మిమ్మల్ని సీతాదేవినీ లక్ష్మణుణ్ణి ఎక్కించుకొని అయోధ్యకు పోతాను. ఇది నా కోరిక. మీ సాన్నిధ్యములో ఉండేట్లయితే పధ్నాలుగు సంవత్సరాలూ నాకు పధ్నాలుగు ఘడియలుగా గడిచిపోతవి. అట్లా కాక పోయేట్లయితే పధ్నాలుగు వందల సంవత్సరాలుగా గడుస్తవి.

"రామా, నీవు భృత్యవత్సలుడవు. నేనూ మీ భృత్యుణ్ణి. అంతే కాదు. మీ భక్తుణ్ణి. నేనూ మీ వెంట వస్తాను అంటూ ఉంటే మీరు నన్ను వదిలిపెట్టి వెళ్ళకూడదు." అంటూ సుమంత్రుడు దీనముగా యాచించినాడు. రాముడికి తన సేవకులు అంటే ఎంతో ప్రేమ. సుమంత్రుణ్ణి చూచి "ఓ మంత్రి పుంగవా, మీ ప్రభుభక్తి పరాయణత్వము నాకు తెలుసును. అందువల్లనే మిమ్మల్ని అయోధ్యానగరము పొమ్మంటున్నాను. మీరు అయోధ్యకు పోగానే మా సవతి తల్లి కైకేయీదేవి రాముడు అడవులపాలు అయినాడు అని నమ్ముతుంది. మీరున్నూ చెప్పుతారు. ఆమె సంతోషిస్తుంది. పరమధార్మికుడు అయిన నా తండ్రి దశరథ మహారాజు మిథ్యావాది కాడు అని ఆమెకు అప్పుడు తెలుస్తుంది. ఆయన సత్యసంధుడు అని ఆమె విశ్వసిస్తుంది. ఆమె పుత్రుడు భరతుడు అంతట యువరాజు అవుతాడు. నా ముఖ్యము అయిన కోరిక ఆమె సంతోషించడమే. కాబట్టి నన్ను సంతోష పెట్టడానికైనా మీరు వెంటనే అయోధ్యకు పోవలెను. నేను ఎవరెవరికి ఏమేమి చెప్పినానో అవి అన్నీ ఎక్కువ తక్కువలు లేకుండా వారివారికి చెప్పవలెను" అన్నాడు రాముడు.

ఈ విధముగా చెప్పి రాముడు సుమంత్రుణ్ణి అయోధ్యకు పోవడానికి ఒప్పించినాడు.

అంతట ఆ మహాత్ముడు రాముడు గుహుణ్ణి చూచి "ఓ సఖుడా, నేను జనసంచారము లేని అరణ్యాలలోనే ఉండవలెను. అది పితృ ఆజ్ఞ. అందువల్ల, నేను ఇక్కడ ఉండకూడదు. కందమూలాలు తింటూ నేలమీద పడుకోవలెను. ముని జనుల వలె జటలు ధరించవలెను. కాబట్టి ఇప్పుడు నాకు మర్రిపాలు కొట్టించి తెప్పించి పెట్టవలెను" అన్నాడు.

అప్పటికి అప్పుడు గుహుడు మఱ్ఱిపాలు తెప్పించినాడు. ఆ మఱ్ఱిపాలను రామలక్ష్మణులు తమ తలలకు పట్టించినారు. అంతట ఆ అన్నదమ్ముల వెంట్రుకలు జడలు కట్టుకొని పోయినవి. జటామండలాలతోనూ వల్కలాలతోనూ వారు అప్పుడు మహామునులవలె శోభించినారు. వారు వైఖానసమహర్షి పద్ధతిని వానప్రస్థవ్రతము అవలంబించినారు.

రాముడు గుహుణ్ణి చూచి "మిత్రుడా, రాజ్యాన్ని కాపాడుకొంటూ ఉండడము కష్టసాధ్యము అయిన పని. నీవు నీ బొక్కసాన్ని నీ దుర్గాన్ని నీ గ్రామాలనూ ఏమరుపాటు లేకుండా ధర్మమార్గాన కాపాడుకొంటూ ఉండవలెను సుమా" అన్నాడు. గుహుడు అక్కడ నిలిచిపొమ్మని చెప్పి భార్యనూ లక్ష్మణుణ్ణి వెంట పెట్టుకొని నీటి ఒడ్డుకు పోయినాడు. ఆ ఒడ్డున ఉన్న నావను చూచినాడు. లక్ష్మణుడితో "తమ్ముడా, నీవు ముందు నావ ఎక్కు. ఈ మనస్విని నీ చేతులు పట్టుకొని మెల్లగా నావ ఎక్కుతుంది" అన్నాడు.

అన్నగారి అభిప్రాయము తెలుసుకొని ఆ బుద్ధిమంతుడు లక్ష్మణుడు ముందుగా సీతాదేవిని ఆ నావ ఎక్కించి తానూ ఎక్కినాడు. ఆ తరువాత ఆ మహాతేజస్వి రాముడు నావ ఎక్కి కూర్చున్నాడు. అప్పుడు నిషాద ప్రభువు గుహుడు ఆ నావను ప్రవాహములోకి తోయవలసింది అని నావికులను అజ్ఞాపించినాడు.

ఆత్మహితముకోసము రాముడు నావారోహణ మంత్రాన్ని జపము చేసినాడు. యథాశాస్త్రముగా ఆచమించినాడు.

నావ ప్రవాహానికి అడ్డముగా పోతూ ఉంది. రాముడి దేహము ఉప్పొంగి పోయింది. సీతాలక్ష్మణులు ఆ గంగాభవానికి నమస్కారము చేసినారు. రాముడు సుమంత్రుణ్ణి గుహుణ్ణి నిలిచిపొమ్మని చేతులతో వీడ్కోలు చెప్పినాడు. వేగముగా నదిని దాటించమని నావికులను హెచ్చరించినాడు. చుక్కాని కాసేవాడు జాగ్రత్తగా కూర్చున్నాడు. నావికులు గబగబా తెడ్డు వేయసాగినారు. నావ ఇట్టే నదీమధ్యములోకి పోయింది.

అప్పుడు సీతాదేవి లేచి నిలుచుకొని ఆ గంగాభవానికి నమస్కారము చేస్తూ "ఓ గంగా, నీవు భక్తుల కోరికలు ఈడేర్చెదానివి. ఈ రాముడు దశరథ

పుత్రుడు. ఈయనను నీవు కాపాడవలెను. ఈ మహానుభావుడు పధ్నాలుగు సంవత్సరాలూ వనవాసము చేసి నన్నూ నా మరిదినీ వెంటబెట్టుకొని తిరిగి వచ్చి నీ దర్శనము చేస్తాడు. అప్పుడు నిన్ను నేను సంతోషముగా పూజచేస్తాను.

"ఓ గంగమ్మతల్లీ, నీవు త్రిపథవు. స్వర్గమర్త్య పాతాళలోకాలలో వారిని అందరినీ నీవు పునీతులను చేస్తునావు. నీవు బ్రహ్మలోకములో వెలసినావు. సముద్రుణ్ణి భర్తగా చేపట్టినావు. అందువల్ల నిన్ను ఈ లోకములో మేము చూస్తున్నాము. నిన్ను స్తోత్రము చేస్తున్నాను. నీకు నమస్కారము చేస్తున్నాను. నా భర్తా నేనూ సుఖముగా తిరిగి వచ్చిన తరువాత నా భర్తకు పట్టము కట్టుతారు. అప్పుడు నేను నిన్ను సంతోష పెడుతాను. లక్షగోవులను బ్రాహ్మణులకు దానము ఇస్తాను. వారికి మృష్టాన్నము పెడుతాను. వారికి అందరికీ వస్త్రాలున్నూ ఇస్తాను.

"ఓ గంగాదేవీ, నేను తిరిగి అయోధ్య చేరగానే వెయ్యి బానల మద్యముతోనూ మాంసాన్నముతోనూ నిన్ను పూజ చేస్తాను. నీ తీరాన ఉన్న దేవాలయాలనూ దేవతలనూ తీర్థాలనూ సేవిస్తాను. ఓ తల్లీ, నా పెనిమిటి ఏ కళంకమూ లేనివాడు. వీరుడు. ఈయన నన్నూ నా మరదినీ వెంటబెట్టుకొని సుఖముగా తిరిగి అయోధ్యానగరము చేరేటట్టు నీవు అనుగ్రహించవలెను" అంటూ ఉండగా ఆ నావ ఆ గంగానది దక్షిణతీరము చేరింది.

నావ దిగి సీతారామలక్ష్మణులు అరణ్యమార్గాన నడవసాగినారు. రాముడు లక్ష్మణుణ్ణి చూచి "తమ్ముడా, ఇక మమ్ములను కాపాడవలసినవాడవు నీవే. ఇదివరకు ఎన్నడూ ఎరగని అరణ్యములోకి ఇప్పుడు మనము పోతున్నాము. అందువల్ల ముందు నీవు నడవవలెను. నీ వెనక సీత నడుస్తుంది. నేను మీ ఇద్దరినీ చూచుకొంటూ మీ ఉభయుల వెనకా నడుస్తాను.

"లక్ష్మణా, ఈ అడవిలో మనము ఒకండ్లకు ఒకండ్లము అండగా ఉండవలెను. కడచిపోయిన తరువాత ఏమీ చేయలేము కాబట్టి ఎప్పుడూ జాగ్రత్తతో నడవవలెను. వనవాస కష్టాలు అంటే ఏమిటో సీతకు ఇకను తెలుస్తవి", అంటూ సీతాదేవి వంక చూచి "ఓ సీతా, ఇక జన సంచారము ఎక్కడా

ఉండదు. పంట పొలాలు కానీ ఉద్యానవనాలు కానీ ఇక నీకు కనిపించవు. మిట్ట పల్లాలుగా ఉండే అడవిలోకి మనము పోతున్నాము” అన్నాడు.

ముందు లక్ష్మణుడూ అతని వెనక సీతాదేవి వారి ఇద్దరి వెనకా రాముడూ ఆ అడవిలో నడవ సాగినారు.

రాముడు గంగానదిని దాటి అవతలి గట్టున సీతా లక్ష్మణులతో నడుస్తూ కంటికి కనబడకుండా పోయేటంతవరకున్నూ సుమంత్రుడు గంగానది ఉత్తరపు గట్టున నిలుచుకొని చూచినాడు. వారు కంటికి కనబడకుండా పోగానే అతడు జలజల కన్నీళ్లు కార్చినాడు.

సీతా రామలక్ష్మణులు ఆ అడవి దాటిపోయినారు. చక్కని పంట పొలాలతో సర్వసమృద్ధముగా ఉన్న వత్సదేశము చేరినారు. అప్పుడు వారికి ఆకలివేసింది అంతట రామలక్ష్మణులు ఆ సమీపములో ఉన్న అడవికి వేటకు పోయి ఒక అడవి పందినీ ఒక మనుబోతునూ ఒక నల్లచారల దుప్పినీ చంపి తెచ్చినారు. వాటి మాంసము పక్వము చేసి ముగ్గురూ తిన్నారు.

సాయంకాలము కాగానే పడుకొనేటందుకు చెట్టుకోసము చూడసాగినారు.

## ౪౩

ఆ రాత్రి గడపటానికి వారు ఒక పెద్ద మర్రిచెట్టును చూచుకొన్నారు. అంతట రామలక్ష్మణులు సాయం సంధ్యను ఉపాసించినారు. అప్పుడు రాముడు లక్ష్మణుడితో “తమ్ముడా, మన దేశము దాటి ఆయా జనపదాలను వదలిపెట్టి మనము ఇప్పుడు చాలా దూరము వచ్చినాము. ఇప్పుడు మన వెంట సుమంత్రుడున్నూ లేడు. ఇకను మనము ముగ్గురమూ గడపవలసిన రాత్రులలో ఇది మొదటిది. అయితే నీవు దిగులుపడవద్దు. ఈరోజు మొదలుకొని రాత్రిపూట మనము ఏమరపాటు లేకుండా మేలుకొని ఉందాము. లక్ష్మణా, ఈ సీతాదేవి యొక్క క్షేమాలను కూడా మనమే కనిపెట్టి ఉండవలెను.

"లక్ష్మణా, చీకటి పడిపోయింది. కావలసిన ఆకులూ అవీ తెచ్చుకొని చక్కని శయ్యలు అమర్చుకొనే అవకాశము లేకుండా పోయింది. గాలికి రాలిన పండుటాకులమీదనే ఈ రాత్రికి ఎట్లాగో నిద్రపోదము" అన్నాడు.

మార్గాయాసమువల్ల సీతాదేవి నిద్రపోయింది. మెత్తని పరుపులమీద పడుకొనే రాముడు నేలమీద పడుకొని ఈ విధముగా విచారపడ మొదలుపెట్టినాడు. "లక్ష్మణా, దశరథమహారాజుకు ఇప్పుడు నిద్ర పట్టి ఉండదు. దుఃఖపడుతూ ఉంటాడు. కైకేయీదేవి మాత్రము కృతకృత్యురాలను అయినాను అని ఉప్పొంగిపోతూ ఉంటుంది. భరతుడు రాగానే వానికి రాజాధికారము స్థిరము చేయడము కోసము కైకేయీదేవి నాయనగారి ప్రాణాలు తీయదుకదా. నీవూ నేనూ ఇద్దరమూ ఇట్లా వచ్చివేసినాము. ఇప్పుడు దశరథమహారాజుకు దిక్కు లేకుండా పోయింది. పయిగా వృద్ధాప్యము. కామాతురుడు అయి కైకేయీదేవికి లోబడిపోయినాడు. పాపము, ఏమి చేస్తాడు!

"తమ్ముడా, ఇప్పుడు మనకు వచ్చిన ఈ కష్టానికి దశరథమహారాజుకు మతిపోయి ఉంటుంది. ఆలోచించి చూస్తే ధర్మముకన్నా అర్థముకన్నా కామమే బలీయము అని తోస్తున్నది సుమా. ఎటువంటి మూర్ఖుడు అయినా ఆడుదానిమాట విని తన మాట జవదాటని కొడుకును మన తండ్రివలె అడవులకు వెళ్ళకొట్టడు.

"సర్వసమృద్ధము అయిన కోసలరాజ్యానికి కైకేయీపుత్రుడా మహారాజు? వాడూ వాడి భార్యమాత్రము సుఖపడవలెనా? నేనూ నా భార్యా అడవుల పాలు అయిపోవలెనా? దశరథమహారాజు చనిపోవడమా? భరతుడు ఏకాధిపతిగా రాజ్యము ఏలడమా?

లక్ష్మణా, ధర్మార్థాలను తోసివేసి కామాతురుడు అయ్యే ప్రతివాడూ దశరథమహారాజు వలె అడవులపాలు అయిపోక తప్పదు. ఆలోచిస్తూ ఉంటే నేను అడవులపాలు కావడానికీ దశరథమహారాజు చావడానికీ భరతుడు కోసల రాజ్యము ఏలడానికే కైకేయీదేవి మన ఇంట దాపురించింది అనిపిస్తూ ఉంది.

"కైకేయీదేవి ఇక సౌభాగ్యముతో మయిమరచి పోతుంది. నాసుంచి మా అక్క కౌసల్యాదేవినీ మా అమ్మ సుమిత్రాదేవినీ నానాబాధలూ

పెట్టుతుంది. వాండ్లు అట్లా కష్టాలపాలు కావడము నాకు ఇష్టము లేదు తమ్ముడా, నీవు ఈ తెల్లవారుజామునే లేచి అయోధ్యానగరానికి ప్రయాణము అయిపో. నేను ఒక్కణ్ణీ సీతను వెంటపెట్టుకొని దండకారణ్యానికి పోతాను. మా అమ్మ కౌసల్యాదేవి దిక్కుమాలి ఉంటుంది. నీవు ఆమెకు దిక్కు అవుతావు. కైకేయి దుష్టురాలు. ద్వేషముతో కౌసల్యాదేవికి ఆమె ఏ అపకారము అనాయి చేయవచ్చును. అయితే భరతుడు మాత్రము ధర్మికుడు. వాడికి నీవు మా అమ్మను ఒప్పగించవలెను.

"తమ్ముడా, జన్మాంతరములో మా అమ్మ ఏ తల్లికో కొడుకుతో ఎడపాటు తెచ్చిపెట్టి ఉంటుంది. అందువల్లనే ఆమెకు ఇప్పుడు ఈ విధముగా అయింది. నీకు తెలుసును, మా అమ్మ ఎంతో కష్టపడి నన్ను పెంచింది. పోషించింది. ఫలము అనుభవించే సమయానికి నాకూ ఆమెకూ ఎడబాటు అయిపోయింది. అయ్యో! నేను ఏమి చేసేది! నానుంచి మా అమ్మకు అంతులేని దుఃఖము వచ్చి పడ్డది. ఏ స్త్రీమంతినికీ నావంటి పుత్రుడు పుట్టకూడదు.

"లక్ష్మణా, మా అమ్మ గోరువంక పిట్టనూ రామచిలుకనూ పెంచుతూ ఉంది. మనము అడవికి పోతున్నాము అని నేను చెప్పేసరికి గోరువంక రామచిలుకతో 'ఓ చిలుకా, మన విరోధి కైకేయిదాని కాలు కటికి కొరికి వెయ్యి అన్నది.' ఆ పిట్ట అట్లా అని నాకంటే ఎక్కువగా మా అమ్మను ఆదరించింది. లక్ష్మణా, నేను మా అమ్మను ఏవిధముగానూ సంతోషపెట్టలేక పోయినాను. ఆమెకు ఏ మాత్రమూ ఉపకరించలేక పోయినాను. నా జన్మ నిరర్థకము. నేను ఇట్లా వచ్చినందువల్ల మా అమ్మ శోకసాగరములో మునిగి పోయి ఉంటుంది. తమ్ముడా, నేను ఒక్కణ్ణీ నా బాణముతో అయోధ్యనే కాదు–ఈ పృథ్విని అంతా సంహారము చేసి వేయకలను. అయితే అధర్మభయమూ పరలోక భయమూ నన్ను అందుకు అడ్డగించినవి. అందువల్లనే పట్టము కోసము నేను ప్రాకులాడలేదు" అంటూ ఆ నిర్జనారణ్యములో విలపించినాడు. మంటలు ఆరిపోయిన అగ్నిహోత్రము వలెనూ అలలు ఆగిపోయిన సముద్రమువలెనూ రాముడు అప్పుడు లక్ష్మణుడికి అగుపించినాడు.

"అన్నా, అయోధ్య ఇప్పుడు చంద్రుడు లేని చీకటి రాత్రిగా ఉంటుంది. నిజమే. కాని నీవు ఇట్లా పరితాప పడడమువల్ల ప్రయోజనము ఏమీ లేదు. నీవు నన్నూ సీతాదేవినీ దుఃఖపెట్టడముకన్నా ఫలము ఏమీ ఉండదు. సీతాదేవీ నేనూ నిన్ను విడిచి పెట్టి ఒక్క క్షణము అయినా ఉండలేము. నీవు సమక్షములో ఉండక పోయేటట్లయితే నీళ్లలో నుంచి బయట వేసిన చేపలవలె మేము చచ్చిపోతాము. అన్నా, నీవు లేకుండా నేను మన నాయనగారి దగ్గరకు పోను. మా తమ్ముడిదగ్గరకు కానీ మా అమ్మ దగ్గరకు కానీ నీవు పొమ్మన్నా నేను పోను. స్వర్గముకో అయినా నాకు నిమిత్తము లేదు. అన్నా, నీవు ధైర్యము కోలుపోవద్దు" అని చెప్పినాడు లక్ష్మణుడు.

రాముడు ఆ మఱ్ఱిచెట్టు కింద పడుకొని ఆలోచించ సాగినాడు. పధ్నాలుగు ఏండ్లూ వనవాసము చేయ నిశ్చయించుకొన్నాడు.

పర్వతసానువులలో సంచారము చేసే సింహాలవలె ఆ నిర్జనారణ్యములో ఏ భయమూ ఏ తొట్రుపాటూ లేకుండా ఆ రామలక్ష్మణులు ఆ రాత్రి ఆమఱ్ఱి చెట్టు కింద గడిపినారు.

[ తరువాయి రెండవ భాగములో ]

— o —

జ్యోతీ ప్రెస్, హైదరాబాదు.